# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక, డిశంబరు, 2015 ₹ 25

ISSN 2454–4329



శిల్పచిత్రం

# మిసిమి
మాసపత్రిక

**"All that we are is the product of what we have thought"**
*- Dammapada.*

**సంపుటి 26 డిసెంబర్ 2015 సంచిక 12**

*ప్రధాన సంపాదకుడు*
చెన్నూరు ఆంజనేయ రెడ్డి

*సంపాదకుడు*
వల్లభనేని అశ్వినీకుమార్

*సహాయ సంపాదకుడు*
కాండ్రేగుల నాగేశ్వరరావు

*సాంకేతిక సహాయకులు*
పడవల ఉమాశంకర్, చేపూరి రమేష్,
మహమ్మద్ కుర్రాముద్దీన్ జీ షాన్, వెల్దండ రమేష్,
వేములు రాణి, సారిక నిర్మల

*సంస్థాపక సంపాదకులు*
**రవీంద్రనాథ్ ఆలపాటి**

*Printed & Published by*

**Bapanna Alapati**
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536. Cell: 994 651 6567
E-mail : misimi_monthly@yahoo.in
www.misimimonthly.com
e-magazine : www.kinige.com/misimi

| | |
|---|---|
| ప్రతి : ₹ 25 | సంవత్సరానికి : ₹300 |
| విదేశాలకు ప్రతి : $ 2.50 | సంవత్సరానికి : $ 25 |

| | |
|---|---|
| **Library of Congress Control Number** LCCN 91-903060 | **ISSN 2454-4329** |


# ఈ నెల...


సాహిత్యం ఒక కళ ........ 7
*- ఆర్థర్ షోపెన్ హోవర్*

మా జాతి గులాబి రెమ్మా ........ 11
*- వరవరరావు*

అమ్మా! సరోజినీదేవీ! - సింధుభైరవి-చతురశ్ర గతి ........ 15
*- రచన : తోలేటి వెంకటరెడ్డి, గానం : ఘంటసాల*

అలా ప్రవేశించింది - కృష్ణశాస్త్రి కవిత్వం ........ 17
*- ఆవంత్స సోమసుందర్*

రామాయణ సమాజం ........ 22
*- దాశరథి రంగాచార్య*

శతపత్రం గడియారం రామకృష్ణ శర్మ ........ 28
*- రావినూతల సత్యనారాయణ*

ఆముక్త మాల్యద : ద్రావిడ దేశీయత... ........ 35
*- కోసూరి దామోదర నాయుడు*

దేవాసురయుద్ధం ........ 39
*- సాయి పాపినేని, జయశ్రీ నాయని*

వేదిక ........ 48
*- యార్లగడ్డ బాలగంగాధరరావు*

మా రామబ్రహ్మం ........ 52
*- కొసరాజు రాఘవయ్య చౌదరి*

జీనోమ్ కథనమ్ ........ 59
*- ము.పా.సా.*

గోవాలో తెలుగువారు ........ 66
*- కొసరాజు వెంకటేశ్వరరావు*

గిరిజన సాహిత్యం ........ 72
-ఎమ్. వెంకటస్వామి

ఖలీల్‌తో కలయిక ........ 79
*- కాళోజి*

అధ్యక్షోపన్యాసము- ప్రథమాంధ్ర నాటక కళాపరిషత్తు ........ 82
*- చట్టి చినపూర్ణయ్య పంతులు*

జాతీయ వాదాన్ని పెంపొందించిన - కోణార్క దేవాలయ శిల్పి...... 91
*- ఈమని శివనాగిరెడ్డి స్థపతి*

నార్ల - ఒక జ్ఞాపకం ........ 95
*- వి. ప్రమోద్ కుమార్*

పుస్తక పరిచయం ........ 96


| | | |
|---|---|---|
| *ముఖచిత్రం* | : కన్య ప్రార్థన | చిత్రకారుడు : సాల్వీ |
| *రెండవ అట్ట* | : శిల్ప చిత్రం | " : చాగంటి శ్రీనివాస్ |
| *మూడవ అట్ట* | : ఊటీలో ఉదయ రేకలు | చిత్రకారిణి : స్రవంతి |
| *నాల్గవ అట్ట* | : మగ్దలీనా | శిల్పి : ? |

అట్టతో కలిపి 100 పుటలు

*వివరాలు : 50 వ పుటలో ...*

'ప్రపంచం నా భావన' - The world, my idea అని చెప్పిన తర్క, తాత్త్వికుడు షోపెన్ హావర్ – నిజాన్ని నిగ్గు తేలుస్తూ వ్రాసిన వ్యాస పరంపర గత మూడు నెలలుగా **మిసిమి** పాఠకులను అలరిస్తుందని మాకొచ్చిన స్పందననుబట్టి తెలుస్తుంది. తార్కికతను, శాస్త్రీయతతో రంగరించి ఆయన వ్రాసిన మరికొన్ని వ్యాసాలు రాబోతున్నాయి. ఇవి పాఠకుల ఆలోచనా శక్తిని మరింత పదును పెడుతుందని, మీ అభిమానాన్ని చూరగొంటుందని ఆశిస్తున్నాము.

ఏ ఆలోచన, సిద్ధాంతం ఒకే విధమైన అభిమాన, ఆదరణలకు నోచుకోదు. మారుతున్న కాలం, తరం, విలువలు కొన్ని పాతుకుపోయిన భావాల పునాదులను తవ్వి పోస్తాయి. 'గురజాడ – వెలుగు జాడ' అనే పదబంధం ఒక నానుడిగా స్థిరపడబోతున్న తరుణంలో ఆ వెలుగు రేకలపై కొన్ని నీలినీడలు ప్రసరిస్తున్నాయి. ఒక వ్యక్తి స్పృశించిన సాహిత్యం – అందులోని పాత్రలు, ఆ రచయిత వ్యక్తిగత జీవితం – వీటన్నిటినీ సమగ్రంగా చూడాలా? లేక విడివిడిగా చూడాలా? అనే ఒక సందేహం సమాధానం లేని ప్రశ్నగా ఎందరినో వేధిస్తుంది. వెల్చేరు, వి.వి.న. మూర్తిల అభిప్రాయాలపై ఎందరో స్పందించి తమ అభిప్రాయాలను సంపాదకునితో ఫోను ద్వారా పంచుకున్నారు. ఫలితం? ఇది ఇద్దరి వ్యక్తుల మధ్య జరిగిన సంభాషణగానే మిగిలిపోతుంది తప్ప, అందరితో పంచుకొనే సార్వజనీనత దీనికి రాదు. ఏదైనా రాతపూర్వకంగా ఉంటేనే సార్థకత. అన్నీ ప్రచురింపబడకపోవచ్చు. కానీ ఒక రికార్డుగా భద్రపరచబడతాయి. గురజాడకు వీరాభిమానులు ఎందరో ఉన్నారని తెలుసు, కానీ స్పందన తక్కువగా కనిపిస్తుంది. చెప్పవలసినది చెప్పకుండా ఉండే ఈ అలసత్వం, నిర్లిప్తత, తెలుగు సాహిత్యపు విలువలపై చిన్నచూపుని సూచిస్తుంది. సహృదయులైన పాఠకుల స్తబ్ధతకు కారణమేమిటి?

ఎప్పటికప్పుడు కొత్త ఆలోచనలతో నవ్యత కోసం తపించే **మిసిమి** 'వేదిక' అనే పేరుతో ఓ సత్యపీఠాన్ని మీ ముందుకు తెచ్చింది. ఇది సాహిత్య, లలిత కళల పట్ల పరిశోధనకు, సత్యనిష్ఠకు సంబంధించినది. నిస్సంకోచంగా మీ అభిప్రాయాలను వెలిబుచ్చండి. ఈ వేదికను మరో భువన విజయం చేయండి.

నవంబరు సంచిక సంపాదకీయంలో ఉటంకించినట్లు జాతీయోద్యమంలో, స్త్రీ జనోద్ధరణలో ప్రముఖపాత్ర వహించిన జాతిరత్నాలలో సరోజినీనాయుడు ప్రముఖులు – వీరి కుటుంబ చరిత్ర – జాతీయ – ముఖ్యంగా హైద్రాబాద్‌కు సంబంధించి వంద సంవత్సరాల చరిత్ర – ఇప్పటికీ వీరి పాదముద్రలు చూడగలమంటే అవి ఎంత గాఢంగా ఈ నగరానికి అంకితమో గమనించాలి.

రామాయణ సమాజంలోని సమకాలీనత వలననే ఆ కావ్యానికి విశ్వజనీనత గలదని అంగీకరించాలి – రామాయణ, భారతాలు ఈ జాతి నాగరకత – సంస్కృతులకు ప్రతీకలు – ప్రపంచానికి పలకడం నేర్పిన జాతి ఈనాడు వినటమే వ్యసనంగా మార్చుకోవటం విచారించతగిన విషయం!



డిసెంబరు అంటే కాలెండరులో చివరి నెల – అంతేనా – హైద్రాబాద్‌లో పుస్తకాల పండుగ – అంతేనా చలిగాలులు గిలిపెట్టే నెల – ప్రపంచానికి సెలవు ప్రకటించిన నెల – 18 వ తేదీ నుంచి 27 వ తేదీ వరకు జరిగే 'పుస్తకాల సంత'లో **మిసిమి** ని దర్శించండి! మీకు కావలసిన పాత, కొత్త సంచికలతోపాటు విలువైన పుస్తకాలు లభిస్తాయి.

**– సంపాదకులు**

# కమ్మతెమ్మెరలు

★ "... చాలా సంవత్సరాల నుండి ***మిసిమి*** కి అభిమానిని. ***మిసిమి*** పత్రికకు ఉత్తరం వ్రాయడం ఇదే ప్రథమం. సాహిత్యం పై వస్తున్న వ్యాసాలు, అప్పుడప్పుడు సినిమాల గురించి వచ్చిన వ్యాసాలు చాలా ఆసక్తికరంగా వుంటాయి. ఉత్తమ వ్యాసాలు ప్రచురిస్తున్నందుకు అభినందనలు. అక్టోబరు 2015 సంచికలో *ప్యాసా* సినిమాను సమగ్రంగా వివరించిన తీరు చాలా బావుంది. అంపశయ్య నవీన్ గారి *బుచ్చిబాబు సాహిత్య వ్యాసాలు* పై గల విశ్లేషణ చాలా విషయాలు తెలియజేశాయి. అక్టోబరు సంచికలోని పతివాడ సూర్యనారాయణ గారి సేకరణ 29 పుటలోగల ఫొటో కీ.శే. చంద్రభట్ల రాజగోపాలరావు గారిది. మద్దూరి అన్నపూర్ణయ్య గారిదని ప్రచురింపబడినది..."

**– కవికొండల వెంకట సూర్యనారాయణ,** హైదరాబాదు.

★ "... అక్టోబరు 2015 సంచికలో *ఉత్కళాంధ్ర ప్రముఖులు* అన్న వ్యాసం వివరణాత్మకంగావుందిగాని ఆ ప్రముఖుల గురించిన వివరాలు ఇంకా రాయవలసి వుంది. గిడుగు రామమూర్తిగారు సవరభాషకు లిపి కనిపెట్టారు అని అందరూ భావించినట్లే ఈ రచయితగూడ భావించారు. రామమూర్తిగారు సవరభాషకు లిపి కనిపెట్టలేదు. వారు సవర రీడర్లు (1912) రాయడానికి తెలుగు లిపిని వాడారు. తరవాత అంతర్జాతీయ భాషావేత్తల అవగాహనకోసం, సవరభాష నేర్చుకోవాలనుకొనే బ్రిటిష్ ఉద్యోగుల కోసం అంతర్జాతీయ ధ్వని లిపి వాడారు. ప్రతిభాషకూ ప్రత్యేక లిపి వుండాలనే అభిప్రాయానికి గిడుగు వ్యతిరేకి. వివరాల కోసం ***మిసిమి*** డిశంబర్ 2012 సంచికలో నేను రాసిన *సవరలిపి – గిడుగు* అన్న వ్యాసం పరిశీలించండి..."

**– అల్లంసెట్టి చంద్రశేఖర రావు,** పొందూరు.

★ "... ఈమని శివనాగిరెడ్డి వ్యాసం – *శిథిలాలు చెప్పిన కథనాలు* చరిత్రకు సంబంధించి ప్రత్యేకించి భారతీయ శిల్పచరిత్రకు సంబంధించి అది విశిష్టమైన వ్యాసం. వారికి హార్దిక అభినందనలు...

... కోణార్క సూర్య దేవాలయం, మహోన్నతము, పరమాద్భుతము. ఇట్టి దేవాలయాన్ని నిర్మింపచేసి, తాను సూర్యునికి ఒక కుటీరం (గుడిసె) నిర్మించానని తూర్పుగాంగ చక్రవర్తి, నరసింహుడు, అతి వినయంతో ప్రకటించుకున్నాడు. (కోణా కోణే కుటీరమ్ అచీ కరాత్ – ఉషా రశ్మేః) సింహాచలంలోని నరసింహ దేవాలయం కూడా ఈ ప్రభువు నిర్మింపచేసినదే. సింహాచల దేవాలయ నిర్మాణం శక 1190 (క్రీ.శ. 1268)లో పూర్తయింది. తూర్పు గాంగరాజులు గంగా, గోదావరీ నదుల మధ్యస్థమయిన విశాల సామ్రాజ్యాన్ని 400 ఏండ్లకు పైబడి పాలించారు. వారు ఒరిస్సాలోని కటక రాజధానిగా పాలించినా, వెయ్యికి మించిన వారి శాసనాలు అన్నీ తెలుగులోనే ఉన్నాయి. ఒరియా భాషలో ఒక్క శాసనం కూడా లభించలేదు..."

**– సి.వి. రామచంద్రరావు,** చెన్నై.




★ "... అక్టోబరు 2015 ***మిసిమి*** లో వచ్చిన *ఉత్కళాంధ్ర ప్రముఖులు* అనే వ్యాసంలో చివరగా గిడుగు వారి ప్రస్తావన మాత్రమే నేను చదివాను..."

1. గిడుగు వారు సవరభాషకు లిపిని రూపొందించలేదు. అప్పటికే ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యంలో ఉన్న అంతర్జాతీయ ధ్వని లిపిని (International Phonetic script) సవరభాషకు లిపిగా వాడుకున్నారు. ఎందుకనో వారే సవర భాషకు లిపిని రూపొందించారని తప్పుడు సమాచారం ప్రజలలో నిలిచిపోయింది.
2. 'హిందూ సుందరి' స్త్రీల మాసపత్రిక. సత్తిరాజు సీతారామయ్యా గారి సంపాదకత్వంలో ఏలూరు నుండి ప్రారంభించబడింది. కొన్నాళ్లు 'కంతేరు' నుండి వారే నడిపారు. ఆ తరువాత దాని కార్యస్థానం కాకినాడకు మారింది. అప్పటి నుండి ఈ పత్రిక స్త్రీల నిర్వహణలోనే దాదాపుగా నడిచింది, కాని గిడుగు వారెప్పుడూ దీని బాధ్యతలను చేపట్టలేదు. అయితే ఒకసారి వారు ఈ పత్రికను మెచ్చుకుంటూ సంపాదకులకు ఉత్తరం వ్రాశారు. అది ఆ పత్రికలో అచ్చయింది. అంతకుమించి గిడుగువారికి 'హిందూ సుందరి'కి ఎట్టి సంబంధం లేదు..."

**– కణుగుల వెంకటరావు,** శ్రీకాకుళం.

✶ "... నవంబరు ***మిసిమి*** సంచికలో *మానవ నిర్మిత మహాసాగరం* నాగార్జున సాగరం రచయితను, ప్రచురించిన ***మిసిమి*** వారికి అభినందనలు. పండిట్ నెహ్రూ సాగార్జున సాగర్ శంకుస్థాపన చేసిన కార్యక్రమంలో పాల్గొన్న వేలాది మందిలో నే నొకణ్ణి. నాగార్జున సాగర్ గురించి చాలా తక్కువ వ్యాసాలే వచ్చాయి. ఈనాటికి ఈ రచయిత నాగార్జున సాగర్ గురించి పరిచయం చేయడం అభినందించవలసిన విషయమని భావిస్తాను. అయినా ఇంకా సాగర్ నిర్మాణ విషయకంగా ప్రజలకు తెలవాల్సి ఉంది. సాగర్‌కు రాళ్ళు మోసిన ప్రథములు కేరళ నుంచి వచ్చిన మోపులాలు. ఈ వ్యాసంలో ఆ ప్రస్తావనే లేదు. నాగార్జున సాగర్ నిర్మాణంలో ఆ నాటి భారత దేశంలో అమెరికా రాయబారిగా పనిచేసిన ప్రొ॥ జాన్ కెనెత్ గాల్‌బ్రేత్ (1961–63) శ్రమదానం చేసిన విషయం ఈ నాటి పాఠకులకు తెలియదు. తాజ్‌మహల్ నిర్మాణ విశేషాలు ఈ నాటి పాఠకునికి తెలియదు. మరి నాగార్జున సాగర్ మన కళ్ళముందు నిర్మించినా చాల తక్కువ విషయాలు ఈ నాటి వారికి తెలిశాయి. ఈ రచయిత నుండి నాగార్జున సాగర్ నిర్మాణం గురించి సమగ్రమైన చారిత్రక వ్యాసాలుగా రావాలని అభిలషించడంలో నా స్వార్థం లేదు. మొదటి సారి కాలువలోని నీరు వదిలినప్పుడు ఆ నీటి వెంటబడి వచ్చిన తెలంగాణ ప్రజల ఉత్సాహాన్ని, ఆనందాన్ని నేనెలా మరువగలను?..."

**– గుడిపూడి సుబ్బారావు,** హైదరాబాదు.




✶ "... అక్టోబరు సంచికలో టి. చక్రధర్ స్వామి వ్యాసం *తెలంగాణా నాటక సాహిత్యం* గురించి : *శ్రీ కృష్ణతులాభారం* నాటక రచయిత ముత్తరాజు సుబ్బారావు. చందాల కేశవదాసు పాటలు మాత్రమే (మీరజాలగలడా మాత్రం స్థానం రచన) వ్రాసారు..."

**– వి.ఎ.కె. రంగారావు,** చెన్నై.

✶ "... నేనండీ! అగ్రజులు కోడూరు పుల్లారెడ్డి గారి *మా అమ్మ ఓబుళమ్మ* (సమీప చరిత్ర)లోని బాల ప్రభాకరుడిని. అదేనండీ! *మా అమ్మ ఓబుళమ్మ* పొలం పనులనుండి తిరిగి వచ్చేదాకా వెదురు దబ్బల ఉయ్యాల్లో నుండి మంచంమీదకు ప్రమోషన్ దొరకనివాడిని. ఇంకా గుర్తుపట్టలేదా? వేంపల్లెలో నాకు మూడు, నాలుగేండ్ల వయస్సుండగా ఇంటికి కాపలా కాస్తూ అరుగుమీద *కసబియాంకా* లాగ ఎక్కడికీ కదలకుండా కూర్చొని, అన్నగార్లు వస్తే చొక్కా ఎత్తి మొలతాడుకు కట్టిన తాళం చెవి చూపించి, కాళ్ళ గజ్జెలు భద్రంగా ఉన్నాయని ఘుల్లు మనిపించిన బాల ప్రభాకరుడిని. నేనిప్పుడు గత 40 ఏండ్లుగా ఎమ్.డి. శిశువైద్య నిపుణుడిగా ప్రొద్దుటూరులో పేరు ప్రఖ్యాతులు పొందడం అజ్ఞాతంగా ఆమె చేసిన కృషే కారణం. దీనికి అన్నగారి సహాయసహకారాలు నేను రాష్ట్రస్థాయిలో పేరొందిన సాహితీవేత్తగా ఎన్నో పురస్కారాలు పొందడానికి, బహుగ్రంథకర్తను కావడానికి తోడ్పడ్డాయి. ఆయన జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను అధిగమించి మమ్మల్నింతవాళ్లను చేశారు. ఆయన జీవనయానంలో ఇంకెన్నో సంఘటనలు జరిగాయి. అవన్నీ గ్రంథస్థం చేస్తే పాఠకులు తమ జీవితాల్లో కష్టాలనెలా అధిగమించాలో తెలుసుకోవచ్చు. ఆ విషయాలు ఎంతో విజ్ఞానదాయకంగా ఉంటాయికూడా!..."

**– కోడూరు ప్రభాకర రెడ్డి,** ప్రొద్దుటూరు.

✶ "... ***మిసిమి*** నన్ను యీ వృద్ధాప్యంలో చాలాచాలా కదిలిస్తున్నది. మీ చిత్రకళాభిరుచికి ఆనందిస్తున్నాను. అట్టల చిత్రాలు పరమాద్భుతం. దేవికారాణి చౌదరి గురించి గతంలో చదివాను, విన్నాను ఆనాటి పెద్దలు చెప్పగా. సంజీవదేవ్ రోరిక్ గురించి గొప్పగా వ్రాసారు. దేవికారాణి చిత్రాన్ని శ్రీమతి శివరాజు సుబ్బులక్ష్మిగారు చిత్రించారంటే ఆశ్చర్యపోతున్నాను. కథారచయిత్రిగా – చిత్రకారిణిగా తెలుసు. ప్రముఖ నవలారచయిత – కథకుడు బుచ్చిబాబుగారి భార్యగా కూడా తెలుసు. యింత గొప్ప చిత్రకారిణిగా ఊహించలేకపోయాను. *ఆమె కన్నులలో అనంతాంబరపు నీలి నీడలు కలవు* అన్నట్లుగా వుందాచిత్రం. చిత్రకారిణి ప్రతిభకు నమస్కరిస్తున్నాను. గురజాడవారి గురించి – *'మేముత్తి వెధవాయలమోయ్'* వెల్చేరు వారి వ్యాసాన్ని ఎవరూ ఆమోదించరు. బాగా యెత్తుకు యెదిగిన తరువాత ఏం వ్రాసినా చెల్లుతుందనుకోవటం మంచిది కాదనుకుంటా! శ్రీరంగం గోపాలరత్నం గారి గురించి శ్రీమతి జానకీబాల ఎంతో చక్కగా వ్రాసారు సుమా!..."

**– చెరుకువాడ వెంకటరామయ్య,** విస్సాకోడేరు



ఆర్థర్ షోపెన్ హోవర్

# సాహిత్యం ఒక కళ

– ఆర్థర్ షోపెన్ హోవర్

### కొన్ని సాహిత్య ప్రక్రియలు

మానవ అస్తిత్వాన్ని పరిపూర్ణంగా దర్శింపచేయగలిగిన ప్రక్రియ నాటకం. దీన్ని మనం మూడు పార్శ్వాలనుండి పరిశీలిద్దాం.

మొదటిది రంగస్థల దశ. ప్రదర్శనను ఆసక్తికరంగా రూపొందిస్తారు. ప్రేక్షకులకున్న కోరికలూ, లక్ష్యాలే పాత్రలకూ వుంటాయి గనక, మనం చెయ్యదలచుకున్న పనులే వాళ్ళూ చేస్తారు గనక, నాటకంలోని మనుషులు మనల్ని ఆకట్టుకుంటారు. కుట్రలు, కుహకాలు, పన్నాగాలు, ఒకరిమీద ఒకరు పైచేయి సాధించాలనుకోవటం, హాస్యం, వ్యంగ్యం నాటకానికి ప్రాణం. ప్రేక్షకులు నాటకం చివరిదాకా చూడాలంటే యివి తప్పవు.

ఇక రెండవ పార్శ్వం నాటకం. సెంటిమెంటు మీద ఆధారపడుతుంది. "కథానాయకుడిని మనం యిష్టపడ్డాం. అతడిపట్ల సానుభూతి పెరిగింది" అంటే అర్థం మనమీద మనకు సానుభూతి పెరిగిందన్నమాట. అనేక సన్నివేశాలు మనచేత కంటతడి పెట్టించవచ్చు. కాని ముగింపు సుఖాంతమే. మనమనుకున్నచోటే సమస్య పరిష్కారమవుతుంది.

నాటకంలోని మూడవ దశ క్లైమాక్స్. ఇది తొలి రెండు దశలకన్నా కఠినమైనదీ, జటిలమైనదీ. ఓ గొప్ప విషాద సంఘటనతో కథ ముగించాలి. జీవితంలోని బాధ, దుఃఖమంతా సుడిగుండంలా క్లైమాక్స్‌లో కేంద్రీకృతమయి విధివిలాసం ముందు మానవ ప్రయత్నం వృథా అని తెలుస్తుంది. మొత్తంమీద ప్రేక్షకుల్ని కదిలిస్తుంది క్లైమాక్స్. వాళ్ళమీద గాఢమైన ముద్రవేస్తుంది. దీన్ని భరించలేక, కొన్నిసార్లు జీవన సమరం నుండి నిష్క్రమించాలనుకుంటాం లేదా హీరోలాగే ప్రతిస్పందించాలనుకుంటాం.

ఏదైనాసరే 'ప్రారంభించటం కష్టం' అని ఒక నానుడి వుంది. కాని నాటకం దీనికి పూర్తి విరుద్ధం. ముగించటమే చాలా కష్టం. ఒకటీ, రెండూ కాదు, వందల ఉదాహరణలు చూపించవచ్చు. ఎంతో ఆసక్తికరంగా ప్రారంభమై, ఒకటి రెండు అంకాల తర్వాత, కథ ఎటుపోతుందో, ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ప్రేక్షకులందరూ అనుభవించే ఉంటారు. ఇక నాలుగవ అంకం దాకా వచ్చేసరికి మరింత గందరగోళం పెరిగి బలవంతంగా ఏదోరకంగా ముగిస్తారు. ఇందువల్ల ప్రేక్షకులకు మిగిలేది నిరాశ, అసంతృప్తి మాత్రమే. లేదా అందరూ ముందే ఊహించిన ముగింపై వుంటుంది. కొన్నిసార్లు నాటకం 'ఎమిలియా గుహోటి'లాగ, ప్రేక్షకులకి కోపం, చిరాకు తెప్పిస్తుంది.

అయితే, యిలా జరగటానికి కారణం మనం ఊహించుకునేదేమి కాదు. కథాప్రారంభంలో చిక్కుముళ్ళు వేస్తారు. కాని వాటిని విప్పటమే కష్టం. మొదటి అంకాలలో, పాత్రలు సమస్యల సాలెగూడులో చిక్కుకున్నందుకు మనకు రచయితమీద కోపం రాదు సరిగదా, కథ భలే మలుపులు తిరుగుతున్నదని సంతోషిస్తాం. కాని చివరన, తను సృష్టించిన సమస్యల నుండి పాత్రలను గట్టెక్కించవలసిన బాధ్యత కూడా అతడిమీద వుంది. సుఖాంతమో, విషాదాంతమో ఏదో ఒకటి మనల్ని ఆకట్టుకోవాలి. సంభ్రమాశ్చర్యాలలో ముంచగలగాలి. కానీ, నిజజీవితంలో మనుషులు అంత ఖచ్చితమైన, స్పష్టమైన నిర్ణయాలు తీసుకోరు. అప్పుడు ముగింపు సహజంగా లేదని రచయితను బాధ్యుణ్ణి చేస్తాం. అంటే, ముగింపు కృత్రిమంగా, ప్రేక్షకుల మీద బలవంతంగా రుద్దినట్టుగా వుండకూడదు. పైగా ఎవరూ ఊహించనట్టుగా ఉండాలి.

ఈ మాటలు మహాకావ్యాలకూ (Epics) నవలలకు

కూడా వర్తిస్తాయి. కానీ పరిమాణంలో నాటకం ఈ రెండింటికన్నా చిన్నది గనక, ఈ ప్రక్రియలో రచయితకు సమస్యలు అనేకరెట్లు పెరుగుతాయి.

"సున్నాతో దేన్ని గుణించినా వచ్చేది సున్నాయే". "శూన్యం మరి దేన్నీ సృష్టించదు" వంటి సూక్తులు కళకు కూడా వర్తిస్తాయి.

ఒక చారిత్రక వ్యక్తి గురించి బొమ్మ గీయాలను కున్నప్పుడు మంచి చిత్రకారుడు, తనకు తెలిసిన నిజజీవితం లోని వ్యక్తులను నమూనాగా తీసుకుని వాళ్ళను సజీవ మూర్తులుగా చిత్రిస్తాడు. నవలా రచయితలు కూడా ఇదే పద్ధతి అనుసరిస్తారనుకుంటాను. ఒక పాత్రను సృష్టించ టానికి తెలిసిన వ్యక్తుల్ని నమూనాలుగా తీసుకొని వాళ్ళను తమ అవసరానికి అనుగుణంగా మార్చుకుంటారు.

నవల ఒక ఉత్తమ ప్రక్రియ. పాత్రల అంతర్లోకాలను ఎక్కువగా చిత్రిస్తే, భౌతిక జీవితాన్ని కొంత అశ్రద్ధ చేస్తుంది. ఈ రెండు ప్రపంచాలకూ మధ్య రచయిత సాధించిన సామరస్యాన్నిబట్టీ నవల ఎంత చక్కగా నిర్మింపబడిందో నిర్ణయిస్తాం. ఎలాంటి నవలకైనా యిదే ప్రమాణం. ఉదాహరణకు, లారెన్స్ స్టెర్న్ రాసిన *ట్రిస్ట్రాం షాండీ* నుండి చవకబారు అడ్వెంచర్ రొమాన్స్ నవలలదాకా. *ట్రిస్ట్రాం షాండీ* లో అసలు 'యాక్షన్' లేదు. అలాగే రూసో రాసిన La Nouvelle Heloise (Julie or the New Heloise), గోతే రాసిన Wilhelm Meister, చివరికి సెర్వాంటెస్ రాసిన Don Quixote దాకా అనేక మంచి నవలల్లో యాక్షన్ పెద్దగా లేదు. కాని, మనకున్న అత్యుత్తమ నవలలివే.

ఉదాహరణకు, జాన్ పాల్ (అసలు పేరు యోహాన్ పాల్ ఫ్రీడ్రిష్ (1763–1825) రాసిన రొమాంటిక్ నవలలే తీసుకోండి. పాత్రల మానసిక జీవితాన్ని చిత్రించగలిగిన ఏ అవకాశాన్నీ వదులుకోలేదతడు. పైగా ఎంత గొప్ప రొమాన్సులవి! వాల్టర్ స్కాట్ నవలలు సాహసగాథల్లా వుంటాయిగాని, వాటిల్లోనూ పాత్రల హృదయపు లోతుల సంఘర్షణ విస్తృతంగా వుంటుంది. మానసిక జీవితాన్ని చిత్రించటానికి ఒక అవకాశంగా మాత్రమే నిజజీవితం సంఘటనలను వాడుకొంటాడు స్కాట్. కాని చవకబారు నవలల్లో సంఘటనలకోసమే సంఘటనల్ని గొలుసులాగ రాస్తూపోతారు. భౌతిక జీవితం, పాత్రల్ని వాళ్ల ఆలోచనల్నీ ఎలా ప్రభావితం చేస్తుందో చెప్పటానికే ప్రాధాన్యత యిస్తారు మంచి రచయితలు. రచనలోని నైపుణ్యం, పరిణితి అందులోనే కనిపిస్తుంది. పాఠకుల్ని మానసిక జీవితం ఆకట్టుకున్నంతగా, భౌతిక సంఘటనలు ఆకట్టుకోవు.

నవలా రచయిత పని గొప్ప సంఘటనల గురించి రాయడం కాదు. అతి సామాన్యమైన, రోజువారీ సంఘటనల్ని, చిన్నచిన్న విషయాల్ని కూడా ఆసక్తికరంగా రాయగలడతడు.

ఇక చరిత్ర (పుస్తకాలు), కవిత్వానికి పూర్తి భిన్నంగా వుంటాయి. అంటే, వైశాల్యానికి భౌగోళిక శాస్త్రం ఎలాంటిదో, కాలప్రవాహానికి చరిత్ర అలాంటిది. చరిత్రగానీ, భౌగోళిక శాస్త్రం గానీ, నిజమైన శాస్త్రాలు అనేకం. ఎందుకంటే వీటి అధ్యయనం వల్ల సార్వజనీనమైన సత్యాలేమీ తెలియవు. కొంత పరిమిత సమాచారం మాత్రమే అందిస్తాయి. కొత్త జ్ఞానం ఆర్జించాలనుకున్న వాళ్ళందరికీ చరిత్ర అధ్యయినం ఒక అలవాటుగా మారిందిప్పుడు. ఎందుకంటే మిగతా శాస్త్రాలలాగ, చరిత్ర చదవటానికి ప్రత్యేకమైన ప్రయత్నం, మేధోశ్రమ అవసరం లేదు. ప్రస్తుతానికి యిది యిలాంటివాళ్ళందరికీ యిష్టమైన సబ్జెక్టు. ప్రతీ సంవత్సరం కుప్పలుతెప్పలుగా ప్రచురితమవు తున్న చరిత్ర పుస్తకాలే యిందుకు నిదర్శనం.

"చరిత్రలో సంఘటనలన్నీ పునరావృత మవు తుంటాయి. కలైడోస్కోప్‌లోని రంగురాళ్ళలాగ ప్రతిసారీ, కొత్త అమరికలతో కనిపిస్తాయిగానీ, నిజానికి రాళ్ళు మారవు" అన్నవి నా అభిప్రాయం. నాతో ఈ విషయంలో అంగీకరించలేనివాళ్ళకు (నేను రాస్తున్న ఈ విషయాలు) ఆసక్తికరంగా వుండకపోవచ్చు. అలాగని వాళ్ళు దీన్ని ఖండించరు. ఎందుకంటే కొందరు చరిత్రను తత్వ శాస్త్రంతో ముడిపెట్టటానికి ప్రయత్నిస్తున్నారు. అసలు చరిత్ర, తత్వశాస్త్రంలో భాగమని కూడా మూర్ఖంగా వాదిస్తున్నారు. అంతేనా, తత్వశాస్త్రమంటే చరిత్రే అని అంటున్నారు. క్రమంగా తత్వశాస్త్రం స్థానాన్ని ఆక్రమిస్తుందట చరిత్ర!

చరిత్ర గురించి అందరికీ యింత ఆసక్తి పెరగటానికి కొన్ని కారణాలు కనిపిస్తున్నాయి. ఏ నలుగురు కలసినా యిదే చర్చ. ఇప్పుడిలా వాదోపవాదాలు చేసుకోవటం ఫాషన్‌గా మారింది. ఒకడు ఒక విషయం గురించి ఏదో మాట్లాడుతాడు. మరొకడు, అదే విషయాన్ని కాస్త పద్ధతి మార్చి చెబుతాడు. అలా యిద్దరూ శ్రోతల్ని ఆకర్షిస్తారు.

ఇలాంటి చర్చల్లోగాని, చరిత్రలోగాని, కొన్ని పరిమిత ప్రత్యేక విషయాలు మాత్రమే తెలుస్తాయి. అంతేగాని, శాస్త్రాధ్యయనంలోలాగ, సార్వజనీనమైన సత్యాలు ఆవిష్కరింపబడవు.

అయితే ఇలా మాట్లాడుకున్నంత మాత్రాన చరిత్ర *అధ్యయనానికున్న విలువను ఎవరూ తగ్గించలేరు. జీవితకాలం కొన్ని దశాబ్దాలకు మించదు. క్షణభంగురమైన ఈ జీవితాన్ని లక్షలమందితో కలసి పంచుకుంటాం. అందరం కాలగర్భంలో కలసిపోవలసిందే. అందువల్ల ఈ లక్షల జీవితాల, సంఘటనల నుండి కొన్ని ముఖ్యమైన క్షణాలను, ఘట్టాలను పదిలపరచటం అందరం హర్షించ దగ్గదే. ప్రతి తరంలోనూ, పరిస్థితులను ప్రభావితం చేసిన వ్యక్తుల గురించి తెలుసుకుంటాం.* మునిగిపోయే పడవలోంచి కొందర్నైనా రక్షించినట్టుగా.

మరో కోణంనుండి, చరిత్రను జంతుశాస్త్రానికి (Zoology) పొడిగింపుగా అర్థం చేసుకోవచ్చు. జంతువులను వాటి జాతులను (species) బట్టి అధ్యయనం చేస్తాం. కాని చరిత్రలో వ్యక్తుల గురించి, అంటే వాళ్ళు చేసిన మంచి-చెడ్డ పనుల్ని గురించి తెలుసుకుంటాం. ప్రతి మనిషికీ ఒక వ్యక్తిత్వముంటుంది. కాని శతాబ్దాల, సహస్రాబ్దాల చరిత్రలో ఎందరో వ్యక్తులు మరెన్నో సంఘటనలు. అందరిగురించీ తెలుసుకోలేం. అందువల్ల చరిత్రకెప్పుడూ (మిగతా శాస్త్రాలలాగ) పరిపూర్ణత రాదు. అంటే ఎంత తెలుసుకున్నా, తెలుసుకోవలసింది యింకా మిగిలే వుంటుంది. ఇతర శాస్త్రాలలో ఈ పరిపూర్ణత సాధించటం అసాధ్యంకాదు.

*చైనా, ఇండియాల చరిత్రను పరిశీలించినప్పుడు, ఆ సంఘటనల పరంపర, మన అధ్యయనం ఎంత లోప భూయిష్టమో గుర్తుచేస్తుంది. వైవిధ్య భరితమైన సంఘటనలను ఏకసూత్రంలో బంధిస్తున్నదేమిటో తెలుసుకొమ్మంటుంది. ప్రతిక్రీడకూ కొన్ని నియమాలున్నట్లే చరిత్ర గమనానికీ కొన్ని పద్ధతులున్నాయి. దేశాల గురించి తెలుసుకోవటం ద్వారా మానవజాతి గురించి తెలుసు కోవచ్చు. అంతే తప్ప, సంఘటనల చిట్టా చదువుతూ కాలం వృథా చెయ్యకూడదు.*

*చరిత్ర రెండు రకాలు. ఒకటి రాజకీయ పరిణామాలకు సంబంధించింది. మరొకటి సాహిత్యం, కళారంగాల చరిత్ర. ఒకటి వ్యక్తుల కోరికలకు, విజయ కాంక్షలకు సంబంధించినది. మరొకటి మేధోపరమైన చరిత్ర. ఒకటి హింస, భీభత్సం, దోపిడీ, లూటీ, కుట్రలు, హత్యలు, నరమేధలు. మరొకటి ప్రశాంత ధ్యానంలాంటిది. అంటే, యిది ఒకరకంగా తత్వశాస్త్ర చరిత్ర. దీని ప్రతిధ్వనులే, మనకు తెలిసిన యితర (రాజకీయ పరిణామాల) చరిత్రలోనూ వినిపిస్తాయి. మనుషుల ఆలోచనాధోరణుల్ని ప్రభావితం చేస్తాయి. అందువల్ల తత్వశాస్త్రాన్ని సరిగ్గా అర్థం చేసుకోగలిగితే, అదో శక్తివంతమైన ప్రపంచాన్ని మార్చగల శక్తివున్న ఆలోచనాక్రమమని అర్థమవుతుంది. ఈ మార్పు చాలా నెమ్మదిగానే జరగవచ్చు. కాని తప్పక జరుగుతుంది. అంటే ఒకతరానికి చెందిన తత్వశాస్త్ర చరిత్రే, అప్పటి నిజమైన చరిత్ర.*

*ఇక, వార్తాపత్రికలు,చరిత్ర అనబడే గడియారంలో సెకండ్ల ముల్లులాంటిది. దీనికి ఉపయోగించే లోహం కూడా మిగతా గడియారం భాగాలకుపయోగించే లోహంకన్నా తక్కువరకమైనది. ఈ ముల్లు చేసే పని నిమిషాలనూ, గంటలనూ లెక్కపెట్టటమే.*

వార్తాపత్రికలోని లీడింగ్ ఆర్టికల్ (ఎడిట్ పేజీలోని వ్యాసం) ఆనాడు జరిగిన సంఘటనల కోరస్ (బృందగానం) లాంటిది. ఉత్ప్రేక్షలే జర్నలిజానికి ప్రాణం. ప్రతి చిన్న విషయాన్నీ నాటకీయంగా మలచగలగాలి. సెన్సేషనల్‌గా మార్చి, అత్యల్ప విషయాలనుండి గూడా వీలైనంత పిండాలి. జర్నలిస్టులంతా ఎక్కడ ఏ మిణుగురు కనిపించినా ఇల్లు తగలబడిపోతుందని గగ్గోలుపెట్టేవాళ్ళే. అది వాళ్ళ వృత్తిధర్మం. వార్తలను ఆసక్తికరంగా తయారుచేసే పద్ధతి యిదే. ఈ విషయంలో వాళ్ళు ఊరకుక్కలలాంటివాళ్ళు. ఎక్కడ ఏ చిన్న అలికిడి అయినా పెద్దగా మొరిగి అందర్నీ వులిక్కిపడేట్టు చేస్తారు.

*అందువల్ల మనం పత్రికల్ని అంత సీరియస్‌గా తీసుకోకపోతేనే ఆరోగ్యానికి మంచిది. మంచి వార్తాపత్రిక కూడా ఒక భూతద్దం కన్న ఎక్కువేమీ కాదు. లేదా గోడమీద పడిన నీడలాంటిది.*

నడకకు కర్ర ఎలాంటిదో, ఆలోచనకు కలం అలాంటిది. కర్ర పట్టుకోనప్పుడే మనం సునాయాసంగా, వడివడిగా నడవగలం. చేతిలో కలం లేనప్పుడే ఆలోచన స్వైరవిహారం చేస్తుంది. వృద్ధాప్యంలో మాత్రమే మనిషికి కర్ర అవసరమవుతుంది. కలం కూడా అప్పుడే పట్టుకోవాలి.

ఒక ప్రతిపాదనకు ఒక ఊహకు మనసులో బీజం

పడిందంటే, భూమ్మీద పడిన జీవి పెరిగినట్టే అదీ పెరుగుతుంది. తనకు అవసరమైన ఆహారం సంపాదించుకొని భోజనం చేస్తుంది. తనకు సరిపడని పదార్థం దొరికితే దాని జోలికి కూడా వెళ్ళదు. ఒకవేళ బలవంతంగా తినవలసి వచ్చినా తక్షణమే విసర్జిస్తుంది. లేదా వాంతి చేసుకుంటుంది.

అమరత్వం సాధించటానికి వ్యక్తికి చాలా ప్రత్యేకతుండాలి. అన్ని సుగుణాలు ఒకే మనిషిలో ఉండటం కష్టమే. అయితే ప్రతీ తరంలో ఒకరో యిద్దరో అలాంటివాళ్ళుండకపోరు. ఈ లక్షణాలన్నీ వుండటంవల్లనే, కాలక్రమంలో వ్యక్తుల అభిరుచుల్లో ఎంత మార్పు వచ్చినా, చరిత్రలో కొన్ని నిత్యపఠనీయ గ్రంథాలుగా కొనసాగుతాయి.

భవిష్యత్ తరాలవాళ్ళు తనను గుర్తుపెట్టుకోవాలనుకునే ఈ రచయితకు, తనలాంటి మరొకడు ఈ విశాలవిశ్వంలో ఎంత వెదికినా కనిపించడు. తన విలక్షణతవల్ల అందరికన్నా భిన్నంగా వుంటాడితడు. ఎన్ని తరాలు గడచినా యితడికి తన ఉన్నత స్థానం పదిలంగానే ఉంటుంది. అతడి ఆలోచనలకు కాలదోషం పట్టలేదంటే, అతడు సజీవంగా ఉన్నట్టే.

సాహిత్యంలో ప్రతీకలు, ఉదాహరణలు చాలా ముఖ్యమైనవి. రెండు విషయాల మధ్య వున్న తెలియని సంబంధాన్ని పాఠకులకు తెలిసిన మరొక సంబంధంతో సుబోధకం చేస్తాయి. కొన్నిసార్లు ఈ ఉదాహరణలు పిట్టకథలుగా, ప్రతీకాత్మక కథనాలుగా రూపాంతరం చెందుతాయి. మొత్తంమీద అర్థంకాని విషయాలను అర్థం చెయ్యటం వీటి ప్రధాన ప్రయోజనం. ఆలోచనల విస్తృతికి మూలం ఉదాహరణలే. రెండు ఆలోచనల మధ్య సారూప్యమున్నప్పుడే ఆలోచన పెరుగుతుంది – అంటే భేదాలను విస్మరించి, ఒకేరకమైన లక్షణాలను ఎంపిక చేసుకుంటాం. వస్తువుల, విషయాల మధ్య ఉన్న పరస్పర సంబంధాలను అర్థం చేసుకోవటమే మేధస్సు కర్తవ్యం. పరస్పర విరుద్ధంగా కనిపించే భావనల మధ్య కూడా సామాన్య లక్షణాలను చూడటమే జ్ఞాన పరిపూర్ణతకు తొలిమెట్టు.

అందువల్ల జ్ఞానబోధలో, ప్రతీకలు, ఉదాహరణలకు ఎంతో ప్రాముఖ్యం వుంది. ఈ ఉదాహరణలలోని వైవిధ్యం, వాటి ముక్కుసూటిదనం, అతని ప్రతిభకు గీటురాయి. "ప్రతీకలను చెప్పటాన్నిబట్టే ఒక రచయిత విలక్షణతను గుర్తించవచ్చు" అంటాడు అరిస్టాటిల్. ఇది నేర్చుకుంటే వచ్చేది కాదు. జీనియస్సులకు స్వతహాగా వుంటుంది అంతే.

*మంచి పుస్తకాలు చదవాలంటే, చెడ్డపుస్తకాలు చదవటం మానెయ్యాలి. జీవితకాలం చాలా పరిమితం. కాలమూ, శక్తి కూడా పరిమితమే.*

ముఖ్యమనుకున్న పుస్తకాన్ని రెండుసార్లు చదవాలి. రెండవసారి చదివినప్పుడు పుస్తకంలోని వివిధ పార్శ్వాల మధ్య ఉన్న సంబంధం మరింత బాగా అర్థమవుతుంది. ముగింపు తెలిస్తేనే, ప్రారంభానికున్న ప్రాముఖ్యత తెలుస్తుంది. పైగా రెండుసార్లూ ఒకే మానసిక స్థితిలో చదవం. రెండవసారి చదివినప్పుడు, ప్రతి పేరామీద కొత్త వెలుగు ప్రసరించినట్టుగా వుంటుంది.

ఒక రచయిత రచన అతని మేధోసారం. అతడు ఎంత గొప్ప వక్త, ఎంత అద్భుత సంభాషణాచతురుడైనా, రాసిన పుస్తకమే ఈ యితర చర్యలకన్నా గొప్పది. రచయితతో వ్యక్తిగత పరిచయం లేకపోయినా, పుస్తకం చదివి అతడి గురించి పూర్తిగా తెలుసుకోవచ్చు. గొప్ప మేధావి కాకపోయినా, ఒక రచయిత పుస్తకం చదివితే మనకు చాలా విషయాలు తెలుస్తాయి. ఎందుకంటే ఒక భూతద్దం నుండి పడిన కిరణాలలాగ, అతడి ప్రతిభ, రచనలో ప్రతిఫలిస్తుంది. అతడి మేధోఫలం, అతడి అధ్యయన పరమావధి ఆ పుస్తకం. స్వయంగా అతడితో సంభాషించినా, అతడి పుస్తకం చదివినంత తృప్తి కలగదు.

*అందువల్ల పరిచయం చేసుకోవటానికి యిష్టంలేని ఈ రచయిత పుస్తకాలు కూడా మనం చదివి ఆనందించవచ్చు. గొప్ప సంస్కారం వున్నవాళ్ళే రచయితల సంపర్కంకన్న వాళ్ళ పుస్తకాలను యిష్టపడతారు!*




తెలుగు సేత :
ముక్తవరం పార్థసారథి
హైదరాబాదు.
ఫోన్ : 9177618708


*(వచ్చేనెల - కీర్తిప్రతిష్ఠలు)*




# మా జాతి గులాబి రెమ్మా

– వరవరరావు

కొడవటిగంటి రోహిణీ ప్రసాద్ హిందుస్థానీ సంగీత కచేరి చేసి పప్పన్నం పెడతామంటే ఒక సాయంత్రం వెళ్ళాం. ఆయన సాయంత్రం 4 గంటల నుండి 8 గంటల దాకా మాటలు, పాటలు, గిటార్, సితార్, ఎలక్ట్రానిక్ తబ్లా మార్చిమార్చి మమ్మల్ని ఆశ్చర్యచకితుల్ని చేశాడు. ఆయనకు సైన్సు ఎంత వ్యసనమో సంగీతమంత వ్యసనమని అర్థమైంది. అక్కడికి వచ్చినవాళ్ళలో రాగం, తాళం అంటే అసలే తెలియనివాణ్ణి నేనేనేమో. కాకపోతే ఎక్కువగా హిందీ సినిమా పాటలు, కొన్ని తెలుగు సినిమా పాటలు, కొన్ని లలిత గీతాలు పాడాడు. అవన్నీ నేను విన్నవే. నాకిష్టమైనవే. ఆయనకు హిందీలో నౌషాద్, తెలుగులో ఎస్. రాజేశ్వరరావు సంగీత దర్శకత్వం చాలా ఇష్టం. గాయకులుగా కె.ఎల్. సైగల్, ఘంటసాలలు చాలా ఇష్టం. బాలమురళీకృష్ణను సంగీత జీనియస్ అంటాడు. కవుల్లో సాహిర్, శ్రీశ్రీలు సినిమాల్లోనూ ఇష్టమే. లయ జ్ఞానం ఉన్నవాళ్ళుగా గురజాడ, శ్రీశ్రీ, ఆరుద్ర, నారాయణరెడ్డిలను గుర్తిస్తాడు.

'తొలి రోజుల్లో హిందీ సినిమా పాటలు ఏమంత బాగుండేవి కావు. 50ల నుంచి 60ల దాకా సినిమా పాటల్లో అద్భుతమైన సాహిత్యం వచ్చింది. ఎందువల్ల?' అని నన్ను అడిగాడు. 'ఇప్టా' అరసం, ప్రజా నాట్యమండలి హిందీ, తెలుగు సినిమాల్లోకి రావడంవల్ల'నన్నాను నేను. సాహిర్, కైఫీ ఆజ్మీ, మజ్రూహ్ సుల్తాన్‌పురి మొదలైనవాళ్ళంతా అట్లా వచ్చినవాళ్ళేనన్నాను.

రోహిణీ ప్రసాద్ సైన్సు మాట్లాడినా ఇంక మధ్యన మనకు మాట్లాడే అవకాశం రాదు. అట్లే సంగీతమైనా ఇంకొకళ్ళకు పాడే అవకాశం కూడ ఇవ్వడం కష్టమేనని మొన్ననే తెలిసింది. వచ్చినవాళ్ళలో సంగీత జ్ఞానమున్నవాళ్ళు చాలామందే ఉన్నారు. పాడగలవాళ్ళు కూడా కనీసం పదిమంది ఉండి ఉంటారు. కష్టం మీద నలుగురయిదుగురికి నాలుగయిదు పాటలు పాడే అవకాశం వచ్చింది. వచ్చినవాళ్ళలో మా జంట మాత్రమే తెలంగాణది. మిగతా ఎవరూ పుట్టుకవల్ల ఇక్కడివాళ్ళు కాదనుకుంటాను. అంతా ఉద్యోగరీత్యా హైదరాబాద్‌కు వచ్చినవాళ్ళే లేదా వ్యాపారాలకోసం వచ్చినవాళ్ళు.

పాడిన నలుగురయిదుగురిలో పాడిన ఐదారు పాటల్లో రెండు సరోజిని నాయుడు మీద కావడం నాకు ఆశ్చర్యం వేసింది. 'అమ్మా సరోజినీ దేవీ, స్త్రీ జాతి శిరోమణివమ్మా. మా జాతి గులాబీ రెమ్మా!' ; టంగుటూరి సూర్యకుమారి పాడిన బహుళ ప్రచారం పొందిన పాట ఒకటి. మరొకటి పద్యం.

తీగె లాగితే డొంకంతా కదిలినట్లయింది.

జాతీయోద్యమం, ఆంధ్ర మహాసభ, ఆంధ్రోద్యమం ఒకే శత్రువుకు (బ్రిటీష్ వానికి, వాని బంటయిన నిజాంకు) వ్యతిరేకంగా సాగుతున్న కాలంలో వచ్చిన పాట, పద్యం అయి ఉండాలి ఇవి.

కాని ఎవరీ సరోజినీ నాయుడు?

ట్యాంకుబండ్ మీద సరోజినీ నాయుడు విగ్రహం ఉన్నా, బ్రహ్మనాయుడు పేరులో నాయుడు అని ఉన్నందుకు, నాయుడు అంటే ఆంధ్ర అనుకుని మొట్టమొదటే కూల్చివేసినట్లుగా కూల్చివేసి ఉండేవాళ్ళా?!

1877లో సాలార్‌జంగ్ ఇంగ్లాండుకు వెళ్ళినప్పుడు అక్కడి ప్రభుత్వాన్ని – మేం హైదరాబాదులో ఒక కాలేజీ పెడుతున్నాం. మాకొక ప్రిన్సిపల్‌ను సూచించండి అని అడిగాడట. అప్పుడే అక్కడ పి.జి. పూర్తి చేసిన అఘోరనాథ్ ఛటోపాధ్యాయ పేరు వీళ్ళు సూచించారట. అట్లా ఏర్పాటయిన నిజాం కాలేజీకి మొట్టమొదటి ప్రిన్సిపల్‌గా ఆయన వచ్చాడు. ఆయన కూతురే సరోజినీ దేవి.

ఇంతలో సింగరేణి బొగ్గు గనులు వచ్చి బొగ్గు గనుల




దాకా రైల్వే లైను వేయడానికి నిజాం బ్రిటిష్ కంపెనీతో ఒప్పందం చేసుకున్నాడు. అదే చాందా రైల్వే లైను ఒప్పందం. ఈ చాందా (ఇప్పటి చంద్రాపూర్) రైల్వే ప్రాజెక్ట్ ఒప్పందం ఏమిటో బయటపెట్టాలని, ఇది బ్రిటిష్ కాంట్రాక్టర్లకు ఎందుకు ఇచ్చారో తెలుసుకునే హక్కు హైదరాబాద్ రాష్ట్ర ప్రజలకుందని అఘోరనాథ్ ఛటోపాధ్యాయ అధ్యక్షుడుగా ఏర్పడిన ఒక కమిటీ ఆందోళన చేపట్టింది.

(మెట్రో రైల్వే లైను ఒప్పందం గురించి హైదరాబాద్ ప్రజలకు, తెలుగు ప్రజలకు ప్రశ్నించే హక్కు ఉన్నదని అంటున్న వాళ్ళను అనుమానంగా, అవమానంగా చూస్తూ ఎద్దేవా చేస్తున్న వాళ్ళతో పోల్చి చూడండి.)

'మేం తెచ్చుకున్న ఉద్యోగస్తుడు మా కాంట్రాక్టును ప్రశ్నిస్తున్నాడా?' అని కోపం వచ్చి నిజాం ప్రభుత్వం ఆయనను దేశ బహిష్కరణ చేసింది. విచిత్రంగా బ్రిటిష్ ప్రభుత్వం మేం సూచించిన అధికారిని బహిష్కరిస్తారా అని కోపం వచ్చి నిజాంపై ఒత్తిడి తెచ్చింది. అట్లా అఘోరనాథ్ ఛటోపాధ్యాయ మళ్ళీ హైదరాబాద్ తిరిగి వచ్చాడు. అఘోరనాథ్, ఆయన సహచరి వరదాదేవి హైద్రాబాద్ రాజ్యంలో మొదటి బాలికల పాఠశాలను నాంపల్లిలో స్థాపించారు.

ఈ మధ్యలో సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో పరిచయమైన హైదరాబాద్ డాక్టర్ గోవిందరాజులు నాయుడు ప్రేమలో పడింది సరోజినీదేవి. కాని అప్పటి హైదరాబాద్ సంస్థానంలో మతాంతర, కులాంతర వివాహాలు నిషేధం. కూతురు కోసం ఈ చట్టానికి చిన్న మినహాయింపు సాధించి హైదరాబాద్ స్పెషల్ మ్యారేజెస్ ఆక్ట్ అనే సివిల్ చట్టాన్ని కల్పించి తన కూతురుతో గోవిందరాజులు నాయుడుకు వివాహం చేయించాడు అఘోరనాథ్. ఆ వివాహాన్ని మద్రాస్‌లో శాస్త్ర సమ్మతం చేసినవాడు కందుకూరి వీరేశలింగం.

*ఒకరకంగా ఈ కుటుంబ చరిత్ర ఇంచుమించు ఒక వంద సంవత్సరాల హైదరాబాద్ చరిత్ర.* సరోజినీదేవి అట్లా సరోజినీ నాయుడు అయింది. గోవిందరాజులు, సరోజినీ నాయుడుల సంతానమే డాక్టర్ జయసూర్య. సుప్రసిద్ధ హోమియో డాక్టర్‌గా రామ్‌కోఠిలో, హైదరాబాద్‌లో ఆ రోజుల్లో అందరికీ తెలిసిన జయసూర్య దేశానికి మాత్రం, తెలంగాణలో మొట్టమొదటి పౌరహక్కుల నాయకుడుగా సురవరం ప్రతాపరెడ్డి, వట్టికోట ఆళ్వారుస్వామిలతో పాటు తెలుసు. సరోజినీనాయుడు కూతురు పద్మజా నాయుడు తెలంగాణ సాయుధ పోరాట కాలంలో ఆకునూరు, మాచిరెడ్డిపల్లిల మీద పోలీసుల దాడిపై ప్రఖ్యాత నిజనిర్ధారణ బృందానికి నాయకురాలు. 1952 ఎన్నికల నాటికి కమ్యూనిస్టు పార్టీ మీద నిషేధం ఉండడంవల్ల పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్‌ను ఏర్పాటుచేసి చెయ్యి గుర్తుతో తెలంగాణలో 90 స్థానాల్లో 48 స్థానాలను గెలుచుకున్నది డాక్టర్ జయసూర్య నాయకత్వంలోనే. తెలంగాణరైతాంగ సాయుధ పోరాట కాలంలో ఉరిశిక్షలు పడిన పదకొండుమంది కమ్యూనిస్టు కార్యకర్తల కోసం ఇంగ్లండు నుంచి బారిష్టరు ప్రిట్‌ను, సుప్రీం కోర్టు నుంచి డానియల్ లతీఫ్‌ను పిలిపించి వాదింపచేసినవాడు డా. జయసూర్యయే. సైనికచర్య సందర్భంగా జరిగిన అత్యాచారాలు, హత్యా కాండపై సమగ్రమైన నివేదిక ఇచ్చినవాడు జయసూర్యనే. నాలుగు వేల మంది కమ్యూనిస్టులు, సానుభూతిపరులు మాత్రమే కాదు, రజాకార్ల పేరుతో కనీసం నలభై వేల మంది అమాయక ముస్లింలను భారత సైన్యం చంపిందని కూడా ఆయన సాక్ష్యాధారాలతో నివేదిక ఇచ్చాడు. ఆ నివేదిక ప్రామాణికమైనదని జవహర్‌లాల్ నెహ్రూ సన్నిహిత మిత్రుడు పండిట్ సుందర్‌లాల్ కూడా భావించాడు.

అయితే డాక్టర్ జయసూర్యను మించిన తల్లి సరోజినీదేవి. పద్నాలుగవ ఏటనే ఇంగ్లీష్‌లో సానెట్ రాసి గాంధీజీతో 'నైటింగేల్ ఆఫ్ ఇండియా' అని పిలిపించుకున్న ఇష్టమైన శిష్యురాలు. 'ఇంపీరియల్ ఢిల్లీ' వంటి మరెన్నో

సుప్రసిద్ధ సానెట్లు రాసిన ఇంగ్లీషు కవయిత్రి ఆమె. హైదరాబాద్‌లోని చుడీ బజార్ (బ్యాంగిల్ సెల్లర్స్) మీద, కుతుబ్‌షాహీ సమాధుల మీద ఆమె రాసిన సానెట్లు హైదరాబాద్ సంస్కృతికి అద్దంపడతాయి. 'సంస్థానాల్లో కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేయనవసరం లేదు. సంస్థాన వ్యవహారాల్లో జోక్యం చేసుకోరాదు' అని గాంధీజీ భావిస్తున్న రోజుల్లోనే ఆమె హైదరాబాద్‌లో ఉండి కూడా అఖిలభారత కాంగ్రెస్ అధ్యక్షురాలయింది.

ఆమె ఇల్లు అబిడ్స్‌లోని *'గోల్డెన్ త్రెషోల్డ్'* (Golden Threshold) అక్షరాల సాహిత్య సంస్కృతుల సంగమం. సహజీవన సంస్కృతికి తెరచిన తలుపులు. అది హైదరాబాద్ కళాసాహిత్య సంస్కృతులకే కాదు, దేశంలోని నలుమూలల నుంచి, బహుశా విదేశాల నుంచి కూడా హైదరాబాద్‌కు వచ్చిన విభిన్న సంస్కృతుల, కళల, వైవిధ్యభరితమైన కూడలిగా ఉండేది. సంస్కృతి గురించి, హైదరాబాద్ సంస్కృతి గురించి ఇవ్వాళ మాట్లాడుతున్న వాళ్ళు అఘోరనాథ్ ఛటర్జీ, సరోజనీనాయుడు, డా. జయసూర్యలు తెలుగుజాతికి, ముఖ్యంగా సంస్కృతికి చేసిన సేవల నెపుడయినా తలుచుకున్నారా? ఆమె పుట్టుక వల్ల బెంగాలీ అనే అభిమానంతో 1990లో సుప్రసిద్ధ బెంగాలీ దర్శకుడు గౌతమ్ ఘోష్ గోల్డెన్ త్రెషోల్డ్‌లో చిత్రీకరించి ఆమెపై అద్భుతమైన డాక్యుమెంటరీని ఫిల్మ్ డివిజన్ కోసం తయారు చేశాడు. గోల్డెన్ త్రెషోల్డ్ సాంస్కృతిక చరిత్ర ఆమెతోనే ఆగిపోలేదు. ఏ కారణంవల్లనో కానీ 1960లలో అందులో మైసూర్ కేఫ్ వచ్చింది. శ్రీశ్రీ హైదరాబాద్‌కు ఎప్పుడొచ్చినా అందులోనే దిగేవారు. హైదరాబాద్‌లో ఉన్న కవులందరూ సాయంకాలం ఆయనను అక్కడే కలిసేవాళ్ళు. 1970లో అభ్యుదయ సాహిత్య నివేదిక సదస్సుకు వచ్చినపుడు జరిగిన అరసం కార్యవర్గం కోసం మాత్రం ఆయనను ద్వారక హోటల్‌లో ఉంచారు. అక్కడి నుంచి ఆరుద్రతో కలసి జూలై 3న ఆయన హిందీ ఆర్ట్స్ కాలేజీలో మాట్లాడటానికి వెళ్ళినపుడు తప్పించి చలసాని ప్రసాద్ ఆయనను మైసూరు కేఫ్‌కి తెస్తాడని అరసం వాళ్ళు, సినిమా వాళ్ళు, ప్రభుత్వం ఊహించే అవకాశం ఉంది గనుకనే జులై 3 అర్ధరాత్రి మేమంతా ఇంపీరియల్ హోటల్ (నాంపల్లి)కి మారి విరసం ఏర్పాట్లు ప్రకటించాల్సి వచ్చింది. జులై 3 సాయంకాలం దాకా ఈ గోల్డెన్ త్రెషోల్డ్‌లోనే ప్రొద్దుటూరు నుంచి 'ప్రభంజనం', కరీంనగర్ నుంచి 'విద్యుల్లత', వరంగల్ నుంచి 'తిరగబడు', విశాఖ నుంచి 'సాగర గ్రంథమాల' లేదా శ్రీశ్రీ షష్టిపూర్తి కమిటీ, కావలి నుంచి కె.వి.ఆర్, దిగంబర కవుల్లో నలుగురు కలునుకున్నదీ, కలబోసుకున్నదీ, 'మార్చ్' కవితాసంకలనం, కరపత్రాలు పంచుకున్నదీ ఇక్కడే.

ఆరు సూత్రాల పథకం కింద 1974లో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పడింది కూడా ఈ గోల్డెన్ త్రెషోల్డ్‌లోనే. కేంద్రీయ విశ్వవిద్యాలయం పరిపాలనా విభాగం, సరోజినీ నాయుడు స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఇక్కడ, మిగతా శాఖలు మాసబ్ ట్యాంకు దగ్గర ప్రారంభమయ్యాయి. ఈ విశ్వవిద్యాలయంలో పరిశోధక కార్యదర్శిగా ఎం. కోదండరామ్, (ఇపుడు తెలంగాణ పొలిటికల్ జె.ఎ.సి. ఛైర్మన్) ఒక ప్రొఫెసర్, తన పరిశోధనా విద్యార్థిని వేధిస్తున్నాడని, అతనిపై చర్య తీసుకోవాలని ఇక్కడే ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించి విజయాన్ని సాధించాడు.

గచ్చిబౌలీ క్యాంపస్ ఏర్పడి అక్కడికి మారిన తర్వాత కూడా అక్కడ చాలాకాలం ఫైన్ ఆర్ట్స్, మాస్ కమ్యూనికేషన్స్ శాఖలు కొనసాగాయి. ఆరుద్ర నాట్యశాస్త్రం ఇక్కడే నేర్పాడు. సుప్రసిద్ధ చిత్రకారుడు లక్ష్మాగౌడ్ చిత్రలేఖనం ఇక్కడే నేర్పాడు. కేంద్రీయ విశ్వవిద్యాలయం థియేటర్ ఆర్ట్స్ విద్యార్థులు కాళీపట్నం రామారావుగారి 'చావు' కథను ఎంతో సృజనాత్మక నాటికగా ఎంతో సహజంగా ప్రదర్శించింది ఇక్కడే. సాలార్‌జంగ్ కాలంలో హైదరాబాద్ రాజ్యంలో పరిశ్రమల గురించి 80 లలో పరిశోధన చేసిన సుప్రసిద్ధ రచయిత, పి.యు.డి.ఆర్. సంస్థాపక నాయకుడు, ఢిల్లీ



లండన్‌లో చాప్లిన్, గాంధీలతో సరోజినీ నాయుడు



యౌవ్వనంలో సరోజినీదేవి

విశ్వవిద్యాలయం ఆర్థిక శాస్త్ర అధ్యాపకుడు సి.వి. సుబ్బారావు హైదరాబాద్‌లో ఉన్నంతకాలం ఇక్కడే 'సమీక్షా వేదిక' నిర్వహించాడు. అక్కడ నిర్వహించిన సాహిత్య సమాజ సంబంధాల చర్చా – విశ్లేషణలే తర్వాత కాలంలో '*విభాత సంధ్యలు*' పేరుతో పుస్తక రూపంలో వెలువడి సాహిత్య విమర్శలో ఒక ప్రత్యేకమైన గుర్తింపును పొందింది.

అబిడ్స్ మీదుగా నాంపల్లికి వెళ్తుంటే అప్రయత్నంగా గోల్డెన్ థ్రెషోల్డ్ వైపు చూపులు మళ్ళుతాయి. ఇపుడక్కడ సరోజినీ దేవి ఆవాసం మాత్రం మిగిలి ఆవరణ అంతా మారిపోయింది. ఆవాసం కేంద్రీయ విశ్వవిద్యాలయానికి అప్పగించినందువల్ల ఇంకా దూరవిద్యాకేంద్రంగా, తమ సిటీ సెంటర్‌గా – అంటే కేంద్రీయ విశ్వవిద్యాలయం గురించిన సమాచారం నగరంలో ఇచ్చే కార్యాలయంగా కొనసాగిస్తున్నారు. ఆవరణ అంతా కొత్త భవనాలు వస్తున్నాయి. గేట్లోంచి లోపలికి చూస్తే, అక్కడ గాంధీగారు నాటిన మామిడి చెట్టు మీద ఈ వసంత ఋతువులో ఆయన ఇష్టంగా పిలుచుకున్న 'నైటింగేల్' పాడుతూ ఉంటుందా? లేదా ఈ తరం కోకిలలు ఆమెను ఆవాహన చేసుకొని ఆనాటి స్మృతులను మామిడి చిగుళ్ళతో వెతుకుతూ ఉంటాయా? రామ్‌కోఠి మీంచి కింగ్ కోఠీ వైపు పోతుంటే కుడిచేతివైపు చూపు మరల్చుకోకుండా ఉండలేం. అక్కడ అవిశ్రాంతంగా డాక్టర్ జయసూర్య తెలంగాణ ప్రజల పోరాట హక్కుల కోసం ఏదో ప్రయత్నాల్లో ఉన్నట్లే ఉంటుంది. రామ్‌కోఠీలో సరోజినీదేవి హాల్ ఉంది. ఇటీవల కుల నిర్మూలనా పోరాట సమితి మహాసభలు జరగటం మినహాయిస్తే ఇదీ మన సాంస్కృతిక చరిత్రలో లేకుండా పోతున్నదిగానీ 72లో జార్జి రెడ్డిని ఉస్మానియా ఇంజనీరింగ్ కాలేజీ మెట్లమీద ఎ.బి.వి.పి., ఆర్.ఎస్.ఎస్. శక్తులు అప్పటి విద్యామంత్రి అండతో చంపినపుడు ప్రగతిశీల విద్యార్థి సంఘాలన్నీ జార్జిరెడ్డి సంస్మరణ సభను నిర్వహించింది ఇక్కడే. రాష్ట్రస్థాయి విప్లవ విద్యార్థి ఉద్యమ నిర్మాణంలో పి.డి.ఎస్.యు., ఆర్.ఎస్.ఎస్.ల చీలిక ఇక్కడే జరిగింది.

సికిందరాబాద్‌లో మారేడుపల్లికి తోవలు చీలే చోట చిన్నదే అయినా సజీవమైన సరోజినీదేవి నల్లని శిల్పం (బస్ట్), దక్కన్ క్రానికల్ ఆఫీసు రోడ్డుకు సరోజినీ దేవి రోడ్డు అనే పేరును బట్టి సికిందరాబాద్ ప్రజలయినా ఆమెను గుర్తుపెట్టుకున్నారు. పైగా సికిందరాబాద్ క్లాక్‌టవర్ దగ్గర 69 తెలంగాణ అమరుల సంస్మరణ స్థూపానికి దగ్గరగా సరోజినీ దేవి స్మృతి మిగలడం మంచి సంస్కారమనిపించింది.

ఇంకా నిజాం కాలేజీ, అఘోరనాథ్ ఛటర్జీ – ఎప్పటి మాట –

సరోజినీ దేవిపై పాట, పద్యం పాడినవాళ్ళకు తెలుసునా – ఈ సాంస్కృతిక వారసత్వం!

(*'శంకరన్ స్మృతి' సంచిక*)



వరవరరావు



ఘంటసాల

# అమ్మా! సరోజినీదేవీ!

## సింధుభైరవి–చతురశ్ర గతి

**– రచన : తోలేటి వెంకటరెడ్డి**

**– గానం : ఘంటసాల**

**అమ్మా సరోజినీదేవీ! పరి**
**పూర్ణ సువర్ణకళామయజీవీ! ॥అమ్మా॥**

**1. స్త్రీజాతి శిరోమణివమ్మా**
**మా జాతి గులాబీ రెమ్మ**
**మధురాల వరాల స్వరాలు పల్కు**
**మంజుల కోయిలవమ్మ ॥అమ్మా॥**

**2. స్వారాజ్యసమర కరాసి!**
**చరితార్థవు సద్గుణరాశీ!**
**వర వీరవిహార స్వరాజ్య సమర**
**ధ్రువతారవు నీవమ్మా! ॥అమ్మా॥**

**3. నీ జీవితకావ్యాలాపం**
**విశ్వానికి ప్రేమకలాపం అను**
**రాగతరంగ మృదంగభంగిమల**
**అమృతము చిందితివమ్మా! ॥అమ్మా॥**

**భావం :** అమ్మా ! సరోజినీదేవీ ! బంగారంలాంటి సంపూర్ణమైన కళాజీవితాన్ని అనుభవించినదానా ! స్త్రీజాతికంతటికి శిరోమణివంటిదానవు. గులాబీరెక్కవంటి సున్నితమైన మనస్సుగలదానవు. తీయని స్వరాలతో పాటలు పాడే కోయిలవు. స్వాతంత్ర్యసమరంలో కత్తిలా దూసుకుపోయావు. సద్గుణరాశివిగా చరితార్థురాలివైనావు. స్వరాజ్యసమరంలో వీరవిహారం చేసి ధ్రువతారగ చిరస్థాయిగా నిలిచినావమ్మా! నీ జీవితమే ఒక విశ్వప్రేమ కావ్యం. నీ ప్రేమతరంగాల మృదంగనాదం విశ్వవ్యాప్తం కాగా అమృతంవంటి తీయని అనురాగాన్ని చిందించినావమ్మా!

అర్థాలు : మంజుల=మృదువైన; కర+అసి=చేతి కత్తి; కలాపం=క్రియావిధానం.

తెలుగింటి ఆడపడుచు సరోజినీ నాయుడు స్వాతంత్ర్య సమరంలో ఎంతో చురుకైన పాత్ర వహించింది. గవర్నరుగా అందరి మెప్పు పొందింది. ఆమె మరణించినప్పుడు ఆమెను స్మరించుకుంటూ తోలేటి వెంకటరెడ్డిగారు రచించిన స్మృతిగీతం ఇది.

'మా జాతి గులాబీ రెమ్మ' అన్న ప్రయోగంలో చిన్న ధ్వనిని రచయిత నిక్షిప్తం చేశారు. ఎప్పుడూ గులాబిని కోటుకు పెట్టుకునే అలవాటున్న జవహర్‌లాల్ నెహ్రూ అభిమానాన్ని సంపాదించిన ప్రముఖులలో సరోజినీనాయుడు ప్రథమురాలుగా నిలిచిందన్న సంగతి అలనాటి ప్రముఖులందరికీ తెలిసిన విషయమే. భారతదేశప్రధాని అభిమానాన్ని సంపాదించుకోగలగటం సరోజినీదేవి చరితార్థతను ప్రకటిస్తున్నదనే అంశాన్ని ఈ పదప్రయోగంలో కవి చక్కగా సూచించారు. 'మధురం' అనేది ఒక విశేషణం. దీన్ని నామవాచకంగా చేస్తే 'మాధుర్యం' అవుతుంది. అలాకాక 'మధురం'నే ఏకవచనంగా మలుచుకుని 'మధురాలు' అంటూ బహువచనంగా ప్రయోగించడం నిజంగానే మధురమైన భాషాప్రయోగం. 'భారతకోకిల' (The Nightingale of India) అనే బిరుదును మొదటి చరణంలోనే 'మంజుల కోయిల' అంటూ సంభావించటం మెచ్చదగిన అంశం. రెండో చరణం ప్రారంభంలో ఆమెను స్వాతంత్ర్యసమరంలో 'చేతికత్తి'గా అభివర్ణించిన కవిగారికి తృప్తి తీరక మూడు, నాలుగు పాదాలలో 'స్వరాజ్యసమర ధ్రువతార' అని ఉత్తమోత్తమమైన విశేషణాన్ని ప్రయోగించి, ఇక ఇంతకంటె ఎక్కువగా ప్రశంసించలిగే అవకాశాన్ని ఏ కవికీ మిగల్చలేదు.

స్వరాజ్యం వేరు, స్వారాజ్యం వేరు. స్వతంత్ర దేశానికి పర్యాయపదంగా స్వరాజ్య పదాన్ని హిందుస్తానీ భాషాసంప్రదాయానుసారం మనం ఉపయోగిస్తున్నాం. కొంతవరకు ఫరవాలేదు. కాని స్వారాజ్యం అంటే 'స్వర్గం' అని అర్థం. ఈ అర్థంలోకాక, స్వతంత్రమనే అర్థంలో ఈ కవిగారు 'స్వారాజ్యం' ఉపయోగించడం విశేషం.

"భారతీయులకళా.." అనే పద్యంలో కూడా వీరు ఈ పదాన్నే ప్రయోగించారు. అంతేకాదు, సాహిత్యాభిమానులకు కొత్త పదబంధాన్ని వినూత్నభావంతో పరిచయం చేసిన ఘనత వీరిదే అని ఆనందంగా చెప్పవచ్చు. *'మృదంగ భంగిమల' ప్రయోగంలో 'భంగిమ'ను భౌతికార్థంలో చూడరాదు. మృదంగనాదాలలోని అనేక కోణాలు అనే భావంలో దీన్ని గ్రహించవలసివుంటుంది. దీన్ని పదార్థంగా కాక వ్యంజకార్థకంగా స్వీకరిస్తే కవిగారి మనోభావానికి గౌరవం కలుగుతుంది.* ఈ పాట 1949లో రికార్డుగా విడుదలైంది.

దీన్ని ఘంటసాల సింధుభైరవిరాగంలో, చతురశ్ర గతిలో స్వరపరిచారు. ఈ పాట బాణీ, లయగతిని వినగానే చప్పున స్ఫురించే పాట 'ప్రేమకోసమై వలలో పడెనే' (పాతాళభైరవి) అనేది. సరోజినీ (నాయుడు) దేవిని స్మరించుకునే గీతం కనుక ప్రశంస, అభినందన, అనురాగం, ఆవేదన అన్నీ పాటలో ధ్వనించేట్లుగా మేష్టారు బాణీ చేశారు. ప్రారంభంలో వాద్యాల్లో 'దైవత్వాన్ని' వినిపిస్తూ 'దారీనీ' అనే స్వరసంపుటితో 'అమ్మా' అని దీనస్వరంతో సాకీని ప్రారంభించడంతోటే ఒక విషాదవాతావరణాన్ని సృష్టిస్తారు. మొదటి చరణం షడ్జమం నుంచి సాగుతుంది. రెండో చరణాన్ని అంతరగాంధారంతో ప్రారంభించడంవల్ల కరుణ రసార్ద్రత మరింత పెరిగింది. అంతేకాదు, ఈ చరణంలో 'స్వారాజ్యస్సమర', స్వరాజ్యస్సమర అనే పదాలలో 'స్స' అని నొక్కి పలుకుతున్నట్లుగా వేష్టారు మనల్ని భ్రమింపచేశారు. కాని అది నొక్కడం కాదు. పదాల మధ్యన జాగాను సరిగా పాటిస్తూ పదాల్ని కత్తిరించి పలకడంలో ఉండే ఒక కొత్త ఒరవడిగా చూపారంతే. మూడవ చరణాన్ని పంచమంనుండి ప్రారంభించారు. ఈ మూడు చరణాల నేపథ్య సంగీతం కూడా మూడు రకాలుగా, క్లుప్తంగా సాగడం మెచ్చదగిన ముఖ్యాంశం.

పాట అంతా లయగతి 'అనాహతపద్ధతి'లో సాగడం మరోవిశేషం. అంటే, పాట పంక్తులలోని రెండవ అక్షరం నుండి లయ ప్రారంభమవుతుంది. ఈ విధానాన్ని పల్లవి, చరణాలు అన్నిటిలోనూ అనుసరించారు. 'అమ్మ' అనే సాకీకి ముందు వాద్యాలతో ఏ బిట్టూ ఇవ్వక స్వరవాద్యాలన్నీ 'దైవతాన్ని' ధ్వనింపజేయడం దైవస్మరణ సూచకమని పిస్తున్నది. ఆ తరువాత 'అమ్మ' అనే పదంకూడా దైవతంనుంచి ప్రారంభించి "సరిమమ గారిరీసా" అనే స్వరాలతో 'సరోజినీదేవి' అని స్వరాక్షరపద్ధతిని పాటించడం ఒక రకమైన స్వరగాంభీర్యం. భక్తియుతమాధుర్య సంభరితమైన ఈ గీతం విన్నాకనే సరోజినీదేవిగారి ఆత్మ ఖచ్చితంగా స్వర్గానికే చేరుకొనివుంటుంది. ❖

డా॥ ఎమ్. పురుషోత్తమాచార్య
(మన ఘంటసాల సంగీత వైభవం)

## వర్ణన రత్నాకరం

*ఆ.వె. ధనము గూర్చి నరుఁడు తస్కరుల్ క్షత్రియు*
*లపహరింతురొక్కొ యని కృశించు*
*స్త్రీల నేలు - వాండ్ర చిత్తంబు లేరిపైఁ*
*బాఱునో యటంచుఁ బరితపించు*
*(కుచేలోపాఖ్యానము)*

ఎక్కువగా ధనాన్ని కూడబెట్టిన మానవుడు ఆ ధనాన్ని దొంగలు, ప్రభుత్వం అపహరించుకొని పోతారేమో అనే భయంతో, ఎప్పుడూ బెంగతో దిగజారిపోతాడు. ఈ ధనవంతుడు చాలామంది స్త్రీలను వ్యామోహంతో ఏలుకొంటాడు. కానీ వాడికి ఎప్పుడూ ఒకే భయం. అదేమంటే తన స్త్రీల మనసు ఎప్పుడు ఏ కారణంచేత ఎవరిమీద మరులు పుట్టి వారివైపు పరుగుపెడుతుందో అనే తలంపుతో నిత్యమూ పరితపిస్తుంటాడు.

*కం. ధనవత్త్వము దుఃఖకరం*
*బని కని తత్కాంక్ష విడుచునతని కధనతా*
*జనితాత్మాధీనత్వం*
*బనుపమసౌఖ్యంబు సేయు నక్షీణముగన్*
*(ఆంధ్రమహాభారతము. శాంతి. 4-38)*

ధనం కలిగి వుండటం చాలా దుఃఖాన్ని కలిగిస్తుంది అని తెలుసుకొని అటువంటి ధనంమీద కోరికను విడిచిపెట్టినవాడికి కలిగే సుఖం ఏమిటో చెబుతున్నాడు. ధనం లేకపోవటం వలన మనిషి తన మనస్సును అదుపులో ఉంచుకోగలుగుతాడు. ఆ ప్రకారంగా కలిగిన ఆత్మ అధీనత గుణం అతడికి సాటిలేని ఆనందాన్ని, సుఖాన్ని కలిగిస్తుంది.

- బేతవోలు రామబ్రహ్మం



కృష్ణశాస్త్రి

చలివేళ పొలిమేర ఆమని పొడిచె...!

# అలా ప్రవేశించింది - కృష్ణశాస్త్రి కవిత్వం

- ఆవంత్స సోమసుందర్

**1930** దశకంలో తెలుగు కవిత్వం ఒక మహోజ్వల కాంతిరేఖగా వెలిగిపోయింది. తెలుగుదేశం నాలుగు మూలలా కవిత్వమే! వినూత్న మలయ పవనోర్మిక ప్రసరించింది. ఊరానాటా ప్రజలలో నవ్యకవిత్వం విపరీత సంచలనం కలిగించింది. ప్రజలకు నవ్య కవులంటే ఎంతో మోజు... అపూర్వ ఆకర్షణ. నాగరక పౌరులందరికీ కవులూ కవిత్వమూ ప్రధాన భాగధేయంగా మారింది. నిత్యారాధ్యమైంది. తెలుగు నేలలో ఈ మూలనుంచి ఆ మూలవరకూ నవ్యకవిత కోసం ఎత్తిన చలువ పందిళ్ళే!

నేటి సినీమాతారలంటే ప్రారంభ యౌవనులు ప్రదర్శించే వెర్రి మోజువంటిదానాడు కవులపట్ల కేంద్రీకృతమయ్యేది. అలాంటి కొత్త కెరటాలు ప్రేరేపించిన భావకవితాయుగానికి కృష్ణశాస్త్రి - మణివిరాజిత కళ్యాణ మకుటధారి!... ఆకలా దాహమా, చింతలా, వంతలా? ఏమి ఎరుగని వెర్రి ఉద్రేకం కవులది. వెర్రిగా ఏకతను తిరుగాడుతూ అడవులలోనో కొండలలోనో దాగిపోయే నిర్హేతుక ఉత్సాహం కవులది!.. కృష్ణశాస్త్రి భావకవుల్లోకల్లా భావకవి; చుక్కల్లో చందమామ. ఆయన ముఖాననే పొడిచాడో భావకవితా ప్రభాస్కరుడు! ఆ కవితా మహోద్యమం కోసమే పుట్టాడాయన. దానికి నిర్దిష్ట రూపురేఖల వెలార్చాడు. తన బొమ్మ తానే చిత్రించుకుంటూ కదలకుండా కూర్చున్న తెలుగు కవితాశారదకు ఎరువు సొమ్ముల బరువులన్నీ తొలగించివేశాడు. ఆమె గొంతులో కొత్తపాటల తేనె పోశాడు. ఆమె కాళ్ళకు కొత్త గజ్జెలు అలంకరించాడు. కొత్త నడకా, కొత్త షోకూ చేకూర్చాడు కృష్ణశాస్త్రి.

వ్యక్తిగా, కవితావ్యక్తిగా కృష్ణశాస్త్రి, కొత్త నాగరికతకు ప్రేరకుడు. ఆయన పలుకు కొత్త, ఊహ కొత్త, ఇతివృత్తం కొత్త, కవితాశిల్పం కొత్త!... తత్పూర్వయుగాలలో తెలుగు కవిత్వమెన్నడూ సమకాలీన సామాజికుల హృదయా వేదనలను స్పృశించి ఎరుగదు! ఎప్పుడూ గతంవైపే దాని చూపు. ఎప్పుడూ పితృదేవతల కథలే దాని జీవనవృత్తాలు...

ప్రతి అవినీతిపరుడూ - కవిత్వ రచన వచ్చేసరికి గొప్ప నీతి ప్రవక్తగా మారిపోయినవాడే. ప్రతి కవీ ముక్తి బోధకుడే! కావ్యాన్ని ఎంత పచ్చి శృంగారంతో నింపినా అంతంలో పాత్రలన్నిటికీ జీవన్ముక్తి ప్రసాదించినవాడే! కన్సర్‌వేషన్ ఆఫ్ కేరక్టర్సు వారి ప్రధాన ధ్యేయం. బోధాయనంగా సాగిన వారి ఇతివృత్త నిర్వహణ పరిశీలిస్తే - 'Nothing is dishonest than stupid moral conviction, Nothing more stupid than pesudo morality' అంటూ వెక్కిరించిన డిలాన్ థామస్ మాట ఎంత నిజమోననిపిస్తుంది. అలాంటి సుడిగుండాల సంప్రదాయాన్ని విచ్ఛేదం చేశాడు కృష్ణశాస్త్రి, సమకాలీన సమాజ హృదయాన్ని కళామయంగా ప్రతిబింబించాడు. బ్రతుకుతూన్న కాలంలోని జీవన ప్రత్యయాలకూ, సంవేదనలకూ, పరిదేవనలకూ, విప్రలంబాలకూ, విష్కంభాలకూ కవితాహృదయాన్ని ప్రతినిధిగా నిలిపాడు కృష్ణశాస్త్రి. అందువల్లనే ఆయనకాలం సమగ్ర కాంతిమయ కవితా యుగంగా భాసించింది.

## 2

పశ్చిమ దేశాలలో రొమాంటిక్ ప్రభంజనాలు వీచి వీచి నడుంవాల్చిన రోజులవి. (కీట్సు, షెల్లీ, బైరన్లు) వాటి అంతస్సారం ప్రపంచాన్ని విడిచిపెట్టలేదు. భారతదేశంలో రైలురోడ్ల నిర్మాణంతో పారిశ్రామిక విప్లవం నిశ్శబ్దంగా జరుగుతోంది. భారతీయుల్ని మంచి గుమాస్తాలుగా, కట్టు బానిసలుగా మార్చగలమనుకొని ప్రవేశపెట్టిన మైకాలేమార్కు ఆంగ్ల విద్యావిధానం - విద్యార్థులలో నవీన ప్రపంచ నాగరకతను వెలారుస్తున్న రోజులవి. ఇతరేతర ప్రజల సాంఘిక ఆర్థిక రాజకీయ జీవనవిధానాలతో పోల్చిచూసిన

మన సాంఘిక జీవనం ఎంతో నికృష్టంగా నివృచ్ఛరంగా కనిపించి అసంతృప్తి కలిగించిన రోజులవి. తత్ఫలితంగా జాతీయ పునరుజ్జీవన మహోద్యమం చంద్రమారుతాల వీచనారంభించింది. దానిలో అంతశ్శాఖగా, హార్దికశిఖిగా తెలుగులో రొమాంటిక్ కవిత్వం ప్రభవించింది. ఫ్యూడల్ అవశేషాలపై సాగించిన జైత్రయాత్రకు హార్దిక జీవనధాతువులందించింది మన భావకవిత్వం! ఈ కవితాశ్రేణి ద్వారా బూర్జువా ప్రజాస్వామిక వ్యక్తి చైతన్యం ప్రస్ఫుటంగా అభివ్యక్తమైంది.

ఫ్యూడలిజం తరతరాలుగా స్త్రీని భోగవస్తువుగా మార్చింది; ఇందులో సందేహం లేదు; నగల బరువులు దిగద్రోసి, నీతుల పాశాలు బంధించీ, కట్టు బానిసగా మార్చింది. పురుషాహంకారానికీ, సామాజిక ధాష్టీకానికీ స్త్రీని గురిచేసింది. అట్టి స్థితిలో ఉద్భవించిన పునరుజ్జీవనోద్యమం ద్వంద్వ నీతిపై ధ్వజమెత్తింది. జీవన మహాయాత్రలో స్త్రీ పురుషులిరువురూ సమాన భాగస్వాము లన్న స్ఫురణ కలిగించింది. నరనారీ హృదయాలను అవిచ్ఛిన్నంగా ఏకం చేయగలిగేది ప్రేమ తప్ప అన్యమేదీ కారాదన్న నూత్న భావం ముందుగా కవులకు స్ఫూర్తి నిచ్చింది. నూత్న సామాజిక చైతన్యానికిది సంపూర్ణా విష్కారమైంది. సర్వత్రా వాంఛనీయ నాగరకతాసూత్రంగా పరిఢవిల్లింది. ప్రజాస్వామిక జీవనసరళికిది అంకురార్పణ కాజొచ్చింది.

రొమాంటిక్ కవులకు ప్రకృతి ప్రధాన ఆరాధ్యదేవత! కారణం మరేమీకాదు; ప్రకృతి యథేచ్ఛా వ్యాపారానికి పరమోత్కృష్టమైన ఆవిష్కార రూపం! అంతే తప్ప సామాజిక బాధ్యతలనుంచి పలాయనం చేయజూచిన కవికి ప్రకృతి స్వేచ్ఛావృత్తిని పరిశీలించినవారికి తమ సమాజం ఎంత అస్వతంత్రతతో మగ్నమవుతున్నదీ స్పష్టపడటంలో అబ్బురం లేదు. ఈ వైయక్తిక స్వేచ్ఛాపిపాస నైసర్గిక సామాజిక పరిసరాలతో తలపడవలసి వచ్చింది. పరిసరాలు అన్న మాటలోనే రాజకీయార్థికాద్యనేక విషమస్థితులతో సర్వంకషంగా ఆనాటి కవిహృదయం సంఘర్షించవలసి వచ్చిందనే అర్థం. తమ దేశం బానిసత్వంలో మ్రగ్గుతున్నదనీ తమ సమాజం పాశవిక స్థితిలో బ్రతుకుతున్నదనీ – ఇలాంటి స్ఫృహలన్నీ ఆంగ్ల విద్యాభ్యాసంవల్లనే ప్రేరణ పొందాయి.

ఆనాటి మేధావుల హృదయంలో దేశాభిమానం సహజంగానే పొంగింది. దేశ స్వాతంత్ర్య వాంఛ బాసటగా నిలిచింది. "జగమునిండ స్వేచ్ఛాగాన ఝరులు నింపే" అపూర్వ యత్నంలో కృష్ణశాస్త్రి నవ్యకవితా హృదయం కదలిపోనారంభించింది. ఆనాటి స్వేచ్ఛాపిపాసకు నిర్దిష్టమైన నిర్వచనం లేకపోవచ్చు. స్వాతంత్ర్య స్వరూపం గురించిన అవగాహనకు ఆధారసూత్రమంటూ లేకపోవచ్చుగాక! మహామహా రాజకీయ ధురంధరులే 'భారతమాత'కు ముక్కూ కన్నులూ తగిలించి పూజలూ మ్రొక్కుబడులూ ప్రారంభించిన రోజులవి!

ఆ స్వేచ్ఛారాధనం వారి హృదయాలకు నూతనోజస్సును సంతరించిందనడంలో సందేహంలేదు. అది వారి కవితారీతికే నవీనకాంతి చేకూర్చింది. ఈ స్వేచ్ఛాపిపాస బహు ముఖీనంగా ఆవిష్కృతం కావడం ఆ యుగ వైలక్షణ్యం.

ప్రబంధాల బంధాలలో నలిగి తెలుగు కవిత్వం నిలవ నీరుగా మారింది. కవులలో ప్రయోగ దక్షత లోపించింది. 'నవనవోన్మేషశాలినీ ప్రజ్ఞాప్రతిభామతా' అన్న గీర్వాణాలం కారికుల సూక్తికి కాలదోషం పట్టింది. కవులు పాపం పరప్రత్యయనేయ బుద్ధులుగా మారారు. అట్టి గుడిసుళ్ళలోంచి జగన్మోహినిలా లేచి వచ్చింది నవ్యకవిత్వం. నవ్యతతో దర్శనీయమైన రసమార్గాల నన్వేషించింది. వినూత్న భావుకవిత్వాన్ని వెలార్చుకుంది. అపూర్వ శైలీవిన్యాసాన్ని సంతరించుకుంది. వినూత్న సంవిధానాన్ని స్వాయత్తం చేసుకుంది.

ఆత్మాశ్రయ యితివృత్తం స్వీకరించడంతోపాటు కవితలో వైయక్తిక అహమిక ప్రవేశించింది. తాదృశమైన మనోభావాలూ పరిదేవనలూ అనుభవాలూ కలిగిన సమాజ శ్రేణికిది ప్రతినిధివాణిగా భాసించింది. ఆనాటి మధ్యతరగతి బుద్ధిజీవుల సంవేదనలన్నీ నవ్యకవిత్వంలో ప్రతి బింబించాయి. ఏతావాతా కవితాభివ్యక్తి స్వరూపం పూర్తిగా మారిపోయింది. వర్తమాన మానవుల అంతరాత్మలు పరిసరాల నిర్బంధాలలో పంజర బంధితం కావడం సామాజికుల చైతన్యానికి అవగతమైంది. అట్టి పరిసరాలలో వ్యక్తి నిరంతరాయంగా సంఘర్షించడం తప్పలేదు; ఈ ప్రతిఘటనకు ప్రధమశః భావకవిత్వం అక్షరరూపమిచ్చింది. ఈ ఆక్రోశ తరంగాలను అలతి అలతి పదాలతో అభివ్యక్తం చేసింది. శైలీసౌకుమార్యంతో నేరుగా శ్రోతృహృదయ ప్రవేశం కావించింది. అచ్చమైన కళాస్పర్శకు పట్టాభిషేకం జరిగింది. పూర్వ కావ్యాలలో ఛందస్స్వరూపాలు చక్షురక్షర

న్యాయానికి పరిమితమయ్యాయి. హృదయ ద్రవ్య సమాహారంతో వాటికి నిమిత్తం లేదు. సందర్భంతో ప్రమేయం లేకుండా ఆవేశాన్ని కలిగించే వృత్త ఛ్ఛందస్సులు బహుళంగా ప్రయుక్తమయ్యాయి. కవి దక్షతవల్ల కొన్ని బ్రతికాయి. కాని భావకవితాయుగంలో గేయగుణం ఆరాధ్యమైంది. తేట గీతులు, అటవెదులు, ద్విపదలు, మంజరులు, రగడలు భావకవితా వాహకాలుగా నిలచాయి. రిరిక్‌కు గీతికాగుణం ఉండటం ప్రాణావసరమైంది. పిట్ట చిన్నదైనా దాని విహాయసగమనశక్తి అపారమే; దాని కలనాదం అకుంఠితమే! అది కలిగించే ప్రతిధ్వని తరంగాలూ అగణితాలే! భావకవిత్వంలో గేయగుణ సమృద్ధికి కృష్ణశాస్త్రిని చెప్పి మరొకరిని చెప్పాలి!

ఆత్మపరమైన కవిత్వ ప్రాధాన్యతకు కృష్ణశాస్త్రి ఆద్యులు కాకపోయినా ప్రథమగణ్యులు. వస్త్వాశ్రయ కవిత్వాన్ని ఆయన దాదాపు ముట్టనేలేదు. చైతన్యపూరితమైన వారి అవగాహన దీనికొక సిద్ధాంతాన్నీ రూపొందించింది. "ఉత్తమమైన ఆత్మపరమైన కావ్యంలో ఉన్నంత లావణ్యం మరొక కావ్యంలో ఉండదు. ఊపినచోట అది ఊపినంత మరొకటి ఊపదు" అని వారే అన్నారు. దీని ద్వారా వారి కవిత్వ విశ్వాసం సువ్యక్తమవుతోంది. కవిత్వానికి లావణ్యత ప్రధానంగా అమరడం, గుండెల్ని ఊపే శక్తి దాని కలవటమూ ప్రథమ లక్షణాలని తేలుతుంది. వారి కవిత్వాన్ని ఎక్కడ స్పర్శించినా ఈ రెండు లక్షణాలూ స్పష్టంగా ఆనుతాయి.

కవితా భావుకత్వంలో స్వేచ్ఛకీ, ఆలోచనావైఖరిలో స్వేచ్ఛకీ, కవితా నిర్మాణంలో స్వేచ్ఛకీ మునుపెన్నడూ ఇంత విస్తృత ప్రాచుర్యం లభించి వుండలేదు. స్వేచ్ఛ అనే పదాన్నే దాదాపు తెలుగు కవిత్వం ఎరగదు. దానిని దర్శించిన కొద్దిమంది ఆవేశ ప్రధానులు – వైయాకరుణులచేత దూరు పడ్డారు. కవికి సాక్షాత్కరించిన స్వేచ్ఛ త్రిగుణాత్మకమైంది; సామాజిక స్వేచ్ఛ, రాజకీయ బానిసత్వం నుంచి స్వేచ్ఛ, సకల నిర్బంధాల నుంచీ స్వేచ్ఛ; ఈ త్రివర్ణాత్మక స్వేచ్ఛ భావకవులందరికీ ఆరాధ్యమైంది. దీనిని కృష్ణశాస్త్రి పొదుపరిగా మూడు పాదాలలో ప్రకటిస్తాడు:

**తిమిరలత తారకా కుసుమములు దాల్చ**
**కర్కశ శిలయు ననజీవ కళల దేర**
**మ్రోడు మోక చివురులెత్తి మురువుసూప**
**జగమునిండ స్వేచ్ఛాగాన ఝరుల నింతు!**

అదీ వారి ప్రతిజ్ఞ! ఇందులో ఈ మూడు స్థాయిలూ స్పష్టంగా దర్శనమిస్తాయి. అంతవరకూ బ్రతుకుతూ వచ్చిన లోకమంతా 'తిమిరలత'వంటిది. కంటికేమీ కనరాని నిస్తేజమైన చీకటి; అట్టి నట్టింట తారకాకుసుమాలు విరిసే రీతిగా తన స్వేచ్ఛాగానం దిగంతాలు నింపుతాడు.. అంతవరకూ ఉన్న సమాజం కర్కశ శిలాభూతం! కదలదు, మెదలదు; తాను శిల్పి. దానిపై తన పోగారు కదిలిస్తాడు. ఉలితో వలవులూదుతాడు; సుత్తితో సుతిమెత్తని రాగాలాడిస్తాడు. అప్పుడది జీవకళల దేరుతుంది. తన గానానికి మారుపలుకుతుంది... అంతవరకూ సామూహిక జీవితం మ్రోడుమోకలా నిర్జీవంగా నిలచివుంది. దానికొక మురువులేదు. మురిపెమూ ఎరుగదు. తానా స్వేచ్ఛాగాన ఝరులు నింపడానికే అవతరించాడు. ఆ గానతరంగాల తాకిడికి ఆ మ్రోడుమోక చివురులెత్తుతుంది. తన ఇంద్రజాలిక శక్తితో సమూలంగా మారిపోతుంది. సకల నిర్బంధ పాశాలనూ పటాపంచలు చేస్తుంది. సామాజిక విషమ నీతుల కట్టుబాట్లతో వ్యక్తి కట్టు బానిసగా మారివున్నాడు. కర్కశ శిలగా ఘనీభవించిపోయాడు. అతడి కిక విముక్తి లభించి తీరుతుంది.

## 4

భావకవిత్వమంతా సమాజ భూతలాన్ని విడిచి కేవలం గాలి ఈతగా బ్రతికిందని అవిచారపూరితులు అపార్థం చేసుకున్నారీ దేశంలో. దానికి వారు చూపే ఉదాహరణ కృష్ణశాస్త్రి ఒక మానసిక క్లేశంలో రచించిన తేలికపాట – 'దిగిరాను దిగిరాను దివినుండి భువికి – నా యిచ్ఛయే గాక నాకేటి వెరపు?' అనేది. ఆత్మాశ్రయత్వమే భావకవితకు ప్రధాన జీవలక్షణం; కనక సమకాలిక సమాజ ప్రమేయం ఇసుమంతయినా దానికి లేదు – అని తీవ్ర నిందారోపణ చేసినవారూ ఉన్నారు. బహుశా ఈ అవగాహనతోనే చలంగారుసైతం – 'కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ' అనవలసి వచ్చిందేమో! నిజానికది సరికాదు.

ఆనాటి సమాజం అప్పుడప్పుడే దీర్ఘ నిద్ర నుంచి అలసాలసంగా కన్నులెత్తుతోంది. ఇంకా తేరపారజూసే సత్తువ దానికి అబ్బలేదు. నిద్రమత్తులో మునిగిన కన్నులకు జగమంతా విస్పష్టంగా కానరావడంలేదు. ఏది సత్యమో ఏదసత్యమో తేలడంలేదు. ఏది స్వేచ్ఛయో, ఏది బానిసత్వమో అవగాహనకందడంలేదు.

బరువుగా నడుస్తున్న సంధియుగ మది. జాతినీ పాత బంధాలింకా కట్టి కుదుపుతున్నాయి. ఆ చారిత్రక సందర్భంలో చైతన్య విలసితమైన భావకవి హృదయంలో స్వేచ్ఛాప్రియత్వం ఉప్పెనలా పొంగివచ్చింది. అట్టిదానిని దర్శించలేక కేవల ఆత్మాశ్రయత్వమేనని తిరస్కరించ బూనడం భవిష్యత్తుకు మేలుచేయదు. ఇప్పటికీ దాని హాని తక్కువకాలేదు. వారి కవిత్వంలోని ఆత్మాశ్రయత్వం కేవలం అభివ్యక్తిమేరకే పరిమితం. సమాజాశ్రయత్వం ప్రతిచోటా ప్రతిష్ఠితమవుతూనే వుంటుంది. సామాజాశ్రయత్వం ప్రతిచోటా ప్రతిష్ఠితమవుతూనే వుంటుంది. మూగగా పడివున్న సమాజానికి కవి ప్రతినిధిగా పలుకుతూనే ఉంటాడు. ఈ క్రింది పద్యాలలో సాక్ష్యం దొరుకుతుంది:

1. **పక్షివలె నాకాశ నిర్మల**
   **వథవిహార స్వేచ్ఛ గోరితి**
   **పక్షములు లేవం చెరుంగక**
   **ప్రాకులాడుచు పొగిలితిన్.**

(పు. 60; 1940 ముద్రణ; కృష్ణపక్షం ప్రవాసం – ఊర్వశి సంపుటి 3)

2. **ఏను మీవలె నేకంఠమెత్తి పాడ**
   **నెంతో యుబలాట పడి సవరింతు గొంతు**
   **ఏను మీవలె నవానూన గాన**
   **విస్తృత వ్యోమయానాల వెదలి వెదలి**
   **భావలోకాంచలమ్ముల వాలవలతు...** *(పు. 71)*

ఇలాంటి ఉదాహరణలు కృష్ణశాస్త్రి నుంచి అసంఖ్యాకంగా చూపవచ్చు. రెండవ ఉదాహరణలోని 'ఏను మీవలె' అన్న దానిలోని 'మీరు' స్వేచ్ఛాజీవనం అనుభవిస్తున్న మానవులుగా మనం అన్వయించుకుంటే కవి స్వేచ్ఛాప్రియత్వపు స్పష్ట రూపం దర్శనమిస్తుంది. సామాజిక హృదయంలో ఈ ఆవేశం ప్రచలితమవుతూన్నదేతప్ప నిరాధారమైంది కాదు. దానినే కవి వ్యక్తిత్వం తనపరంగా పలుకుతోంది. అభివ్యక్తిలో ఆత్మాశ్రయత్వం ఉండవచ్చుగాక; సమాజ ప్రతినిధిగానే కవి హృదయం ఆక్రోశిస్తోంది; గర్జిస్తోంది; ఘోషిస్తోంది!

## 5

కృష్ణశాస్త్రి 'నన్ను మనసారగా ఏడ్వనీరు మీరు' అంటే సందర్భాన్నీ కవి మానసిక స్థితినీ అవగాహన చేసుకోడానికి తిరస్కరించినవారు ఆయనకి ఏడుపే అత్యంత ప్రీతిపాత్రమనీ, ఉపాదేయమనీ వెర్రిభ్రమలకు లోనవుతారు. భ్రమకీ ప్రేమకీ మధ్య ఎంతో అంతరం వుంటుంది.

ప్రపంచ జ్ఞానం అలవడిన ఆనాటి మేధావికి, ఇతర సమాజాలతో తులనాత్మక పరిశీలన జరపడం సహజంగా అవసరమైంది. తన సమాజం ఎంత హీనంగా ఉన్నదీ తెలిసొచ్చింది. కులాల అంతరాలతో కునారిల్లుతోంది. అస్పృశ్యత పెనుభూతంలా భయపెడుతోంది. బానిసలకు బానిసగా స్త్రీ సతమతమవుతోంది. వెరసి సమాజమంతా సకల కాలుష్యాలతోనూ నిండివుంది. ఈ బాహ్య వాస్తవికతా స్వరూపం కవికి హృదయైక చైతన్యావిర్భూతికి దోహదం చేసింది. కవి తానుగా ఈ సంకుల సమస్యలన్నిటినీ పరిష్కరించలేడు. సమాజమూ మేలుకొని తనంత తానుగా పరిష్కరించుకోగల స్థితిని అందుకోలేదు. కవి కింక మిగిలిన దాక్రోశమే! దుర్భర పరిస్థితుల చూసిన కవి నిస్సహాయుడవుతున్నాడు. ఆ దుస్సహ పరిస్థితులను శపిస్తూ కవి దురపిల్లాడు. శోకం అమంగళకరమని లోకమతన్ని వారిస్తోంది. ఏడవనీయడం లేదు. అప్పుడా కవి శోకమే తన స్వేచ్ఛాభివ్యక్తిగా విన్యసిస్తాడు. అతని ఆంతరిక ప్రేరణ పరిసరాలతో సంఘర్షిస్తోంది. అంతే! కృష్ణశాస్త్రి భావకవిత్వానికి ఏడుపే చిరప్రీతిపాత్రం కాదు.

లోకమింకా కట్లు సహజాలంకారాలనుకుంటోంది. వాటినే పూజిస్తోంది. స్వేచ్ఛాకుమారుడైన కవిని సైతం – ఆ కట్లకే అంకితం చేయచూస్తోంది. కనుకనే కృష్ణశాస్త్రి ఇలా పలవిస్తాడు : "నన్ను విడువుడు! ఒకసారి నన్ను విడిచినంతనేకాంత యవని కాభ్యంతరమున వెక్కివెక్కి రోదింతు"నంటూ ప్రాధేయపూర్వకంగా పలుకవలసి వచ్చింది.

తన చుట్టూవున్న లోకం – 'అనంత శోక భీకర తిమిరం'లో కొట్లాడుతోంది. దానికతడు 'పతి'గా గుర్తించుకున్నాడు. అంటే వాగ్విలసనం ప్రదర్శించగల శక్తియుతుడైన ప్రతినిధి తనకెదురైన లోకం – నిశీథిమధ్యంలో తారట్లాడుతోంది. తన దరికి చేరిన వారినందరినీ అది – 'హృదయ దళన దారుణ మహోగ్ర కార్యంబు దలచి' పీడిస్తోంది. అది ప్రణయ మధురిమ నెరుగదు; పాపమని తెలియదు; 'పక్షముల దూల్చు, బంధింతు పంజరాన! వెర్రి లోకమ! హృదయంపు స్వేచ్ఛ నెటుల పంజరంబున బంధించె?' అని సవాలు చేస్తాడు కవి. 'ఘోర కాంతార కుటిల కఠోర వీథులందు' నిదురపోతోంది లోకం. తాను ఒంటరిగా తిరుగాడు

తున్నాడు. తనవలెనే వేరెవరైన మేలుకొన్న నరమానవు లున్నారేమోనని వెదుకుతున్నాడు. ప్రావ్వడం బోధరస్వామి ఎదురయ్యాడు. 'నీవు కూడా నావలెనే జాలి వొడమ వాపోవుచుంటి'నా, అని కవి ప్రశ్నిస్తాడు. మారు పలకక వైదొలగుతుంది.

అలా ఒంటరిగా పోతున్న కవికి, సంధ్యాసమీకరణమూ తారసిల్లుతుంది:

**'నీదు నునులేత రెక్కల మీద పడిగ**
**నెత్తుకొని పోవరాదె నన్నెచటికేని !**
**నిత్య తేజోమయానంద నిలయమునకు...'**

అని ప్రార్థిస్తాడు. ఫలితం లేదు. కవి తన 'దుఃఖమే తోడు నీడగాగ నిశలు' గడుపుతున్నాడు. ఏకాకిగా అన్వేషించే కవికి–

**ఎద కరగునట్లు సన్నని ఎలుగు తోడ**
**నట్టి తలలెత్తి పాట కూకొట్టు చేద్చు**
**గౌతమీ వీచికాళి సగంబు నిదుర.. లో**

జోగుతూ తన పాట కూకొదుతూ ఎదురైంది. తాను ఏకైక ప్రవాసి. 'అపుడు గొంతెత్తి ఏడ్చి'నాడు! అంత దుఃఖాకులిత మనస్థితిని తారకలు సైతం చూడలేక కన్నులు మూసుకొన్నాయి.

**6**

అమృతవిష్యందిని ప్రకృతిమాత ప్రదర్శించే అనంత సౌందర్యానికి వనిత ప్రతిబింబం. ఆమె ప్రణయైక స్వరూపిణి. రసదేవత. ప్రకృతి సౌందర్యానికి వివశుడవుతూన్న కవికి స్త్రీ రాగమయమూర్తిగా దర్శనమిచ్చింది. ఆమె కిలకిల నవ్వే పువ్వు; అంచులలో మెరపు లందగించుకున్న మచ్చుతునక; మధుస్వరాలు వినిపించే చిన్ని పులుగు; 'ప్రసవ కోమల రమణీయ పథము బట్టి' ఒంటరిగా పోయే లావణ్యమూర్తి. అట్టి కమనీయ మూర్తిని అతిలోక రమణీయ కవితా హృదయుడైన కవి ప్రేమించడం సహజమే! 'పుష్పవ్రజం సౌరభాలు విరజిమ్మడమంత సహజం; చందమామ చంద్రికలను వెదజల్లడమంత అనివార్యం; ప్రసరించడమే ధర్మమైన సలిలంవలె, రాగ వీచులు బరపడం తన హృదయానికంత నైసర్గికం; విసరే లక్షణం గల గాడ్పులకు మల్లేనే – తన హృదయానికీ ప్రణయ ఝంఝుల సహజసిద్ధాలు!

లోకం తనని తప్పుపట్టే అవసరం లేదు. ఉన్నదీ అంటే దాని వెనుకచూపే కారణం. సహజంగా బ్రకతడం అది ఎప్పుడో మానుకుంది. కృతకధర్మాల బరువుల క్రిందపడి నలిగిపోతున్న బానిస! దాని కతని మృదుమంజులోక్తులు వినిపించవు. అతని పాటలు – 'నునుమబ్బు లేదునక కొనలపై సోనలు; నెలవంక చిరునవ్వు చలువలు; ఉషస్వినీ స్వచ్ఛ శీతల మలయానిలాలు!' అంతేకాదు. అలాంటి పాటలు వినిపించే తన గొంతు ఎలాంటిది? 'తొలిప్రొద్దు పొడుపురేకుల పైడిదారుల ఏరులౌమంచు కన్నీటి పాటల్ని' వినిపించగలట్టిది! నిద్రావివశమై జడమయంగా పడివున్న లోకాని కవి ఎలా అర్థమవుతాయి?

**7**

భావకవిత్వ ఉద్యానవనంలో సుషమమంజుల సుషిరాపగల వెలయించిన కవి కృష్ణశాస్త్రి! కవితాసుమాలు గుత్తులుగా ఎత్తిన తరుణ శృంగార మధుర మాధవుడు, నిజంగా కృష్ణశాస్త్రే! చిరనిద్రల పొగిలిన చలివేళలు – పొలిమేరలకు చేరగా, కొత్త ఆమనిలా పొడుచుకుంటూ వచ్చిన కవితా వసంతుడు కృష్ణశాస్త్రి!

కలికిపాటల కోయిలల కులంలో పుట్టి, రాజరాజేశ్వర కిరీట రాజఘటిత రత్నమాణిక్య కాంతి నీరాజనార్చితాంఘ్రి నీరేజయుగళుడై గళమెత్తి, కవితా పదధ్వనుల నటరాజ స్వరూపా న్నందుకొన్న మహోదయుడు కృష్ణశాస్త్రి!

'ఎట్లొహసేయుటో ఎరుగలేక
వంగి వంగి శిరము వొంచి క్రుంగిపోదు'

– అనుకుంటూ నిమ్నతలంలో బ్రతికే మనకోసం ఆర్తాలాపనచేసిన కలస్వనుడు. తన కన్నీటి చుక్కకు – 'పరమ పావన జాహ్నవీ ప్రతిభ'లు సముపార్జించుకున్నాడు. మధురగేయ మంజరులతో లోకాన్ని పూతీకరించాడు. తన మధురగేయ చుంబిత సుందర చరణగా ప్రియభారత జనయిత్రిని కొల్చుకున్న ధన్యజీవి కృష్ణశాస్త్రి! మి



దాశరథి రంగాచార్య

# రామాయణ సమాజం

*- దాశరథి రంగాచార్య*

సాహిత్యం - సమాజం ఈ రెండూ అవినాభావ సంబంధంగలవి. అలా అంటున్నామంటే సమాజమే సాహిత్యం అనిగాని సాహిత్యం సమాజం అనిగాని అర్థంకాదు. రెండూ వేరువేరు వ్యవస్థలు. సమాజం అనంతం అయింది. విశ్వవ్యాపకం గలది. విశ్వరూపం గలది. "సహస్ర శీరాపురుష్ణ సహస్రాక్ష సహస్రపాత్" అనే పురుషసూక్తికారుడు సమాజాన్ని నిర్వచిస్తున్నాడని నా ఉద్దేశం. సమాజం అనేక శాఖోపశాఖలుగల మహావృక్షం అని ఉపమించుకుంటే సాహిత్యం ఆ వృక్షానికి ఒక ప్రధానశాఖ అని చెప్పుకోవచ్చు. సమాజానికిగల అనేక విభాగాల్లో సాహిత్యం ఒక ముఖ్య విభాగం అనవచ్చు. సాహిత్యం సమాజాన్ని వివరిస్తుంది - వ్యాఖ్యానిస్తుంది. అందువల్ల సాహిత్యం సమాజానికి ప్రధానాంగం అవుతుంది. అంతేకాక సాహిత్యానికి మరో విశిష్టత ఉంది. అది అక్షరస్వరూపంగలది. కాబట్టి సాహిత్యకారుని ప్రతిభాపాటవాలనుబట్టి అది అక్షరం అవుతుంది. ఒకనాటి సామాజిక స్వరూపాన్ని అక్షరబద్ధం చేసి కళాస్వరూపంతో దర్శనం చేయిస్తుంది. ఇలాంటి శక్తిసామర్థ్యాలు సమాజంలోని ఇతర శాఖలకు అంతగా లేదు. అందుకే సాహిత్యం సమాజానికిగల శాఖల్లో ప్రధానమైనది విశిష్టం అయిందీ అనుకుంటున్నాం.

సమాజం విశాలమైంది. విస్తృతం అయింది. సమాజాన్ని సంపూర్ణంగా దర్శించడం కష్టం. సమాజాన్ని ఏ కోణంనుంచి దర్శిస్తే ఆ కోణం కనిపిస్తుంది. కాలాన్నిబట్టి, దర్శించే వారి సంస్కారాన్నిబట్టి అది దర్శనం ఇస్తుంది. దర్శించేవారి ప్రతిభాసంస్కారాలనుబట్టి సాహిత్యకారుడు ఆ సమాజాన్ని మనకు దర్శనం చేయిస్తాడు.

సమాజం కోట్ల తలలు గలది. కోట్ల చేతులు గలది. కోట్ల పాదాలు గలది. కోట్ల నోళ్ళు గలది. కోట్ల మేధస్సులు గలది అనాల్సి వస్తుంది. పురుష సూక్తికారునికి వేలను మించిన సంఖ్య తెలియకపోవచ్చు. ఇవ్వాళ చెప్పుకోవలసివస్తే కోట్ల కోట్లు అనాల్సివొస్తుంది. ఎంచేతంటే ఈనాటి సమాజం ఏ ఒక్కదేశానికీ పరిమితం అయిందికాదు. ఇది సర్వ ప్రపంచవ్యాప్తం. ఎంచేతంటే ఏ దేశంలో జరిగిన పరిణామాలయినా ఇతర దేశాలను ప్రభావితం చేస్తున్నాయి.

*కోట్ల జనులుమాత్రం సమాజం అగునా? అంటే కాదని జవాబు చెప్పాల్సి వస్తుంది. జనం మాత్రం సమాజం కాదు. జన జీవితం సమాజం అవుతుంది. జనానికీ జన జీవితానికీ చాలా భేదం ఉంది. జనం జీవించాలంటే గాలి మాత్రం చాలదు. నీరు కావాలి. వర్షం మీద మాత్రమే ఆధారపడిన సమాజం గతించి ఎంతోకాలం గడిచిపోయింది. గంగను నేలకు తేవడానికి సగరుని నుండి భగీరథుని వరకు సాగిన నిరంతర ప్రయత్నం ఇందుకు నిదర్శనం. సమాజం ముందుకు సాగుతుంటే నీటిని అందించటం క్లిష్టం అయిపోతుంది. ప్రాజెక్టులు నిర్మించడానికి ఎంతమంది మేధావుల ఎంతమంది శ్రామికుల శ్రమ అవసరం అవుతుందో ఆలోచిస్తే అర్థం అవుతుంది. ఇది ఒక్క నీటిని గురించి మాత్రమే. జనం జీవించడానికి నీరు మాత్రం చాలదు. ఒక పటిష్టం అయిన రాజకీయ వ్యవస్థ నుంచి కుటుంబ వ్యవహారాల వరకు అనేక అంగాంగాలు అవసరం. శ్రమ జనజీవితానికి మూలకందం. శ్రమించే కోట్లాది జనులు జన జీవితం సుఖప్రదం చేయడానికి నిరంతరం వారికి తెలియకుండానే కృషిచేస్తున్నారు. వీరందరి సమాహితం సమాజం.*

సాహిత్యం సమాజంలోని సంబంధాలను వివరిస్తుంది. సమాజంలో ఉన్న లోపాలను ఎత్తిచూపుతుంది. సమాజం ఇలా ఉంటే బావుండును అని సూచిస్తుంది. కాని సాహిత్యం సమాజాన్ని మార్చలేదు. సమాజంలోని మార్పులకు

సాహిత్యం కూడా సమిధ అవుతుంది. కాని సాహిత్యమే సమాజాన్ని సంపూర్ణంగా మార్చిన నిదర్శనాలు లేవు. సాహిత్యం సమాజానికి మార్గదర్శి కావచ్చు. కాని ఆ మార్గాన సమాజం నడచిన దృష్టాంతరాలు తక్కువ. రచయిత క్రాంతదర్శి. అతడు రానున్న దాన్ని దర్శించగలడు. రానున్న ప్రమాదాన్ని గురించి హెచ్చరించగలడు. కాని ప్రమాదాన్ని నివారించలేడు. తాను అనుకున్న సమాజాన్ని తేనూలేడు. ఒక ఆదర్శ కుటుంబాన్ని దర్శించాడు వాల్మీకి. ఇంతకాలం గడచినా అది ఆదర్శంగానే నిలిచి పోయింది కానీ ఆచరణ సాధ్యం కాలేదు. "అగ్నివంటిది ఆయుధం. అంటుకుంటే కాలక మానదు" అని మానవాళిని హెచ్చరించాడు వాల్మీకి. ఈనాటి అగ్రరాజ్యాలు మారణాయుధాలను పెంచుతూ వాటిని మేము వాడం అంటున్నాయి. నాటి వాల్మీకి ఆదర్శం నేటికీ ఆదర్శంగానే ఉంది. రాజకీయులకు రచయితల హెచ్చరికలు నాడూ నేడూ ఎన్నడూ చెవికి ఎక్కలేదు. వాల్మీకి మాట నాడు రాముడు వినలేదు. నేటి ప్రభువులు వినరు. ప్రజలూ వినరేమో! అందుకే భర్తృహరి ''జీర్ణమాగే సుభాషితం'' అన్నాడు. అది భర్తృహరికే కాదు రచయితలందరికీ వర్తిస్తుంది. రచయిత చెప్పింది ఎవరూ వినరు. అంతా మెచ్చుకుంటారు. అందుకే ''జీర్ణమాగే సుభాషితం''.

సాహిత్యం – సమాజం ఈ రెండూ సజీవాలు. సజీవ పదార్థాలన్నీ పరిణామాలకు లొంగుతాయి. నిర్జీవ పదార్థాలకు పరిణామంలేదు. పరిణామం చెందని దానికి ప్రాణం లేదు. ప్రాణం ఉన్న ప్రతిపదార్థం మారుతుంటుంది.

"ప్రకృతి ధర్మమగును పరిణామ మందుట
దచ్చు అందమదియె సత్యమగును" అంటాడు ఇక్బాల్.

సాహిత్యం సమాజం అనాదికాలంగా మారుతున్నాయి. మారుతుంటాయి. మారకుండా ఉన్న జడపదార్థాలు కావివి. మరోవిషయం ఏమంటే ఈ రెండూ మనకు తెలిసినంతవరకు ప్రగతిపథంలోనే పయనిస్తున్నాయని చెప్పుకోవచ్చు. మారుతున్న సమాజాన్నీ సాహిత్యాన్నీ దర్శించడానికి సమాజ పరిణామం తెలియడం అవసరం. సాహిత్యం సజీవం అనే సత్యం తెలుసుకోక దాన్ని జడపదార్థంగా అధ్యయనం చేయడం మన జడత్వాన్ని సూచిస్తుంది తప్ప సాహిత్యపు ఔన్నత్యానికి లోపం రాదు. వేదకాలంనుంచి నేటిదాకా సాహిత్య సృష్టి జరుగుతూంది. సాహిత్య స్రష్టలు గతిస్తున్నారు. వారి సాహిత్యాన్ని మిగిలించిపోతున్నారు. సాహిత్య సృష్టి మిగిలిపోతూంది కాబట్టి సాహిత్య ద్రష్టలు అవసరం అవుతున్నారు. *సమాజానికి దూరంగా ఉన్న రచయిత ఎంత ప్రమాదకారుడో సమాజానికి దూరంగా ఉండి సాహిత్యాన్ని పరిశీలించిన ద్రష్ట అంతకు మించిన ప్రమాదకారి. ఎంచేతంటే అతడు ఉన్నదానికి వ్యాఖ్యానం చేసి సమాజానికీ, సాహిత్యానికీ ద్రోహం తలపెట్టుతున్నాడు.*

సాహిత్య ద్రష్టకు స్రష్టకంటే ఎక్కువ ప్రావీణ్యతా, బాధ్యతా ఉన్నాయి. అతడు పరిశీలించే సాహిత్యం మానవ సమాజ పరిణామంలో ఏ దశకు చెందిందో గుర్తించకుంటే పరిశీలన వక్రమార్గంపట్టే అవకాశం ఉంది. "పరిణామదశ" అనే పదం కావాలనే వాడుతున్నాను. ఎందుకంటే ఇది కాలానికి సంబంధించింది కాదు. ఇది దశకు సంబంధించింది.

ఈనాటి సమాజాన్నే తీసుకుందాం. ప్రపంచం సాంతం నేడు ఒకే పరిణామ దశలో లేదు. ఇంకా వెలుగు నోచుకోని ఆఫ్రికాలోని నీగ్రోలది ఒక పరిణామదశ. అభివృద్ధి చెందుతున్నా మనుకుంటున్న దేశాలది ఒక దశ. సంపన్న దేశాలది ఒక దశ. సమాజవాద సోషలిస్టు దేశాలది ఒక దశ. ఆయా సమాజాల సాహిత్యాలను పరిశీలించేటప్పుడు ఆ దశ తెలియకుండా పరిశీలిస్తే మనం ఆయా సాహిత్యాలకు అన్యాయం చేసినట్లు అవుతుంది. *అందాకా అక్కర్లేదు గురజాడ, వీరేశలింగం, ఉన్నవ వారి సాహిత్యాలను నేటి సమాజ దృక్పథంలో పరిశీలిస్తే మిగిలేదేమీ ఉండకపోగా వక్రభాష్యాలు వచ్చే ప్రమాదం ఉందని సంస్కారంగల వారందరికీ తెలుసు.* వాస్తవంగా పరిశీలకుడు ఆ సామాజిక దశకు పరకాయప్రవేశం చేయాలి.

ఈ దృష్టితో వాల్మీకి రామాయణాన్ని పరిశీలిస్తే అది మనకొక మహాకావ్యంగా దర్శనం ఇస్తుంది. వాల్మీకి ఆనాటి సమాజాన్ని సూక్ష్మాతిసూక్ష్మంగా పరిశీలించాడు. అతని పరిశీలన అతి నిశితం అయింది. అతడు ఎంత గొప్ప ద్రష్టయో అంత గొప్ప స్రష్ట. రామాయణాన్ని లౌకిక కావ్యంగా తీర్చిదిద్దాడు. రామాయణం మొత్తంలోనూ పరలోకాన్ని గురించిన విషయం ఎక్కడా కనిపించదు. ఎక్కడా ఒక్క గుడి కనిపించదు. ఒక్క విగ్రహం కనిపించదు. పూజలు

నమస్కారాలూ కనిపించవు. వాల్మీకి రామాయణంలో "దైవం" అనే ఒక మాట వాడ్తాడు. అయితే దానికి ఒక నిర్దిష్టం అయిన స్వరూపం లేదు. మనం ఈ రోజుల్లో "విధి" అని వాడుతున్నదాన్ని "దైవం"గా వాడినట్లు కనిపిస్తుంది. ఒకటి రెండు చోట్ల మాత్రం 'విష్ణువు' ప్రస్తావన వస్తుంది. దానికి అంత ప్రాధాన్యత కనిపించదు. యజ్ఞయాగాది క్రతువులను గురించి కూడా లేదు. ఇటు బాలకాండలోనూ, అటు ఉత్తరకాండలోనూ యజ్ఞయాగాదుల ప్రసక్తి ఉండేది. ఆ రెండు కాండలూ వాల్మీకి ప్రోక్తాలు కావని నా నమ్మకం. అందుకు కారణాలు చెప్పడం ఇక్కడ వృత్తాంతం రామాయణంలో లేదు. బాలకాండలో తప్ప శివుడుగాని శివుని పేరుగాని కనిపించదు. వాల్మీకికి మనిషిలో ఉన్నంత విశ్వాసం దైవంలో ఉన్నట్లు కనిపించదు.

*"దైవ సంపాదితో దోషో మానుషేన మయాజితాః"*

"దైవం వల్ల వ్యాప్తించిన దోషాన్ని మనిషినైన నేను జయించాను'' అంటారు రాముడు. వాల్మీకికి మానవ ప్రయత్నం మీదనే విశ్వాసం ఎక్కువ. రామాయణంలో పూర్వ, పరజన్మల వృత్తాంతాలు కూడా అంతగా కనిపించవు. మాయలు, మంత్రాలు కనిపించవు. మరోవిషయం ఏమంటే వాల్మీకి ధర్మార్థకామాలను గురించే చెపుతాడు. మోక్షాన్ని గురించి ప్రస్తావించదు. వాల్మీకి కథ, అతని పాత్రలు, అందలి సన్నివేశాలూ అన్నీ నేలనంటినవి. అవి ఎక్కడా నేల విడిచి సాము చేయవు. రామునికి దైవత్వం ఆపాదించింది, అద్భుతాలు అనేకం సృష్టించింది. వాల్మీకికి వ్యాఖ్యానాలు చెప్పినవారు, లేక స్వతంత్రంగా రామాయణాలు రచించినవారే. వీటిలో వాల్మీకి ప్రమేయం లేదు. కాబట్టి వాల్మీకిని వాల్మీకిగా అధ్యయనం చేయడానికి ప్రయత్నించాలి.

వాల్మీకి నాటి సమాజాన్ని సాకల్యంగా పరిశీలించాడు. ఆ సమాజాన్ని చూచి దుఃఖించాడు. ఒక ఆదర్శ సమాజాన్ని దర్శించాడు. దాన్ని సజీవంగా సకల కళాభిరామంగా చిత్రించాడు. జరామరణాలు ఎరుగని పాత్రలకు కథను సృష్టించి శాశ్వతం అయిన ఒక మహాకావ్యాన్ని సమాజానికి ప్రసాదించాడు. అయినా ఎక్కడా తనను గురించి చెప్పుకోడు. అతి వినయ సంపన్నుడు. అదృశ్యంగా రామాయణం సాంతంలోనూ దర్శనం ఇచ్చే వాల్మీకి ప్రత్యక్షంగా ఎక్కడా కనిపించడు. వాల్మీకి సమాజాన్ని దర్శించిన తీరు విలక్షణం అయింది. అతడు ఆనాటి సమాజాన్ని వాస్తవంగా చిత్రించాడు. ఆ సమాజంలో ఉన్న పాత్రలనూ సృష్టించాడు. అదేవిధంగా తాను దర్శించిన సమాజాన్ని చిత్రించాడు. అందుకు తగిన ఆదర్శ పాత్రలను చిత్రించాడు. అంటే అతని రచన రెండు రకాల పాత్రలు, సంఘటనలు కనిపిస్తాయి. ఒకటి వాస్తవం - ఒకటి ఆదర్శం.

**స సర్వే భ్రాతరస్తాత భవంతి భరతో పమాః**
***మద్విధా వాపితుః పుత్రాస్సుహృదోహా భవద్విధాః***

*అందరూ భరతునివంటి సోదరులు కారు. నావంటి పుత్రులు కారు. నీవంటి మిత్రులు కారు, అంటాడు రాముడు సుగ్రీవునితో.*

మంచి తండ్రి, మంచి కొడుకు, మంచి భార్య, మంచి మిత్రుడు ఎలా ఉండాలో చూపడానికి రామాయణం రచించిన వాల్మీకి అప్పటికి సమాజంలో ఉండిన దోషాలకు అప్పటి పాత్రల ద్వారా నిరూపిస్తాడు.

కాండముల విభజనలోనే ఒక ప్రత్యేకతను, విశిష్టతను కనబరచారు వాల్మీకి. అయోధ్యకాండలో ఆనాటికి నాగరికం అయిన సమాజాన్ని వివరించాడు. అరణ్యకాండలో నాగరికత ప్రవేశించని ఆటవికుల సమాజాన్ని వర్ణించారు. కిష్కింధకాండలో నాగరికత అడుగుపెడుతున్న వానర సమాజాన్ని గురించి చెప్పారు. సుందరకాండలో విలాస జీవితానికి అలవాటుబడిన రాక్షస సమాజాన్ని చిత్రించారు. యుద్ధకాండలో రెండు సమాజాల సంఘర్షణ వర్ణించి విలాసాలకు అలవడ్డ సమాజం ఎంత సమున్నతం అయినా పతనం తథ్యం అనే విశ్వసత్యాన్ని వక్కాణించారు.

అయోధ్యకాండలోని సమాజాన్ని పరిశీలిస్తే రాజకీయం అంతగా బలపడలేదని స్పష్టం అవుతుంది. రాజ్యాలు నగర రాజ్యాలుగాగాని, మరీ చిన్న రాజ్యాలుగా గాని ఉండి ఉండాలి. విస్తారమైన రాజ్యాలను పాలించే పటిష్టం అయిన రాజకీయ వ్యవస్థ కనిపించదు. రామాయణంలో కనిపించే నాగరిక రాజ్యాలు కోసల, మిథిల, కేకయ. ఈ మూడింటిలోనూ యుద్ధాలు చేయాలనే ఆసక్తిగాని శక్తిగాని ఉన్నట్లు కనిపించదు. అయితే పెళ్ళిళ్ళ ద్వారా రాజ్యాలను ఆక్రమించుకునే ఒక పద్ధతి ఉన్నట్లు కనిపిస్తుంది. కేకయ రాజులు కైకను ముసలి దశరథునికి ఇచ్చి పెళ్ళి చేసేప్పుడు కైకకు పుట్టినవానికే పట్టంకట్టాలనే షరతు పెడతారు. దశరథుడు అందుకు అంగీకరిస్తాడు. జనకుడు రామునికి సీతనిచ్చి పెళ్ళిచేసి తన ఆధిపత్యం సంపాదించాలి

అనుకుంటాడు. రాముడు ఇంటికి పెద్దకొడుకు. ఆచారం ప్రకారం అతనికే రాజ్యం రావాలనుకొని ఉంటాడు జనకుడు. దశరథునికి కేకయ రాజుకు ఇచ్చిన వచనమును గురించి రామాయణంలో చాల గుప్తంగా ఉంచడం జరిగింది. రాజ్యపాలనను గురించి రామాయణం మొత్తంలోనూ ఎక్కడా చెప్పబడలేదు. దశరథుడు జనరంజకంగా పాలించాడు అంటాడు. రాముని రాజ్యపాలన రామాయణంలో లేదు. రామ పట్టాభిషేకంతో రామాయణం ముగుస్తుంది. ఉత్తరకాండ వాల్మీకి ప్రవచనం కాదు.

అయోధ్యను వర్ణించిన తీరునుబట్టి శ్రమ విభజన పటిష్టంగా జరిగినట్లు కనిపిస్తుంది. రాజభవనంలో రెండంతస్తుల మేడలు ఉన్నాయి. అవి సున్నంతో కట్టినట్లూ స్పష్టం అవుతుంది. అందు అనేక ప్రాకారాలూ, భవనాలూ ఉన్నట్లు తెలుస్తుంది. శ్రమ విభజన లేంది వాస్తుశాస్త్రం అంత అభివృద్ధి చెందటం అసాధ్యం. అయోధ్యలో విశాలం అయిన వీధులుంటాయి. చౌరస్తాలుంటాయి. వాటి అలంకరణలు ఉంటాయి. నగరానికి ఆవలకూడా రహదారులుంటాయి. అయితే నదులమీద, కాలువలమీదా వంతెనలున్నట్లు కనిపించదు. వర్షాకాలంలో ప్రయాణాలు జరగవు. నావల వాడకం కూడా అయోధ్యవాళ్ళకు తెలియదు. గుహుని తెగకు మాత్రమే పడవలు చేయడంలోనూ, నడపడంలోనూ ప్రావీణ్యం ఉన్నట్లు కనిపిస్తుంది.

శ్రమ విభజన కులాలవారిగా జరిగిందో లేదో చెప్పలేం. రామాయణంలో కులాల ప్రసక్తి అంతగా రాదు. వాల్మీకి వర్గాలను గురించే చెప్పాడు. కులాలను గురించి అంతగా పట్టించుకోడు. ఇందుకు రెండు కారణాలు కావచ్చు. ఒకటి అప్పటికి కులాలు గట్టిపడి ఉండవకపోవచ్చు. లేదా వాల్మీకికి కులాలంటే సదభిప్రాయం లేకుండవచ్చు. ఆహారం విషయంలోనూ శాఖాహార మాంసాహార విభజన కనిపించదు. పట్టుబట్టల ప్రసక్తి వచ్చింది కాబట్టి నేతపరిశ్రమ అభివృద్ధిలో ఉందని చెప్పుకోవచ్చు. అయితే వైద్యం అభివృద్ధి చెందినట్లు కనిపించదు. రాజవైద్యులు అనేమాట వినిపిస్తుంది కాని అవసరం అయినప్పుడు వైద్యులు కనిపించరు. దశరథుడు చావు, బతుకుల్లో ఉన్నప్పుడు కూడా వైద్యులు కనిపించరు. వాణిజ్యం, వ్యాపారం ఉన్నట్లు కనిపిస్తుంది. వాటికి అంత ప్రాముఖ్యం లేకున్నా వ్యాపారాన్ని సమాజం గుర్తించినట్లు కనిపిస్తుంది.

స్త్రీ పురుష సంబంధాలకు సంబంధించినంతవరకు పురుషుని ఆధిక్యత స్పష్టంగా కనిపిస్తుంది. స్వప్రయోజనాల కోసం ఆడదాన్ని ఫణంగా పెట్టడం కైక పెళ్ళి విషయంలో స్పష్టం అవుతుంది. పెళ్ళికి అంతస్తుల నిర్ణయానికి కూడా కైక పెళ్ళి నాందిలా కనిపిస్తుంది. దశరతుడు పెళ్ళాడిన మిగతా ఇద్దరు రాజకూతుళ్ళు కారు. బహుభార్యాత్వం స్థిరపడిపోయింది. ముసలివానికి పిల్లలనివ్వడమూ మొదలయింది. అయితే స్త్రీ ఇంకా పూర్తిగా అబల అయిపోలేదు. ఆమెకు యుద్ధ విద్య తెలుసు. రాజకీయ పరిజ్ఞానమూ ఉంది. పెళ్ళి ఒక శాశ్వతం అయిన బంధంగా కనిపించదు. విడాకులు అమల్లో ఉన్నట్లు కనిపిస్తుంది. భార్యను వదిలేయడం చాల సులభం అయిందిగా కనిపిస్తుంది. అయితే స్త్రీ ధనాన్ని సమాజం గుర్తించింది. తన డబ్బును తాను వాడుకునే స్వేచ్ఛను స్త్రీకి ఉంది. బానిసలు స్త్రీలను భార్యలుగా చేసుకోవడం, వారికి కలిగిన సంతానం కూడా బానిసలే అవుతారు.

ఒక విషయం విచిత్రం అనిపిస్తుంది. అయోధ్యలో మద్యపానం ఉన్నట్లు కనిపించదు. ముసలితనపు పెళ్ళిళ్ళవల్ల వచ్చే అనర్థాలను విపులంగా వివరించడం జరిగింది. బహుభార్యత్వాన్ని ఖండించి ఏకపత్నీత్వాన్ని స్థాపించడానికి వాల్మీకి ఉద్దేశించాడు.

అరణ్యకాండలో రెండు రకాల సమాజాలు కనిపిస్తాయి: ఒకటి మున్యాశ్రమాలు. జనపదాలు వదిలి తపస్సు చేసుకోవడానికి మునులు ఏర్పరచుకున్న ఆశ్రమాలు అరణ్యంలో అనేకం ఉన్నాయి. అవన్నీ అందంగా ప్రశాంతంగా ఉంటాయి. తపస్సు చేసుకోవడం ఆ తరువాత అగ్నిగుండాలు ఏర్పరచుకుని, వాటిల్లో దూకి శరీరాలు త్యజించడం కనిపిస్తుంది. యజ్ఞయాగాదులు అంతగా కనిపించవు.

మరొక సమాజం ఆటవికులది. వాళ్ళనే రాక్షసులు అన్నారు. రాక్షసులు మునులను హింసించారని చెప్పడానికి నిదర్శనలు రామాయణంలో కనిపించవు. రెండు భిన్న జీవన విధానాల మధ్య సంఘర్షణ జరిగినట్లూ కనిపించదు. రాముడు శరభంగుని ఆశ్రమంలో ఉన్నప్పుడు మునులంతా వస్తారు. ''ఈ అడవి సాంతం మునికళేబరాలతో నిండివుంది. నీవు రాక్షసులను సంహరించాలి'' అంటారు. రాముడు వధిస్తాననీ అంటాడు. అంతేగాని మునులమీద

రాక్షసులు దౌర్జన్యాలు చేసినట్లుగాని, రాముడు వారిని సంహరించినట్లుగాని ఎక్కడా కనిపించదు. దీనిని ఆర్య ద్రావిడ నాగరికతల ఘర్షణగా పేర్కొనడానికి కూడా ఎక్కడా ఆస్కారం లేదు. మునులదారి మునులు జీవించారు. రాక్షసుల దారిన రాక్షసులు జీవించారు. రెండు జీవన విధానాల సహజీవనం కనిపిస్తుందేగాని సంఘర్షణ ఎక్కడా కనిపించదు.

ఆటవికులదే ఈ ప్రాంతం అన్నట్లు "రాక్షస సేవితమ్" అంటాడు. రాక్షసులు – ముఖ్యంగా దండకారణ్య ప్రాంతంవారు – నాగరికత తెలియనివారు. వారికి నియమనిబంధనలు ఉన్నట్లు కనిపించదు. వారు స్వేచ్ఛాజీవులు. వారికి విధి నిషేధాలు లేవు. కనిపించింది తినడం – కనిపించిన దానితో కామం తీర్చుకోవడం వాళ్ళ ప్రవృత్తి. అదీ వాళ్ళ విధానం.

శూర్పణఖ అలాంటి సమాజానికి ప్రతినిధి. ఆమె స్వేచ్ఛాచారిణి. ఆమెది స్వేచ్ఛా ప్రణయం. ఆమె అలా అడవిలో తిరుగుతూ రాముని పర్ణశాల దగ్గరకి వచ్చింది. అక్కడ రాముడు కనిపించాడు. అతనితో కామం తీర్చుకోవాలనిపించింది ఆమెకు. అడగడంలో ఆమెకు సంకోచంలేదు. అడిగింది. ఆటవికుల ఆచారం రామునికీ తెలిసివుండాలి. అతడూ తప్పుపట్టలేదు. పైగా హాస్యాలాడాడు. శూర్పణఖ చూచింది. సీత తనకు అడ్డంకిగా కనిపించింది. ఆమెను తినేస్తానని ఉరికింది. సీతకు ప్రమాదం ఏర్పడినపుడు ఆమెను రక్షించాలనుకున్నాడు. ఆమె ముక్కూ చెవులూ కోయించాడు. అవమానం జరిగిన శూర్పణఖ అన్నల దగ్గరికి పరిగెత్తింది. ఏడ్చింది. మొత్తుకున్నది. వాళ్ళను ప్రేరేపించింది. వాళ్ళు ఆటవికులే. వాళ్ళకు ఎత్తులూ, జిత్తులూ, పన్నాగాలూ తెలియవు. చెల్లెలికి అవమానం జరిగిందని తెలిసి మూక ఉమ్మడిగా ఉరికారు. వాళ్ళకు ఒక శిక్షణ లేదు. ఒక పథకం లేదు. దొమ్మీకి పోయినట్లు పోయారు. హతమారారు. ఇది కూడా వ్యక్తి ద్వేషమేకాని వర్గద్వేషం కాదు. ఆ తరువాత కథ లంకకు చేరుతుంది. అక్కణ్ణుంచి సాగిన కథకు పథకాలూ, పగలూ, ప్రయోజనాలు ఉన్నాయి. కాని ఇక్కడి ఆటవిక రాక్షసులకు అవన్నీ ఉన్నట్లు కనిపించదు. ఆ తరవాత జరిగిన కథకు ఆటవిక జీవితంతో సంబంధం లేదు. అలాంటి ఆటవిక జీవన విధానం – ఆటవిక సమాజాలూ ఇంకా ఉన్నట్లు కనిపిస్తుంది.

కిష్కింధలో మనకు కనిపించే వానర సమాజం కూడా ఆటవిక సమాజమే. అయితే ఈ సమాజంలో కొన్ని నియమనిబంధనలూ, విధి నిషేధాలూ ఉన్నాయి. వీళ్ళకు ఇళ్ళు కట్టుకోవడం తెలియదు. గుట్టలు, గుహలు, చెట్లే వీరికి ఆవాసాలు. ఆహార విషయాల్లో కూడా ప్రకృతి సిద్ధం అయిన ఆహారమే తప్ప వంటలు వీరికి తెలిసినట్లు కనిపించదు. బట్టలకు సంబంధించినంతవరకు వీరు అర్ధనగ్నంగా ఉండేవారేమోననిపిస్తుంది. వీరికి యుద్ధాలు తెలిసినట్లు కనిపించదు. వీరికి తెలిసిందల్లా ద్వంద్వయుద్ధమే. ఒక్కనితో పోట్లాడ్డమే వారికి తెలుసు. వ్యూహాలు ఏర్పాటు చేసుకొని దండెత్తడం వాళ్ళకు తెలియదు. పన్నాగాలు, ప్రచ్ఛన్న యుద్ధాలూ వారికి తెలియదు. చాటున దాగి బాణం వేస్తాడని వాలి కనీసం ఊహించదు. తార రాముని గురించి హెచ్చరిస్తుంది. వాలి లెక్కచేయడు. కారణం అతడు యుద్ధం చేయాల్సింది సుగ్రీవునితో. సుగ్రీవునికి రాముడు ఎలా సాయం చేయగలడోకూడా ఊహించదు. వాలి రాముని కుట్రకు బలి అవుతాడు. వానర సమాజానికి కుట్ర తెలియదు.

వానరులకు ఒక రాజ్యం ఉన్నట్లు కనిపిస్తుంది. అయితే ఈ రాజ్యానికి భౌతిక హద్దులు లేవు. వానరులు ఎక్కడున్నా వారికి ప్రభువు ఒక్కడే. ఇది మన ప్రస్తుత స్వచ్ఛంద సంస్థలా కనిపిస్తుంది. ప్రపంచ కార్మిక సంస్థలో సభ్యులు కావడానికి రాజకీయ హద్దులు అడ్డురావు. అలాంటిదే ఏదో ఒక వదులైన ముడి ఆ జాతిని బంధించి ఉంటుంది. వానరులకు పెళ్ళిళ్ళు తెలుసు. అయితే అన్న చనిపోయినప్పుడు వదినను చేపట్టడం వాళ్ళ ఆచారం. ఈ సమాజంలో స్త్రీలకు వ్యక్తిత్వం కనిపిస్తుంది. తారవంటి ప్రజ్ఞావంతురాలు ఉండడమే అందుకు నిదర్శనం. తార సలహా వినక వాలి కూలాడు. తార సలహా ప్రకారం నడుచుకుని సుగ్రీవుడు బయటపడ్డాడు. బాగుపడ్డాడు. ఈ సమాజంలో మద్యపానం అమల్లో ఉంది. అందుకు స్త్రీ పురుష భేదం లేదు. మరొక విషయం ఏమంటే వీరికి వైద్యం తెలుసు. సుషేణుడు వీళ్లకు వైద్యుడు. అతడు మూలికలతో వైద్యం చేస్తాడు. ఈ సమాజంలో ప్రధాన సమస్య అన్నదమ్ముల వైరంలా కనిపించుతుంది. అన్నను గురించి చెపుతూ సుగ్రీవుడు ''వైరణం భ్రాతృదూషితం'' అంటాడు. అన్నదమ్ముల వైరాన్ని అడుగంటించడానికే వాల్మీకి రామాయణం రాశాడు.

సుందరకాండ ఎంతో సుందరం అయింది. ఇది వాల్మీకికి నచ్చిన కాండలా కనిపిస్తుంది. మిగతా కాండలకు కథ జరిగిన స్థలాలనుబట్టి పేర్లు పెట్టాడు. ఆ పద్ధతిలో ఇది లంకా కాండ కావాలి. కాని దీన్ని సుందరకాండ అన్నాడు. ఈ కాండ నిండా లంకా వర్ణనమే. అయోధ్యను ఇంత అందంగా వర్ణించలేదు. పాఠకుని పరవశింపచేసే వర్ణనలున్నాయి ఇందులో. లంకలోను మూల మూలలను వర్ణిస్తాడు.

*లంకానాథుడు రావణుడు విద్వాంసుడు. శాస్త్రజ్ఞుడు. అతడు ఆజ్ఞాపిస్తే సముద్రం తరంగాలు వేయడం మానేస్తుంది. అతడు కన్నెర్రచేస్తే సూర్యుడు నిలిచిపోతాడు. గాలి స్తంభిస్తుంది. అంత శక్తిమంతుడతను! అతని శాస్త్రజ్ఞానంతో లంకను అంత అందంగా సిద్ధం చేశాడు. అక్కడి భవనాలు, ఆరామాలు, విమానాలు, అంతఃపురాలు అద్భుతాలు. బాహ్య నాగరకతను అంత విపులంగా వర్ణించిన వాల్మీకి రాక్షసుల గుణగణాలను అంత విపులంగా వర్ణించడు. బాహ్య నాగరికత బలిసిపోయి నైతిక శక్తి లోపించిన నగరం లంక - నాగరికత లంకది. నైతిక శక్తి లోపించినపుడు పతనం తప్పదని వాల్మీకి ప్రవచనం.*

లంకలోని ఇంత సంపద రాక్షసులు ఉత్పత్తి చేసిందేనా అంటే కాదనిపిస్తుంది. రావణుడు ఇతరుల సంపదలు హరించడంలో మొనగాడు. అతడు దోపిడీగాడు. కుబేరుని మీదికి దండెత్తి పుష్పకం తెచ్చాడు. మయుణ్ణి ఓడించాడు అతని సంపద తెచ్చాడు. కాలకేయులను, నాగులను, వరుణ పుత్రులను జయించి సంపద కొల్లగొట్టి తెచ్చాడు. రావణుడు ఎదిరించి ఎవరితోనూ యుద్ధం చేసి ఉండడని నా అభిప్రాయం. దొంగచాటుగా దండెత్తి అన్నీ ఎత్తుకురావడమే అతని పని. చాటుగా ఎత్తుకురావడం అతనికి తెలుసు. సీతను కూడా అలాగే తెచ్చాడతను. అలా తెచ్చిన వాటిని భద్రపరచుకోవడానికి లంకను పటిష్టంగా తయారుచేశాడు.

*ఇది దోపిడీ నాగరికత. ఇది పతనం చెందక తప్పదు అంటున్నట్లున్నాడు వాల్మీకి. దోపిడీ నాగరికతలు శిథిలం కావడం మనం చూస్తూనే ఉన్నాం.*

లంకలోని సంపద సొంతం శ్రమ ఫలితం కాదు. సుళువుగా లభించిన సంపదవల్ల విలాస జీవితం వెర్రితలలు వేస్తుంది. అక్కడ అర్ధనగ్న నాగరికత పూర్తి నగ్న నాగరకతా ఉన్నాయి. బట్టలు లేని పడతులు, తాగి తందనాలాడేవారూ కనిపిస్తారు. లైంగిక సంబంధాలలో నియమనిబంధనలు ఉన్నట్లు కనిపించదు. కామం తీర్చుకోవడం తప్ప ప్రేమ జాడ కనిపించదు. ఈ సమాజంలో ఆడదానికి మనసున్నదని గుర్తించడం జరగలేదు. ఆడది భోగవస్తువు. పరస్త్రీలను ఎత్తుకురావడం, వాళ్ళను అనుభవించడం రాక్షసులకు ధర్మం అని చెపుతాడు రావణుడు. రావణునికి నిజంగా పెళ్ళి అయిందో కాలేదో తెలియదు. అతని అంతఃపురం నిండా ఎత్తుకు వచ్చిన ఆడవాళ్ళే ఉన్నారు. ఆడదాన్ని ఎత్తుకునివస్తే అడిగిన మగవాడు కనిపించలేదు. రాముడే అలాంటివాడు. లంకలోని నాగరికత బలదర్పాల మీద ఆధారపడింది. జలదర్పాలమీద ఆధారపడిన నాగరికతకు పతనం తప్పదు.

లంక సముద్ర మధ్యంలో ఉంది. అయినా అక్కడ వారికి నావలు తెలియవు. నావ లేకుండా సముద్రం దాటే విద్య యేదో రాక్షసులకు తెలుసు. వారు కేవలం మాంసాహారులు. నరమాంసం సహితం రుచిగా పండుకుని తినగలవారు. వారు విలాస ప్రియులు. మత్తుపదార్థాలలో మునిగి తేలుతుంటారు. వారికి విమానాలు సహితం ఉన్నాయి. నియమాలు లేవు. విమానాలుండి నియమాలు లేని నాగరికత నిలవడం అసంభవం.

ఆనాటి నాగరికతకు పరాకాష్ఠ లంక. లంకలో సంపద శీఘ్రంగా పెరిగింది. సంపదతోపాటు నైతిక శక్తి పొందలేదు. నీతినియమాలు లేని సంపదకు నిలకడలేదు, అది ఏనాడు ఎలా కూలిపోతుందో చెప్పలేం.

పడమటి దేశాలలో నాగరికత లంకలోలా పెరిగిపోతూంది. నైతిక విలువలు అక్కడా నశిస్తున్నాయి. లంకలోని భోగాల వర్ణన చూస్తుంటే పాశ్చాత్య దేశాల విలాసాల వర్ణనలా కనిపిస్తుంది. వారికీ, మనకూ వాల్మీకి ఇచ్చిన సందేశాలు అనేకం. అవి నిత్య సత్యాలు.

**యావత్ స్థాస్యంతి గిరయ స్సరితశ్చ మహితరే**
**తావద్రామాయణం కథా లోకేషు ప్రచారిష్యతి.**

నేలమీద కొండలూ, నదులూ ఉన్నంతకాలం రామాయణ కథ లోకాల్లో ప్రచారంలో ఉంటుంది.

అజరామరం అయిన సత్యాలు అందులో ఉన్నాయి. కాబట్టి రామాయణానికి అంతంలేదు. అది నిరంతరాయం అయింది.

# శతపత్రం
# గడియారం రామకృష్ణ శర్మ

**– రావినూతల సత్యనారాయణ**

**భూమిక:**

వివిధ రంగాలలో కీర్తిప్రతిష్ట లార్జించినవారు తమ జీవితానుభవాలు మరికొందరికి ఆదర్శం కాగలవనే భావనతోనే తాము పోరాడి సాధించుకొన్న ఉన్నతి స్ఫూర్తిదాయకం కాగలదని, ఇతరులతో పంచుకొనే నిమిత్తం స్వీయచరిత్ర రచనకు పూనుకుంటారు.

స్వీయచరిత్రలను గూర్చి ముచ్చటిస్తూ శ్రీ అక్కిరాజు రమాపతిరావుగారు తమ అభిప్రాయాన్ని ఇలా వ్యక్త పరుస్తారు. "తాము జీవించి వున్న కాలానికి, దేశానికి, సంఘపరమైన అభ్యుదయానికి ప్రాతినిధ్యం వహించిన మహాపురుషులు, ముందు తరాలవారికి అప్పటి దేశకాల పరిస్థితులు – తాము ఎదుర్కొన్న సమస్యలు – పడినపాట్లు, అనుభవించిన కష్టాలు, పొందిన అవమాన సన్మానాలు తెలియపర్చాలన్న ఉద్దేశంతో పెద్దలు స్వీయ చరిత్రలను రచిస్తారు". అయితే, ఆత్మకథను చరిత్రలాగా, కేవలం సంఘటనల చిట్టాలాగా వ్రాస్తే, అందులో సృజన సాహిత్యంలో ఉండాల్సిన ఆత్మ, కళాధర్మం లోపిస్తుంది. రచయిత ప్రాధాన్యత స్వీయ జీవనావలోకనంతో, ఆత్మీయస్పర్శతో ముడిపడి ఉంటుంది.

అనుభూతుల అభివ్యక్తిలో తాదాత్మ్యం చెందాలి. అలా అయితేనే గాని స్వీయానుభవాలు పాఠకుల్ని కదిలించవు. స్వీయచరిత్రలో తన కథకూ, తనకాలపు కథకూ, ప్రాధాన్యతలలోని తేడాల్ని బట్టి స్వీయచరిత్రకు ప్రాముఖ్యత హెచ్చుతుంది. తనకాలపు కథ అంటే రచయిత సాక్షీభూతంగా ఉన్నకథ అని అర్థము. స్వీయచరిత్ర రచించే వ్యక్తి లోకానికి తెలిసిన తన బహిరంగ జీవితంతోపాటు, ఆంతరంగిక జీవితాన్ని కూడా చిత్రించాలి. అలా చేయకపోతే, బాహ్యజీవితానికి ప్రేరకమైన సంఘటనలు, ఆంతరంగిక జీవితంలో నున్న సందర్భాలు లోకానికి తెలియవు.

భారతదేశంలో మొట్టమొదట స్వీయచరిత్రను వ్రాసుకొన్న వ్యక్తి శ్రీ రాజారాంమోహన్ రాయ్ అని పెద్దలు పేర్కొంటారు. భావదాస్యం నుంచి, మత మౌఢ్యాలనుంచి, మృత సంప్రదాయాల నుంచి, నిర్వీర్య నిస్తేజాల నుంచి, భారతజాతిని సముద్ధరించడానికి ఆయన చేయని త్యాగం లేదు, పడని కష్టాలు లేవు, జరపని యుద్ధాలు లేవు.

అలాగే, తెలుగులో స్వీయచరిత్ర రచనా పరంపర శ్రీ వీరేశలింగం పంతులు గారి స్వీయచరిత్రతో మొదలైంది. స్వీయచరిత్రలు ఒక ప్రక్రియగా ఇరవయ్యో శతాబ్దం మొదటి దశకం నుండి మొదలైంది. అంతకు పూర్వం తెలుగులో ఈ ప్రక్రియ లేదు. ఒక శతాబ్దకాలంలో తెలుగులో దాదాపు రెండువందల రచనలు రావడం చెప్పుకో దగిన విషయమే! అంటే, రచయితలలోను, పాఠకులలోను, ఈ ప్రక్రియ పట్ల ఆసక్తి ఉన్నదని మనం తెలుసుకో వచ్చును. ఒక విధంగా చెప్పాలంటే, సామాజిక యథార్థతలను స్వీయచరిత్ర ప్రక్రియ ప్రతిబింబించినట్లుగా తక్కిన సాహిత్య ప్రక్రియలు శక్తివంతంగా చిత్రించ జాలవు.

వీరేశలింగం స్వీయచరిత్ర వెలువడినదాదిగా ఇప్పటి వరకు కవులు, పండితులు, రాజకీయ ప్రముఖులు, కళారంగంలో ప్రతిష్ట గడించినవారు అనేకులు స్వీయచరిత్రలు రచించారు. అవి షుమారు రెండువందల దాకా లెక్కతేలుతున్నవి. అయితే, ప్రాంతాలవారీగా లెక్క కడితే, రాయలసీమ ప్రముఖుల నుంచి వచ్చినవి చాలా తక్కువ సంఖ్యలో తేలు చున్నవి. ఇందుకు కారణాలు తెలియవు. స్వాతంత్ర్యోద్యమ చరిత్రలోకాని, సాహిత్య రంగంలో కాని, భారతీయ సాంస్కృతిక పునర్జీవన తాదాత్మ్య ప్రయత్నాలలో కాని, త్యాగజీవన సంరంభంలో కాని, రాయలసీమవారు ఆధునిక చరిత్రలో అగ్రగణ్యులున్నారు. అయినప్పటికీ, స్వీయచరిత్రలు అట్టేలేవు! ఈ లోటును ఇటీవల కాలంలో (1997) వెలువడిన శ్రీ తిరుమల

రామచంద్రగారి హంపీ నుంచి హరప్పా దాక తీర్చంది. అక్కడి పెద్దలు పూనుకొని ఉంటే ఇటువంటి స్వీయచరిత్రలు ఎన్నో వచ్చి వుండవలసింది! ముఖ్యంగా గమనించ దగిన విషయ మేమిటంటే, రాయలసీమ నుంచి ఈ నూరేళ్ళలోనూ వచ్చిన స్వీయచరిత్రలు కవిపండితులు, చారిత్రకులూ, సంస్కృతి పరులు తెలుగులో వ్రాసినవి రెండే రెండు అని! అవి రామచంద్రగారి హంపీ నుంచి హరప్పా దాక మరియు శ్రీ గడియారం రామకృష్ణశర్మ గారి శతపత్రము అని.

ఇచ్చట రామకృష్ణశర్మగారిని గురించి కొద్దిగా వివరించాలి. శ్రీ గడియారం రామకృష్ణశర్మగారు మేధావి, కవి, పండితులు, గతాగతాలకు వారధి. ఉత్తమ సంస్కృతి మూర్తీభవించిన వారు. మునుముందు ఈ వ్యాసంలో వారిని గూర్చిన అనేక విషయాలు చర్చిత మౌతాయి. అయితే ముందుగా శ్రీ శర్మగారి రచనా వ్యాసంగాన్ని గూర్చి తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. రామకృష్ణగారు చిరుప్రాయంలోనే బట్టీపెట్టి పద్యరచన మొదలెట్టారు. వారి చిన్నాయన ప్రోత్సాహంతో విడి పద్యరచన మానేసి, చిన్ననాడు ఐదవ తరగతి వాచకం లోని చంద్రహాసుని కథను రెండశ్వాసముల పద్యకావ్యంగా రూపొందించారు. ఆ చిరుకావ్యాన్ని కడపలో హైస్కూలు తెలుగు పండితులైన జనమంచి శేషాద్రిశర్మగారికి తప్పులు సవరించుటకై చూపగా, వారు రామకృష్ణగారిని చులకనచేసి మాట్లాడిరట! ఆ సంఘటన వారి భావి జీవిత మార్గాన్నే రూపొందించు కొనుటకు దారి తీసింది. గొప్ప రచయితగా పరిణమించుటకు కారణమైంది. ఆయన దీర్ఘజీవితకాలంలో (1919–2006) అనేక విషయాలపై గొప్ప సృజనాత్మక పుస్తక రచయితగా తెలుగు పాఠకలోకానికి స్పష్టపరచినది. శ్రీ గడియారం వారి కలం నుండి బాలసాహిత్యం పైన, క్షేత్రచరిత్రల, దేశచరిత్రల రూపంలోను, సాహిత్యము, వాస్తుశిల్పము, శాసనపరిశోధన, ధార్మిక విషయముల పైన చక్కని రచనలు వెలువడినవి. అంతేకాక, కొన్ని ప్రాచీన గ్రంథ పరిష్కరణలు చేసి విశ్లేషనాత్మక పీఠికలు, విజ్ఞానకోశాల నిమిత్తమై వివరణాత్మక వ్యాసాలు రచించి, సుజాత లాంటి సాహిత్య మాసపత్రికను మూడు సంవత్సరాలు నిర్వహించారు. వారి జీవితకాలంలో అనేక సంస్థలనుంచి సన్మానములు, పురస్కారములు, అవార్డులు పొందారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వంవిద్యాలయం వారు 2003లో గౌరవ డాక్టరేటు పట్టాతో సత్కరించారు. శ్రీ గడియారం రామకృష్ణశర్మగారి కలం నుండి వెలువడిన చివరి రచన (?) వారి ఆత్మకథ. ఇది 2004వ సంవత్సరంలో శతపత్రము అనే శీర్షికన ప్రచురితమైనది. శతపత్రము గ్రంథాన్ని ఉత్తమ తెలుగు రచనగా ఎంపిక చేసి, క్రేంద్ర సాహిత్య అకాడమీ, న్యూఢిల్లీ వారు తమ 2007వ సంవత్సరపు జాతీయ పురస్కారాన్ని శ్రీ గడియారం రామకృష్ణశర్మ గారికి (మరణోపరాంతం) ప్రకటించి గౌరవించారు. ఈ వ్యాసం ముఖ్యోద్దేశం ఆ ప్రసిద్ధ ఆత్మకథ శతపత్రము ను గురించిన విశేషాలు పాఠక మహాశయులకు తెలియ జేయడమే! ఈ నాప్రయత్నాన్ని విజ్ఞులైన పాఠకులు హర్షిస్తారని, మూలరచన వైపు వారు ఆకర్షితులవుతారని ఆశిద్దాం.

**శతపత్రము:**

ఒక వ్యక్తి తానున్న సమాజం మధ్యను, అనంతర కాలంలోను విశిష్టవ్యక్తిగా ఎట్లా పరిగణనం పొందుతాడు? అన్న ప్రశ్నకు శ్రీ గడియారం రామకృష్ణశర్మగారి జీవితచరిత్ర ఉదాహరణగా నిలుస్తుంది. ఒక వ్యక్తి సమాజంలో ఇష్టుడు కావటానికి కళా, సాహిత్య, సంగీత, సమాజ సేవారంగాలలో దేనిలోనైనా ఆమహనీయుడు కృషి చేసి ఉండటం కారణ మౌతుంది. అసాధారణ ప్రతిభ, హృదయ సౌకుమార్యం, మేధా, సామాజిక సంబంధాలలో ఇతరుల హితం పాటించడం, త్యాగనిరతి. తన పరిచయ పరిధి లోని వారినుంచీ, తద్వారా ఇతరుల నుంచీ మెప్పుకు పాత్ర మౌతాయి. అన్నిటికన్నా ముఖ్యమైనది సమాజంలో ఆ వ్యక్తి ప్రవర్తన, త్రికరణశుద్ధీ, అంతఃకరణం, హృదయవాదిత. అటువంటి విలక్షణ వ్యక్తిత్వం కలవారు శ్రీ గడియారం రామకృష్ణశర్మగారు అని ఆయన స్వీయచరిత్ర ద్వారా మనకు తెలుస్తుంది. ఆయన జీవితంలో పాటించిన మానవ సంబంధాలే వారిని మహనీయుణ్ణి చేశాయి. స్వార్థం కోసం, స్వీయోత్కృష్టత ప్రాధాన్యం కోసం, వారెన్నడూ ఉత్సుకులు కాలేదు. ప్రచారాన్ని ఆశించలేదు, పదవికోసం పాకులాడ లేదు. ఉన్నత పాఠశాల విద్యార్జన సహితం పొందలేదు. కాని, శ్రుతి, స్మృతేతిహాస పురాణ కోవిదులైనారు! స్వయంగా శాసనాలు చదివి తెలుసుకోగల నేర్పు సాధించారు. పరిశోధన పాటవం స్వాయత్తం చేసుకున్నారు. అందువలన వారు సాహిత్య, సాంస్కృతిక, పురాణచరిత్ర విశేషజ్ఞతతో, స్వయంకృషితో ఉన్నత ప్రమాణాలు అందుకున్నారు. ఆధునిక కాలపు సామాజిక అవసరాలను, ఆదర్శాలను శర్మగారు

చక్కగా ఆకళింపు చేసుకున్నారు. శ్రీ గడియారం వారి స్వీయచరిత్ర చదువు తున్నప్పుడు శ్రీ కందుకూరి వీరేశలింగం వంటి మహనీయులు మనకు గుర్తుకు వస్తారు.

శ్రీ గడియారం రామకృష్ణశర్మగారి ఆత్మకథ రెండు విభాగాలుగా రూపొందించ బడింది. మొదటి విభాగంలో పదునారు, రెండవ భాగంలో పది, మొత్తం ఇరువైఆరు ప్రకరణలలో ప్రచురిత మైనది. ఈ శతపత్రము అనే ఆత్మకథకు అరుదైన ఆర్జవం అనే పేరున డా. అక్కిరాజు రమాపతిరావు భూమిక రచించారు. అది అత్యంత ప్రశంసనీయముగా నున్నది. శర్మగారి చరిత్రకు అరుదైన ఆర్జవం లఘు వ్యాఖ్యగా ఉపకరిస్తుంది. పాఠకులు తెలుకొన దగిన అనేక విషయాలు అందులో నిక్షేపమైనవి.

మొదటి పదహారు ప్రకరణాలలో శ్రీ శర్మగారు తమవంశ చరిత్రతో ప్రారంభించి, విశాలాంధ్ర ఉద్యమము వరకు జరిగిన సంఘటనలన్నీ ప్రస్తానుప్రసక్తంగా వివరించారు. ఆ పుస్తకంలో పేర్కొని నట్లుగా శ్రీ శర్మగారు అనంతపురం జిల్లా, కదిరి తాలుకా, బాబాసాహెబ్ పల్లెలో పుట్టినారు. వారి తల్లిదండ్రులు గడియారం జ్వాలాపతిశాస్త్రి గారు, వెంకటసుబ్బమ్మ గారలు. వారి జన్మతిథి మార్చి 6వ తేది, 1919వ సంవత్సరం. శర్మగారి తండ్రిగారు ఉభయశాఖలలో దిట్టమైన యాజ్ఞికులు. షోడశకర్మలు చేయించ గలవారు. జోతిష్యములోను ప్రజ్ఞగలవారు. మంచి లౌక్యులు. ప్రక్క గ్రామాల ప్రముఖులతో తగాదాలు పెట్టుకుని ఆస్తినంతా పోగొట్టుకున్నారు. ఆయన పినతండ్రి రామశర్మ. ఆయనకు యాజ్ఞిక జోతిషాలతోపాటు సాహిత్యజ్ఞానం కూడా ఉండేది. శర్మగారి చిన్నతనంలో కుటుంబ పరిస్థితులు బాగులేక వారి చదువు సరిగా సాగలేదు. శర్మగారికి ఎనిమిదేండ్ల వయసులో వారి కుటుంబం కదిరి పట్టణానికి మారింది. శర్మగారు ఆ ఊరి హయ్యర్ ఎలిమెంటరీ స్కూలులో చేరి 5వతరగతి వరకు చదువుకున్నారు.

శ్రీ శర్మగారిని పురోహితుని చెయ్యాలని వారి నాన్నగారి ఆలోచన. అందుకు అనుగుణ్యంగా ఏడోఏటనే శర్మగారికి ఉపనయనం చేసి యాజ్ఞిక మంత్రాలు ప్రారంభించారు. శింగవరం గ్రామంలో చదువుకొనుటకు స్కూలులేదు. నైజాము ఇలాకాలోని ఆలంపూరులో శర్మగారి అక్కయ్యను ఇచ్చినారు. శర్మగారి బావగారు శర్మగారి పరిస్థితిని గమనించి, ఆలంపూరుకు తీసుకుని వేళ్ళారు. అచ్చట ఉర్దు స్కూల్లో శర్మగారిని 6వ తరగతిలో చేర్చినారు. ఉర్దూ మీడియం కాబట్టీ అన్ని సబ్జట్సు ఉరుదూ లోనే చెప్పే వారు. శర్మగారు ఏదో విధంగా 6వ తరగతి పాసయ్యారు. కాని, 7వ తరగతిలో లెక్కల్లో 7మార్కులు వచ్చి పరీక్ష తప్పిపోయారు. అప్పుడు ఆయన వయసు 12 సంవత్సరాలు. ఉర్దూ చదువు చాలించి తిరిగి శింగవరానికి చేరుకొన్నారు.

రామకృష్ణశర్మగారి గొప్ప అదృష్టం వారు శ్రీ వేలూరి శివరామశాస్త్రి గారి దగ్గర చదువుకోవటం. శ్రీ శివరామశాస్త్రి గారు గొప్ప విద్వాంసులు. బహుభాషా కోవిదులు, శతవధానులు. ఉదారమైన, విశాలమైన ఔపనిషద దృక్పథం కలవారు. ఆ దృష్టి శర్మగారికి కూడా అలవడింది. తమ గురువు గార్ని గురించి ముచ్చటిస్తూ "మా గురుదేవుల వ్యక్తిత్వం చాలా గొప్పది. విశిష్టమైనది. ఆగర్భ శ్రీమంతులైనా నిరాడంబరులు, దార్శనిక పండితులైనా, నిరహంకారులు, మాన్యులను, సామాన్యులను సమానంగా చూచే ఉదాత్త వర్తనులు. శిష్యవత్సలులు. వారిని గూర్చి ఎంత వ్రాసినా తక్కువే. నాకు వారి సన్నిధిలో విద్యనభ్యసించే అదృష్టం లేదు..." అంటారు. ఆలంపూరులో శర్మగారి బావగారు మరణించి నందున పరిస్థితులు వికటించి ఆస్తుల వ్యవహారాలు చక్కదిద్దుకొనుటకై శర్మగారి చదువు మధ్యలోనే ఆపివేసి 1939 చివరి భాగంలో ఆలంపూరు వెళ్ళవలసి వచ్చింది. అచ్చటినుండి కేసు వ్యవహారాలు కోర్టుల ద్వారా తీర్మానింపబడి భూములన్నీ శర్మగారి అక్కగారి పేర రికార్డుల కెక్కుటకు కొంతకాలం పట్టింది. శర్మగారు అక్కయ్య వ్యవహారం సంతోషంగా ముగిసింది కదా అనుకొని మరలా శివరామశాస్త్రిగారి దగ్గర విద్యావ్యాసంగాన్ని కొనసాగించు ప్రయత్నంలో ఉండగా మరేదో కుటుంబ అవాంతరము అడ్డుతగిలి శర్మగారికి నిరాశయే ఎదురైనది. అయితే, ఈ కాలంలోనే శర్మగారికి దుంపిలి రామిరెడ్డి గారి పరిచయ భాగ్యం కలిగింది. ఆ పరిచయమే శ్రీశర్మగారిని రాజకీయ రంగంలోనికి లాగింది. 1940వ సంవత్సరం లో ఆంధ్రమహాసభ ఆలంపూరు తాలుకా బ్రాంచి స్థాపింప బడింది. శర్మగారు ఆ సంస్థ కార్యకలాపాలతో సంబంధము పెంపొంద చేసుకున్నారు. గ్రంథాలయోద్యమంలో భాగంగా రాత్రి పాఠశాలలు మొదలెట్టి ఉపన్యాసాల మూలంగా నిజాంప్రాంత తెలుగు ప్రజలలో భాషాభిమానాన్ని మేలుకొల్పారు. తాలుకా కమిటీ రెండవ వార్సికోత్సవం

మారా మునగాల గ్రామంలో జరిగింది. అందులో చాలాగ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

"నేను వేలూరి శివరామశాస్త్రిగారి శిష్యరికం చేసినందువల్ల, కుల మతాల పట్టింపు లేకుండా పోయింది. అది నాకు ఈ ఉద్యమంలో పనికి వచ్చింది" అంటారు శర్మగారు. 1941లో మహబూబునగర్ జిల్లా ఆంధ్రమహాసభలు బండ్లపల్లెలో జరిగాయి. ఆ సభల్లో సహపంక్తి భోజనాలు జరిగాయి. హరిజన సేవాసంఘం వాలంటీర్లు వడ్డించారు. మా తాలుకా సంఘ అధ్యక్షుడు నారాయణ రెడ్డికి ఇది కష్టమనిపించింది. భాధ పడినాడు. కొంత సేపటికి తాను సమాధానపడి "బాపనయ్యవు నీకు లేని కులం నాకెందుకు" అంటూ భోజనం ముగించి నాడు" అని వ్రాస్తారు శర్మగారు. ఈ ఉదంతం శర్మగారి అభ్యుదయ భావాలను వెల్లడిస్తుంది. 1942లో శర్మగారు సాంఘికోద్యమాన్ని చేపట్ట వలసి వచ్చింది. అప్పుడు గద్వాల సంస్థానానికి సంబంధించిన రామాపురం గ్రామంలో ఒక ఉదంతం జరిగింది. 12 సంవత్సరాల అమ్మాయికి భర్త మరణించాడు. 11వ రోజున ఆ పసిబిడ్డకు కుంకుమ, గాజులు, పుస్తెలు తీయించ వలెనని పెద్దలు నిర్ణయించారు. ఆ అమ్మాయికి ఇది ఇష్టములేదు. నేను తీయనని పట్టుపట్టింది. ఊరివారు, బంధువర్గం, ఇంటి పురోహితుడు తమ నిర్ణయం జరిగి తీరవలయునని మొండికెత్తినారు. ఆ తరుణంలో ఆంధ్రమహాసభ కార్యకర్తలు ఈ విషయంలో శర్మగారి అభిప్రాయం అడిగినారట. శ్రీ రామకృష్ణ శర్మగారు మనుస్మృతి ఇత్యాది స్మృతు లన్నియు సూక్ష్మంగా పరిశీలించి, సహేతుకంగా శాస్త్రాధారాలు చూపించి, భర్త పోతే గాజులు, కుంకుమ తీయనక్కర లేదని నిరూపించారు. గ్రామప్రజలకు శర్మగారి వాదాన్ని అంగీకరించ వలసి వచ్చింది. మరునాడు ఆమెకు పాత గాజులు తీయించి కొత్త గాజులు వేయించినారు. అలాగే, మరో సందర్భములో పదిసంవత్సరాల వయస్సులో వితంతువైన అమ్మాయికి పునర్వివాహం తానే స్వయంగా జరిపించారు. ఇది శాస్త్ర విరుద్ధమని వాదించవలసిన వాళ్ళు వచ్చి వాదించ వచ్చునని పత్రిక ద్వారా ప్రకటించారు. ఈ విధంగా 5-6 బాల్యవితంతు పునర్వివాహాలు జరిపించినారు. 1943లో శ్రీ శర్మగారు విధవస్త్రీని వివాహం చేసుకొని చరిత్ర సృష్టించారు. అత్యంత విషమ పరిస్థితులలోను, అతిక్లిష్ట పరిస్థితులలోను ఇంటా బయటా కూడా రామకృష్ణ శర్మగారు ధైర్య స్థైర్యాలను వీడలేదు. తాము నమ్మిన విలువలను వారెప్పుడూ విడువలేదు.

శ్రీ రామకృష్ణ శర్మగారి స్వీయచరిత్ర చాలా ఆసక్తికరంగా చదివిస్తుంది. వారు వివరించిన ఎన్నో సన్నివేశాలు హృదయానికి హత్తుకొని పోతాయి. నిరాడంబరంగా, నిర్మమంగా, ముక్కుకు సూటిగా, ఎంతో నిజాయితీతో వారు తమ సామాజిక సంబంధాలు నిర్వహించుకున్నారు. శ్రీ శర్మాగారి ఋజువర్తనము లోకహితంకరమైనది. హిందూమత పూర్వాచారాలను, విశ్వాసాలను, సాంప్రదాయాలను శ్రీ శర్మగారు సర్వాత్మనా నమ్మారు. అయితే, పూర్వాచారం పేరిట, శాస్త్రవచనాల పేరిట మానవత్వ విరుద్ధమైన అనైతికతను, అహేతుకతను ధైర్యంతో ఎదుర్కొన్నారు. మతాధిపతులను, మతాచార్యులను సత్యనిరూపణ కొరకై చర్చలకు సహితం ఆహ్వానించారు. అనేక సందర్భాలలో స్వీయచరిత్రలో శ్రీ రామకృష్ణశర్మ స్వీయ మతాజాతి సంస్కృతుల అభిమానం, చింతాకరమైన వాటి అవనత లజ్జాకర పరిస్థితులకు అవమానం, స్వాభిమాన పూరితమైన వేదన, ఇందుకు బాధ్యులైనవారి పట్ల ఆవేదనతో కూడిన నిశ్వాన చీత్కారం, మందలింపు ధోరణీ కనపడుతాయి.

నిజాం సంస్థానంలో జరిగిన భారత స్వాతంత్ర్యోద్యమాన్ని, విముక్తి పోరాటాలను గురించి స్వీయచరిత్ర పన్నెండో ప్రకరణంలో అత్యంత ఉత్తేజకరంగా వర్ణించారు శర్మగారు. తక్కిన ప్రాంతాలలోని తెలుగు వారికి శర్మగారు వివరించిన విషయాలు తెలియవు. ఉదాహరణకు సుభాస్ చంద్రబోస్, జయప్రకాశ్ నారాయణల ప్రభావం కర్నూలు ప్రాంతాలలో ఎంతగా వుండేదో శర్మగారి స్వీయచరిత్ర ద్వారా చదివి తెలుగు వారు ఎంతో ఉత్తేజితులవుతారు. మరోవిషయం తెలుగు వారు 1942 ఉద్యమాన్ని గుర్చి ఎక్కువగా తెనాలి ప్రాంతాలలోని విషయాలనే స్మరిస్తారు. కాని, 1948 లో నిజాం సంస్థానంలో జరిగిన విప్లవ పోరాటాలను గురించి ఉత్సుకత చూపరు. ఈ విషయాలను గూర్చి అధ్యయనం చేయడానికి తగినన్ని ప్రామాణిక ఆధారాలు తెలుగులో లేవు.




నిజాం సంస్థానంలో విముక్త పోరాటం జరుగుతున్న రోజులలో

కొందరు పెద్దమనుష్యులు తెలుగువారే నిజాం చర్యలను సమర్థించడం ఎంత విడ్డూరంగా వుండేదో శ్రీ శర్మగారు వెక్కసంగా తెలియ జేశారు. అలాంటి స్వార్థపరులే, పోలీసు చర్య విజయవంతమైన మర్నాడే ఖద్దరు అంగీలు ధరించి దేశభక్తి ప్రపూరితులుగా ముతారాజకీయాలతో  అధికార పదవులకు ఎగబ్రాకి తమ పబ్బం గడుపుకొని అన్నివిధాలా బాగుపడిన వారిని గూర్చి శర్మగారు మొదటి భాగం చివరి ప్రకరణలలో తెలిపారు. ఈ వివరాలు అత్యంత ఆసక్తి కరంగాను, ఆశ్చర్యం గొలిపేవిగాను ఉన్నాయి.

స్వీయచరిత్రలో 13వ ప్రకరణమైన "పోలీసుచర్య - అనూహ్య పరిణామాలు" అనే దానిలో ఆశ్చర్యకరమైన విషయాలు నమోదు చేశారు శర్మగారు. ఈ ప్రకరణం చదివితే, శ్రీ రామకృష్ణశర్మగారు ఎంతటి ఉదార హృదయులో, నిష్పక్షపాతులో పాఠకులకు తెలుస్తుంది. హైద్రాబాదు సంస్థానంపై సైనిక (పోలీసు) చర్య తీసుకోవడంలో నెహ్రూగారి తడబాటును, ఆయన మతాతీత ఉదార లౌకిక దృక్పథాన్ని మొగమాటం లేకుండా వివరించారు శ్రీ శర్మగారు. రజాకర్ల ముఖ్యనాయకుడు ఖాశింరజ్వీ సునాయాసంగా తప్పించుకొని పోయిన విధానాన్ని వ్యంగ్యంగా విమర్శించారు. ఆ సమయంలో జరిగిన అత్యాచారాలు వర్ణనాతీత మైనవని అందరికి తెలిసిన విషయమే! అప్పట్లో మతాంతరీకరణకు గురి అయిన ఒక యువతని శుద్ధికార్యక్రమం నిర్వహించి మళ్ళీ స్వీయ మతంలోకి చేర్చిన సాహసగాథను ప్రస్తావించారు శర్మగారు. ఆ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించింది శ్రీ గడియారం వారే! దక్షిణభారత మంతటిలోను ఇటువంటి సంఘటన  మరొకటి జరిగిన సూచనలు లేవు. ఇంతకంటే సాహసకార్యం మరొకటి చేసినట్లు పేర్కొన్నారు శర్మగారు. ఎప్పుడో ముస్లిములు ఆక్రమించి బాలఖిల్లా మసీదుగా మార్చిన ఆలంపూరులోని మన(హిందూ) ''అర్క బ్రహ్మాలయాన్ని" మరలా దేవాలయంగా మార్చి వేశారు. అయితే మసీదుకు నిజాం నవాబు ఇచ్చిన భూములను దేవాలయం పేరిట బదిలీ చేయించ కుండా వేరే మసీదుకు బదయలాయింప చేశారు. ఈ సంఘటనను ప్రసక్తం చేస్తూ ''ప్రజా ప్రభుత్వం ఏర్పడే లోగా ఆ వ్యవహారాన్ని ముగించినాను" అని పేరకొన్నారు శర్మగారు. ఈ విధంగా శ్రీ శర్మగారి ధైర్య సాహసాలే కాక, ఉదార విశాల మానవీయ, త్యాగజీవన సంభరిత మైన కథలూ గాథ లెన్నో ఈ గ్రోథంలో నిక్షిప్త మైయున్నవి.

శర్మగారి స్వీయచరిత్ర మొదటి భాగమంతా (1-16 ప్రకరణలు) కాలాను క్రమంగా రచించారు. రెండవ విభాగం (17-26 ప్రకరణాలు) విషయాను క్రమంగా రూపొందించారు. పాఠకులకు సులభంగా ఉండవలయునని ఈ పద్ధతిని అనుసరించామని పేర్కొన్నారు. ఈ విభాగంలో చర్చితమైన ముఖ్యాంశాలు: రామకృష్ణశర్మ గారి దేవాలయ ధర్మ కర్తృత్వము, ఆంధ్రసారస్వత పరిషత్తుతో వారి సంబంధము, ఆంధ్రసాహిత్య అకాడమీకి వారిసేవ, ప్రజాహిత రంగము, ప్రభుత్వ సంస్థలతో శర్మగారి అనుబంధము, ఆధ్యాత్మిక రంగము, వారు చరిత్ర లోనూ, వాస్తువుకు సంబంధించి చేసిన పరిశోధనలు, రచనా వ్యాసంగం, చిట్టచివరిగా సాంసారిక జీవితము మొదలైనవి.

గడియారం వారి నివాసమైన ఆలంపూరు సుప్రసిద్ధ పుణ్యక్షేత్రము. దక్షిణ వారణాసిగా పేరు పొందింది. ప్రఖ్యాతి చెందిన చారిత్రక స్థలం. అక్కడ 7వ శతాబ్దం నుండి 17వ శతాబ్దందాకా పరిపాలించిన రాజవంశాలవారు వేయించిన 70కి పైగా శాసనాలున్నాయి. తెలుగు చోళ, కాకతీయ, విజయనగర వాస్తురీతులకు చెందిన అనేక దేవాలయాలున్నాయి. అందువల్ల అదొక పురాతత్త్వశాస్త్ర పరిశోధకులకు, చరిత్రకారులకు, వాస్తుశాస్త్రజ్ఞులకు, శాసన పరిశోధకులకు, దైవభక్తులకు, రసవాదులకు యాత్రాస్థలముగా ఉంది.

శ్రీ శర్మగారు 1954 జనవరి 31వ తేదిన ధర్మకర్తల సంఘానికి అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ సంఘం ఆనాటి నుండి దేవాలయ బాధ్యతలు తీసుకున్నది. సంఘంలో శ్రీ శర్మగారే కాక మరో ఐదుగురు సభ్యులుండిరి. శర్మగారు రికార్డుల ద్వారా దేవాలయం, అన్నసత్రాల పరిస్థితులను చక్కగా అవగాహన చేసుకొని, దేవాలయ నిర్వాహణ లోని అవకతవకలను తెలుసుకొని ఆలంపూరు శిధిలములు అనే పుస్తకాన్ని ప్రచురించారు. అంతకు ముందు సంఘంవారి పాలనా సమయంలో జరిగిన కొన్ని అక్రమాలని వెలికి తెచ్చారు. అందువలన కొత్త కమిటీని సమావేశ పరచి కొన్ని ముఖ్య తీర్మానాలు చేయించారు. శర్మగారు 1954 నుండి 1983 డిశంబరు వరకు దేవాలయ సంఘ అధ్యక్ష పదవిలో కొనసాగారు. ఆయన మొదట దేవాలయ కమిటీ ఛైర్మన్ గా నిలవ 3680వ00

రూపాయలతో చార్జీ తీసుకొన్నారు. 1984 జనవరి 8వ తేదీన మూడులక్షల అరువదిఎనిమిది వేల (3,68,000వ00) రూపాయల బ్యాంకు బ్యాలెన్సుతో కొత్తగా వచ్చిన ఇ.ఓ. గారికి దేవాలయం ఆస్తులు, బ్యాంకు నిలువలు మరియు ఇతర వస్తువులతో చార్జి అంద జేసి పదవిముక్తు లైనారు. 1954 – 1983 కాలంలో దేవాలయ వికాస కార్యక్రమాలు చక్కగా జరిగినవి. శర్మగారి సేవలను ప్రశంసించని అధికారులు కాని, సామాన్య భక్త ప్రజానికం కాని లేనే లేరు. దేవాలయ, అన్నసత్రాల నిర్వహణ ఎలాంటి దుర్వినియోగాలకు తావు లేకుండా జరిగింది.

ఈ కాలంలో అనేక సంఘటనలు తావు చేసుకున్నవి. ఉత్కంఠను, కుతూహలాన్ని కలిగించే విషయం ఒకటి ఉంది. అదే, హిందూ దేవాలయాల్లో మహ్మదీయుల 'ఉర్సు' (తిరుణాల) మాన్పించడం. ఉర్సు జరిగే మూడు దినాలు ముస్లిం యాత్రికులు దేవాలయాలలోని సత్రాలు, మండపాలు ఆక్రమించుకొని అక్కడ వంటలు, తాంబూలాల ఉమ్మివేతలు, స్త్రీల మూత్రాలు, మలవిసర్జనలతో పాడు చేసేవారు. ఈ దురలవాటును 1957 నుండి మాన్పించారు శర్మగారు. ఆ తర్వాత హిందూ దేవాలయాలు ఉర్సు పీడనుండి విముక్తి పొందాయి. ఈ విషయంలో శర్మగారు చేసిన కృషి చెప్పుకో దగినది. ఆంధ్ర సారస్వత పరిషత్తుతో శర్మగారి సంబంధము చాలాపాతది. 1943 లో పరిషత్తు స్థాపించ బడినప్పుడు, శర్మగారు స్థాపక సభ్యులలో ఒకరుగా ఉండి, ప్రచార కార్యదర్శిగా పనిచేశారు. 1950 – 57 మధ్యకాలంలో సహాయకార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. 1958 నుండి 1983 వరకు ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. 1984 నుండి చాలాకాలం పరిషత్తు ఉపాధ్యక్ష పదవి కార్యభారాలను నిర్వహించారు. 1944 నుండి 1993 వరకు దేవులపల్లి రామానుజరావు, పులిజాల హనుమంతరావు, నరోత్తమరెడ్డి గార్లతో కలిసి పరిషత్తుకు అమోఘ సేవలందించారు. పరిషత్తు స్వర్ణోత్సవాలు విజయవంతముగా జరిపించుటలో అత్యంత ముఖ్యపాత్ర వహించారు. అలాగే ఆంధ్రసాహిత్య అకాడమీ అవతరించి నప్పటి నుంచీ అది అంతమయ్యే వరకు దానిలో కార్యవర్గ సభ్యునిగా, విశిష్ట సభ్యునిగా యథాశక్తి సాహిత్యసేవ చేశారు శ్రీ శర్మగారు. అకాడమీ నిర్వహించిన అనేక కార్య కలాపాలలో తమకు అప్పగించిన బాధ్యతలను నిజాయితీగా, నిష్ఠతో నిర్వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీ కొన్ని సలహా సంఘాలలో నియమితులై కొన్ని ప్రణాళికలు విజయవంతంగా పూర్తి చేశారు.

శ్రీ రామకృష్ణ శర్మగారు అనేక ప్రజాహిత కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని నిర్మాణాత్మక కార్యకలాపాలు నిర్వహించారు. భూముల ప్రతిఫల నిర్ణయసంఘం, టెనెన్సీ ట్రిబ్యూనల్, రీజనల్ హిస్టారికల్ రికార్డ్సు సర్వేకమిషన్, అధికారభాషా సమీక్షా సంఘము, యూనివర్సిటీ అకాడమిక్ కౌన్సిల్, తదితర ప్రభుత్వ సంస్థలలో సభ్యునిగా శర్మగారు తమబాధ్యతలను నిజాయితీగా, నిష్ఠతో నిర్వహించారు. ఆధ్యాత్మిక రంగంలో పలురకములైన కార్యకలాపాలలో పాల్గొని పీఠాధి పతుల శుశ్రూష చేయుటయే కాక, అనేక ధార్మిక కార్యకలాపాలు విజయవంతంగా నిర్వహించారు.

శ్రీ రామకృష్ణ శర్మగారు చదువుకున్నది సాహిత్యం. కాని, ఆయన అభిమాన విషయాలు శాసన పరిశోధన, చరిత్ర, వాస్తు శిల్పాలు, పురాతత్త్వశాస్త్రము, భారతీయ సంస్కృతి మరియు ధర్మశాస్త్రాలు. శ్రీ శర్మగారు నూటికి పైగా శాసనాలు ప్రకటించినారు. కొన్ని క్షేత్రచరిత్రలు వ్రాసినారు. మాధవ విద్యారణ్య స్వామి వంటి మహానుభావుల జీవితచరిత్రలు రచించారు. అలాగే సాహిత్యగ్రంథాలు (పాంచజన్యము లాంటివి) వ్రాశారు. అనేక నగరాలలో కవులను గూర్చి, కావ్యాలను గురించి ఉపన్యసించారు. సంగ్రహాంధ్ర విజ్ఞానకోశం, తెలుగు విజ్ఞాన సర్వస్వం సంపుటాలలో వివిధ విషయాల మీద వ్యాసాలు వ్రాసి ప్రకటించారు. హైదరాబాదు, కర్నూలు రేడియో స్టేషనుల ద్వారా శర్మగారి ప్రసంగములు ప్రసారం అయినవి.

దేశానికి స్వాతంత్ర్యము రాగానే క్రియాత్మక రాజకీయాల నుండి తప్పుకో దలచారు. కాని, ముఠాతత్వ రాజకీయాలు దేశాయి కాంగ్రెస్ – గోసాయి కాంగ్రెస్ ప్రబలి నందున మరి కొంతకాలం శర్మగారు రాజకీయాలలో కొనసాగ వలసి వచ్చినది. 1956 నవంబరు 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతారణ జరిగింది. అప్పటి ముఖ్యమంత్రి గారైన నీలం సంజీవరెడ్డి గారి మంత్రివర్గ నిర్మాణము న్యాయబద్ధము కాదని అందుకు నిరసనగా కాంగ్రేసు ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి శర్మగారు రాజకీయాలనుండి బయటపడినారు. అయినప్పటికీ ఆలంపూరు దేవస్థాన ధర్మకర్తల సంఘానికి అధ్యక్షులుగాను, 1977 నుంచి 1985 వరకు తాలుకా

వ్యవసాయదారుల సంఘానికి అధ్యక్షులుగాను పనిచేశారు.

1943లో వివాహము జరిగినప్పటి నుండి శర్మగారి సంసారిక జీవితం ఆరంభమైనది. అనేక ఒడుదుడుకులకు, ఆర్థిక ఇబ్బందులకు లోనైంది. ఆర్థిక సంకటాలకు తోడుగా శర్మదంపతులకు 1944 – 1972 మధ్యకాలంలో 15మంది బిడ్డలు కలిగారు. వారిలో ఏడుగురు మరణించారు, 8మంది మిగిలారు. వారిలో ఐదుగురు మగపిల్లలు, ముగ్గరు ఆడ పిల్లలు. ఆడపిల్లల చదువుల విషయమై శర్మగారు శ్రద్ధ వహించ లేదని స్వయంగా చెప్పుకున్నారు. ఆర్థికస్థితి అనుకూలించక పై చదువులు చదివించ లేకపోయానని విచారించారు. కొడుకులు వారివారి చదువుల ననుసరించి ఏవో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. వివాహాలకు సంబంధించినంత వరకు కొడుకులు వర్ణాంతర వివాహాలు చేసుకొన్నారని శర్మగారు పేర్కొన్నారు. స్వీయ ఆర్థికస్థితి సరిగ్గా లేనప్పటికీ శర్మగారు ఇతరులకు సహాయ పడుటలో ఏమాత్రం వెనుకంజ వేయలేదు. కొన్ని బీద కుటుంబాలకు సహాయ సహకారాలు అందించారు. చివరి దశలో శర్మగారి ఆరోగ్యం బాగా క్షీణించింది. మూత్రకోశ వ్యాధికి లోనైనారు. 1999లో కాపురాన్ని ఆలంపూరు నుండి కర్నూలుకు మార్చినారు. భార్య కమలమ్మ ఆరోగ్యం బాగాక్షీణించి చివరకు 2002 జనవరి 27వ తేదీన స్వర్గస్తు లయ్యారు.

**ముగింపు:**

శ్రీ శర్మగారు చివరి దశలో తన స్వీయ చరిత్రను పూర్తి చేశారు. వయస్సుతో పాటు ఆరోగ్యం క్షీణించింది. జూలై 2006 లో కన్ను మూశారు. కేంద్ర సాహిత్య అకాడమీ వారు శర్మగారి స్వీయచరిత్ర శతపత్రము అనే గ్రంథానికి జాతీయ పురస్కారాన్ని 2007లో ప్రకటించారు. ఆ పురస్కారాన్ని స్వయంగా స్వీకరించుటకు శర్మగారు జీవించి లేరు! అకాడమీ వారి జాతీయ పురస్కారం శర్మగారి జీవితకాలంలో లభించి వుంటే, ఎంతో సముచితంగా ఉండేది. కాని అలా రుగ లేదు. విధి బలీయం కదా!?


ప్రొ. రావినూతల సత్యనారాయణ
హైదరాబాద్
సెల్ : 9618524702




ప్రొ. రావినూతల సత్యనారాయణ

తెలుగు భాషలో 'కేంద్ర సాహిత్య అకాదెమీ పురస్కారం' పొందిన వారి రచనలను, సమీక్షించాలని మిసిమి సంకల్పించింది. అందుకు తగినట్లు ప్రొ. రావినూతల సత్యనారాయణ గారు స్పందించారు.

ఇదొక బృహత్ కార్యం. ఇందులో రచయితల రచనలే కాకుండా ఒక్కొక్కప్పుడు వారి జీవితంలోకి తొంగిచూడవలసిన అవసరం రావచ్చు. కేవలం రచనలు చదివితే సరిపోదు. రచయిత స్వభావంపట్ల కూడా అవగాహన ఉండకపోతే సమీక్ష తేలిపోతుంది. రచయితలు తాము రాసే రాతకు, జీవించే జీవితానికి పొంతనే ఉండదు. వీటిని సమన్వయపరుస్తూ వారి రచనలను విశ్లేషించగలగాలి. కవిత్వమైనా, కథయైనా, నవల అయినా, నాటకమైనా, విధానమేదైనా అన్నీ వ్యక్తిత్వ సూచికలే. రచయిత అనుభూతి పరిసరాల వీచికలే.

ప్రతి రచయితా తన మనసులో ఒక కార్యాచరణ ప్రణాళిక తయారు చేసుకుంటాడు. ఆనందం, ఆవేశం, ఆవేదన, ఆర్తి – ఇవన్నీ తన రచనలలో ప్రతిబింబింపచేస్తాడు. రచయితలకు భావావేశం ఎక్కువ. దానికి భిన్నమైన తర్కం కూడా ఉంటుంది. అవన్నీ పాఠకులలో గందరగోళాన్ని సృష్టిస్తాయి. రచయితను, పాఠకుడిని ఎదురెదురగా నిలబెట్టి కరచాలనం చేయించగలిగినవాడే నిజమైన సాహితీ సమీక్షకుడు. ఆయన తన సమీక్షలో ఆయా రచయితలకు సంబంధించిన ఏ పుస్తకాన్నీ వదలలేదు.




తెలుగు భాషలో వెలుగు చూసి, పురస్కారం పొందిన రచనలన్నింటినీ, రచయితలెందర్నో సమీక్షించి, పరిచయం చేసి తెలుగు పాఠకులకు గ్రంథ రూపంలో అందిస్తున్నారు. ఇది విజ్ఞులైన పాఠకులకూ, పరిశోధనాశీలురైన విశ్వవిద్యాలయ విద్యార్థులకూ కరదీపికగా ఉండగలదని ఆశిస్తున్నాం.

(ప్రతులకు *మిసిమి* కార్యాలయాన్ని సంప్రదించండి.)

## ఆముక్త మాల్యద :

# ద్రావిడ దేశీయత...

*– ఆచార్య కోసూరి దామోదర నాయుడు*

దేశ శబ్దానికి అనేకపట్టణాలు గల గొప్పభూభాగం అని నైఘంటికార్థం. దేశానికి సంబంధించింది దేశీయత. ఆముక్తమాల్యదలో దేశీయత అంటే ఆముక్తమాల్యదలోని కథలకాలంనాటి దేశీయత అని ఒక అర్థం. ఆముక్తమాల్యద ప్రబంధంలో రాజకవి అయిన శ్రీకృష్ణ దేవరాయలు తాను దర్శించిన పట్టణాలలోని ప్రజల స్థితిగతులు ఆచారాలను సంప్రదాయాలను ఏరకంగా సహజంగా వర్ణించిన విధానం కూడా దేశీయతే. రాయలు ఆముక్తమాల్యదలోని వర్ణిత కథాకాలంనాటివే కాకున్నా ఆకథాకాల చ్ఛాయలు తాను దర్శించిన ప్రదేశాలలో గుర్తించి, పరిశీలించి అవి ప్రజలకు చేరువగా ఉన్నాయని గ్రహించి సందర్భోచితంగా ప్రస్తావించారు.

సాహిత్యంలో ఇతర ప్రబంధాలకూ ఆముక్తమాల్యదకు వస్తువిషయంలో తేడా వుంది. చారిత్రక వ్యక్తులయిన విష్ణుచిత్తుడనే పెరియాళ్వార్, గోదాదేవి, యామునాచార్యుల జీవన విశేషాలన్నీ సత్యాంశాలు. మాలదాసరి లాంటివి పురాణోక్తాలు. ఆముక్తమాల్యదలో వర్ణితాలైన దక్షిణ మధుర, శ్రీవిల్లిపుత్తూరు, శ్రీరంగం, తిరుక్కురుంగుండ్రం మొదలగు శ్రీవైష్ణవ దివ్యక్షేత్రాలన్నీ రాయల సామ్రాజ్యంలోని పట్టణాలు కావడంవల్ల తన పాలనలోని అనేక పట్టణాలుగల భూభాగంలోని సహజస్థితులను స్వభావోక్తులతో కళ్ళకు కట్టేలా వర్ణించాడు. ఇందుకు సూక్ష్మపరిశీలన, వస్తువుపట్ల ప్రీతి, ముందుతరాలకు తెలియచెప్పాలనే తపన ఎంతో అవసరం. ఆముక్తమాల్యదను బాగా పరిశీలిస్తే 'ద్రావిడదేశీయత' సుస్పష్టమవుతుంది ఈ దేశీయతలో కొన్ని అంశాలను ప్రస్తావించడమే ఈ వ్యాసోద్దేశం.

**ఊరి నిర్మాణం:**

శ్రీ కృష్ణదేవరాయలు వర్ణించిన ఊరు శ్రీ విల్లిపుత్తూరు. ఈ ఊరికి వరాహక్షేత్రం, పుదూర్, పుదువైపుట్రూర్, వన్మీకపురం, వాదీశ్వరపురం అని పేర్లు. మల్లి అనే రాణికి ఇద్దరుకొడుకులు. వారు ఒకరు విల్లు, మరొకరు కాంతన్. విల్లిచే నిర్మితం కనుక విల్లిపుత్తూరు. ఈ పురాన్ని 26 (1–51–76) పద్యాలలో రాయలు అభివర్ణించాడు. విల్లిపుత్తూరు పరిసర ప్రాంత విశేషాలు, ద్రవిడాంగనల తీరుతెన్నులు, ఆనాటి గృహసీమల అందచందాలు అన్నిటా ద్రవిడదేశీయత సుస్పష్టంగా కనిపిస్తుంది. మచ్చుకు శ్రీవిల్లి పుత్తూరులోని స్త్రీలు చెంగలువ దిగుడుబావి దగ్గర పసుపు పూసుకొని స్నానం చేసి అందెలుధరించి పాదాలు ఖంగుమంటుంటే, చేతిలోని పూజాపద్మాలు కూజా బిందెమీద తడబడుతుంటే, ఆబిందెను కటిసీమమీద ఉంచుకొని వంగి దివ్యప్రబంధం పాడుకొంటూ పూలతోటలోని దారులవెంట అచ్యుతుని అభిషేకార్థం చెంగలువదిగుడుబావి నీరు తేవడం అక్కడి స్థానిక విశేషం. 'కూజా' తమిళనాడు ప్రత్యేకత. ఈ భావ విశేషాన్ని 'శయపూజాంబుజముల్ ఘటిం దడంబడన్' (1–56) అన్న పద్యంలో రాయలు వర్ణించాడు. ఈ వర్ణనలో కవిరాజు మాటమాటికి ద్రవిడాంగనల్, ద్రావిడీపరిచితిన్ ద్రవిడ కుటుంబినుల్, ద్రవిడకన్యలు అని గుర్తుకు తేవడం విశేషం శ్రీ విల్లిపుత్తూరు వీధులు 'సూత్రపట్టినట్లుంటా'యని చేసిన వర్ణన ఇప్పటికి కంచి, శ్రీ విల్లి పుత్తూరు వీధులలో గమనించవచ్చు.

అలాగే నగర వర్ణనలో కూడా దేశీయత వుందనడానికి పుష్పలావికలు సాక్ష్యం. ఇప్పటికీ మధురైమల్లిగై' (మధుర మల్లెలు) సుప్రసిద్ధం.

"వెలది యీ నీ దండ వెలయెంత?
నాదండకును వెలబెట్ట నెవ్వని తరంబు?" (2–19)

అనడం సంవాద సంభాషణ ఇక విటుల మాటలకు, మోవి చెఱింగిడి, పుష్పలాలికలోని పూబోడులు, ఆగునవ్వు, కంటనిగుడ, విరులునాన్చుకరణి, చల్లు, సరసంపుజలంబె, జాణల మరులు కొల్పు (1-21) తారట, అలాగే తిరునాళ్ళకు జనం రావడం, ఎక్కడ కాసంత స్థలముంటే సేదతీరడం నాటికీ నేటికీ సమానం. మదురై పరిసర ప్రాంతాలలో జరిగే 'తెప్పతిరునాళ్ళ' వేళ విశ్రమించిన వారి తీరులోకూడ దేశీయత స్పష్టంగా తెలుస్తుంది.

**తే. 'పానకం బతిథుల కిడ్డ దానుగ్రోలి**
**యర్చనా దత్త చందన చర్చ దేలి**
**విరులు సిగ దాల్చి కర్పూర వీటి, జౌరు**
**కొట్టుచు ద్విజుండు వెన్నెల బిట్టుగాయ'** *(2-73)*

**తే. మాత్ర సంచి తలాడగా, మార్గ వేది**
**నొక్కc డార్యలు, గీత లొండొకc డు, దాసు**
**భాషితంబులుగాc దోడి బ్రాహ్మణౌఘ**
**ముబుసు పోకకుc జదువc బరున్నవేళ** *(2-74)*

తిరునాళ్ళ సమయంలో వచ్చినవారికి స్థానికులు రకరకాల సౌకర్యాలు కల్పించడం సహజం. కొందరు వేసవికాలం కనుక వచ్చిన వారికి పానకం పోస్తున్నారు. యాత్రికులు హాయిగా, ఆనందంగా పానకం కావలసినంత అడిగి తృప్తిగా తాగారు. అంతేకాదు వారిచ్చిన చందనాన్ని ఒంటినిండా పూసుకున్నారు. కడుపు చల్లబడింది. దేహోష్ణం చల్లబడింది. ఇంకావారిచ్చిన పూలు సిగలో తురుముకొని హాయి అనుభవించారు. తాను తెచ్చుకొన్న సంచులను తలగడలుగా పెట్టుకొని కొందరు 'ఆర్య'లు పాడితే మరి కొందరు 'గీత'లు అందుకొన్నారని రాయలు వర్ణించాడు.

**రైతు జీవన చిత్రణలో దేశీయత:**

మహారాజైన రాయలు 'రైతును' గుర్తించినవాడు. రైతుజీవనాన్ని అనేక సందర్భాలలో వర్ణించాడు. రైతులు 'ఏతాము' తొక్కేవేళ, కడవ నీటిలో మునిగిపైకి లేస్తుంది. మునిగినప్పుడంతా చప్పుడవుతుంది. ఏతంతొక్కువారు పాడేపాటలకు ఆ చప్పుడు వాద్యధ్వనిలాగా వుందని 'ప్రాతర్వేళల...' (2-55) పద్యంలో రాయలు వర్ణించాడు. అంతేకాదు భార్యా బిడ్డలు చేలకు పోయి కూరగాయలు కోయడం, వారి కాళ్ళకు ముళ్ళు గుచ్చు కోవడం, వారు కాలునొప్పి కారణంగా నిద్రపట్టక బాధపడటాన్ని, 'అంటలు గట్టిచేలకును'(3-33) పద్యంలో వర్ణించాడు ఇవన్నీ సహజ దృశ్యాలు.

రాయలు రాజనీతిని వర్ణించేవేళ రాజధర్మం, రైతుధర్మం ఒకటన్నాడు. సరిహద్దుల నిర్మాణం, రక్షణ, కంటక విచ్ఛేదనం లాగా రాష్ట్రానికి సరిహద్దులు కోటలు. ఆయుధాలతో శత్రునిర్మూలనం లాంటివి రాయలు ఒక (4-279) పద్యంలో ఇలా వర్ణించాడు. పొలాల్లో పనిచేసేవారు అంబలితాగడం సహజం. పొలంలో కావలికాసే తమభర్తలకు స్త్రీలు అంబలిపాత్రల్ని బుట్టలో పెట్టుకొని పోతున్నారని జొన్న, సజ్జ, గోధుమ,పిసికిళ్ళు తినేవారని నాల్గవ ఆశ్వాసంలోని 'వసతుల్వేల్పడి...' (4-133) అనే పద్యంలో వర్ణించాడు.

ప్రాచీన కాలంలో నైష్ఠికులు తీర్థయాత్ర నిమిత్తం విభిన్న ప్రదేశాలకు వెళ్ళేవారు. దారిలో తమకు సరిపడే చోట 'సాపాటు' ముగించేవారు. భిన్నదేశీయులు కనుక భాషకు సంబంధించిన ఇబ్బందులున్నాయి ఆనాటికి 'సంస్కృతమే' అందరికీ మాధ్యమ భాష. ఆ కారణం వల్లనే విష్ణుచిత్తుడు వైష్ణవులను అర్థిస్తూ', అభ్యర్థిస్తూ రాత్రివేళ 'నాస్తి శాక బహుతా, నాస్త్యుష్ణతా', 'నాస్త్యపూపః', 'కృపయా భోక్తవ్యం' (కూరలు ఎక్కువలేవు. వంట వేడిగా లేదు. పణ్యారాలులేవు దయతో ఆరగించండి.) అన్నాడు. కంచి ఉపచారంలాగా ఇదికూడా దేశీయతమే. పైవాక్యాలన్నీ సంస్కృతంలోనే ఉన్నాయి.

**బాటసారుల భాషణ:**

సాధారణంగా రైళ్ళల్లో, బస్సుల్లో లేదా వానలు కురిసేవేళ ఒకచోట ఆగి జనాలు పరస్పరం తమ అనుభవాలను ప్రకటిస్తూ రాజరికంగురించి తమ అభిప్రాయాలు వెలిపుచ్చడం సహజం.రాయలు వర్షఋతువర్ణనలో ఈ అంశాన్ని జోడించాడు.

**చ॥ "రయమున వృష్టికై యొదిగి రచ్చలపై, విధియింతు రుగ్రతన్**
**హయపతి మీద దంతిపతి నాతనిపై నృపతిం గజాదిని**
**ర్ణయముల మొత్తులాడుదురు, ప్రబ్బొక యింతయు విప్ప విచ్చుమొ**
**గ్గయి మఱి పొల్సిపోదురు సమస్త దిశాగతులైన యధ్వగుల్"**

**(4-131)**

'హయపతి' గొప్పవాడంటారట కొందరు. కాదుకాదు 'దంతపతి' గొప్ప అంటారు మరికొందరు. కానేకాదు 'నృపతే' గొప్ప సందేహం లేదంటారు ఇంకొందరు ఈ విధంగా వాదించుకుంటూ వానచినుకులు తగ్గడంచూసి తలోదారికి తరలివెళతారని ఆ పద్య భావం. ప్రజలకుగల రాజకీయ ఆసక్తి నాటికీ నేటికీ సమానమే ఇలాగే దేశీయతకు మరొక ఉదాహరణ ఇల్లాండ్ర అగచాట్లు.

'వందనలయదు వేవురు వచ్చిరేని' అని పెద్దన తన గృహిణిపేరు చెప్పకుండా వర్ణించి ఊరకున్నాడు కాని ఆ గృహిణుల కష్టాలను రాయలవారు గుర్తించి గ్రంథస్థం చేశాడు... వర్షాకాలంలో గృహిణుల అవస్థలెన్నో, ఇల్లిల్లు తిరిగినా ఇంత నిప్పుపుట్టదు. ఒక వేళ దొరికినా పూరిగుడిసె. గడ్డివేసినా రాజుకొనదు. రాజుకొన్నా రవులుకొనదు. రవులుకొన్నా కూడు ఉడకదు. ఉడికినా కూరలు వుడకవు. దట్టమైన పొగవలన భోజనం సమకూడదు. ఆ భోజనమే పెట్టినా ముందు ఆరగించే పురుషులకే సరిపోతుంది. నెయ్యి, గుడ్డలు, ఇంటివాసాలు వేసి మంటలతో వండడం తప్పనిసరి.

ఇతరుల ఇండ్లలోకంటె అగ్రజాతులలో గృహిణులకు వంట వార్పులలో అలాగే ఇంటివ్యవహారాలలో భర్తలు సాయపడడం కాసంత ఎక్కువ అనాలి. ఇంచుమించు ఆ అంశమే పెరియాళ్వార్‌లో కనిపిస్తుంది. అంతేకాదు శనివారం తలంటు పోసుకోవడానికి తైర్థికులకు తగిన వస్తు సముదాయం ఇవ్వడాన్ని రాయలు వర్ణించాడు. తమిళంలో 'శనినీరాడు' శనివారం అభ్యంగస్నానం చేయాలనే సూక్తి ప్రసిద్ధం. రామానుజవైష్ణవం తమిళనాడులో పుట్టింది గనుక ఈ 'దేశీయత'ను కూడా రాయలవారు మరువక 'కదళగభీర' అనే పద్యంలో 'శనివారమున్ పరదేశి వైష్ణవుల్' అనడం గమనింపదగిన అంశం.

**మందు పెట్టే ఆచారం ఇది మణిదేశీయత:**

ఇతరులు తాము చెప్పే మాటలనే వినాలని, తమచేతి కీలుబొమ్మగా చేసుకోవాలని తలంచి కొందరు ఇతరులకు మందు పెడతారనే విశ్వాసం ప్రజలలో వుంది. దానినే 'మర్లుమందు' పెట్టడం అంటారు. మర్లు (మరుల) తీగను తొక్కినా తమను తాము మరచిపోతారనే అంశాన్ని రాయలు 'మాలదాసరి కథ'లో వర్ణించాడు. మాలదాసరి తెల్లవారు జామున లేచి గుడికై బయలుదేరి దారిలో మరులు తీగను తొక్కడం వల్ల దారితప్పి తిరిగాడట. ఇది దేశీయత.

రాయలు మాలదాసరి కథలో దాసరి చండాలికను మీటిన సందర్భంలో, డోలు, మౌరి, భేరి, గుమ్మెట, తమ్మెటంబు, డక్క, డక్కి, చక్కి, చుయ్యంకి లోనగు అసంఖ్యాక వాదిత్ర, త్రితయ, పరంపరలు, వెలచు అని మూడు రకాల వాద్యాలను సూక్ష్మ పరిశీలనతో స్పష్టం చేశాడు. ఇది దేశీయత. రాయలు సంగీతరహస్యాలు తెలిసినవాడు. వీణావాద్య విద్యను 5 సంవత్సరాలు నేర్చుకొన్నాడని ఆధారాలున్నాయి.

**గ్రామాంతరాలకు వెళ్ళేవేళ నైష్ఠికుల ప్రవృత్తి :**

వైష్ణవులు నిష్ఠాగరిష్ఠులయినవారు ఇతరులలాగా ఏదిపడితే దాన్ని, ఎక్కడపడితే అక్కడ తినరు. వారి 'సరంజామా' పెద్దది. జాగ్రత్త వారి లక్షణం. రాయలు విష్ణుచిత్తుని మధుర యాత్రను వర్ణించే వేళ ఈ అంశాన్ని కూడా వర్ణించాడు. తమిళనాడుకు సంబంధించిన ఆహారపదార్థాల ఉల్లేఖనం ఆశ్చర్యం.

**సీ॥ "భక్తి ద్రోవకు సాధ్వి పరికరంబులు వెట్టి**
**కట్టిన పొరివిళంగాయ గమియు**
**నెసటి పోతలు గాగ నేర్పరించిన చిరం**
**తనపు శాలిక్షేమ తండులములు**
**వడి బెట్టిలో జెఱకడము సాబాలూన్ప**
**జెలగు సంబారంపు జింతపండు**

**గీ॥ పెల్లు లోహండి కావళ్ళ కొమ్ముల వ్రేలు**
**గిడ్డిమొత్తపు నేతిలడ్డిగలును**
**పెరుగు వడియంబులును, బచ్చివరుగు, బేడ**
**లురుత రాచ్యుత పూజోపకరణ పేటి**

శ్రీవైష్ణవులు ఏది మరచినా నిత్యపూజలకు అవసరమయ్యే పూజలపేటిని మరవరనడం సత్యం. శ్రీ వైష్ణవులకు సేవచేసేవారు 'సాతానులు', ఆ సాతానికులం బలిసిరాగా విధినిషేధాలు పాటిస్తూ మధురకు విష్ణుచిత్తుడు కదిలాడు. ఇప్పటికీ సాతానులు శ్రీవైష్ణవ కైంకర్యపరులే.

**వైద్య సంబంధి విశేషాలు :**

రాయలు ఆముక్తమాల్యద 5వ ఆశ్వాసంలో 'మంత్రసాని బొడ్డు గోసిన కొడవలి వోలె' అనే పద్యంలో శస్త్ర చికిత్స ప్రస్తావించాడు. కొంగలాగా వంకరగా వున్న కత్తితో భుజాలు చీరినపుడు అంటుకొనేలా వైద్యుడు కుట్లు వేస్తాడని 7వ ఆశ్వాసంలోని 21వ పద్యం వర్ణించింది.

ఎర్రగా కాల్చి శుభ్రం చేసి ఉపయోగించిన కత్తివల్ల ధనుర్వాతం లాంటివి రావని వారికి తెలుసు. ఇది వైద్య సంబంధి దేశీయతాంశం. ఇంతేగాక ఆహారసంబంధి విశేషాలలో కూడా ఆరోగ్య రహస్యాలు కనిపిస్తాయి. అందుకే వేసవికాలంలో సామాన్య ప్రజలు కూడా చందనపు పూతతో ప్రకాశిస్తారు. తెల్లని కొద్దిపాటి వేడిగంజి, చెరుకురసం, లేత కొబ్బరి నీళ్ళు, పండ్లు, వడలు, మామిడి పిందెల ఊరగాయలు, పల్చటి మజ్జిగతో ఆరోగ్యసంరక్షణ

చేసుకొంటారని 'తెలినులివెచ్చ' పద్యంలో వర్ణితం. ఈ నియమాలు దేశాన్నిబట్టి, వాతావరణాన్నిబట్టి, అభిరుచులను బట్టి మారుతుంటాయి. అలాగే చలికాలంలో పునుగు వాసనగల పొయ్యిమీద ఉడికిన అన్నాన్ని అప్పుడేదించి, పాయసాన్నాలతో, ఊరగాయలతో చెయ్యి చురుక్కునే వేడిగల నేతితో, ఇవురగాచిన పాలతో, మిరియాలపొడి చల్లిన కూరలతో, నాసికా జాడ్యం హరించే ఔషధ గుణాలుగల పదార్థాలతో వడ్డిస్తారని 'పునుగుందావి' (1-82) పద్యంలో వర్ణించాడు. వర్ణించిన మాంసాహార విశేషాలు (2-68) విశదీకరించడం సబబుకాదని వదిలేస్తున్నా. రాయల కాలంలో 70 రకాల భోజన పదార్థాలు ఆరగించే వారనడం సారాంశం. ఇవన్నీ ఇతరత్ర కనిపించని దేశీయతాముద్ర కలవి.

ఈలాగే రెడ్ల భోజనాన్ని 'గురుగుంజెంచలి' (4-134) పద్యంలో రాయలు వర్ణించాడు. వర్షాకాలంలో రెడ్లు గురుగాకు, చెంచలి ఆకు, తుమ్మిఆకు, లేతతగిరాకు మొదలయిన వాటిని చిగురుతో కలిపి నూనెలో ఇంగువ కూరి చేసి, వేడిగా వుండే బియ్యపు అన్నాన్ని తృప్తిగా భుజించేవారట. ఈ రెడ్లు 'అరవరెడ్లు' కావచ్చు.

**తదీయారాధన:**

వైష్ణవులకు 'తదీయారాధన' చాలా ప్రధానం. అతిథిసేవ, ద్రావిడ ప్రబంధ పారాయణం, గోష్ఠి మొదలైనవి ఇందులో ప్రధానం. విష్ణుచిత్తుని ఇంట ఎపుడూ 'నాగేంద్రశయాను' పుణ్యకథలు, దివ్య ప్రబంధాను సంధానం అతిథుల కుపచారంగా ఉంటాయి. ఈ సపర్యలు విష్ణుచిత్తునికేకాదు భాగవతులకు అప్పురి భాగవతులు చేసే అతిథి సపర్యలు.

**ఆచార సంప్రదాయాలు:**

ఆముక్తమాల్యద కల్యాణాంతకావ్యం. శ్రీరంగనాథుడు 'గోదాదేవిని' మాయంచేయగా విష్ణుచిత్తుడు వగచినాడు. అబ్రహ్మణ్యమన్నాడు. 'నాకు బాసటగా నలిచే భాగవతులు లేరా! అనివగచినాడు. 'పరుల వంకలు వారిడొంకలు సరిదిద్దవశమా!' అని అధిక్షేపిస్తే స్వామి కరుణించి 'గోద' ఇంటిలోనే వున్నదికదా! అని చెప్పగా ఇంట్లో కూతురుని చూచి సంతసించాడు. ఆపై రంగశాయి గోదాదేవిని తనకిమ్మని బ్రహ్మరుద్రాదులను పంపగా విష్ణుచిత్తుడు సంతోషించి శ్రీవిల్లిపుత్తూరున కల్యాణం జరిపినాడు. ఈ కల్యాణ వర్ణనలో 'దేశీయత'ను. రాయలు పాటించాడు. అమ్మాయి ఇంట పెళ్ళిజరగడం ఆనాటి సంప్రదాయం ఆ వివాహపు తంతులో సుగీతాలు, పవిత్రమంగళ స్నానం, అలంకరణ, మధుపర్కం, సప్తపదులు, అరుంధతీదర్శనం, ఉడుగరల సమర్పణాదులను రాయలు వర్ణించాడు.

కథావస్తువు ఎంపికలోను, వర్ణనలలోను, ఆచార సంప్రదాయ పాలనలోనూ, దేశీయతను పాటించిన రాయలు భాషా విషయంలో మాత్రం కరకుశైలిలోనే కథను నడపడం చిత్రం! భాషలో దేశీయత లేకున్నా భావంలో దేశీయతను చూపిన రాజకవి కృష్ణదేవరాయలు.

గురుశిష్యుల మాటల్లో

"శ్రీకృష్ణదేవరాయలు వ్రాసిన 'ఆముక్తమాల్యద' గ్రంథం ఆంధ్రభాషకు బనారసు పట్టుచీర. దాని నిండా బంగారపు పువ్వులే" అని విశ్వనాథ వారు అంటే వారి శిష్యులు తుమ్మపూడి కోటీశ్వరరావు గారు "ఒక పరమహంస- ఒక రమణమహర్షి - ఒక షిరిడి బాబా ఉన్నప్పుడు ఆ గ్రామాలు, నగరాలు, మహత్యం అక్కడి మానవజీవితాలకు వారు కేంద్ర బిందువులుగా ప్రతిజీవిత వ్యావృతిలో వారి మహత్తే పరిమళించింది. అలావుంది (విల్లి పుత్తూరు) ఆ ఊరు" అన్నారు.




ఆచార్య కోసూరి దామోదర నాయుడు
తెలుగు అధ్యయన శాఖ
శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం,
తిరుపతి
ఫోన్ : 9441645601

# దేవాసురయుద్ధం

– సాయి పాపినేని, జయశ్రీ నాయని

గత సంచికలో తొలి హరప్పా యుగారంభంలో ఐక్ష్వాకుల రాజ్యవిస్తరణ ప్రక్రియని పురాతత్వ కోట్డిజి సంస్కృతి నేపథ్యంలో పరిశీలించాం. భౌగోళికంగా సుమారు 5 లక్షల చదరపు కిలోమీటర్లు, ప్రపంచంలోనే అతిపెద్ద పురాతత్వ సాంస్కృతిక స్తరంగా విస్తరించిన కోట్‌దిజి సంస్కృతిలో, సామాన్యుల జీవన విధానంలో చెప్పుకోదగ్గ ప్రగతి కనుపించదు. ఉత్పత్తులు, ఎగుమతులు పెరిగినా వాటికి తగిన ప్రతిఫలం కింది వర్గాల ప్రజలకు అందలేదని అనుమానించక తప్పదు. అసురుల అసమాన వాణిజ్య వ్యవస్థ దీనికి ముఖ్యకారణం.

క్రీపూ. 2900 నాటికి స్థానిక మేధావి వర్గంలో ఈ వ్యవస్థ పట్ల నిరసన ఉద్యమరూపం దాల్చింది. ఆ ఉద్యమానికి నడుంకట్టిన ప్రజాసమూహం తమని తాము దేవుళ్ళు (దివి వాస్తవ్యులు), అంటే స్థానికులుగా పిలుచుకొన్నారు. వారి నాయక స్థానంలో ధ్వజ చిహ్నంగా ఒక కొత్త శక్తి ఉదయించింది. అనాటి సమకాలీన మెసొపొటేమియాలోని 'మర్డుక్' వలెనే ఇతడు కూడా ఒక కొత్త దేవుడు. సుమేరియా తొలి సంప్రదాయంలోని 'అను', 'ఎల్' వంటి దైవాలు, మన సంప్రదాయంలో వరుణుడు, ద్యుస్సుల వలె పితృ చిహ్నాలైతే, 'మర్డుక్', 'బాల్' వంటి కొత్తతరానికి చెందిన దైవాలు 'దేవుని కుమారులు' (Sons of God). ప్రాచీన నాగరికతలన్నింటిలో ఈ కొత్తతరం దైవాలు, యుద్ధానికి, వీరత్వానికి చిహ్నాలుగా నిలిచారు. మన సంప్రదాయంలో అగ్ని (సూర్యుడు), ఇంద్రుడు, ఆదిత్యులు, స్కంధుడు అదే కోవకి చెందుతారు. వేదవాఙ్మయంలో దాదాపు ముప్పాతిక వంతు ఈ కోవకు చెందిన దేవుళ్లకే కేటాయించబడింది. ఇది ప్రాచీన నాగరికతలో సంభవించిన అతిముఖ్య పరిణామాన్ని సూచిస్తుంది.

వేదాల్లో ఇంద్రునికి విరోధులైన అసురులతో బాటు, దాస, దశ్యు, పణ్య మొదలైన జాతినామాలు ప్రముఖంగా కనిపిస్తాయి. ముందు సంచికల్లో అమ్రీ సంస్కృతిని అసురుల ఆధిపత్యానికి కేంద్రంగా ఊహించడం జరిగింది. వాఙ్మయంలోని ఆధారాలతో తొలి హరప్పాయుగంలోని అమ్రీ సంస్కృతి ప్రాంతంలోని సామాజిక నేపథ్యాన్ని మరోసారి పరిశీలించడం అవసరం. మ్యాక్స్ మ్యూల్లర్ వంటి చరిత్రకారులు, దానదశ్యులను, ఆర్యుల దండయాత్రల్లో అణిచివేయబడ్డ స్థానిక జనజాతులుగా సిద్ధాంతీకరించారు. ఆర్యుల దండయాత్ర అనే సిద్ధాంతం అవాస్తవమైనా, వారి సూచనలో కొంత నిజం లేకపోలేదు. ఇంద్రుని నాయకత్వంలోని దేవతల దాడులకు బలియైన వారిలో దానులు, దశ్యులు అనే జనజాతులు ముఖ్యమైనవిగా వాఙ్మయం కోడైకూస్తుంది. మరి ఈ దాసదశ్యులు ఎవరు? వీరికీ అసురులకూ ఉన్న సంబంధం ఏమిటి? వాఙ్మయంలో ఈ ప్రశ్నలకు పూర్తి సమాధానాలు దొరకవు. కానీ కొన్ని ఊహలకు అవకాశం ఉంది. ఉదాహరణకి, ఋగ్వేదంలోని ఆరవ మండలంలోని (VI.10..4-13) సూక్తం, ఇంద్రునిచే వధించబడ్డ అనేకమంది దానదశ్యుల పేర్లను వివరిస్తుంది. వీరందరినీ సాయనాచార్యుడు అసురులుగా సంబోధించాడు. ఋ. V.29.9 లోని 'దశ్యూనసురాన్' అనే పదబంధానికి భాష్యం చెబుతూ 'దశ్యులే అసురులని' తీర్మానించాడు. మహాభారత కాలానికి దశ్యు, దాస అనే పదాలు 'అసుర' పదానికి పర్యాయాలుగా వాడబడ్డాయి. ఋగ్వేదంలో దాస దశ్యులుగా పిలువబడ్డ అసురుల పేర్లు కొన్ని పట్టికలో చూడవచ్చు. (పట్టిక) ఇది దాసదశ్యులు అసుర సామాజిక వ్యవస్థలో భాగస్వాములనే ఊహను బలపరుస్తుంది.

**దానులు :** దాస, దాశ పదాలు నదీ పరివాహక ప్రదేశాల్లో నీటిపై ఆధారపడిన జీవన వ్యవస్థను సూచిస్తాయి. నదీజలాలు, పడవలు, బల్లకట్లు, చేపలవేట, ఆనకట్టలు, కాలువలు, సరస్సులు వీరి వర్ణనల్లో ప్రముఖంగా కనిపిస్తాయి. పై పట్టికలోని అసురులను దాసులుగా సంబోధించడం, అసురులకూ, నదీ పరివాహక క్షేత్రానికీ ఉన్న సంబంధాన్ని సూచిస్తుంది. దాసుడు అనే పదానికున్న

| | అసురుడు | దాశుడు | దశ్యుడు |
|---|---|---|---|
| అర్బుద | ✓ | ✓ | |
| ఇలీబిశ | ✓ | ✓ | |
| చుమురి | ✓ | ✓ | ✓ |
| ధుని | ✓ | ✓ | ✓ |
| నముచి | ✓ | ✓ | |
| పిప్రు | ✓ | ✓ | |
| వర్చి | ✓ | ✓ | |
| వృత్ర | ✓ | ✓ | |
| శంబర | ✓ | ✓ | ✓ |
| సుష్ణ | ✓ | ✓ | ✓ |

బానిస లేదా సేవకుడు అనే అర్థంలో, అసురుల పరాజయం తరువాత వారి ఆశ్రిత జాతుల హోదాలో వచ్చిన మార్పును ఊహించవచ్చు.

**దశ్యులు :** భాషా శాస్త్రం ప్రకారం, దశ్యు పదానికి, ఇతర ఇండోయూరోపియన్ భాషల్లోని ద్రక్మ, దచావ్ (Drachma, Dachau) పదాలకూ సామ్యం ఉంది. సంస్కృతంలోని గ్రామ, దమ (ఇల్లు) పదాలకు మూలాలను, దశ్యు పదంలో వెదకవచ్చు. కనుక దశ్యులు అసుర నేపధ్యానికి చెందిన గ్రామీణ వ్యావసాయిక జనజాతులనే ఊహకు అవకాశముంది.

**పణ్యులు :** డి. డి. కోశాంబి వంటి చరిత్రకారులు, నేటి 'వణిజ', 'బనియా' పదాలకు ఫణి లేదా పణ్య పదమే మూలమనే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. బలిజ అనే తెలుగు జాతినామానికి కూడా అదే నిరుక్తార్థం. ఋగ్వేదంలో పణ్యులు వర్తకులుగా, వడ్డీ వ్యాపారులుగా, ధనికులుగా, పిసినారులుగా వర్ణించబడ్డారు. పణం, పెన్నీ (Penny) వంటి నాణాలకూ, పణం (తాకట్టు, జూదంలో ఒడ్డు) పాన్ (Pawn) వంటి పదాలకు కూడా మూలమదే. ప్రాచీన ఐరోపా, మధ్యఆసియా దేశాల్లో, వర్తకానికీ సముద్రయానానికి పేరెన్నికగన్న Phoenician జాతులకు, పణి పదానికి ఉన్న సామ్యం గుర్తించదగినదే. కనుక పణ్యులు వాణిజులుగా, అసుర వ్యవస్థపై ఆధారపడి వారికి సహాయ సహకారాలు అందించిన జనజాతిగా భావించవచ్చు.

పురాణాల్లోని కృత, త్రేతాయుగాల రాజుల కథల్లో ప్రముఖంగా కనిపించే దేవాసుర సంగ్రామాల్లో, పై జాతులు అసురుల పక్షం వహించినట్లు కానవస్తుంది. మన పర్గిటార్ పట్టికలో క్రీపూ 2900 – 2500 మధ్య ఐక్ష్వాకుల చరిత్రల్లో ఈ దేవాసురుల స్పర్థ ముఖ్యాంశం. దీనిలో మూడు నిర్దిష్టమైన పరిణామ దశలు కనిపిస్తాయి.

1) స్థానిక శక్తుల సమీకరణ, అసురుల పరాజయం

2) ప్రాంతీయ తిరుగుబాట్లు, రాజకీయ అనిశ్చిత పరిస్థితి

3) ఐక్ష్వాకుల ఆధిపత్యం, అసురుల వలసలు

దాదాపు ఐదొందల యేళ్లు సాగిన ఈ దేవాసురుల స్పర్థ, వైదిక వాఙ్మయంలోనేగాక. హిందూ సంప్రదాయంలోని అనేక గాథల్లో, అద్భుతాల్లో, అవతారాల్లోనూ, ఆనాటి వాస్తవ చారిత్రక సంఘటనల నేపధ్యంగా కనిపిస్తుంది. ప్రస్తుతం సంస్కృత భాషలో మనకు అందుబాటులో ఉన్న వేదాల సంకలనం, ఆదిపురాణం మహాభారత యుద్ధకాలం అంటే క్రీపూ. 1500 కాలానికి చెందినవి. మిగిలిన వైదిక, ఇతిహాస పురాణ సంప్రదాయం ఆ తరువాత రచింపబడింది. అంటే, కృత త్రేతాయుగాలుగా వర్ణింపబడ్డ కాలంలోని వాస్తవ సంఘటనలకు, మనకి లభిస్తున్న వాఙ్మయంలోని వర్ణనలకూ మధ్య వెయ్యి సంవత్సరాలకు పైగా అంతరం ఉంది. భాషలో, మతంలో, ఆర్థిక సామాజిక వ్యవస్థలో వచ్చిన మార్పుల వల్ల, వ్యక్తుల కథల్లో సంఘటనల వర్ణనల్లో మార్పు చేర్పులు ఉండటం అనివార్యం. కనుక వాఙ్మయమే ఆధారంగా మనం చేసే పరిశీలనలో ఆనాటి వ్యక్తులూ వారి కథలే చరిత్రగా భావించక, ఆ గాథల్లో దాగివున్న నేపథ్యాన్ని, ఆ నేపథ్యంలో ఏర్పడ్డ సామాజిక, రాజకీయ, సంప్రదాయక పరిణామాలపై మాత్రమే దృష్టి పెట్టడం అవసరం.

స్థానిక శక్తుల సమీకరణం, అసురుల పరాజయం

క్రీపూ. 2800 నాటికి అయోధ్యలో ఐక్ష్వాకులు ప్రముఖ రాజకీయ శక్తిగా ఎదిగారు. ఎగువ సరస్వతి మైదానంలోని ప్రతిష్ఠానంలో పౌరవుల ముఖ్య శాఖ ఉంటే, మరో రెండు కాశీ, కన్యాకుబ్జాల్లో స్థానిక రాచరికాలుగా కనిపిస్తాయి. దిగువ సింధు, గుజరాత్ ప్రాంతాల్లో యాదవులవి రెండు




శాఖలు, వీరిలో కోష్టువు సంతతి ముఖ్యమైనదైతే, హైహేయులు మరో శాఖ. అసురులకు ప్రత్యామ్నాయంగా పెరిగేందుకు ఐక్ష్వాకులకు ఈ స్థానిక రాచరికాలను కూడగట్టుకోక తప్పలేదు. ఆనాటి సమకాలీన రాజవంశాల మధ్య వైవాహిక సంబంధాలు, ఐక్ష్వాకులు ఆ దిశలో చేసిన ప్రయత్నాలను ఎత్తిచూపుతాయి. (పటం.)

పురాణాల్లో ప్రసేనజిత్తు (క్రీపూ. 2828) కుమారుడు యువనాశ్వుడి భార్య పేరు గౌరి, వారి కుమారుడు మాంధాత. పౌరవ వంశంలో మతినారుడి కుమార్తె గౌరియే మాంధాత తల్లి. ఇది పౌరవుల ముఖ్య శాఖకి, ఐక్ష్వాకులకూ మధ్య రాజకీయ సమీకరణాలను తెలుపుతుంది. యాదవుల్లో చిత్రరథుని కుమారుడు శశబిందు కుమార్తె, బిందుమతి, మాంధాత భార్య అని సంప్రదాయం. అంటే తరువాతి తరంలో ఐక్ష్వాకులు యాదవులతో బాంధవ్యం నెరపారని తెలుస్తుంది. అంతేగాక కన్యాకుబ్జులలో జహ్నువు అనే రాజు, యౌవనాశ్వుని (మాంధాత) మనుమరాలు, అంటే పురుకుత్సుని కుమార్తెను పెండ్లాడాడు. దేవాసురయుద్ధంలో మొదటి ఘట్టం – శుష్ణ, శంబరుల వృత్తాంతం పురుకుత్సుని కాలంలో (క్రీపూ. 2750) సంభవించింది. ఋగ్వేదంలో ఇంద్రుడు కుత్సుని కొరకు శుష్ణుడిని, దివోదాసుని కొరకు శంబరుడినీ సంహరించాడని నిర్ద్వంద్వంగా చెప్పబడింది. కనుక ఈ వైవాహిక సంబంధాలతో ఒనగూడిన రాజకీయ సమీకరణాలను, అసురులపై స్థానిక శక్తుల తిరుగుబాటు ప్రక్రియలో భాగంగా ఊహించవచ్చు.

ఈ రాజకీయ సమీకరణాలకు తోడుగా సంప్రదాయక వర్గాల్లో కూడా అసురుల పట్ల తిరుగుబాటు ధోరణిని సూచించే ఇతివృత్తాలు, సాహిత్యంలో కనిపిస్తాయి. సాంప్రదాయకంగా పౌరవుల పురోహితులైన ఆంగీరసులు, ఐక్ష్వాకుల పురోహితులైన వాశిష్టుల తోడుగా నిలిచారనేందుకు వాఙ్మయంలో ఆధారాలు ఉన్నాయి. మరోముఖ్యమైన పరిణామం, అసురుల పురోహితులైన భార్గవుల తిరుగుబాటు. కావ్య ఉశానుడు ఇంద్రునికి వజ్రాయుధం నిర్మించిన వృత్తాంతంలో, అసురులకు వ్యతిరేకంగా, భార్గవ ఋషులను చూస్తాం. కవి, ఉశానులు భార్గవులు, అసుర గురువులైన శుక్రాచార్యుని సంతతికి చెందినవారు. ఈ యుద్ధానికి కాశీ లేదా వారణాశి కేంద్రంగా కనిపిస్తుంది. క్షత్రియ సంప్రదాయంలోని కాశేయుల వృత్తాంతాలు ఆనాటి రాజకీయాల్లో నెలకొన్న ఆటుపోట్లను సూచిస్తాయి.

ప్రాంతీయ తిరుగుబాట్లు, రాజకీయ అనిశ్చిత స్థితి

తొలి తరాల్లో కాశీని పాలించిన రాజులు పౌరవులుగా కాక వారి దాయాదులుగా చెప్పుకొన్నట్లు తోస్తుంది. ఈ వంశానికి కశుడు (క్రీపూ. 2900) మూలపురుషుడు. అతడి పేరున నిర్మించబడ్డ నగరానికి కాశి అని పేరువచ్చింది. ఈ తేదీ మొహెంజొదారో తొలిదశను సూచించడం, ప్రాచీన మొహెంజొదారో నగరమే కాశీ అనే వాదనను బలపరుస్తుంది. కాశేయుల్లో ముఖ్యుడు దివోదాసుడు, పురుకుత్సుని సమకాలీనుడు (క్రీపూ. 2750). శంబరాసురునిపై విజయంలో ఇతడికి పురుకుత్సుని సహాయ సహకారాలు అందాయి. శంబరుని నూరు పురాలపై (గ్రామాలు?) దివోదాసుడి గెలుపు దిగువ సరస్వతీ మైదానంలో మొహెంజొదారో ఆధిపత్యాన్ని సూచిస్తే, శుష్ణుని కదిలే నగరంపై (చరిష్ణు) కుత్సుని విజయం, అసురుల నౌకాదళంపై స్థానిక శక్తుల గెలుపుగా ఊహించాలి.

అయితే కాశేయుల ఆధిపత్యం ఎంతోకాలం సాగలేదు. అసురుల పరాజయంతో ఏర్పడిన శూన్యతలో మరో కొత్త శక్తి పుట్టుకొచ్చింది. క్షేమకుడనే పుణ్యజన రాక్షసుల నాయకుని సహకారంతో, యాదవుల్లోని ఒక శాఖయైన హైహేయులు, దివోదాసుని పారద్రోలి కాశీపై ఆధిపత్యం సాధిస్తారు. రామాయణంలో బ్రహ్మ సముద్రజలాల రక్షణకై రాక్షసులను ప్రత్యేకంగా సృజించాడని చెప్పబడింది. 'పుణ్యజన రాక్షస' పదబంధంలో ప్యూనిక్ జాతులకు చెందిన నావికదళం అనే అర్థం ఊహించవచ్చు. పాణిని అష్టాధ్యాయిలో రాక్షసులను మూరదేవ, మూఢదేవ అనే పేర్లతో సంబోధించాడు. మూఢ, మూర్ధ పదాలు, రాక్షసులకు అనాటి మెసొపొటేమియాలో ప్రాముఖ్యం ఉన్న 'మర్దుక్'




సంప్రదాయంతో సంబంధాన్ని సూచిస్తాయి. అసురులపై యుద్ధం శ్రమదోపిడీ వ్యవస్థపై స్థానికుల తిరుగుబాటు అనుకుంటే, హైహేయులకు రాక్షసుల సహకారం, వలసవాదుల ప్రతిచర్యగా భావించవచ్చు.

దివోదాసుని తరువాతి తరంతో కాశేయుల వంశం అంతరిస్తుంది. విదేహ వంశావళిలో కూడా ఈ కాలంలో తరాల మధ్య కొంత ఎడం కనబడుతుంది. పురుకుత్సుని కొడుకు త్రాసదశ్యుని (క్రీపూ. 2738) తరువాత త్రిశంకుని (క్రీపూ. 2600) వరకూ ఎనిమిది తరాల ఐక్ష్వాకుల్లో కూడా ప్రముఖులు కనపడరు. అంతేగాక త్రిశంకుడు, హరిశ్చంద్రుడు, రోహితాశ్యుల కథల్లో అంతర్లీనంగా వినిపించే 'రాజ్యం కోల్పోవడం', 'దేశబహిష్కారం' వంటి ఇతివృత్తాలు హైహేయుల ఆధిపత్యాన్ని, ఐక్ష్వాకుల బలహీనతనూ సూచిస్తాయి. ఈ హైహేయులలో ముఖ్యుడు కార్తవీర్యార్జునుడు (క్రీపూ. 2600). హైహేయుల ఆధిపత్యంపై ప్రతిఘటనలో ఆనాటి సాంప్రదాయక వర్గాలకు చెందిన విశ్వామిత్రుడు, భార్గవులలో ఔర్వుడు, జమదగ్ని, పరశురాముల పాత్ర ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. (పటం.)

హైహేయుల పతనంతో ఏర్పడిన ఐక్ష్వాకుల ఆధిపత్యం, నాగరికత ఉత్కృష్ట దశకి నాంది పలికింది. పురాతత్వ శాస్త్రం చూపే పరిణత హరప్పాయుగం, సంప్రదాయంలోని త్రేతాయుగాలు (క్రీపూ. 2600 - 2000) సామాన్య నాగరికుల జీవన వ్యవస్థలో వచ్చిన అద్వితీయమైన అభివృద్ధికి అద్దంపడతాయి. ఇది అసుర వ్యవస్థ అంతాన్ని, స్థానిక పాలనలో మెరుగైన ఉత్పత్తి-ప్రతిఫలాల నిష్పత్తిని సూచిస్తుంది.

**ఐక్ష్వాకుల ఆధిపత్యం, అసురుల వలసలు :**

భారతీయ ఇతిహాసపురాణ వాఙ్మయంలో దేవాసురయుద్ధాలు, ఆధునిక ప్రపంచమంతటా, వలసరాజ్యాల్లో స్వాతంత్రం కోసం స్థానికుల తిరుగుబాట్లను తలపిస్తుంది. వైదిక వాఙ్మయంలోని యుద్ధ షడ్యంత్ర వర్ణనలు మోసపూరితమైన దేవతల వ్యూహాలను తలపిస్తాయి. దేవతల విజయాల్లో అగ్ని పాత్ర, నదుల కరకట్టలూ ఆనకట్టలు తెంచడం (నముచి, వృత్రాసుర వధ) వంటి విద్రోహ చర్యల్లో, దేవతల వ్యూహాలకూ, నేటి గెరిల్లా యుద్ధరచనకూ పోలిక అనివార్యం. జొరాస్ట్రియన్ సంప్రదాయం (జెండ్ అవెస్తా) కూడా అహుర మజ్దాకు, దేవతల (Daeva) నాయకుడు ఆంగ్రమైన్యుకు మధ్య యుద్ధం వారెణ అనబడే ప్రాంతంలో జరిగిందని, అందులో దేవతలు మోసంతో జయించారనీ చెప్తుంది.

ఋగ్వేదంలోని ప్రసక్తుల్లో శుష్ణ, శంబరులు, ఇలీబిశు డనే అసుర రాజుకు సమకాలీనులుగా కనిపిస్తారు. వీరందరూ ఒకే సమయంలో పరాజయం పాలయ్యారు. పట్టికల్లోని తేదీలను బట్టి పురుకుత్సుని కాలంలో (క్రీపూ. 2775-50) అసురుల ఆధిపత్యానికి తిరుగులేని దెబ్బ తగిలినట్లు భావించాలి. పరశురాముని వృత్తాంతం, హైహేయుల పతనం (క్రీపూ. 2600) ఈ తిరుగుబాటు బాటలో మరో ముఖ్యఘట్టం. దాదాపు మూడు శతాబ్దాలు సాగిన ఈ ఉద్యమానికి క్లైమాక్స్ సగరుని (క్రీపూ. 2400) కాలానికి చెందింది. నముచి, వృత్రాసురులపై ఇంద్రుని విజయం, సింధ్, గుజరాత్ సాగరంపై పరిణత హరప్పా



సంస్కృతి విస్తరణ, ఇరాన్ పీఠభూమిలో, గంగా మైదానంలో కనిపించే మొట్టమొదటి హరప్పా స్థావరాలు సగరుని దిగ్విజయం అనే అంశంలో చూడవచ్చు. (పటం). అదే నాణానికి మరోపక్క అసురుల పరాజయం, వారి వలసల క్రమంలో మధ్యఆసియా ఈజిప్ట్‌ల వరకూ విస్తరించిన ఇండోఆర్యన్ సంస్కృతుల, రాచరికాల మూలాలు కనిపిస్తాయి. వీటిని త్వరలో పరిశీలిద్దాం.

**ముగింపు :**

సగరుని సమకాలీనుల చరిత్రలో, వైశాలిలో తుర్వసుల రాజ్యస్థాపన, దుష్యంతుని వృత్తాంతంలో భరతవంశపు తొలి రాచరికం వంటి ఇతివృత్తాలు ఎగువ గంగా మైదానానికి హరప్పా నాగరికత విస్తరణను సూచిస్తే, యాదవుల్లో భీమ, విదర్భ వంటి పేర్లలో, వింధ్యపర్వత ప్రాంతంలో క్రీపూ 2400 ప్రాంతంలో పుట్టిన హరప్పా స్థావరాల మూలాలను వెదకొచ్చు. మక్రాన్ తీరంలో, కచ్, కొంకణ్, సౌరాష్ట్ర తీరాల్లో కొత్తగా వెలసిన పరిణత హరప్పా రేవు పట్టణాలు సాగరంపై సగరుని ఆధిపత్యాన్ని సూచిస్తాయి. క్రీపూ. 2600లో 5 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో కనిపించే భారతీయ కాంశ్యయుగ నాగరికత, క్రీపూ. 2400 నాటికి దాదాపు రెట్టింపై 9 లక్షల చదరపు కిలోమీటర్లకు విస్తరించింది. బాబిలోనియా ఫలకాల్లోని ఎన్మెర్కర్ కథలో అరట్ట రాజు అల్ సుగ్యుర్ (సగరుడు) సుమేరియా నగరాలను కప్పం కట్టమని ఆదేశించే వృత్తాంతం, మధ్య ఆసియాపై ఐక్ష్వాకుల ప్రభావాన్ని సూచిస్తుంది. పురాతత్వ శాస్త్రరీత్యా కూడా హరప్పా నాగరికతా క్షేత్రానికి వెలుపల ఇరాన్ పీఠభూమిలో, మధ్య ఆసియాలో ప్రత్యక్షమైన హరప్పా నాగరికతకు చెందిన వర్తక కేంద్రాలు, వాణిజ్యరంగంలో భారతీయుల వలస వ్యవస్థను సమర్ధిస్తాయి. భారతీయ ఇతిహాసంలో అత్యంత ఉత్కృష్టమైన త్రేతాయుగానికి చెందిన క్షత్రియ వంశానుక్రమణికల్లోని వివరాలు వచ్చే సంచికలో చూద్దాం.

# త్రేతాయుగం

పురాణాల్లోని సూచనల ఆధారంగా భారత ఉపఖండ పురాచరిత్రలో అత్యంత ఉత్కృష్ట దశయైన పరిణత హరప్పా నాగరికతని, వాఙ్మయంలో రామరాజ్యంగా పేరుగాంచిన త్రేతాయుగంగా నిరూపించడం జరిగింది. క్షత్రియ సంప్రదాయంలో ఐక్ష్వాకులలో హరిశ్చంద్రుని నుండి శ్రీరాముని వరకూ త్రేతాయుగానికి చెందిన 30 తరాల రాజులున్నారు. ఈ రాజుల చరిత్రల్లో, సమకాలీన ఋషుల చరిత్రల్లో అనేక భౌగోళిక, సామాజిక వాస్తవాలు దాగివున్నాయి. హైహేయుల పతనానికి కారకులైన భార్గవుల తిరుగుబాటులో కూడా విశ్వామిత్రుని ప్రమేయం ఊహించవచ్చు. విశ్వామిత్రుని తోబుట్టువు సత్యవతి జమదగ్నికి తల్లి. పరశురాముడి పూర్వులకి భార్గవుడని పిలువబడ్డ వశిష్టుని కంటే, విశ్వామిత్రునితో బాంధవ్యమే ఎక్కువ. ఐక్ష్వాకుల చరిత్రలో తదుపరి ఘట్టం సగరుని (క్రీపూ. 2430) దిగ్విజయంలో కూడా ఔర్వుల (పరశు రాముని సంతతి) సహకారమే ప్రముఖంగా కనిపిస్తుంది. హైహేయుల పతనానికి కారణమైన 'హయముఖం' అనే ఆగ్నేయాస్త్రాన్ని సగరుడు వీరినుంచే పొందాడని కథ. సగరుని కాలంలో దుష్యంతుని ద్వారా భరతవంశ స్థాపన, విశ్వామిత్రుని ఉనికిని సరస్వతీ ఎగువ మైదానాలలో చూపుతుంది.

పరిణత హరప్పాయుగానికి చెందిన నేపథ్యాన్ని, వాఙ్మయంలో విస్తృతంగా వివరించబడ్డ నాలుగు ఇతివృత్తాల ద్వారా, వంశానుక్రమణికలూ, పురాతత్వ పరిశోధనల్లో వెల్లడైన అధారాలతో పరిశీలిద్దాం. ముందుగా విశ్వామిత్ర, సగరుల చరిత్రల్లో ఆనాటి నదీ పరివాహక క్షేత్రాల్లో వచ్చిన పెనుమార్పులను, సగరుని కాలంలో ప్రారంభమైన భరత వంశపు పుట్టుకను, సంప్రదాయక వర్గాల్లో తదుపరి పరిణామాలను దశరాజ్ఞ యుద్ధ నేపథ్యంలో విశ్లేషిద్దాము.

1) వశిష్ట విశ్వామిత్రుల స్పర్ధ
2) గంగావతరణం
3) దశరాజ్ఞ యుద్ధం
4) విశ్వామిత్రుని యాగరక్షణ

**వశిష్ట విశ్వామిత్రులు :**

ఐక్ష్వాకులలో త్రిశంకుడు (క్రీపూ. 2600) విశ్వామిత్ర

పరంపరను ఆదరించిన మొట్టమొదటి రాజు. త్రేతాయుగారంభంలో విశ్వామిత్రుని ఆగమనానికి కారణంగా త్రిశంకు, హరిశ్చంద్రుల కథల్లో అంతర్లీనంగా ఒక భౌగోళిక ఇతివృత్తం కనిపిస్తుంది. ఇది కన్యాకుబ్జం ప్రాంతంలో వచ్చిన కరువు వృత్తాంతం. పురాణాల్లో విశ్వామిత్రుని భార్య పేరు దృషద్వతి. ఈ అంశం కన్యాకుబ్జం దృషద్వతీ ప్రాంతంలోదని సూచిస్తుంది. దృషద్వతీ తీరంలోని రాఖీగఢి పరిణత హరప్పాయుగానికి చెందిన పెద్ద నగరం. చారిత్రక యుగంలో రాఖీగఢికి 200 మైళ్లు తూర్పున గంగాతీరంలో కనిపించే, కనోజ్ నగర ప్రాంతంలో అప్పటికి హరప్పా నాగరికత విస్తరించలేదు. కనుక త్రేతాయుగంలోని కన్యాకుబ్జాన్ని రాఖీగఢి ప్రాంతంలో ఊహించవచ్చు. దృషద్వతి ఎగువ ప్రవాహం దారిమళ్లి యమునలో కలవడం వల్ల కాన్యాకుబ్జులు సరయూ నదీ ప్రాంతానికి వలసవెళ్లక తప్పలేదు. ఆ కరువుకాలంలో త్రిశంకుడు, పిదప అతడి కొడుకు హరిశ్చంద్రుడు, విశ్వామిత్రుని కుటుంబానికి ఆహారం సమకూర్చి ఆదరించినట్లు విష్ణుపురాణంలో కథనం. ఐక్ష్వాకుల పురోహితుడైన వశిష్టునితో వైరం కూడా అదే కాలానికి చెందుతుంది. మార్కండేయ పురాణంలో, వశిష్ట విశ్వామిత్రుల మధ్య యుద్ధం హరిశ్చంద్రుని కాలంలో జరిగినట్లు చెప్పబడింది.

త్రేతాయుగానికి చెందిన పురాణ ఆఖ్యానాల్లో ఈ నదీ ప్రవాహంలో వచ్చిన మార్పుల గురించి నిర్దిష్టమైన సూచనలున్నాయి. త్రిశంకుడు–విశ్వామిత్రుల కథ, యమున ఎగువ నీటి ప్రవాహంలో వచ్చిన మార్పు, తద్వారా సరస్వతి ఉపనదుల్లో ఒకటైన దృషద్వతి మండలంలో వచ్చిన కరువును గురించి ముందే ప్రస్తావించాము. 'ది లాస్ట్ రివర్' రచయిత మైకెల్ డానినో దృషద్వతి ప్రవాహంలో వచ్చిన ఈ మార్పుకి కారణం యమున ఎగువనీరు తూర్పుకి మళ్లడంగా ఊహించాడు. దృషద్వతీ సరస్వతుల సంగమప్రాంతంలోని కాలిబంగన్ తవ్వకాల్లో క్రీపూ. 2700–2600 మధ్యకాలానికి చెందిన స్థరాల్లో ఆ స్థావరం తాత్కాలికంగా పతనం చెందిన ఆధారాలు లభిస్తాయి. అంతేగాక ఆ ప్రాంతంలో వచ్చిన భూకంపపు చాయలు కూడా కనిపించాయి. అందువల్ల క్రీపూ. 27వ శతాబ్దిలో సరస్వతీ దృషద్వతీ ప్రాంతంలో భూమి ఉపరితలం ఎత్తు పెరగడం ఆ నది ఎండిపోయేందుకు కారణమయిందని నిర్ధారించాడు. మన పర్జిటర్ పట్టికల్లో విశ్వామిత్రుని ఆగమనం (క్రీపూ. 2600) కూడా అదేకాలానికి చెందడం మన పురాణల్లోని చారిత్రక వాస్తవికతని సూచిస్తుంది.

ఈ ప్రాంతానికి ఉత్తరంగా పారే సరస్వతి, సత్లూజ్ నదుల దిశల్లో వచ్చిన మార్పులకు కూడా ఈ ప్రాంతంలో భూమి క్రమేపి మెరకవేయడమే కారణంగా ఊహించవచ్చు. ఈ మార్పులను సూచించే గాథలను పరిశీలిద్దాం. వశిష్టుని ఆత్మహత్యా ప్రయత్నం గురించిన కథ మొదట శతపథబ్రాహ్మణంలో కనిపిస్తుంది. కొన్ని తేడాలతో ఇదే కథ ఐతరేయబ్రాహ్మణంలో, పురాణాల్లోని నదీనదాల చరిత్రల్లో కూడా ఉంది. క్లుప్తంగా చెప్పాలంటే, విశ్వామిత్రునితో వైరం వహించిన వశిష్టుడు, పరుష్ణీ తీరం వదిలి అత్మహత్య ఉద్దేశ్యంతో కాళ్లూ చేతులు కట్టుకొని బియాస్ నదిలో దూకుతాడు. ఆ నది వశిష్టుడి పాశాలను విప్పి అతడిని అవతల ఒడ్డున పడేస్తుంది. పాశాలు విప్పిన నదికి 'విపాశ' అని పేరువచ్చింది. దానితో వశిష్టుడు మరో నదిలో దూకేందుకు ముందుకెళ్లాడు. ఆ నది వశిష్టుని చూసి దూరంగా పోసాగింది. ఈవిధంగా వందమార్లు దూరంగా జరిగిన నదికి 'శతద్రు' అని పేరొచ్చింది. ఈ కథ సత్లూజ్ నది ప్రవాహమార్గంలో వచ్చిన అనేక మార్పులను సూచిస్తుంది. మరోకథ, చంపవస్తున్న విశ్వామిత్రుడి నుంచి సరస్వతి వశిష్టుడిని తప్పించి దూరంగా తనతో తీసుకుపోయిందని చెప్తుంది. ఇది సరస్వతీనది ముఖ్య ప్రవాహంలో వచ్చిన మార్పును సూచిస్తుంది. ఈ రెండు గాథలూ, హరిశ్చంద్రుని కాలంలో వశిష్టవిశ్వామిత్రుల యుద్ధ వృత్తాంతానికి, సుదాసుని కాలంలో విశ్వామిత్రుని చేతిలో వాశిష్టుల హత్య ఉదంతానికి మధ్య జరిగాయి. అంటే సరస్వతీ నదీ మార్గంలో వచ్చిన మార్పులు క్రీపూ 2600 – 2200 మధ్య ఏర్పడ్డ పరిణామాలుగా ఊహించాలి.

**గంగావతరణం :**

బాబిలోనియా ఫలకాల్లోని ఎన్మెర్కర్ (క్రీపూ. 2450–2400) సమకాలీనుడైన, అల్ సగ్యుర్ (సగరుని) వృత్తాంతంలో, నదీదేవత 'ఇనానా' ఆగ్రహం వల్ల అరట్ట రాజ్యంలో అలుముకొన్న క్షామం గురించి ముందు ప్రస్తావించాం. హక్రా, గఘ్గర్ లోయలో భూగర్భ జలాల వనరులపై పరిశోధనలు చేసిన పురాతత్వ పర్యావరణ




శాస్త్రవేత్త 'రైక్స్', క్రీపూ 2500–2400 ప్రాంతంలో నదీప్రవాహ మార్గంలో వచ్చిన మార్పులను గుర్తించాడు. సత్లూజ్ (శతద్రు), చౌతాంగ్ (దృషద్వతి) సరస్వతికి ముఖ్య ఉపనదులని ముందు సంచికల్లో వివరించాము. సగరుని చరిత్రలోని కొన్ని అంశాలు కూడా ఈ సమకాలీన పరిణామాలను సూచిస్తాయి. పురాణాల్లో సగరుని పట్టమహిషి 'కేశిని' యాదవ వంశానికి చెందిన విదర్భుని కూతురు. ఈ వివాహం యాదవుల అధికారంలోని గుజరాత్ మాల్వా ప్రాంతాల్లో సగరుని దిగ్విజయానంతరం జరిగింది. సగరుని జ్యేష్ఠ పుత్రుడు అసమంజసుడు ఇక్ష్వాకు రాజ్యానికి వారసుడు. సగరుని మరో భార్య కశ్యప ప్రజాపతి కూతురు, సుమతి. ఆమె సంతానం 60వేల మంది. కశ్యప ప్రజాపతి కూతురి సంతానమైన ఈ 60వేల మందిని సగరుని సహజ సంతానంగా కాక అతడి ప్రజలుగా ఊహించడం హేతుబద్ధం. కపిలమహర్షి శాపం వల్ల భస్మమయిన వీరిని, అసమంజసుని మనువడైన భగీరథుడు, గంగానదిని భువికి దింపి పునరుద్ధరించడమే, 'గంగావతరణం' కథ. నదీ ప్రవాహాలలో వచ్చిన మార్పువల్ల, సత్లూజ్ నది నీటిని కృత్రిమ పద్ధతుల ద్వారా మళ్లించి శుష్కమైన సరస్వతీ క్షేత్రానికి సాగునీటిని తిరిగి అందించే ప్రయత్నాన్ని ఈ భగీరథప్రయత్నం అనే వృత్తాంతంలో చూడవచ్చు.

ఆధునిక చరిత్రలో 1899లో బికనీర్ ప్రాంతంలో వచ్చిన కరువుకు స్పందించి, బికనీర్ రాజు, గంగాసింగ్ బ్రిటిష్ ఇంజనీర్ AWE Standley సహకారంతో, శ్రీగంగానగర్ ఎగువన ఆనకట్ట నిర్మించి సత్లూజ్ జలాలను హనుమాన్గనథ్ వరకూ (150 కిమీ) కాలువ ద్వారా అందించాడు. పురాచారిత్రక యుగంలో సరస్వతీ నది, సత్లూజ్ నదికి దక్షిణంగా హనుమాన్ఘ1ఢ్, సూరత్ఘగర్ జిల్లాల ద్వారా పాకిస్తాన్లోయని చోలిస్తాన్ ఎడారిలోకి ప్రవహించేది. బికనీర్లో నిర్మించిన ఆనకట్ట వృత్తాంతం చరిత్ర పునరావృతం అవుతుందనేందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. సగరుని కుమారుల వృత్తాంతంలో వారు పాతాళం వరకూ తవ్విన సొరంగమార్గాన్ని ఒక కాలువగా ఊహిస్తే, అది సరస్వతీ నది ప్రవాహాన్ని పునరుద్ధరించేందుకు భగీరథునిచే నిర్మించబడ్డ సాగునీటి ప్రాజెక్టు యొక్క జ్ఞాపకంగా భావించవచ్చు.

క్రీపూ. 2450–2000 మధ్యకాలం సరస్వతీ మైదానంలో (గఘ్గర్ హక్రా లోయ) హరప్పా నాగరికతకి ఉచ్ఛదశ. ఇది సరస్వతీ నదీ జలాలపై ఆధారపడిన నాగరికత అనేందుకు సందేహంలేదు. భగీరథుని వృత్తాంతానికి ఇతిహాసపురాణ సంప్రదాయంలోని ప్రాముఖ్యం, ప్రకృతిపై మానవ ప్రయత్నం సాధించిన విజయాన్ని నిరూపిస్తుంది.

**దశరాజ్ఞయుద్ధం :**

సగరుని దిగ్విజయం ఆనాటి రాజకీయ నేపధ్యంలో కొన్ని మౌలికమైన మార్పులు తెచ్చింది. ద్వాపరయుగంలో అంటే మహాభారత కాలం నాటి సాంస్కృతిక నేపధ్యానికి పునాదులు సగరుని కాలంలో (క్రీపూ. 2450) పడ్డాయి. భారతయుద్ధం కథలో భరతవంశం, వారి పురోహితులైన భారద్వాజులు ముఖ్య పాత్రలు . భారద్వాజులు సాంప్రదాయకంగా ఆంగీరసులు. భరతుల, భారద్వాజుల మూలాలపై పురాణాల్లోని వివరాల్లో ఎన్నో పీటముళ్లు ఉన్నాయి. మొట్టమొదటి భరద్వాజుడిని కాశీలో దివోదాసుడి పురోహితుడుగా చూస్తాం. దివోదాసుడు సగరుని సమకాలీనుడు. కాశీనుండి అగస్త్యుని వలస వృత్తాంతం అదే సమయానికి చెందింది. ఐల వంశంలోని మరో శాఖయైన తుర్వసులలో కరంధముని పురోహితునిగా మరో అంగీరసుడు కనిపిస్తాడు. యయాతీ, దేవయానుల కుమారుడైన తుర్వసుడి సంతతికి రాజ్యం కోల్పోతారనే శాపం ఉంది. కరంధముని నుండి అతడి పదవ తరం రాజైన విశాలుని వరకూ తుర్వసులు రాజ్యరహితులై

వలసలు పోయారని సంప్రదాయం. నిజానికి, సగరుని దిగ్విజయానంతరం రాజ్యం కోల్పోయిన తుర్వసుల్లో కరంధముని మనుమడు మరుత్తుడు, భారధ్వాజుల నేతృత్వంలో కొత్త ప్రాంతానికి వలసపోయాడు. మరుత్తుని మరో కుమారుడైన దుష్యంతుడిని దత్తత స్వీకరించిన భరధ్వాజుడు అతడిని పురువంశానికి రాజును చేసాడు. దుష్యంతుని కొడుకు భరతుని ద్వారా ఆ వంశానికి భరతవంశంగా పేరొచ్చింది. అయితే భరతునికి సంతానం లేదు. అతడొక భారధ్వాజుడిని దత్తత గ్రహించి వాని కుమారుడైన విదథుడిని తన తదనంతరం రాజును చేసాడు. మత్స్యపురాణం భారధ్వాజులను 'ద్వ్యాముష్యాయణ కౌలీనులు' అని పిలిచింది.

**తస్మాదపి భరద్వాజాద్ బ్రాహ్మణా క్షత్రియాభువి**

**ద్వ్యాముష్యాయణ కౌలీనాః స్మృతాస్తే ద్వివిధేనచ**

ఇదే శ్లోకంలో కొన్ని మార్పులతో వాయుపురాణం వారిని 'ద్విపితరౌ' అంటే ఇద్దరు తండ్రులు అంటే బ్రాహ్మణ, క్షత్రియ పరంపరలకు వారసులుగా చెప్పింది.

**తస్మాద్దివౌ భరద్వాజా బ్రాహ్మణా క్షత్రియా విశః**

**ద్వ్యాముష్యాయణ నామానః స్మృతా ద్విపితరాస్తువై**

పై ఉదంతాలు త్రేతాయుగంలో ప్రాముఖ్యం వహించిన భృగు వంశంపై స్థానిక క్షత్రియ సాంప్రదాయం సాధించిన పైచేయిని సూచిస్తాయి. ఇదే ప్రక్రియలో మరో కోణం సుదాసుని చరిత్రలో చూడవచ్చు. సుదాసుడు, అతడి కొడుకు కల్మషపాదుల చేతుల్లో వశిష్టుని కుమారులు చంపబడటం, కల్మషపాదుడు విశ్వామిత్రుని చేరదీయడం, విశ్వామిత్రుని ఆగ్రహానికి జడిసి వశిష్టుడు పారిపోవడం అనే వృత్తాంతాలు అయోధ్యలో కూడా భార్గవులపై క్షత్రియ పరంపర విజయాన్ని సూచిస్తాయి. సుదాసుని అనంతరం ఐక్ష్వాకుల చరిత్రల్లో వాశిష్టుల ప్రాముఖ్యం అంతగా కనిపించదు. రామాయణంలో కూడా విశ్వామిత్రునికి ఉన్న ప్రాముఖ్యం వశిష్టునికి లేదు.

దశరాజ్ఞయుద్ధంలో విజయం సాధించిన సుదాసుడు ఉత్తరపాంచాల వంశానికి చెందిన వాడా లేక ఐక్ష్వాకుడా అనే విషయం నిర్ధారించడం కష్టం. ఋగ్వేదంలోని దశరాజ్ఞ యుద్ధ ఘట్టంలో వశిష్టుడు సుదాసునికి పురోహితుడుగా కనిపిస్తాడు. వాశిష్టులు ఐక్ష్వాకుల పురోహితులు కనుక అతడు శ్రీరాముని పూర్వీకుల్లోని సుదాసుడిగా ఊహించవచ్చు. సుదాసుడు రాచరికాల తిరుగుబాట్లు అణిచివేయడం, దశరాజ్ఞయుద్ధంలో ముఖ్యాంశం. వంశానుక్రమణికల్లో సుదాసుని అనంతరం సాంప్రదాయక పౌరవ వంశాలు అంతరించడం ఈ వాదాన్ని బలపరుస్తుంది. అయితే, పౌరవ వంశాల వలసలకు సుదాసుని విజయమే కారణంగా నిర్ధారించలేము. ఆనాటి నాగరికతా క్షేత్రంలో, నదీ ప్రవాహ దిశల్లో వచ్చిన మార్పులు కూడా కారణం కావచ్చు. వైదిక వాఙ్మయంలో ప్రముఖంగా కనిపించే దశరాజ్ఞ చరిత్రని పురాణాల్లో ఉపేక్షించడానికి కారణం, అది చంద్రవంశ పరంపరల అపజయాన్ని, వలసలనూ సూచించడం కావచ్చు. ఇక త్రేతాయుగ సంప్రదాయంలోని అతిముఖ్యమైన అంతిమఘట్టం రామాయణం. రామాయణంలోని బాలకాండంలో విశ్వామిత్రుని యాగరక్షణ వృత్తాంతంలో కూడా ఆనాటి నదీ పరివాహక క్షేత్రాల్లో పునరావృత్తమైన విపరీత పరిస్థితులను చూడవచ్చు.

**యాగరక్షణ :**

రామకథ త్రేతాయుగాంతాన్ని, ద్వాపర యుగారంభానికి చెందినది. త్రేతాయుగంలో ముఖ్య క్షత్రియ వంశం ఐక్ష్వాకులైతే, ద్వాపరయుగానికి మూలస్తంభం భరతవంశం అని ముందే చెప్పుకున్నాం. విశ్వామిత్రుడు భరతవంశానికి మూలపురుషుడు. 'భరతవృషభ' అని పిలువబడ్డ విశ్వామిత్రుని చరిత్రలోనూ, శ్రీరాముని వనవాసానికి కారణమైన కైకేయీ, భరతుల పేర్లలోనూ అంతర్లీనంగా ఐక్ష్వాకుల బలం క్షీణించడంలో భరతుల హస్తం కనిపిస్తుంది. కేకేయదేశం సరస్వతి యమునల ఎగువ మైదానాలకు చెందినదైతే, విశ్వామిత్రుని కన్యాకుబ్జం దృషద్వతీ మండలానికి చెందినది. భరత, పాంచాల రాజ్యాల



స్థాపనలో, సింధుసరస్వతీ కేంద్రం నుంచి యమునా మైదానానికి నాగరిక జనజాతుల వలస క్రమం చూడవచ్చు. మధ్య సరస్వతీ వ్యవసాయ క్షేత్రాల్లో వచ్చిన సంక్షోభం వల్ల జనజాతుల వలసలు పరోక్షంగా ఈ పౌరవ వంశాల అభివృద్ధికి దోహదం చేస్తే, ఐక్ష్వాకుల రాజ్యం బలహీన పడసాగింది. ఈ సంక్షోభ నివారణకై ఐక్ష్వాకులు (రాముడు) చేసిన ప్రయత్నాలు, రామాయణంలో విశ్వామిత్రుని యాగసంరక్షణ వృత్తాంతంలోని 'తాటకి', 'అహల్య' కథల్లో కనిపిస్తాయి.

సస్యశ్యామలమైన నేలను ఎడారిగా మార్చిన తాటకిని చంపి ఆ భూములను మునుపటి స్థాయికి తేవడం, తాటకవధలో ముఖ్యాంశం. తాటక పదానికి ఉన్న 'తట, తటాక' అనే అర్థాలనుబట్టి ఆ ప్రదేశాన్ని ఒక కృత్రిమ సరస్సు లేక చెరువుగా ఊహించవచ్చు. కృత్రిమ సరోవరాల కింద సేద్యపు వ్యవస్థను పునరుద్ధరించడమనే ప్రక్రియ ఈ వృత్తాంతంలో అంతర్లీనంగా కనిపిస్తుంది. ఇక అహల్యా గౌతముల వృత్తాంతంలో, శాపానంతరం ఆశ్రమం పాడుబడటం, శాపవిముక్తితో పోయిన కళ తిరిగిరావడంలో అదే ఇతివృత్తాన్ని చూడవచ్చు. సప్తర్షులలో ఒకడైన గోతముడు, మనువు కుమారుడు నిమి వంశంలోని, మిథిజనకుడి సంతతియైన (క్రీపూ 3050) మాథవుని కాలంలో, కోసల దేశానికి తూర్పున సరస్వతి తీరాన నేలను అగ్నితో దహించి, విదేహ రాజ్యాన్ని స్థాపించాడని శతపథబ్రాహ్మణం చెప్తుంది. రామాయణ కథలో కూడా, బండగా మారిన అహల్య విదేహ రాజధాని మిథిలకు వెళ్ళే దారిలోనే కాలికి తగులుతుంది. ఈ కథను గౌతమునిచే స్థాపించబడి బీడుబడ్డ క్షేత్రాలను రాముని కాలంలో పునరుద్ధరించిన కార్యక్రమంలో భాగంగా చూడవచ్చు. శ్రీరాముడికి గంగావతరణం కథ కూడా విశ్వామిత్రుడే చెప్పాడు. ఈ అంశాలన్నింటి వెనుక వ్యావసాయక వ్యవస్థ అభివృద్ధి క్రమంలో రాముడిని విశ్వామిత్రుడు ప్రోత్సహించాడనే ఇతివృత్తాన్ని ఊహించవచ్చు.

**ముగింపు :**

పర్జిటార్ పట్టిక ప్రకారం పరిణిత హరప్పా నాగరికత కాలానికి చెందిన, సగరుని నుంచీ రాముని వరకూ ఐక్ష్వాకు వంశావళిలో దిలీపుడు, భగీరథుడు, అంబరీషుడు, ఋతుపర్ణుడు, సుదాసుడు, కల్మషపాదుడు, ఇడవిడుడు, రఘువు, అజుడు, దశరథుడు, రాముడు మొదలైన చక్రవర్తుల పేర్లు, భారతీయ ప్రాచీన చారిత్రక సంప్రదాయంలోని వాస్తవికతను నిరూపిస్తాయి. రాజకీయాల్లో, సాంప్రదాయక నేపథ్యంలో, ప్రకృతి పర్యావరణాల్లో, ఉత్పత్తి వ్యవస్థలో వచ్చిన ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని, క్రీపూ. 2600–2000 వరకూ, ఆరు శతాబ్దాల కాలం భారతీయ కాంశ్యయుగ నాగరికతతో ఉచ్ఛదశని నిర్దేశించిన ఐక్ష్వాకుల స్థానం, ప్రాచీన చారిత్రక సంప్రదాయంలో అద్వితీయం. దురదృష్టవశాత్తు, పరిణత హరప్పా నాగరికతకు చెందిన ప్రాచీన లిపి మనకింకా అంతుపట్టటం లేదు.

త్రేతాయుగ చరిత్ర అవగాహనకు మౌలికమైన గ్రంథం 'రామాయణం'. ఇది సంస్కృత వాఙ్మయంలో మొట్టమొదటి కావ్యం. రామాయణానికి ఉన్న జనాదరణ ఆసియాలో మరే గ్రంథానికీ లేదు. పశ్చిమాన మధ్యధరాసముద్రం నుంచి, తూర్పున జపాన్ వరకూ ప్రాచీన నాగరికతా స్తరాల్లో దొరికిన శిల్పాలు, జానపద కళల్లో ఇతివృత్తాలు, రామాయణానికి ఉన్న పాప్యులారిటీని నిరూపిస్తాయి. అయితే కావ్యరూపంగా లభ్యమయ్యే వాల్మీకిరామాయణంలోని భాషలో, కవితా శైలిలో పరిణతిని బట్టి ఈ ఆదికావ్యం, క్రీస్తు శకారంభం నాటి చారిత్రక యుగానికి చెందినది. ఈ కావ్యానికి ఉన్న అత్యమిత జనాదరణ, దీనిలో అనేక పిట్టకథలు, ధార్మిక చర్చలు, స్థల మాహాత్మ్యాలు ప్రక్షిప్తాలుగా జొరబడేందుకు కారణమైంది. భౌగోళికంగా రామకథ దక్షిణదేశంలో బ్రాహ్మణ సంప్రదాయ విస్తరణ ప్రక్రియని సూచిస్తుంది. కావ్యంలోని భౌగోళిక, సామాజిక నేపథ్యం, చారిత్రక యుగాన్ని, ఆ తరువాత వచ్చిన పరిణామాలను సూచిస్తుందే తప్ప, మూలకథ నేపథ్యమైన వాస్తవ సాంస్కృతిక స్తరాలకు చెందదు. రామాయణంలోని కథాంశాలను, పురాణ సంప్రదాయంలోని గాథలతో సరితూచుకోవడం ద్వారా మూలకథలోని వాస్తవాలను ఆనాటి సాంస్కృతిక స్తరాల పరిధిలో పరిశీలించడం అవసరం. క్షత్రియ వంశానుక్రమణికలు సూచించే కాలానికి చెందిన పురాతత్వ ఆధారాలను బట్టి రామాయణంలోని భౌగోళికాంశాలను చూద్దాం.



సాయి పాపినేని
బెంగళూరు.
ఫోన్: 09845034442

# వేదిక

## ఒక ముచ్చట

**ఇది** మిసిమి అక్టోబరు సంచికకు సంబంధించినది.

అట్టమీది, లోపలి బొమ్మలు - వాటి సౌందర్యాన్ని గూర్చి చెప్పటానికి మాటలు అందిరావు. వ్యాసాలన్నీ బాగున్నాయి. 'ఉత్కళాంధ్ర ప్రముఖులు' చాలామందిని పరిచయం చేసింది. అయితే ఒక చిన్నమాట. ఉత్కళాంధ్ర అనిగాక పూర్వాంధ్ర అనుటమేలు. ఉత్కళమన్నమాట ఉత్తర కళింగనుండి ఏర్పడింది. కళింగ మూడు భాగాలు : 1. ఉత్తర కళింగ, మధ్యకళింగ, కళింగ. ఇటీవలి కాలంలో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలను 'ఉత్తరాంధ్ర' అని వ్యవహరిస్తున్నారు. నిజానికది పూర్వాంధ్రమే. అంటే తూర్పు ఆంధ్ర అని అర్థం. అందువల్లనే ఆ ప్రాంతపు కర్షక సామాజిక వర్గాన్ని తూర్పుప్రాంతాలనటం జరుగుతోంది. క్రీడాభిరామంలో కూడా తూర్పునాట గడిడు అనే ప్రస్తావన వుంది.

అయితే 'ముచ్చట' అని చెప్పింది పై విషయమును గూర్చి కాదు, శ్రీ వేలూరి కృష్ణమూర్తి గారు 'మైసూరు సంస్థానంలో రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ' అనే వ్యాసంలో చాల విశేషాలు చెప్పారు. ఈతరం సాహితీ విద్యార్థులు మరచిపోయిన గొప్ప సాహితీమూర్తి శ్రీమాన్ రాళ్ళపల్లివారు. అది చదివినమీదట నా మనస్సు పొరల్లో ఒక జ్ఞాపకం కదలాడింది. దానిని గూర్చి కృష్ణమూర్తి గారితో ఫోనులో మాట్లాడగా, ఈ విషయం మీరు తప్పకుండా మిసిమిలో వెలువరించాలని సూచించారు. పనుల వత్తిడి వలన వెంటనే వ్రాయటం కొంత ఆలస్యమైంది.

విషయమేమంటే 1972-73 సంవత్సరాల్లో రాళ్ళపల్లివారు బెంగుళూరులో వుంటూ జబ్బుపడి హాస్పిటల్‌లో కొద్దిరోజులున్నారు. అప్పట్లో నేను ఆంధ్రవిశ్వవిద్యాలయం తెలుగుశాఖలో పరిశోధక విద్యార్థిగా వున్నాను. అప్పుడు శ్రీ శర్మగారి నుండి ఆచార్య దోణప్పగారికి ఒక ఉత్తరం వచ్చింది. అప్పటికప్పుడు వారు ఆ ఉత్తరం వ్రాయటానికి వేరే నేపథ్యం ఉంది. దానినలా ఉంచితే, ఉత్తరం లోని విషయమేమంటే, ఎన్నడో 1930కి ముందు అనుకుంటాను - శర్మగారు కట్టమంచి రామలింగారెడ్డిగారి ఆహ్వానం మేరకు 'వేమన' పై ఉపన్యాసాలిచ్చారు. దానికి విశ్వవిద్యాలయం ప్రతిఫలం ఇచ్చింది. పిదప ఉపన్యాసాలను అదేపేరుతో ('వేమన') పుస్తకంగా ప్రచురించారు. డిగ్రీ లేక ఇంటర్‌మీడియట్ విద్యార్థులకు పాఠ్యగ్రంథంగా అది చాల ప్రచురణలు పొందింది. ఆ విషయాన్ని ఉటంకిస్తూ శర్మగారు వ్రాసిందేమంటే, ఇప్పటి తన శారీరక స్థితిని బట్టి, ఆర్థికావసరాలను బట్టి విశ్వవిద్యాలయం తన పై దయతో ఏమైనా ఆర్థిక సహాయం చేయటానికిగల అవకాశాలను పరిశీలింపవలసిందిగా దోణప్ప గారికి మనవి చేస్తూ వ్రాసారు. దోణప్పగారు, ఆ ఉత్తరం నాకు ఇచ్చి, "పెద్దవారు వ్రాసారు. మనమేదైనా చేస్తే బాగుంటుంది. ఈ ఉత్తరం సంగతి చూశావా" అన్నారు.

అంతట దానిని తీసుకుని అప్పటి ఆర్థిక శాఖాధికారి శ్రీ జె.ఎస్. శాస్త్రి గారిని, శ్రీ కొచ్చెర్లకోట సుబ్బారావుగారిని కలిసి విషయమిది అని చెప్పాను. వారు "పెద్దవారు అడిగారు. విశ్వవిద్యాలయం ఆ పుస్తకం ప్రచురించి నష్టపోయినదేమీ లేదు. తగువిధమైన లాభమే వచ్చింది. నిజమే! కాని వారికి అప్పట్లోనే తగుప్రతిఫలం ఇచ్చి గదా ప్రచురించింది. అయినా విశ్వవిద్యాలయ అధికారులు, ముఖ్యంగా ఇది పాలకవర్గం (సిండికేట్) తీసుకోవలసిన నిర్ణయం" అని చెప్పారు. 'అది నాకు వదిలేయండి. ఫైలు నడిపించండి' అన్నాను. అలాగే వారి తరఫున నీవో, దోణప్పగారో ఒక రిప్రజెంటేషన్ ఇవ్వండి అన్నారు. ఆ పని చేశాను. అయితే మొదటిదానికి ప్రతిఫలం ఇచ్చిన విషయంగాని, అచ్చువేయటానికి ఆర్డరు ఇచ్చిన ఫైలుగాని దొరికితే తప్ప దీనిపై చర్య తీసుకోలేము. అదికూడా దొరుకుతుంది. రికార్డు రూములో ఉంటాయి. ఏభై ఏళ్ళనాటి సంగతి ఎలా చూస్తావు అన్నారు వారు. అదృష్టవశాత్తు నేను మచిలీపట్నం త్రివేణిలో 1958లో కొనుక్కున్న 'వేమన' పుస్తకం దొరికింది. అది మొదటి ప్రచురణ. అది సరస్వతీ పవర్‌ప్రెస్ రాజమండ్రిలో అచ్చయింది. దానిపై నాటి ఫైలు నంబరు ఉంది.

అది తీసుకుని రికార్డు రూంలో మూడురోజులపాటు ముక్కుకి మూతికి గుడ్డకట్టుకుని వెతికితే ఫైలు దొరికింది. ఇక ఫైలు నడిపించటం, సిండికేటువారు ఆమోదం తెలియచేయటం చకచకా జరిగిపోయాయి. ఫలితం ఏమంటే అప్పటికప్పుడు విశ్వవిద్యాలయం రూ. 10,000/- (పదివేల రూపాయలు) చెల్లించటం దరిమిలా పుస్తకం ప్రచురిస్తే ముద్రిత ఫైలుపై పదిశాతం వారికి రాయల్టీ ఇచ్చేటట్లు వ్రాయించటం జరిగింది. ఆ మేరకు ఉత్తరం డ్రాఫ్టు తీసుకుని దోణప్పగారికివ్వగా వారు దానిని శర్మగారికి పంపించారు.

శర్మగారు వెంటనే తిరుగు ఉత్తరం వ్రాస్తూ కృతజ్ఞతలు తెలుపుతూ దీనిని నిర్వహించినవారికి నా ఆశీస్సులు తెలుపండి అని వ్రాశారు. ఆ ఉత్తరం దోణప్ప గారు నాకు చూపారు. ఇలా నేను పైన ఉదహరించిన వ్యక్తులు, సిండికేట్ మెంబర్లు ఎవరూలేరు కనుక దీనికి పంచభూతాలు, విశ్వవిద్యాలయాలలోని ఫైలు మాత్రమే సాక్ష్యాలు.

'సత్యే సర్వం ప్రతిష్ఠితమ్'

యార్లగడ్డ బాలగంగాధరరావు
విజయవాడ, ఫోన్ : 9849499169

# వేదిక



వెల్చేరు నారాయణరావుగారు ఆంగ్లంలోకి అనువదించిన కన్యాశుల్కం నాటకానికి ముందుమాటగా సుదీర్ఘంగా రాసిన అప్రస్తుత ప్రసంగంమీద వివిన మూర్తిగారు రాసిన వ్యాసం చాలా మంచి స్పందన. గొప్ప గొప్ప నవలలు – Tolstoy రాసిన War and Peace, Gabriel Garcia Marquez  రాసిన One Hundred Years of solitude లాంటివి  ఆంగ్లంలోకి అనువదించబడ్డాయి. Tolstoy, Marquez ల వ్యక్తి గత జీవితాలు కూడా అంత వుదాత్తమయినవేమీ కావు. అయితే – వారి రచనలు ఆంగ్లంలోకి అనువదించిన వారెవరూ కూడా – ఆయా రచయితల వ్యక్తిగత జీవితాల జోలికి పోలేదు. సంక్షిప్తంగా రచయితల గురించి ప్రస్తావించి – అక్కడితో వూరుకుంటారు.

వెల్చేరు వారు మాత్రం – మంచి అవగాహన వున్న వ్యక్తి, విమర్శకుడూ, అయివుండి కూడా... యే కారణం చేత – గురజాడ వారి వ్యక్తిగత జీవితంలోకి ప్రవేశించి – అందులో వున్న చీకటి కోణాల్ని ఆవిష్కరించ బూనుకున్నారో యెంత మాత్రం అర్థం కావడం లేదు.

గురజాడ వారి వ్యక్తి గత జీవిత వివరాలు మనకెందుకు? ఆయన రాసిన *కన్యాశుల్కం, దిద్దుబాటు, దేవుడు చేసిన మనుషుల్లారా మీ పేరేమిటి?, పూర్ణమ్మ, కన్యక, దేశమును ప్రేమించుమన్నా గీతం* – యివి చాలవూ వారి గొప్పతనాన్ని – రానున్న కాలాలకి కూడ చాటి చెప్పడానికి ? గురజాడ వారి గొప్ప తనం గురించి ప్రస్తావించకుండా వారిలో వున్న లోపాల గురించి అన్వేషించేవారికి – నిశ్చయంగా – ఆదిభట్ల నారాయణదాసుగారు  శలవిచ్చినట్లు – 'తక్కువ నా కొడుకు తప్పులు వెతుకు' అన్న నానుడి వర్తిస్తుంది.

నారాయణరావు గారు ఆధునికత గురించి తన వుపోద్ఘాతంలో విస్తృతంగా ప్రస్తావించి వున్నారు. అంచేత – ఆధునికతకి – బృహద్గురువుగా భావించబడుతున్న T.S. Eliot మంచి విమర్శ గురించి ఏం చెప్పారో ఒకమారు చూడండి – "Honest criticism and sensitive appreciation is directed not upon the poet but upon the poetry" అని. అంచేత మంచి విమర్శ అన్నది –  వ్యక్తుల మీద కాకుండా – వారి రచనల మీద కేంద్రీకరించబడాలి.

మంచి విమర్శ అన్నది – కవి వ్యక్తి గత జీవితం మీదా, కవి కాలపు చారిత్రక ఆధారాల మీదా – ఆధారపడి వుండకూడదని చెప్పారు, Wimsat and Beardsey మహోదయులు – తమ Intentional Fallacy వ్యాసంలో.

నారాయణరావుగారు కన్యాశుల్కం అనువాదానికి ముందుమాటగా చేర్చిన విమర్శనాత్మమైన ఉపోద్ఘాతంలో ఆధునికత తిరస్కరించిన రెండు రకాల విమర్శల్నీ – చారిత్రక విమర్శ, వ్యక్తిగత జీవిత సంబంధిత విమర్శ – వాడి – పొరపాటు చేశారు.

నారాయణరావుగారు అసలు కన్యాశుల్కాన్ని యెందుకు ఆంగ్లంలోకి అనువదించాలని సంకల్పించారు? అది చాలా మంచి తెలుగు నాటకం అని భావించబట్టే కదా? అనువదించేరు – సరే. అక్కడితో వూరుకోకుండా – అనువాదానికి ముందు సుదీర్ఘమైన ఉపోద్ఘాతం యెందుకు రాశారు? అది అవసరమా ? రాసేరు – సరే. ఆ రాతలో గురజాడ మీద చల్లగలిగినంత బురద చల్లేరు. ఈ ఉపోద్ఘాతాన్ని చదివిన ఆంగ్ల పాఠకులు యెలాటి అభిప్రాయానికి వస్తారు? ఇంతటి అవినీతి పరుడు రాసిన ఇంత అవినీతికరమైన నాటకాన్ని – యెందుకు మెచ్చుకుంటున్నారు? ఈ తెలుగు వాళ్ళు –– అని అనుకోరూ ? కన్యాశుల్కం గురించి అలాటి దురభిప్రాయం విదేశీ పాఠకులకి కలిగితే – నారాయణరావుగారు కన్యాశుల్కానికి న్యాయం చేసినట్టా – లేక అన్యాయం చేసినట్టా?

ఆయన చేసిన మరో ఘోరమైన తప్పిదం – కన్యాశుల్కం వందా పాతిక సంవత్సరాలుగా సజీవంగా వుండడానికి కారణం మార్క్సిస్టులు ఆనాటకాన్ని యింతకాలంగానూ తమ భుజాల మీద వేసుకొని మోస్తుండడంవల్లనట. శవాన్ని యెవరెంతకాలం మోసినా – అది శవంగానే వుంటుంది గాని – తిరిగి బతికిపోదుకదా! వందేళ్ళ పై బడి ఒక రచన యింకా  ప్రజల మన్ననలను పొందుతూ వుందంటే – ఆ రచనలో వున్న సమ్మోహన పరచే గుణమే కారణంగాని – యెవరో ప్రచారం చేసినందువల్ల కానే కాదు.

మనకున్న గొప్ప సాహిత్యం అని తెలుగు వాళ్ళు సంబర పడవలసిన రచనలు బహు కొద్దిగానే వున్నాయి. అందులో కన్యాశుల్కం ఒకటి. దానిని – ప్రపంచ పాఠకులు ఒక చవుకబారు నాటకం అని భావించేటట్టుగా వెల్చేరువారు తమ ముందు మాట ద్వారా చేసి వుంటే – అది నిశ్చయంగా క్షమించరాని అపరాధం. మి

ఎ.వి. రెడ్డి శాస్త్రి,
శ్రీకాకుళం.

# అట్టమీది బొమ్మలు

**ముఖచిత్రం : కన్య ప్రార్థన**



సాల్వీ

**చిత్రకారుని పేరు :** Sarroferrato Giovanni Battista Salvi. ఇందులో Sarroferrato అన్నది ఇటలీ నడిబొడ్డులోనున్న ఒక చిన్న పట్టణం. వ్యక్తుల పేర్లముందు వారి ఊర్ల పేర్లు ఉండటం 16, 17 శతాబ్దంలో ఇటలీ దేశంలో ఉన్న ఒక ఆచారం. జీసస్‌ను కూడ నజరేత్ అనే తన స్వస్థలం పేరుతో పిలుస్తారు. Giovanni అనే మాట St. Francis పేరును సూచిస్తుంది. బతిస్టా సాల్వీ 1639లో జన్మించి 1709 తనదైన లోకంలోనికి తరలిపోయారు. తండ్రివద్ద చిత్రకళను అభ్యసించారు. 1654 వ సంవత్సరంలో తల్లిదండ్రులిద్దరూ ప్లేగువ్యాధితో మరణించటంతో రోమ్ నగరం చేరుకున్నారు.

అప్పటికే దావించీ, మైఖలాంజిలో, రాఫెల్ చిత్రాలతో తన్మయులైన రోమ్ నగరవాసులకు మిగిలిన చిత్రకారుల చిత్రాలు సూర్యుని ముందు దివిటీలలో వెలవెలబోతూ కనిపించేవి. 19వ శతాబ్దంలో ప్రీరాఫిలిజంను తలకెత్తుకున్న ప్రఖ్యాత కళావిమర్శకుడైన జాన్‌రస్కిన్ తర్కంతో మరుగునపడ్డ బతిస్టా సాల్వీ పేరుప్రతిష్టలు 300 సం॥ల తరువాత బయటకు వచ్చాయి. ప్రపంచవ్యాప్తంగా అనేక మ్యూజియమ్‌లు అతని చిత్రాల సేకరణకోసం ఎగబడ్డాయి. ఇతని చిత్రాలలో ఎక్కువభాగం అమెరికా, British Royal Collection, Windsor Castle లండన్‌లో ఉన్నాయి. ఇతను ఇటలీలో ఒక చర్చి గోడపై వేసిన Glory of the Mystical Lamb ఎక్కువ ప్రఖ్యాతిగాంచింది. ఇప్పటి ముఖచిత్రం బరోక్ శైలికి చెందినది. ఇది మేలిముసుగు క్రీనీడలో అర్ధనిమీలిత నేత్రాలతో (మేరీ చిత్రాలలో ఎక్కువభాగం కనులు దించినట్లే ఉంటాయి) చేతులు జోడించిన (హిందువులలానే క్రైస్తవులు కూడా భక్తిశ్రద్ధలకు చేతులు దగ్గర చేయటం ఒక సంకేతంగా భావిస్తారు. ఎటొచ్చీ భారతీయ నమస్కారంలో అరచేతులు రెండూ దగ్గరగా చేర్చబడి ఉంటాయి. ఇక్కడ చేతులమధ్య కొద్దిపాటి ఖాళీ ఉంటుంది). మేరీమాత చిత్రం. ఇది ఇటలీలోని జినోమ్ నగరంలోని చర్చిలో ఉంది.

**రెండవ అట్ట : శిల్ప చిత్రం**

**చిత్రకారుడు :** చాగంటి శ్రీనివాస్, 05-07-1948లో కూచవరం, తూప్రాన్ మండలం, మెదక్ జిల్లాలో చాగంటి అనంతాస్వామి, రామలక్ష్మి దంపతులకు జన్మించారు. భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరి మామగారైన చేపూరి వేంకటాద్రి (చిత్రకారులు) గారి దగ్గర చదువుకొంటూ చిత్రకళ మీద ఆసక్తి పెంచుకొన్నారు. వారి శిష్యులుగా కమర్షియల్ ఆర్ట్‌లో నైపుణ్యం సంపాదించారు. హెచ్.ఎమ్.డి.ఎ. లో ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తూ 2006లో రిటైర్‌మెంట్ తరువాత ఐదు సం॥లు ఔటర్ రింగ్‌రోడ్ సెక్షన్, ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌లో బాధ్యతలు, తరువాత చిన్ననాటి అభిరుచితో 'సిరి' ఇన్స్టిట్యూట్ ఆఫ్ పెయింటింగ్‌లో చేరి, సైకత చిత్రకళకు మరికొంత మెరుగులు దిద్దుకుంటున్నారు. చిత్ర మాధ్యమంపై ఇసక రేణువులు అంటించి దానిపై దాదాపు ఒకే వర్ణంలోని నీడలతో చిత్రించటం దీని ప్రత్యేకత!



చాగంటి శ్రీనివాస్

**బహుమతులు :** కోనసీమ, అమలాపురం, తెనాలి చిత్రకళా ప్రదర్శనలో బహుమతులతో పాటు సన్మానింపబడ్డారు. పలు చిత్రప్రదర్శనలలో కూడా పాల్గొన్నారు.

**నాలుగవ అట్ట :** మాగ్దలీనా – పాలరాతి విగ్రహం, శిల్పి పేరు తెలియరాలేదు.

మేరీ మాగ్దలీనా క్రైస్తవ మతంలో జీసస్‌ను అనుసరించి, ప్రయాణంచేసి, సిలువ వేయటం నుంచి పునరుత్థానం వరకూ అతని వెన్నంటే ఉన్న శిష్యురాలు. ప్రముఖంగా చెప్పదగిన స్త్రీ. మేరీ మాగ్దలీనా, ఆమె ఒక పతితురాలైనా, పశ్చాత్తాపం పొంది, దైవసన్నిధిలో జీవితం గడిపింది. జీసస్ క్షమాభిక్షతో మానసిక పరివర్తన పొంది జీసస్ శిష్యురాలుగా కొనసాగింది. బైబిల్ ప్రకారం జీసస్ పునరుత్థానానికి ఆమె ప్రత్యక్ష సాక్షి.

**మూడవ అట్ట :** చిత్రకారిణి – స్రవంతి జన్మత చిత్రకళాభిరుచిగల ఔత్సాహిని! తాను నేర్చుకోవటమే కాదు పదిమందికి మద్రాసులో తన ఇంటివద్దనే చిత్రకళను ఉచితంగా నేర్పేది. అయినా ఎవరైన డబ్బు ఇస్తే దానిని 'తాక్కుం తరంగళ్' అనే ధార్మిక సంస్థకు అందజేసేది.


స్రవంతి

చదువు, సంస్కారం, అందమైన ఆకృతి, అంతకంటే అందమైన మనసు కల్గిన స్రవంతి, వీరమాచనేని ప్రమోద్ కుమార్‌గారి గారాల పట్టి. (కూతురు కూతురు – మనుమరాలు).

అనాథలన్నా, ఆశ్రితులన్నా విశేషమైన ప్రేమ. అంధ విద్యార్థులెవరైనా దారిలో కనిపిస్తే వారిని తన స్కూటర్‌పై ఎక్కించుకుని, చేరవేసేది. అంతేకాదు పదో, పరకో చేతికిచ్చేది. ఎన్నో శరణాలయాలకు ఉచితంగా అల్పాహారం పంపించేది. పెదవులపై సదా చెరగని చిరునవ్వు, మాటల్లో సౌమ్యత, చేతల్లో కృషి, పట్టుదలకు ఆమె చెరగని చిరునామా. రోడ్ సైడ్ రోమియోల భరతం పట్టడంలో ఆమె చూపిన ధైర్యం ఆమెను వీరనారనిపిస్తుంది. ఇంతటి ప్రతిభాశాలి తన 26వ యేట న్యూజెర్సీలో అగ్నిప్రమాదంలో అసువులుబాయటం దురదృష్టం! ఆమె వేసిన చిత్రాలు వందకు పైగా వున్నాయి.

*ఊటీలో ఉదయరేఖలు, ప్రత్యేకం – ఇవి దాదాపు మూడువందల సంవత్సరాల మానులు – తుజ జాతికి చెందినవి. ఇందులో చిత్రించిన చిత్రాలు కూనూరులో ఒక కొండ అంచున ధీమాగా నిలబడి వుంటాయి. ఆ ప్రక్కనే హోలీ ఏంజెల్స్ స్కూలు ఉంది. నా కొడుకును 3వ క్లాసులో అక్కడ చేర్చి – మూడు సంవత్సరాలు చదివించాను. ఎన్నోమార్లు ఆ విస్తారమైన మానుల నడుమ నిలబడి వాటి ధైర్యాన్ని నాలో నింపుకునేవాణ్ణి – కాని పసివాణ్ణి ఇంత దూరంలో చేర్చి తిరిగి వెళ్లిపోతుంటే గుండె చెరువై కళ్ల నీళ్లు తిరిగేవి. ప్రమోద్‌గారి ఇంటిలో ఈ చిత్రాన్ని చూసి ఒక్కసారి గతంలోకి వెళ్లి ఎక్కడివీ చిత్రాలు అని అడిగితే స్రవంతి కథంతా, కన్నీటి కథంతా చెప్పారు – వారి దుఃఖాన్ని దిగమింగుకోమని చెప్పటం మినహా ఎలా ఓదార్చాలి?*

*ఎ.కె.*

మి



స్రవంతి చిత్రాలు



# మా రామబ్రహ్మం

– కొసరాజు రాఘవయ్య చౌదరి

**1920** సంవత్సరం అనుకుంటాను. విజయవాడలో పెద్ద లాయరు కోవెలమూడి గోపాలకృష్ణయ్య ఎమ్.ఎల్.సి. (చిత్ర నిర్మాత కోవెలమూడి భాస్కరరావుగారి తండ్రి) వుండేవారు. ఆయన కుమార్తె పెండ్లికి అంటే జ్యోతి ఫిలిం డిస్ట్రిబ్యూటరు కంచర్ల నారాయణరావుగారి తల్లి పెండ్లికి నన్ను నా జంటకవి కుర్రా వెంకటసుబ్బారావును, మా అప్పికట్లలోనే యింకొక కవి ఇనగంటి పున్నయ్యగారిని రమ్మని కబురందింది.

అప్పుడు నేను చాలా చిన్నవాణ్ణి. బాలకవి అని పిలిచేవాళ్ళు. అప్పటికే నేను అవధానాలు చేస్తూవున్నా. యిప్పుడుకూడా అలాగే పిలుస్తారు కొందరు.

మేం ముగ్గురం బయలుదేరి బెజవాడ స్టేషన్లో దిగాం. అక్కడ ఆ పెండ్లికే ప్రయాణమై వస్తున్న స్వర్గీయ నూతక్కి రామశేషయ్యగారు (మాజీ ఒరిస్సా మంత్రి) మమ్మల్ని ఆదరంగా పలకరించారు. అప్పుడే ఆయన బి.ఎ. పాసయ్యాడు. అందరం రైలెక్కి ఉప్పులూరు స్టేషన్లో దిగి, రామశేషయ్యగారి బావగారింట్లో మకాంవేశాం.

ఒక గంటసేపటికి బర్రున ఒక గుర్రబ్బండి వచ్చి వాకిట్లో ఆగింది. ఆ బండిలోనుండి గుమ్మటంలాగావున్న మంచి చలాకీగల కుర్రవాడు గబాలున దిగాడు. గుమ్మంలో




అడుగుపెట్టిందే తరువాయి కవులు వచ్చారట, వారిని గోపాలకృష్ణయ్యగారు తీసుకురమ్మన్నారన్నాడు. రామ శేషయ్యగారు బాబూ, కొంచెం ఆగమని కాఫీ ఫలహారాలు యిప్పించి, ఆ గుర్రబ్బండిలో మమ్మ్ము కోలవెన్ను పంపారు.

అప్పుడు రామబ్రహ్మం బందరులో చదువుతున్నాడు. దోవపొడుగునా హుషారైన కబుర్లు చెబుతూ మాతో కలిసిపొయ్యాడు. ఆయన వాలకంజూసి మంచి చాకులాగున్నాడు, ముందుముందీయనకు మంచి భవిష్యత్తు వుంటుందని అనుకున్నాం. కోలవెన్ను చేరుకున్నాం. రామబ్రహ్మంగారు అతిథేయ బృందానికి నాయకత్వం వహించి, ఎక్కడజూచినా తానై మర్యాదకు లోటు రానీయకుండా వ్యవహరించాడు.

ఆ పెండ్లిలోనే పొట్లూరు వీరరాఘవయ్యగారు గురువుగారగు అశ్వధాటి రామమూర్తిగారి వద్దనుండి వచ్చి, తొలి మృదంగ వాద్య ప్రదర్శనం చేశాడు.

అక్కడ రామబ్రహ్మంగారికి సన్నిహితత్వం ఏర్పడ్డది. ఇది నా మొదటి పరిచయం. ఇక అప్పట్నుంచీ ఎన్నో సభల్లో కలుస్తూవుండేవాళ్ళం. తర్వాత నేను పాములపాటి వెంకటకృష్ణయ్యగారి రైతు పత్రికలో వుండేవాణ్ణి.

ఆయన బెజవాడలో ఫ్రెండ్స్ అండ్ కో అనే పేరుతో స్టేషనరీషాపు పెట్టాడు. ఆ షాపు దర్బారులాగా వుండేది. తెచ్చే కాఫీలకు, ఇచ్చే కాఫీలకు విరామంలేదు. కవులకు, గాయకులకూ అది కేంద్రస్థానం.

చివరి ఏం జరిగింది. ఫ్రెండ్సు అండ్ కోను ఫ్రెండ్స్ బాగామేశారు. రామబ్రమ్మంగారు పెద్ద దెబ్బతిన్నారు. విపరీతమైన అప్పులు, తీర్చే దారి కనబడక ఉన్న సరుకంతా అమ్మేసి, అప్పులకు కట్టి స్టోరును మూశారు.

**కుప్పుస్వామిగారితో పరిచయం**

ఇలా వుండగా 1928 సంవత్సరములో గుంటూరు జిల్లా బోర్డు ప్రెసిడెంటు ఎన్నిక జరిగింది. పి.సి.యన్. ఎతిరాజులు నాయుడు గారి వర్గానికి, కుప్పుస్వామి చౌదరి వర్గానికి తీవ్రమైన పోటీజరిగింది. కుప్పుస్వామి చౌదరిగారంటే జాగర్లమూడి చంద్రమౌళిగారి తండ్రి. చివరకు కుప్పుస్వామిగారు గెలిచారు. ఆ ఎన్నికలో ఎత్తుకు పైఎత్తులతో

పోటీలు జరిగాయి. గుంటూరు తాలూకా బోర్డునుండి కొందరు సభ్యులు జిల్లా బోర్డుకు ఎన్నిక కావలసి రావడంవల్ల అది ఒక రణరంగంగా మారింది. ఆ సంరంభంలో నేను బుర్రకథలూ, ఎలెక్షన్ పాటలూ వ్రాసి, ఉత్సాహపరుస్తూ ఉండేవాణ్ణి. అప్పటికి ఎలక్షన్లలో బుర్రకథల ద్వారా ప్రబోధం చేసేవాళ్ళల్లో మొదటివాణ్ణి నేనేననుకుంటాను.

ఆ సందర్భంలో రామబ్రహ్మంగారు కూడా వచ్చి కుప్పుస్వామిగారిని తరచూ కలుస్తూవుండేవారు.

ఇక్కడ కుప్పుస్వామిగారిని గురించి కొంత చెప్పాల్సొస్తుంది. ఆయన కవితాప్రియుడు. అనేకమంది కొమ్ములుదిరిగిన కవిపండితులకు ఆత్మీయుడు. జాషువా, తుమ్మల సీతారామమూర్తి, ఏటుకూరు ఇలాంటి ఉద్దండులనెందరినో పండితులుగా నియమించిన రసజ్ఞుడు.

ఆయన జస్టీసు పక్షనాయకుడైనా కాంగ్రెసు నాయకులకు ఆంతరంగికుడు. తెనాలి తాలూకాలో శరణు రామస్వామిచౌదరి, అంచా శివయ్య, చింతమనేని భావయ్య, కన్నెగంటి సూర్యనారాయణ వీరంతా కుప్పుస్వామిగారికి సన్నిహితులు.

గుంటూరులో దేశభక్త కొండా వెంకటప్పయ్య పంతులు, గొల్లపూడి సీతారామశాస్త్రి, ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు, డాక్టరు చలపతిరావు వీరంతా ఆయన ప్రియమిత్రులు.

ఆయన యిల్లు ఒక దర్బారులాగా వుండేది. సాయంకాలానికి ఏ కవిరాజు రామస్వామి చౌదరిగారో, ఏ ఉన్నవ లక్ష్మీనారాయణగారో, శివశంకరశాస్త్రిగారో సాహిత్యాన్ని గురించి సంభాషిస్తూ ఉండేవారు.

కవిరాజుగారంటే ఆయనకు ఎంతో యిష్టం. రెండుసార్లు సెనేటుకు పోటీచేయించి, తీవ్రమైన పోటీలో గెలిపించాడు. సూతపురాణ ప్రకటనకు కారణభూతుడు ఆయనే. కుప్పుస్వామి శతకం ఆయనగురించే.

ఆ కుప్పుస్వామిగారింట్లో నేను పర్మెనెంటు గెస్టును.

ఒకసారి నేనూ కుప్పుస్వామిగారూ బెజవాడ వెళ్ళాం. రామబ్రహ్మంగారు వచ్చారు. అప్పటికి రామబ్రహ్మంగారి పరిస్థితి విన్నారు ఆయన. విని, "ఏంరా బాబూ రామబ్రహ్మం! ఏమిటి నీ పరిస్థితి. ఏం చేస్తున్నావు?" ఏం చెయ్యదలచావు? అని అడిగాడు.

రామబ్రహ్మంగారి కళ్ళవెంట గిర్రున నీళ్ళు తిరిగాయి. తలవంచాడు.

కుప్పుస్వామిగారాదృశ్యానికి చలించిపోయి, లేచి వీపుతట్టి, "పిచ్చివాడా! అధైర్యపడకు. నేనున్నాను. నా కుటుంబంలో ఒకడిగా నిన్ను చూసుకుంటాను" అని ధైర్యంచెప్పి, ఓదార్చాడు.

వారం తిరక్కముందే నన్ను బెజవాడ పంపి, రామబ్రహ్మంగారిని పిలిపించాడు. మేం ముగ్గురమే ఉన్నాం.

"నాయనా, రామబ్రహ్మం – నీకు ఒక మాట చెబుతాను. బెజవాడలోవుండి, నీవు చేసేదేమీ లేదుగదా? పూవులమ్మినచోట కట్టెలమ్మినట్లుంటుంది. కాబట్టి నీవు వెంటనే నీ భార్యను తీసుకొని చీరాలకు వచ్చేసెయ్. స్టేషనువద్ద మా మేడ వుంది. అందులో మీరుండండి. మీకు కావలసిన సంబారమంతా కారంచేడు మా యింటి వద్దనుండి పంపే ఏర్పాటు చేస్తాను. తర్వాత ఏం చెయ్యాలో ఆలోచిద్దా"మన్నాడు. నేనుగూడ ఈ ప్రపోజల్సు చాలా బాగుందని వంతపాడా.

వారంరోజుల్లో ఆయన భార్యతో వచ్చి, చీరాల మేడలో దిగాడు. ఇక్కడ ఆయన భార్య శారదాంబను గురించి, ఒక మాట చెప్పాలి. రామబ్రహ్మంగారు చెప్పింది ఆమెకు వేదం. ఆయన ఎంతమంది అతిథుల్ని వెంటబెట్టుకవచ్చినా విసుగుపడని దొడ్డయిల్లాలు. ఆయన కష్టసుఖాల్లో పాలుపంచుకోవడంలో ఆమెకు ఆమే సాటి.

*కుప్పుస్వామిగారు ఒకనాడు రేపల్లె క్యాంపుకు వెళ్ళాడు. అక్కడ ఆయనకు గొప్ప సన్మానం జరిగింది. ఆ సభలో ఒక వంకకర్ర అబ్బాయి వచ్చి, పద్యాలు చదివాడు. అతని సాహిత్యం చాలా బాగుందని తోచింది కుప్పుస్వామిగారికి. ఆయన ఎవరోకాదు, సినిమా రంగంలో పేరుబడ్డ సీనియర్ సముద్రాల రాఘవాచార్యులు. తర్వాత పదిరోజులకు సముద్రాల వచ్చి, గుంటూరులో కుప్పుస్వామిగారిని దర్శించి, తన పరిస్థితులు చెప్పుకొని తనకేదైనా సహాయం చెయ్యమని అడిగాడు.* అంతకుముందే రామబ్రహ్మంగారికి, సముద్రాలకు బెజవాడలో మంచి



జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి

స్నేహం. అప్పుడు కుప్పుస్వామిగారు కొంచెం యోచించి – "సముద్రాలా! నీకు ఉభయ భాషాప్రవీణ వంటి డిగ్రీ ఏదైనా ఉంటే ఏ హైస్కూల్లో అయినా పండితుడిగా వేసేవాణ్ణి. అలాంటి వీలు లేదుగదా! నేనొక ప్రపోజలు చెబుతాను. మా అబ్బాయి చంద్రమౌళి బెంగుళూరు యూరపియను స్కూలునుంచి వచ్చి, ఎ.సి. కాలేజీలో ఇంటర్‌మీడియట్‌లో చేరాడు. నీవు తెలుగులో తర్ఫీదు ఇయ్యి. అవతల చూచుకుందాం" అన్నాడు. అందుకు సిద్ధమని సముద్రాల వచ్చి, గుంటూరులో కుప్పుస్వామిచౌదరి గారి లాడ్జిలో వుంటూ, చంద్రమౌళిగారికి తెలుగు చెప్పడం మొదలుపెట్టాడు. రామబ్రహ్మంగారు చీరాలనుండి వచ్చినప్పుడల్లా సముద్రాలను కలుసుకోవడం జరుగుతూ వుండేది.

ఇప్పుడు రామబ్రహ్మం, సముద్రాలగార్లను యిద్దరినీ ఎలా ఆదుకోవడం అనే సమస్య కలిగింది కుప్పుస్వామిగారికి.

*ఇంతలో జస్టిసుపక్ష నాయకుడుగా కుప్పుస్వామిగారికి మిత్రుడైన బొల్లిని మునిస్వామినాయుడుగారు ఎన్నికై మద్రాసు రాష్ట్రానికి ప్రధానమంత్రైనాడు. కుప్పుస్వామిగారు శాసనసభ్యుడైనందున తరచూ మద్రాసుకు వెళుతూ వుండేవారు. రామబ్రహ్మంగారినిగూడ వెంటబెట్టుకొని పోతూ నాయుడుగారికి పరిచయం చేశాడు.*

ఒకనాడు గుంటూరులో కవిరాజు రామస్వామి చౌదరిగారూ, రామబ్రహ్మంగారూ, ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులుగారూ, చిలుకూరి వీరభద్రరావుగారు వ్రాసిన ఆంధ్రుల చరిత్రను గురించి చర్చిస్తూ వున్నారు. మధ్యలో కుప్పుస్వామిగారికొక ఆలోచన తట్టింది. కట్టమంచి రామలింగారెడ్డిగారు రెడ్ల చరిత్రను శోధింపచేస్తున్నారట. అదైనా ఆంధ్రుల సమగ్ర చరిత్రకు ఉపయోగపడేదేకదా! మనం కమ్మచరిత్ర పరిశోధన ఎందుకు జరపగూడదు? అందుకయ్యే ఖర్చంతా నేను పెట్టుకుంటాను. ఇందుకు మీరేమంటారని ప్రశ్నించాడు. ఓ చాలా బాగుందని అందరూ అన్నారు.

ఈ పరిశోధన జరగాలంటే మద్రాసు ఓరియంటల్ లైబ్రరీలో జరగాలి. పాత రికార్డులన్నీ గాలించాలి. అందుకు ఎవరు వెళ్ళడం అని సమస్య వచ్చింది.

ఆయన ఏమన్నాడంటే "బాబూ రామబ్రహ్మం. నీవూ సముద్రాల ముందు బయలుదేరండి. రామస్వామి అప్పుడప్పుడూ వస్తూఉంటాడు. మీరు వుండటానికి భోజన వసతులు నేను ఏర్పాటు చేస్తా"నని ప్రక్కనేవున్న నన్ను పిలిచి, "ఏం రాఘవయ్యా! నీవు వెంటనే నీ భార్యను తీసుకొని మద్రాసుకు ప్రయాణంకట్టు. అక్కడ ఒక యిల్లు తీసుకో. నీవూ, రామబ్రహ్మం, రామస్వామి, సముద్రాల ఈ కార్యక్రమం సాగించండి. నీవు జాబులు వ్రాయి. నేను డబ్బు పంపుతూ వుంటా"నని చెప్పాడు.

సరేనని నేను మద్రాసువెళ్ళి ట్రిప్లికేను బెల్సు రోడ్డులో 2వ నంబరు యిల్లు అద్దెకు తీసుకొన్నాను. అందరం మకాం వేశాం. మా పరిశోధన జరుగుతూవుంది.

ఆ రోజుల్లో నేనూ, రామబ్రహ్మంగారూ ఎక్కువగా మునిస్వామి నాయుడుగారి వద్దకు వెళుతూవుండేవాళ్ళం. నేను నాయుడుగారి ప్రోత్సాహంవల్లనే తిరుత్తని జమీన్ రైతు సంఘం తరఫున 'కడగండ్లు' అను గీతాలు వ్రాసి ప్రచారం చేసి వస్తూవుండేవాణ్ణి.

రామబ్రహ్మంగారు ఎంత ఉత్సాహవంతుడో అంతే ఉద్రేకి. కోపం వచ్చినా సంతోషం వచ్చినా ఆపుకోలేడు. పసిపిల్లల మనస్తత్వం.

కృష్ణాజిల్లా బోర్డు వ్యవహారాల్లో నాయుడుగారు మీర్జాపురం రాజాకు ఒక సందర్భంలో అనుకూలం చేశాడు. అందుకు రామబ్రహ్మంగారికి కోపం వచ్చింది. వెంటనే మునిస్వామినాయుడుగారి పరిపాలనను విమర్శిస్తూ ఒక చిన్న వ్యాసం వ్రాసి, ఆంధ్రపత్రికకు పంపాడు. ఆంధ్రపత్రిక సహాయసంపాదకుడుగావున్న కొడాలి శివరామకృష్ణరావు గారు మునిస్వామి నాయుడుగారికి ముఖ్యుడు. ఆ వ్యాసాన్ని ఆయన నాయుడుగారికి ఇచ్చాడు.

నాయుడుగారు నన్ను పిలిచి ఆ వ్యాసం చూపించి రామబ్రహ్మంతో మాట్లాడి, యింటికి తీసుకురమ్మన్నాడు. సరేనని నేనాబాధ్యత వహించి, రామబ్రహ్మంగారికి నచ్చజెప్పి ఆయన్ను నాయుడుగారివద్దకు తీసుకుపోయాను. ఒక అరగంటలో ఆ వ్యాసాన్ని ఉపసంహరించడం జరిగింది.

అప్పట్నుంచి మళ్ళీ రామబ్రహ్మంగారికి నాయుడుగారికి రాకపోకలు జరుగుతూ వుండేవి. *సమదర్శిని పత్రిక*కు రామబ్రహ్మం సంపాదకత్వం వహించడం. బొబ్బిలి రాజాకు మునిస్వామి నాయుడుగారికి తంజావూరులో జరిగిన సంఘర్షణకు పిమ్మట రామబ్రహ్మంగారు ఆ సంపాదకత్వానికి రాజీనామా యివ్వడం అది ఒక చరిత్ర.

వేలు పిక్చరు దాసుగారు తెలుగు సినిమాలు తియ్యడం ప్రారంభించాడు. రామబ్రహ్మంగారితో ప్రతిరోజూ కలుసుకొని

చర్చిస్తూ వుండడం యీ విధంగా జరుగుతుంది. దాసుగారికి రామబ్రహ్మం ముఖ్య సలహాదారుడైనాడు.

ఇంతలో సరస్వతీటాకీసు పొరేపల్లి శేషయ్యగారు 'ద్రౌపదీ వస్త్రాపహరణం' తీయడంలో రామబ్రహ్మంగారి సహాయమర్థించాడు. ఆ పిక్చరు నిర్మాణంలో రామబ్రహ్మం గారు నడుంగట్టుకని పనిచేశాడు.

బళ్ళారి రాఘవరావుగారు యాక్టుచేసిన 'ద్రౌపదీ మానసంరక్షణం', 'వస్త్రాపహరణం' ముందు నిలవలేక పోయింది. రామబ్రహ్మంగారికి గొప్ప అనుభవం వచ్చింది. ఆయన దృష్టి సినిమా రంగంవంక తిరిగింది. సముద్రాల గూడా ఆయన అడుగుజాడల్లో పోతూవచ్చాడు. చల్లపల్లి రాజాగారికీ, మీర్జాపురం జమీందారుగారికి జిల్లా బోర్డు ఎన్నికల్లో పోటీ జరిగింది. కొండపల్లి ఫిర్కాలో గంగాధరరావు నాయుడుగారితో చల్లపల్లి రాజా ఎదుర్కొని జయించారు. ఆ ఎన్నికల్లో కుప్పుస్వామిగారు తిష్ఠవేసి ఎలక్షన్ రంగం నడిపించాడు. అప్పుడే చల్లపల్లి రాజాగారు రామబ్రహ్మంగారి చేత 'ప్రజామిత్ర' పత్రిక పెట్టించారు. రాజాగారు ప్రెసిడెంటయ్యాడు.

కుప్పుస్వామిగారికి మరో ఆలోచన కలిగింది. రామబ్రహ్మంగారిని ఎలాగైనా మద్రాసులో ఉంచే ఏర్పాటు చేయాలని; చల్లపల్లి రాజాగారికి నచ్చచెప్పి 'ప్రజామిత్ర'ను మద్రాసుకు మార్పించాడు. రామబ్రహ్మంగారికి దాన్ని అప్పగించారు. సముద్రాలగూడా ప్రజామిత్రలో ప్రవేశించాడు.

ఆచారప్పన్ వీధిలో బి.యన్.కె. ప్రెస్‌లో ఆ పత్రిక అచ్చవుతూ వుండేది. అది బి.యన్. రెడ్డిగారి సొంత ప్రెస్సు.

రామబ్రహ్మంగారిది భారీచెయ్యి. ఏ పరిస్థితుల్లోగూడా దర్జాకు లోటురాకూడదు. డబ్బు చేతిలో చాలినంత లేకపోయినాసరే, ట్రాంగాని, బస్సుగాని ఎక్కి పొయ్యేవాడు కాదు. ఎంత దూరమైనా టాక్సీలో తిరగాల్సిందే. 'ప్రజామిత్ర' ఆఫీసకు వచ్చేవాడు. ఏమైనా చందాలు వచ్చినవా అని అడిగేవాడు. అవి తీసుకుని టాక్సీలో వెళ్ళేవాడు.

ఇలా వుంటూ సారథి ఫిలింస్ స్థాపించాడు. డైరెక్టర్ల బోర్డు ఛైర్మన్ చల్లపల్లి రాజాగారు. డైరెక్టర్లుగా తుమ్మల సీతారామబ్రహ్మం, లింగ సత్యనారాయణ వగైరా వుండేవారు. తాను మేనేజింగు డైరెక్టర్.

**మాలపిల్ల**

తాను సహజంగా అభ్యుదయ భావాలుగలవాడు. నిత్య ఖద్దరుధారి. బట్టతల, చారెడు కళ్ళు, పేటంచు ఖద్దరు కండువా వేసుకొని వస్తుంటే సముద్రంలో ఓడ కదిలి వస్తున్నట్టుండేది.

మొదట్నుంచీ కాంగ్రెసు మనస్తత్వం ఎక్కువ. తెనాలిలో సత్యాగ్రహ శిబిరం నడిపినవారిలో ఈయనగూడ ముఖ్యుడు. *"వీరగంధము తెచ్చినారము వీరు దెవ్వరో తెల్పరి"* అన్న జాతీయ గీతం కవిరాజుగారి కలం నుండి అప్పుడు వెలువడ్డదే.

తనకు ఫిలిం ఫీల్డులో బాగా అనుభవం ఉన్నది. సారథి తరఫున కాంగ్రెసు భావాలకు అనుగుణంగా *'మాలపిల్ల'* అను విప్లవాత్మక చిత్రం తీయాలని నడుంగట్టాడు. ఆ చిత్రం బయటకు రావడంతో సనాతనుల్లో తీవ్రమైన ఆందోళన కలిగించింది. చాల ప్రతిఘటన గూడ వచ్చింది. కాని ఆయన ఏమీ లెక్కచేయలేదు. అందులో హీరోయిన్ కాంచనమాల. చిత్రం గొప్ప విజయం పొందింది. ఆ చిత్రానికి భీమవరపు నరసింహారావు మ్యూజిక్ డైరెక్టరుగా ఉన్నాడు. ఆ పాటలు ఎంతో ప్రజాదరణ పొందాయి. సాంఘిక విప్లవానికి *మాలపిల్ల* నాందిపలికింది.

**రైతుబిడ్డ**

అంతటితో ఊరుకున్నాడా? జమీందారీవిధానాన్ని దుమ్ము తూర్పరబట్టే *రైతుబిడ్డ* చిత్రాన్ని తీయడానికి పూనుకున్నాడంటే ఎంత దమ్ముండాలి?

సారథి ఫిలిమ్స్ డైరెక్టర్ల బోర్డు ఛైర్మన్ చల్లపల్లి రాజాగారు గూడ అందుకు ఏమీ అభ్యంతరం చెప్పలేదు సరిగదా చేయూత గూడ యిచ్చారు.

ఒకనాడు నాకు గుంటూరుకు టెలిగ్రాం వచ్చింది. వెంటనే మద్రాసుకు రమ్మని. సెంట్రల్ స్టేషన్‌కు ఆయన వచ్చాడు. కారులో పోతూ అన్నాడుగదా "నిన్నెందుకు పిలిచానో తెలుసా? నీవు *రైతుబిడ్డ*లో పాటలు వ్రాయాలి. హీరో రామిరెడ్డి వేషంకూడా వెయ్యాలి" అని చెప్పాడు. నాకేం తోచలేదు. పాటలు వ్రాయడం సరేగాని వేషం వద్దండీ అన్నాను. నీవు ఎదురు మాట్లాడడానికి వీల్లేదని శాసించాడు. చాలా సంవత్సరాలు ఇద్దరం ఒకచోటనే వుండేవాళ్ళం. స్నేహితులం, ఎలా కాదంటాను సరే అన్నాను.

బళ్ళారి రాఘవ రైతు నరసి పాత్ర ధరించాడు. సూర్యకుమారి రైతుకూతురు. గిడుగు సీతాపతి జమీందారు. నేను రైతు ప్రతినిధి రామిరెడ్డి. సూరిబాబు, ఎస్. వరలక్ష్మి రైతుగీతాలు ప్రబోధచేసే ప్రచారకులు.

డైరెక్టర్‌గా రామబ్రహ్మంగారు. రచన గోపీచందు, తాతాజీ. అసిస్టెంటు డైరెక్టర్సుగా మాడపాటి రామచంద్రరావు (వెఱ్రిబాలెం) కపిల కాశీపతి, కాటూరి మోహన్ ఈ విధంగా నిర్ణయమైంది.

ఎమ్.పి.పి.సి. స్టూడియోలో ప్రారంభోత్సవం జరిగింది. సర్ కె.వి. రెడ్డి నాయుడు గారు రామబ్రహ్మంగారి సామర్థ్యాన్ని, సాహసాన్ని ఎంతో మెచ్చుకొని, మద్రాసులో తెలుగువాళ్ళ పేరు నిలబెడుతున్నాడని శ్లాఘించారు.

ఆ పిక్చరు కథాగమనం కృత్యాద్య వ్యవస్థను తెచ్చిపెట్టింది. జమీందారులు పిక్చరును బ్యాన్ చేయిస్తారేమోనని అడుగడుక్కు అనుమానించడం జరిగింది. ఎప్పుడూ ఆయన ఆందోళనలో మునిగివుండేవాడు. ఎలాగైనా ఆ చిత్రాన్ని బయటకు తీసుకురావాలని భల్లూకపు పట్టుపట్టాడు.

సాయంత్రం కాగానే టాపుతీసిన కారులో ప్రతిరోజు విశ్రాంతికి బీచీకి వెళుతూవుండేవాడు. ఆయనవెంట నేనూ తయారు.

ఆయన వెళ్ళేసమయాల్లో మద్రాసులో గొప్ప క్రిమినల్ లాయరు, బారిష్టరు వి.యన్. ఎతిరాజు పెద్ద కారులో షికారు వస్తూవుండేవాడు. రామబ్రహ్మంగారు కనపడగానే ఆయన విష్‌చేస్తూ వుండేవాడు. ఇలా ప్రతిరోజూ జరుగుతూవుండేది. ఆయనకు రామబ్రహ్మంగారెవరో తెలియదుగాని రామబ్రహ్మంగారిని చూడగానే విష్‌చేసేవాడు. "రాఘవయ్యా ఎవరీయన? ప్రతిరోజూ నాకు నమస్కరిస్తాడు" అని నన్నడిగారు రామబ్రహ్మంగారు. ఆయనెవరోకాదండి, మద్రాసులో ప్రసిద్ధిచెందిన లాయర్ వి.యన్. ఎతిరాజు అని చెప్పాను. అందుకు ఆశ్చర్యపడ్డాడు. అసలు సంగతేమిటంటే రామబ్రహ్మంగారి హుందాతనం, ఆయన ఖద్దరు డ్రస్సు, ఆ రోజుల్లో ఆయనకున్న కారు – వాటినిబట్టి ఆయన ఈయనెవరో గొప్పవాడని నమస్కరించేవాడు. అటువంటిది రామబ్రహ్మంలో ఉన్న ఆకర్షణ.

*రైతుబిడ్డ* షూటింగు జరుగుతూవుంది. లాడ్జిలోనే ఆర్టిస్టులకూ టెక్నీషియన్లకూ, అందరికీ భోజనం పెడుతూవుండేవారు. ఆయన ఆజ్ఞ లేనిదే ఎవరూ కాంపౌండు దాటి బైటికి వెళ్ళడానికి వీల్లేదు. అది సుగ్రీవాజ్ఞ. ఆర్టిస్టుల్లో ఒకతను బజారులోకి వెళ్ళి తాగి అల్లరి చేశాడు. ఈ సంగతి మర్నాడు ఉదయం ఆయనకు ఎవరో చెప్పారు. వెంటనే అతన్ని పిలిచి చెడామడా చివాట్లు పెట్టడం జరిగింది. ఆ కోపంతో అతడు ఆ సాయంత్రం కత్తి తీసుకొని రామబ్రహ్మంగారిని పొడుద్దామని దూసుకుని లోపలకు వచ్చాడు. అందరూ ఏమి జరుగుతుందోనని పరుగులు తీశారు. రామబ్రహ్మంగారు తాంబూలం వేసుకుంటూ హాల్లో కూర్చున్నాడు. అతడు ఆయన్ను చూచే దిగ్భ్రమ చెంది ఆ కత్తిని కిందపారవేసి ఆయన రెండుకాళ్ళూ పట్టుకొని బావురుమని ఏడ్చి, క్షమించమన్నాడు. ఫర్వాలేదులే పొమ్మని, అతనికి కాఫీ ఫలహారం పెట్టించమని ఏర్పాటు చేశాడు.

రామబ్రహ్మంగారికి తమాషా కబుర్లంటే భలే సరదా. ఎప్పుడూ కిలకిల్లాడుతూ నవ్వులతో ప్రతిధ్వనించేది సారథి ఆఫీసు. అడుసుమల్లి బసవయ్యగారి వద్ద స్టిల్సు డిపార్టుమెంటులో ముసునూరి సత్యం అంటే యిప్పుడు జై హిందు సత్యం వర్కు చేస్తూవుండేవాడు. సత్యాన్ని పిలిచి, రోజూ గమ్మత్తు కబుర్లు చెప్పించుకుంటూ కాలక్షేపం చేసేవాడు. సారథి ఆఫీసు ఎప్పుడూ జనంతో కిటకిటలాడుతూ ఉండేది. చందాలకు వచ్చేవాళ్ళతో సహాయానికి వచ్చేవాళ్ళతో కోలాహలంగా ఉండేది. చేతులో డబ్బుంటే లాకేత్వం ఆయన నిఘంటువులో లేదు. వర్షం కురుస్తూ వుంటే హాయి ఫీలయ్యేవాడు. ఫ్యాను గాలంటే మహా యిష్టం.

ఆర్టిస్టుల సాధక బాధకాలు ఆయనకు తెలిసినట్లు ఎవరికీ తెలియవు. ఒకటవతేదీ వచ్చేటప్పటికి అందరికి తప్పకుండా జీతాలు అందించేవాడు. లేకపోతే భార్య మెళ్ళో నగలైనా బ్యాంకులో తాకట్టుపెట్టి తెచ్చి ఇచ్చేవాడు.

*రైతుబిడ్డ* తీసే రోజుల్లోనే ఎమ్.పి.పి.సి. స్టూడియో అనగా ఇప్పటి జెమినీ స్టూడియో రామబ్రహ్మంగారి ఆధిపత్యం క్రిందకు వచ్చేసింది. శైలిన్‌బోస్, ఘటక్, కెమెరామెన్లు, సౌండింజనీయరు విశ్వం, మేనేజర్లు మహదేవన్, సీతారాములు – వీళ్ళందరూ రామబ్రహ్మంగారి యాజమాన్యం కింద పనిచేస్తుండేవారు.

*రైతుబిడ్డ* సెట్టులో ఒకనాడు నేను, రామబ్రహ్మం, బళ్ళారి రాఘవగారు కూర్చుని మాట్లాకుంటున్నాం. అప్పుడు రామబ్రహ్మంగారన్నారుగదా "ఏమండి రాఘవగారూ! మీరూ నేనూ ఈ పిక్చరులో కలుసుకున్నాం. దేశంలో ప్రజలు గొప్పగా ఎక్స్‌పెక్ట్ చేస్తారు. కళాత్మకంగా ఉండాలి ఈ చిత్రం" అని హెచ్చరించాడు. అప్పుడు రాఘవగారు "అయ్యా! రామబ్రహ్మం! నీవు ఆ ఆలోచనలు పెట్టుకోవద్దు. నేను అటువంటి

అభిప్రాయాలతోనే చెడ్డాను. "ద్రౌపది మానసంరక్షణం"లో ఆ ఆశయాలతోనే యాక్టు చేశాను. కాని మీరు తీసిన 'వస్త్రాపహరణం' ముందు ఎగిరిపోయింది.

నేను ఒకటి చెప్తాను విను. ప్రాక్టీసువస్తే సక్సెస్‌ఫుల్ లాయర్. బాగా డబ్బొస్తే సక్సెస్‌ఫుల్ పిక్చరు. ఇదీ కొలత. కళ అనేమాట తర్వాత సంగతి. ముందు వ్యాపారం సంగతి చూడాలి" అన్నాడు. అప్పుడు రామబ్రహ్మంగారు పకపకా నవ్వి "ఆచారిగారూ! భలే సలహా యిచ్చారే" అన్నాడు.

ఎలాగైతేనేం ఎన్నో సమస్యలను ఎదుర్కొని *రైతుబిడ్డను* పూర్తిచేసి రిలీజ్ చేశాడు. అప్పటి ప్రభుత్వం జమీందారీ ఏరియాల్లో ఆ చిత్రం ప్రదర్శించరాదని ఆంక్ష విధించింది. *మాలపిల్ల* తీసిన వెంటనే మాజీ మంత్రి కడప కోటిరెడ్డిగారు, రామసుబ్బమ్మగారు రామబ్రహ్మంగారి దర్శకత్వంక్రింద ఒక చిత్రం 'ఇల్లాలు' తీయించారు. ఆ చిత్రంలో మ్యూజిక్ డైరెక్టరుగా మాస్టరు సాలూరి రాజేశ్వరరావుగారికి మొదట అవకాశమిచ్చింది రామబ్రహ్మంగారే.

*రైతుబిడ్డ* నిర్మాణానంతరం కోయంబత్తూరు శ్రీరాములు నాయుడుగారు 'అపవాదు' అను పిక్చరు తీయడానికి రామబ్రహ్మంగారిని డైరెక్టరుగా ఎన్నుకొన్నారు.

ఇలావుండగా మద్రాసుకు ఎమ్.ఎన్. రాయ్‌గారు వచ్చారు. ఆయనకు రామబ్రహ్మంగారు సారధి ఆఫీసులో ఒక డిన్నరు యిచ్చారు. మద్రాసులో పత్రికావిలేఖరులను, ప్రముఖులనుగూడ ఆహ్వానించడం జరిగింది. ఆ డిన్నరు ఎలా యివ్వాలీ అన్న చర్చానంతరం నాన్‌వెజిటేరియన్ అయితే బాగుంటుందని కొందరు సలహాయిచ్చారు. రామబ్రహ్మంగారు ప్యూర్ వెజిటేరియన్. అందువల్ల ఆ బాధ్యతను నాకప్పగించాడు. నేను ఘటికులైన వంటవాళ్ళచేత పలావ్ తయారుచేయించాను. డిన్నరు జరుగుతూవుంది. చివర అయిటం వచ్చేటప్పటికి పెరుగు పెరుగు అని కొందరు అడిగారు. నేను పెరుగు సంగతి మరచిపోయి ఆ అయిటంమాటే అనుకోలేదు. రామబ్రహ్మంగారు ఆందోళనపడుతూ వున్నాడు. ఇంతలో ఎమ్.ఎన్. రాయ్ లేచి ఒక ఉపన్యాసం దంచేశాడు. రష్యామీద జర్మనీ యుద్ధం ప్రకటిస్తుందని ఆ సమావేశంలో ఖండితంగా చెప్పాడు. పత్రికావిలేఖరులు ఆయనపై అనేక ప్రశ్నల వర్షం కురిపించారు. ఆయన సమాధానాలు చెప్పి తర్వాత మీరే నిజం తెలుసుకుంటారులే అని కులాసాగా కాలక్షేపణంజేసి వెళ్ళాడు. ఫిలిం నిర్మాణంలో వున్నా 'ప్రజామిత్ర' సంపాదకీయాలు వ్రాయడం, పత్రిక నడపంలో శ్రద్ధ చూపడం మానలేదు. ప్రతివారం ఆంధ్ర రాష్ట్రాన్ని గురించి 'రాష్ట్ర గీతికలు' అనే పద్యాలు నాచే వ్రాయించి, ప్రకటించేవాడు. ఆయనవద్ద ఒక స్వభావం ఉంది. తనకు అక్రమమని తోచిన ప్రతి అంశంపైనా కొమ్ములు తిరిగినవాడినైనా లెక్కచేయకుండా విమర్శించేవాడు. ఆ రోజుల్లో ఒక బోగస్ సినిమా కంపెనీ బెజవాడలో ఏదో వెలసిందని దానిపై ఎన్నో విమర్శలు వ్రాసి ప్రకటించాడు.

## బెస్టు డైరెక్టరు

తర్వాత *అపవాదు* తీయడానికి కోయంబత్తూరుకు మకాం మార్చాడు. మేమంతా ఆయన వెంట బయలుదేరి పోయాం. ఆ సమయంలో ఆంధ్ర పత్రికవారు ఒక ఫిలిం బ్యాలెట్ నిర్వహించారు. బెస్టు డైరెక్టరు ఆ సంవత్సరం ఎవరు? అని అందుకు ప్రజాభిప్రాయం ఓట్లద్వారా సేకరించారు. రామబ్రహ్మంగారికి అఖండమైన మెజారిటీ వచ్చింది. మద్రాసులో ఆయనకు ఆంధ్రపత్రికవారు గొప్ప నటరాజ విగ్రహం బెస్టు డైరెక్టరు చిహ్నంగా యిచ్చి సన్మానించారు. ఆ విగ్రహంతో కోయంబత్తూరు స్టేషనులో రామబ్రహ్మంగారు దిగగానే ఆర్టిస్టులు, పురప్రముఖులు అందరూ జయజయ ధ్వానాలతో ఊరేగిస్తూ ఆయన్ను సెంట్రల్ స్టూడియోవద్దకు తీసుకొని పోయారు.

ఆ 'అపవాదు' చిత్రానికి శ్రీ కె.యస్. ప్రకాశరావుగారిని హీరోగా ఎన్నుకుంది రామబ్రహ్మంగారే.

తర్వాత కె.ఎస్. ప్రకాశరావుగారు హీరోగా 'పత్ని' చిత్రం తీశాడు.

కొన్నాళ్ళకు అక్కినేని నాగేశ్వరరావుగారికి 'మాయలోకం'లో, శరాబందిరాజు పాత్ర యిచ్చి ఆ చిత్రం పూర్తిచేశారు. *పంతులమ్మ* చిత్రంగూడా ఆయన నిర్మించిందే. *పల్నాటియుద్ధం* తీసి అందులో బ్రహ్మనాయుడు పాత్రను అహింసవాదిగా చిత్రించి, తన దూరదృష్టిని ప్రదర్శించాడు. అందుకు అందరూ ఆయన్ను ఎంతో ప్రశంసించారు.

రామబ్రహ్మంగారిది *దొందు* శరీరం. బాధలను ఎక్కువ ఓర్చుకోలేరు. పైగా అతిమూత్రవ్యాధి. మధుమేహం జబ్బు వుంది. చివరకు ఆ జబ్బువల్లనే వ్రణంలేచి కాలగర్భంలో లీనమైపోయాడు. ఆనాడు ప్రతి ఆంధ్రుడు అంత విప్లవ భాగాలుగలవాడు హిందీ ఫీల్డులోగూడ పుట్టలేదని

కన్నీరుగార్చాడు. పత్రికలన్నీ పతాక శీర్షికలతో ఆయన మరణాన్ని గురించి సంతాపాన్ని తెలియజేశాయి. ఆయన ఎందరినో నూతన ఆర్టిస్టులను, టెక్నిషియన్లను సృష్టించిన చిత్రబ్రహ్మ. అంతటి ధైర్యస్థైర్యాలుగల విప్లవ భావుకులు ఎవరున్నారు?

రైతుబిడ్డ, మాలపిల్ల చిత్రాల నెగటీవులను మాత్రం భద్రంగా కాపాడి, సారధి ఫిలిమ్సు వై. రామకృష్ణ ప్రసాద్‌గారు పూనా ఫిలిం ఇన్‌స్టిట్యూటుకు యిచ్చారు. అవి అక్కడ సురక్షితంగా వున్నాయి.

ఒక్కమాటలో చెప్పాలంటే రామబ్రహ్మం బహుముఖ ప్రజ్ఞాశాలి. రాజకీయాలు కాచి వడపోసిన దేశాభిమాని. స్నేహపాత్రుడు. నియమం తప్పని ఖద్దరుధారి. మంచి వక్త. 'గండికోట పతనం' నాటకం వ్రాసి అనేక గ్రామాల్లో ప్రదర్శింపజేశాడు. రేడియోల్లో గూడ ప్రసారం చేయించాడు. 'గండికోట పెమ్మసాని తిమ్మానాయుడు' అను పుస్తకాన్నిగూడ రచించి, ప్రకటించాడు. ఆయన ఎందరికో సహాయంచేసి పైకితెచ్చాడు. ఆ మహామహునకు నా శ్రద్ధాంజలి!



కొసరాజు రాఘవయ్య చౌదరి
(1905-1997)



స్వతంత్ర రచనలంటే ఎలాగైనా చెయ్యొచ్చు. కానీ అనువాద రచన అంటే కష్టమే. స్వేచ్ఛానువాదం అంటే తల రోట్లోపెట్టినట్టే. ఎందుకంటే స్వేచ్ఛ అంటే ఇష్టమొచ్చినట్టో, తోచినట్టో రాసిపారేయడంకాదు. మూలంలోని భావాన్ని ఆకళింపు చేసుకోవాలి. మూలరచన భాషలోని ఔచిత్యాన్ని, మర్మాన్నీ గ్రహించాలి. ఆ సారాంశాన్ని సరాసరి మన భాషలోనికి సొంపుగా ప్రవహింపజేయాలి. ఈ సొంపుదగ్గరే రచయిత తనదైన శైలిని ప్రదర్శిస్తాడు. ఆ ఒక్క విషయంలోనే వుంది స్వేచ్ఛ. కానీ నిజమైన రచయిత అక్కడే రాణిస్తాడు. పాఠకుల మన్ననలందుతాడు. ఆ ఆనందంలో ఉక్కిరిబిక్కిరై పడ్డ కష్టం మర్చిపోతాడు.

బైరన్‌ను తెలుగులోకి తెచ్చిన రచయితను ప్రశంసలతో ముంచెత్తాల్సిన బాధ్యత మనందరిదీను. ఎంత కష్టపడ్డారు? చెప్పాలా? తలను బైరన్ రోట్లో పెట్టాడు. తనకోసవా? మనకోసం! ఇంతవరకూ మనమెరుగని కవిని, కవితాత్మనీ మనకి చూపించడానికి! ఎంత బాగా చూపించారు, తనదైన వాణి, బాణిలో అంటే సొంపైన తన శైలీదర్పణంలో! అద్భుతం అందామా? ఊహు ! సాధారణంగా వుంది. అపూర్వాద్భుతం అందాం. పుస్తకంలానే కొత్తగా వుంటుంది.

బైరన్ లాగా నిజాన్ని నిర్భయంగా, నిర్ద్వంద్వంగా, నిశ్శేషంగా వెల్లడించేవాళ్ళు కోటికొక్కరుంటారు. తన అంతరంగంలో జరిగే సంఘర్షణలన్ని వెల్లడించేవారెందరు? బహు కొద్దిమంది. కారణం... దానికి సాహసం కావాలి. అది పుష్కలంగా ఉన్న కవి బైరన్. అతనో సాహసి. అతని జీవితం ఈ పుస్తకం. దీన్ని ఆసాంతం చదివేలా, మళ్ళీమళ్ళీ చదివేలా చేస్తారు ముగ్గురు. ఒకరు.. కవి బైరన్. రెండవది... మూలరచన చేసిన ఆంద్రీ మార్వా, మూడొవవారు కవి బైరన్‌లో పరకాయప్రవేశం చేసి ఈ పుస్తకాన్ని మనకందించిన అనువాదకుడు.

ఇంత... ఇంత కాలానికి.. ఈ ఖండంలో... ఈ దేశంలో... ఈ ప్రాంతంలో.. తెలుగువారికి ఇంత వరకూ నామమాత్రంగా తెలిసిన తను అందుబాటు పరిధిలో సమగ్రంగా తెలుస్తున్నందుకు బైరన్ ఎక్కడున్నా సంతోషించడం ఖాయం. అలా తెలియజేసిన తెలుగు సేత ఆ బైరన్‌కి ఒక ట్రిబ్యూట్. సందేహం లేదు. తెలుగు సాహిత్య పరంపరలో, అనువాదపు అరలో పదికాలాలపాటు నిలిచేది బైరన్ తెలుగు పుస్తకం.

– **యన్.యస్. నారాయణబాబు,** మాధ్యమాల రచయిత, హైదరాబాద్.

(మీ కాపీ కోసం మిసిమికి మూడు సంవత్సరాల చందా పంపండి)

# జీనోమ్ కథనమ్

– ము.పా.సా.

**(2) జీవజాతులు**

ఎన్ని అద్భుతాలు సాధించనీ, మరెన్ని మహోన్నత లక్ష్యాలు చేరుకోనీ, మనిషి తనలోని అనాది జీవలక్షణాలను మాత్రం అధిగమించలేదు.

*–చార్లెస్ డార్విన్*

కొన్నిసార్లు కళ్ళముందు కనిపిస్తున్న వాస్తవాన్నికూడా చూడటానికి నిరాకరిస్తాం మనం. మనుషులకు 24 జతల క్రోమోసోమ్స్ వుంటాయని అందరూ అంగీకరించారు. దీని గురించి ఎవరికీ ఏ సందేహమూ రాలేదు. 1921లో థియోఫిలస్ పెయింటర్ అనబడే శాస్త్రజ్ఞుడు ఈ సంఖ్యను నిర్ధారించాడు.

అప్పుడప్పుడూ కొందరికి యివి యిరవైమూడు జతలేమోనని సందేహం వచ్చినా, ముప్ఫైఏళ్ళపాటు దీన్నెవరూ గట్టిగా ప్రశ్నించలేదు. చివరికి (1955లో) జో హిన్ జియో (Tjio) అనబడే ఇండోనేషియన్, ఆధునిక పద్ధతులలో పరిశోధన కొనసాగించి, యిరవైమూడని తేల్చాడు. కళ్ళుండే చూడలేని అంధులుంటారనటానికి యింతకన్నా మంచి నిదర్శనమేముంది!

నిజానికి, మనుషుల్లో యిరవైమూడు జతలే వుండటం కాస్త చిత్రమే. ఎందుకంటే, చింపాంజీలలో, గొరిల్లాలలో, ఒరాంగుటాన్‌లలో యిరవైనాలుగు జతల క్రోమోసోమ్ లుంటాయి. అంటే, కోతి జాతికి చెందిన జీవులలో మనుషులే మినహాయింపు. అయితే దీనికో కారణముంది. మనలో ఒక జత తగ్గలేదు. ఇతర కోతి జాతులలో వున్న రెండు క్రోమోసోమ్‌లు ఒకటిగా కలసిపోతాయి. అదే క్రోమోసోమ్ – 2. మనకున్న రెండవ అతి పెద్ద క్రోమోసోమ్.

జీవ పరిణామ చరిత్రలో మానవుడే అత్యున్నత దశ అనుకుంటాం. కాని, అది కేవలం మన ఊహ మాత్రమే. పరిణామ దశల్లో అత్యున్నతమూ, శిఖరాయమానమూ అంటూ వుండవు. అవసరాన్నిబట్టి, అవకాశాల్నిబట్టి జీవం తన రూపం మార్చుకుంటూ వుంటుంది. ఉదాహరణకు, అట్లాంటిక్ మహాసముద్రపు అట్టడుగున వున్న బ్లాక్ స్మోకర్ బాక్టీరియం, మనుషులకన్న ఎన్నో రెట్లు ఎక్కువ పరిణామం చెందింది (ఒక జీవి, జీవితకాలం ఎంత తక్కువైతే అది అంత ఎక్కువ పరిణామం చెందుతుంది).

మనం హ్యూమన్ జీనోమ్ గురించి మాట్లాడు కుంటున్నామంటే మానవజాతి, మిగతా అన్ని జీవజాతుల కన్నా ముఖ్యమైందనుకోవద్దు. సరే, మనుషులు ప్రధానమైన దశ అని అంగీకరిద్దాం (నిజానికి, ఈ భూగోళం మీది ప్రతీ జీవజాతీ విలక్షణమైందే. ఒక్కొక్కదానికీ ఒక్కో ప్రత్యేకత వుంది).

**ఇంతకూ, మనమెందుకు ముఖ్యం?**

పర్యావరణంలో అత్యంత ప్రధాన భూమిక పోషిస్తున్నాం మనం. ఈ భూగోళం మీది యించుమించు అన్ని ప్రాంతాలలోనూ వున్న జీవజాతి మానవులే. మన జనాభా ఆరు బిలియన్లు దాటింది (ఇది 1999 నాటి అంచనా). బరువు 300 మిలియన్ టన్నులు. మనకన్నా పెద్ద జంతువుల్నీ, యితర అన్నిరకాల జంతువుల్నీ మచ్చిక చేశాం. మనం కట్టిన కంచెల్లో, దొడ్లలోనే అవి నివసిస్తున్నాయి. అన్ని వాతావరణ పరిస్థితులకూ అలవాటు పడ్డాడు మానవుడు. అయితే, ఇవన్నీ మన ప్రత్యేకతలు గనుక, మన కథ సుఖాంతమవుతుందన్న ఆశ పెట్టుకోవద్దు.

పదిహేను మిలియన్ సంవత్సరాలనాడే కనుమరుగైన కోతిజాతికి చెందినవాడు మానవుడు. నలభై అయిదు మిలియన్ సంవత్సరాల క్రితమే అంతరించిన మరోరకం కోతులు కూడా మన పూర్వీకులే. 200 మిలియన్ సంవత్సరాలనాడు చెట్లమీద బతికిన జీవలక్షణాలూ మనలో

వున్నాయి (ఈ జీవులే తరువాత డైనోసార్లుగా మారాయి). అనంతకోటి జన్మల్లో చేపజన్మ కూడా మనదే. అంతకుముందు, 500 మిలియన్ సంవత్సరాలనాటి జీవులమూ మనమే. చూశారా, ఎన్ని అవాంతరాలను తట్టుకుని మానవజన్మ దాకా వచ్చామో!

జీవనపోరాటాలలో రాటుదేలిన 'లూకా'లం మనం. రక్తమాంసాలనబడే ఈ శరీరాలను పునరుత్పత్తికి మంత్రాల్లా ఉపయోగిస్తున్నాం. అయితే, ప్రతిసారీ అనుకున్నట్టే జరగలేదు. పరిణామదశల్లో ఊహించని మలుపులెన్నో! ఈ సుదీర్ఘకాలంలో ట్రిలియన్లకొద్దీ కొత్త శరీరాలు ఏర్పడ్డాయి. కానీ పరిస్థితులను తట్టుకొని నిలబడలేక అనతికాలంలోనే అంతరించాయి. అంటే, రసాయనాలను డి.ఎన్.ఎ. గానూ, ప్రొటీన్‌గానూ మార్చగల సెల్స్ వున్న శరీరాలు మాత్రమే కాలపరీక్షలో నెగ్గుకొచ్చాయి. ఈ రకమైన జీవయుద్ధాలు మూడు బిలియన్ సంవత్సరాలపాటు కొనసాగాయి.

చివరికి, బిలియన్ సంవత్సరాలనాడు, అకస్మాత్తుగా, పెద్దదై పరిమాణంలో బహు కణజీవులుద్భవించాయి. అప్పుడప్పుడూ వుల్కలు, గ్రహశకలాలతో కొన్ని జాతులు రెప్పపాటులో అంతరించినా, ఏదో ఒక యితర రూపంలో అవి అభివృద్ధి చెందుతూనే వచ్చాయి. ప్రతి హానికీ, వీటి మెదడు పరిమాణం పెరిగింది.

నాలుగు బిలియన్ సంవత్సరాల చరిత్రను మనం చిటికెలో ముగించుకొని పది మిలియన్ సంవత్సరాలదాకా వద్దాం. కీటకాలు, చేపలు, డైనోసార్లు, పక్షుల తర్వాత అతిపెద్ద మెదడుతో అవతరించిన జీవి కోతి. ఆ రోజుల్లో (పది మిలియన్ సంవత్సరాలనాడు) భూమ్మీద రెండు రకాల కోతులు నివసించాయి. ఒకటి గొరిల్లాల పూర్వీకులు. మరొకటి చింపాంజీలు (మన తొలి తరం). మన జన్యువులు చెప్పిన కథ యిది. చింపాంజీలు, మనుషుల మధ్య విభజన అయిదు మిలియన్ సంవత్సరాలలోపే జరిగింది.

అయితే, ఈ మాలిక్యులార్ గడియారం ఆధారంగా సంవత్సరాలను ఖచ్చితంగా లెక్కకట్టటం కష్టమే. ఎందుకంటే ఈ గడియారం కాస్త స్లోగా తిరుగుతుంది.

చింపాంజీలలోని రెండు క్రోమోసోమ్‌లు కలసి మనలోని క్రోమోసోమ్-2 గా ఏర్పడిందన్న విషయం మినహాయిస్తే నిర్మాణంలో పెద్ద తేడాలేదు. రెండు జీనోమ్‌ల పేరాగ్రాఫులూ యించుమించు ఒకలాగే వుంటాయి. కొద్ది అక్షరాల తేడాతో. మనం తొంభైఎనిమిది శాతం చింపాజీలం. అవి తొంభైఎనిమిది శాతం మనుషులే. ఈ సత్యం అంగీకరించటానికి మీకు ఆత్మగౌరవం అడ్డొస్తుంటే, చింపాజీలు, మనుషులు కూడా 98 శాతం గొరిల్లాలే అని తెలుసుకోండి. మనలో, గొరిల్లా లక్షణాలకన్నా చింపాంజీ లక్షణాలే ఎక్కువ.

కాని, ఇది సాధ్యమయ్యే విషయమేనా? అసలు, మనకూ, చింపాజీలకూ ఏమైనా పోలికుందా? తల, శరీరం, కాళ్ళు, చేతులు, ముక్కు ఒకేలా వున్నాయా? మరి 98 శాతం చింపాజీలమెలా అవుతాం? కానీ, కేవలం ఆకారాల గురించి మాట్లాడుకుంటే ఎలా? బంకమట్టితో ఎలుకల్నిచేసి ఒకదాన్ని చింపాంజీగానూ, మరొకదాన్ని మనిషిగానూ మార్చాలనుకున్నామనుకోండి. మరి, బంకమట్టి చింపాంజీగానూ, మనిషిగానూ మారితే ఏమవుతుంది? రెండు ఆకారాలకూ, పళ్ళు, చేతులు, కాళ్ళవేళ్ళు, జుత్తు, యితర శరీర భాగాలు కాస్త తేడావున్నా అవి రెండూ మట్టిబొమ్మలే అని మనకు తెలుసు. 98 శాతం రెండూ ఒకటే! 'ఫలదీకరణ చెందిన అండం ఈ శరీరం' అని అర్థంచేసుకొంటే నిర్మాణాలలోని సారూప్యం స్పష్టమవుతుంది. ఈ రెండు శరీరాలలోని రసాయనిక ప్రక్రియ ఒకటే.

మూడు లక్షల తరాల ముందర 'చింపాంజీ, మనిషి పూర్వీకులు' ఆఫ్రికాలో సంచరించారు. ఇది సుదీర్ఘ కాలమనుకోవచ్చు. కాని పరిణామ క్రమాన్ని సంవత్సరాలలోకాక, వారాలలో మాత్రమే అధ్యయనం చెయ్యాలి. బాక్టీరియా, కేవలం పాతిక సంవత్సరాలలో, యిన్ని తరాల పరిణామ దశలనూ అనుభవించగలదు.

ఇంతకూ, మన ఉమ్మడి పూర్వీకుడు మిస్సింగ్ లింక్ ఎలా వుండివుంటాడు? శిలాజాలను పరిశీలించి, అతడు నాలుగు మిలియన్ సంవత్సరాలనాటి 'కోతి-మనిషి' (ape-man) ఆర్డిపితికస్ అని నిర్ధారించారు. ఇతడి నడ్డి నిటారుగా నడిచే జంతువుదే. గొరిల్లాలకు యిలా వుండే అవకాశం లేదు. మన ఆర్డిపితికస్ మెదడు ఈనాటి చింపాంజీకన్నా చాలా చిన్నది. శాకాహారి. పళ్ళూ, కూరగాయలు మాత్రమే

దాని భోజనం. పురుష ఆంథ్రోపితికస్ శరీరం, స్త్రీకన్నా చాలా పెద్దది. సహజంగా, అరణ్యాలలోనే దాని నివాసం. కాలక్రమంలో ఎక్కడో వీటి జనాభా రెండుగా విడిపోయింది. కొత్త జీవజాతుల ఆవిర్భావ క్రమమిదే అని మనకు తెలుసు. కొన్ని పర్వతాలమీదా, మరికొన్ని మైదాన ప్రాంతాలలో నివాసమేర్పరచుకోవటమో, లేదా నదికి రెండువైపులా స్థిరపడటమో జరిగివుంటుంది. మొత్తంమీద పొడి నేలమీద సంచరించాడు తొలి మానవుడు. ఒక అంచనా ప్రకారం. ఉత్తర ఆఫ్రికాలోని సహారా ఎడారి ఈ రెండు ఆంథ్రోపితికస్ సమూహాల్నీ విడదీసింది.

ఆనాటి విభజనతో మనిషి పూర్వీకుల సంఖ్య చాలా స్వల్పం. చింపాజీలదే మెజారిటీ.

అల్పసంఖ్యాకులలో జన్యుమార్పులకవకాశాలెక్కువ. అలా, రెండు క్రోమోసోమ్‌లు కలసిపోయి, ఒకటిగా ఏర్పడ్డాయి. అయితే, మార్పులంతటితో ఆగిపోలేదు. నిటారుగా రెండు కాళ్ళమీద నడవటానికి అనుకూలంగా మారింది అస్తిపంజరం. నేల చదునుగా వుంటే యిలా నడవటం సులభం (జంతువులు నాలుగు కాళ్ళమీద ఎక్కువ దూరం పరిగెత్తలేవు). చర్మంలో కూడా మార్పొచ్చింది. దట్టమైన బొచ్చు తగ్గి నునుపు తేలింది. ఉక్కకు చమట పట్టటం ప్రారంభమైంది. తలమీద మాత్రం రక్షణగా జుత్తు పెరిగింది.

ఈ జీవజాతి మాంసాహారులుగా మారటానికి చాలా కాలం పట్టింది. శిలాజాల ప్రకారం మన మరో దూరబ్బంధువు ఆస్ట్రాలోపితికస్. వీళ్ళు చింపాంజీలకన్నా పొట్టి. కాని నిటారుగా నడిచారు. కండరాలు తేలిన శరీరం, దృఢమైన దవడలు, మనిషిరూపం సంతరించుకున్నా వాళ్ళు జంతువులే. కొందరు ఆరడగులుదాకా పెరిగారు. వళ్ళతో చీల్చటానికి బదులు రాతి పనిముట్లు ఉపయోగించారు. ఆకలేసినప్పుడు సజాతీయులే వారి అహారం. ఎవరినీ నమ్మటానికి లేదుగద (సింహాలు చిరుతల్నీ, తోడేళ్ళు నక్కల్నీ తినటం మనకు తెలుసు). జీవన సమరంలో పోటీ అనివార్యమై వుంటుంది. లేకపోతే, మెదడుపై పరిమాణం క్రమంగా పెరగటానికి మరేమీ కారణం కనిపించదు. ఓ గణిత శాస్త్రజ్ఞుడు, ప్రతి లక్ష సంవత్సరాలలో మెదడులో 150 మిలియన్ సెల్స్ పెరుగుతున్నాయని తేల్చాడు! మాంసాహారం కూడా ప్రారంభించి వుంటారు. ప్రోటీన్ లోపం వుంటే మెదడు పెరగదు.

అయితే, ఈ మార్పులకు మరో ముఖ్యకారణం లైంగిక సంబంధాలు. స్త్రీల శరీరాలు కూడా పెరిగాయి. చింపాంజీలలో, ఆస్ట్రాలోతికస్‌లలో పురుష శరీరం, స్త్రీకన్నా ఒకటిన్నర రెట్లు పెద్దది. కాని తరువాతి కాలంలో ఈ నిష్పత్తి తగ్గింది. లైంగిక విశృంఖలత్వం తగ్గి, పురుషులు ఒక స్త్రీతో దీర్ఘకాలిక సంబంధం పెట్టుకోవటం ప్రారంభమైంది (విచ్చలవిడి లైంగిక సంబంధాలలో స్త్రీలు, పురుషుణ్ణి ఎంచుకుంటారు. కాని 'దంపతులు' కావాలనుకొన్నప్పుడు పురుషులు స్త్రీని ఎంపిక చేసుకుంటారు). పునరుత్పత్తి దశలో ఎంతమందితో కలుస్తామనికాక, ఎవరితో కలుస్తామనే దానికి ప్రాధాన్యత పెరిగింది.

ఆహార సేకరణకు అవసరమైన శ్రమ కూడా, దాంపత్యానికి మరో ముఖ్యకారణం. శాకాహారాన్ని స్త్రీలు సేకరించివేస్తే ప్రమాదకరమైన వేటలో పురుషులు పాల్గొన్నారు. మాంసం తినటంవల్ల స్త్రీలలో ప్రొటీన్‌లోపం తగ్గింది. ఇక ఆహార సమస్య తీరినట్టే. మాంసాహారమో, శాకాహారవో ఏదో ఒకటి ఎప్పుడూ లభ్యమైంది. నూనెగింజలు సేకరించి, మాంసం లేనప్పుడు కూడా ప్రొటీన్ పొందగలిగారు.

క్రమంగా, ఆహార సేకరణకు మాత్రమే ఏర్పడిన శ్రమ జీవితంలోని యితర రంగాలకూ విస్తరించింది. ముఖ్యంగా, ఆహారాన్ని నలుగురితో పంచుకోవటం అలవాటైంది. ఒక్కొక్కరూ ఒక్కొక్క రకమైన శ్రమ చెయ్యటంలో ప్రావీణ్యత సాధించారు (ఈ శ్రమ విభజన మానవ జాతికి ప్రత్యేకం!). పర్యావరణ పరిరక్షణలోకూడా యిది ప్రధానపాత్ర పోషించింది. సాంకేతిక పరిజ్ఞానానికి తొలి అడుగులు పడ్డాయి. ఇప్పుడైతే, శ్రమ విభజనలేని మానవ సమాజాన్నే ఊహించలేం.

ప్రొటీన్ లేక మెదడు పెరగదు. అంటే శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం సాధ్యం కాదు. శాకాహారులు, పప్పుధాన్యాలు తినటంవల్ల ప్రొటీన్ అవసరం తీర్చుకుంటున్నారు. పంచుకోవటంవల్ల, వేటలో పాల్గొనని వాళ్ళకు కూడా మాంసం దొరుకుతుంది. శ్రమ విభజనవల్ల దాంపత్య

జీవితం ప్రారంభమైంది (ఇప్పుడు దాంపత్యంలోకి ఆర్థికకోణం కూడా ప్రవేశించింది). స్త్రీ, పురుషులు ఒకర్నొకరు ఎంపిక చేసుకొని మరీ సహజీవనం చేశారు (ఈ ఎంపికలో వడుచుదనం, యవ్వనం ముఖ్యమనుకున్నారు. పునరుత్పత్తికి యిదే అవసరం).

శిలాజాల పరిశీలనవల్ల యింత సవిస్తరంగా విషయాలన్నీ మనకు తెలిశాయని కాదు. ఇందులో కొంత ఊహ లేకపోలేదు. కానీ జన్యు అధ్యయనం కూడా మన ఊహలకు పునాది వేసింది. నాలుగు బిలియన్ సంవత్సరాల చరిత్ర జన్యువుల్లో నిక్షిప్తమైందని ముందే చెప్పుకొన్నాం.

రెండుశాతం జీనోమ్ నుండి పర్యావరణ, సామాజిక పరిణామ చరిత్ర మనకు తెలుస్తుంది. మనిషి, చింపాంజీల జీనోమ్‌లను కంప్యూటర్‌లో క్షుణ్ణంగా అధ్యయనం చేస్తే, ఈ రెండు జీవజాతుల ఉమ్మడి వారసత్వమూ ఒకటే అని స్పష్టమవుతుంది. అంటే, జీవ రసాయన ప్రక్రియను, శరీర నిర్మాణానికి సంబంధించిన జన్యువులు రెంటిలోనూ ఒకలాగే వుంటాయి. ఎదుగుదలకూ, హార్మోన్ మార్పులకూ మూలమైన జన్యువులు మాత్రం భిన్నంగా వుంటాయి. కంప్యూటర్‌లోని జీనోమ్ డిజిటల్‌లో భాష ఎంత స్పష్టంగా వుంటుందంటే "మనిషి పిండం" ఎదిగిన తర్వాత పాదంలో మడిమ, బొటనవేలు ఏర్పడతాయనీ, చింపాంజీ పాదం కాస్త వంకర తిరిగి వుంటుందనీ తెలిసిపోతుంది.

అయితే ఆ భాష చదవటానికి ప్రత్యేక నైపుణ్యం కావాలి. వ్యాఖ్యానించటంలో కొంత గందరగోళం కూడా వుండే అవకాశం లేకపోలేదు. కాని మనుషులు, చింపాంజీల మధ్య తేడాలకు జన్యువులే కారణమన్నది మాత్రం నిర్వివాదాంశం. సామాజిక, సాంస్కృతిక కారణాలే తేడాలకు మూలం అని వాదించేవాళ్ళు కూడా జన్యువుల ప్రాధాన్యతను విస్మరించలేరు. ఉదాహరణకు, చింపాంజీ సెకలోని న్యూక్లియస్‌ను మానవ అండంలో ప్రవేశపెట్టి తొమ్మిదినెలలు ఎదగనిచ్చామనుకోండి (ఇది చాలా అనైతికమైన ప్రయోగం. నిజజీవితంలో ఏ శాస్త్రజ్ఞుడూ చెయ్యకూడదు), పుట్టేది తప్పకుండా చింపాంజీ పిల్లేనని ప్రయోగం చెయ్యకుండా కూడా తెలుసుకోవచ్చు. మానవ అండంలో ప్రవేశపెట్టబడిన, మానవ గర్భంలో పెరిగినా, చింపాంజీ సెక, చింపాంజీనే పునఃసృష్టి చేస్తుంది. ఆ పుట్టిన బిడ్డలో మనిషి పోలిక ఏమాత్రం వుండదు. ఫోటోగ్రఫీని ఉదాహరణగా తీసుకుంటే ఈ ప్రక్రియ మనకు మరింత బాగా అర్థమవుతుంది. చింపాంజీని ఫోటోగ్రాఫ్ చెయ్యాలనుకొండి ఫిల్మును డెవలెప్ చెయ్యాలంటే, దాన్ని డెవలపర్ ద్రావకంలో కొంతసేపుంచాలి. మీరిలా ఎంతసేపుంచినా ఆ డెవలపర్ ద్రావకం చింపాంజీ బొమ్మను మనిషి బొమ్మగా మార్చలేదు. డెవలపర్ ఫార్ములాను మార్చినా బొమ్మ మాత్రం మారదు. ఈ ప్రయోగం ద్వారా మనకు తెలిసేదేమంటే, జన్యువులు నెగెటివ్‌లాంటివి. గర్భం డెవలెపర్ లాంటిది. బొమ్మ కనిపించాలంటే నెగెటివ్ ఫిల్మును డెవలపర్‌లో ముంచాలి. చింపాంజీ కనిపించాలన్నా అదే చేస్తున్నాం. జన్యువులలో వున్న సమాచారం ప్రకారం మీరేంచేసినా, చింపాంజీ బొమ్మ తప్ప మరొకటి వచ్చే అవకాశమే లేదు.

అయితే, ప్రవర్తన పూర్తిగా జన్యువుల మీద ఆధారపడదు. (కంప్యూటర్ పరిభాషలో) చింపాంజీల హార్డ్‌వేర్‌ను మరో గర్భంలో ప్రవేశపెట్టవచ్చుగాని సాఫ్ట్‌వేర్ కాస్త మారుతుంది. మనుషుల మధ్య పెరిగిన పిల్లచింపాంజీ తనేమిటో తెలియక అంతఃక్షోభకు గురవుతుంది. చింపాంజీల మధ్య పెరిగిన టార్జాన్‌లాగ. టార్జాన్‌కు మనుషుల్లా మాట్లాడటం రానట్టే. మనుషుల మధ్య పెరిగిన చింపాంజీ చెట్టుమీద గూళ్ళుకట్టటం, చెదలకోసం నేలతవ్వటం, నేర్చుకోదు. అంటే, ప్రవర్తనకు సంబంధించినంతవరకూ జన్యువులు నిర్ణయాత్మక పాత్ర పోషించవు. అయినా, కేవలం జీనోమ్‌లలోని రెండు శాతం తేడాలతో రెండు జీవజాతులూ ఎంత భిన్నంగా పెరిగాయో చూశాం.

## 3

## చరిత్ర

"జీవప్రక్రియ రహస్యం తెలిసింది."

28 ఫిబ్రవరి 1953 నాడు ఫ్రాన్సిస్ క్రిక్ చేసిన ప్రకటన.

ప్రొటీన్ తయారు చెయ్యటానికి అవసరమైన రెసిపిని తమలో దాచుకుంటాయి జన్యువులు. శరీరంలో జరిగే రసాయనిక, నిర్మాణ సంబంధమైన ప్రక్రియలన్నింటికీ కారణం యివే. వీటివల్లే శక్తి ఉత్పత్తి అవుతుంది. రోగాలు రాకుండా అడ్డుకుంటాయి. భోజనం జీర్ణం చేస్తాయి. శిరోజాలు మొలవటానికి కూడా యివే కారణం. ముఖ్యంగా, జన్యువులు, శరీరంలో ఆక్సిజన్ సరఫరాను నియంత్రిస్తాయి. జెనెటిక్ కోడ్‌లోని మార్పులవల్ల,

జన్యువులు, ప్రొటీన్లుగా రూపాంతరం చెందుతాయి. అయితే క్రోమోసోమ్-1 లోని 'రిబోసోమల్ RNA జన్యువు'కు ఈ లక్షణాలు లేవు. తల్లిదండ్రుల నుండి మనం ఈ ప్రొటీన్ తయారీ రెసిపీలను వారసత్వంగా పొందుతాం.

అయితే ఇప్పుడు మనం గడియారం వెనక్కి తిప్పి 1822కు వెళ్ళిపోదాం. ఆ సంవత్సరం ఉత్తర మ(్రో)వియంలోని కుగ్రామంలో జన్మించాడు. మోహన్ మెండెల్ తండ్రి, ఒక భూస్వామివద్ద కౌలురైతు. కాని, కాలం కలసిరాక, కొడుకు పదహారేళ్లున్నప్పుడు పొలంమీది తన హక్కుల్ని మరొకరికమ్ముకున్నాడు. చదువు కొనసాగే అవకాశం లేదని మోహన్, రోమన్ కాథలిక్ శాఖలోని ఆగస్టియన్ సన్యాసిగా మారి బ్రదర్ గ్రెగర్‌గా మార్చుకున్నాడు తన పేరు. తరవాత బ్రునోలోని కాలేజీలో చేరి ప్రీస్టు కావటానికి అర్హత సంపాదించుకున్నాడు. కాని ఆ వృత్తి కొనసాగించలేక, వియన్నా యూనివర్శిటీలో లా చదివి సైన్సు టీచర్ కావాలని కలలుగన్నాడు. గ్రెగర్‌ను దురదృష్టం వెంటాడింది. పరీక్షల్లో ఫెయిలయ్యాడు.

ముప్పై ఒక్క ఏళ్ళు వచ్చాయి. కోరుకున్న తేదీ జరగలేదు. సన్యాసిగా బతకటానికి బ్రునో తాగివచ్చాడు. అయితే గణితంలో ప్రావీణ్యం సంపాదించాడు. చదరంగం కూడా బాగా ఆడతాడు. తోటపనులు చెయ్యటమంటే మహాయిష్టం. మొక్కలకు అంట్లు వెయ్యటమెలాగో తండ్రి నుండి నేర్చుకున్నాడు. అయితే ఈ వ్యావసాయిక సంస్కృతిని అలవర్చుకోవటంవల్లే ఆయన శాస్త్రీయ దార్శనికత కొత్త పుంతలువేసింది. మొక్కలలో, పశువులలోని వారసత్వ లక్షణాలను గురించి రైతులందరికీ ఎంతో కొంత తెలియకుండా వుండదు. కాని, అంతవరకు వాటినెవరూ శాస్త్రీయంగా అధ్యయనం చెయ్యలేదు. "తరంనుండి తరానికి మార్పులు ఎలావస్తాయి? అని ఎవ్వరూ ఖచ్చితంగా చెప్పటానికి ప్రయత్నించలేదు" అని రాసుకున్నాడు.

అలా, ముప్పైనాలుగేళ్లు ఫాదర్ మెండెల్, తన ఆశ్రమంలోని మొక్కల పాదుల్లో ఎనిమిదేళ్లపాటు ప్రయోగాలు కొనసాగించాడు. వివిధ వృక్షజాతులకు చెందిన 30,000 మొక్కలు నాటాడు. తన పరిశోధన ఫలితంగా ప్రపంచానికి జన్యుశాస్త్ర జ్ఞానాన్ని ప్రసాదించాడు. కాని, అప్పట్లో ఆయన కృషికి తగిన గుర్తింపు రాలేదు. బ్రునో అబాట్‌గా పదోన్నతి రావటంతో మెండెల్‌కు శాస్త్ర పరిశోధనలమీద ఆసక్తి తగ్గింది. పౌరవ్యవహారాలలో ఎక్కువ శ్రద్ధ కనబర్చాడు.

ఇంతకూ మొక్కల గురించి ఆయన ఆవిష్కరించిన కొత్త సత్యమేమిటి? ఏడురకాల బఠాణీ మొక్కలకు అంట్లుగట్టాడు మెండెల్ (ఈ సంఖ్య యింకా ఎక్కువ అయివుండే అవకాశమూ కాకపోలేదు). వాటివల్ల వచ్చిన మొక్కలకు, తను అంటగంటగట్టిన రెండు మొక్కల్లో ఏదో ఒకదాని లక్షణాలున్నాయని ఆయన తొలిసారి కనుగొన్నాడు. అయిఏత మరో మొక్క లక్షణాలు ఏమైపోయాయి? కాని అవెక్కడికీ పోలేదని త్వరలోనే గ్రహించాడు. తరువాతితరం మొక్కల్లో మరో మొక్క లక్షణాఉల ప్రత్యక్షమయ్యాయి. అలాగే, రెండు తరాల తర్వాత మొదటి మొక్క లక్షణాలలో నాలుగోవంతు మళ్ళీ కనిపించాయి. శతాబ్దం తర్వాత సర్ రొనాల్డ్ ఫిషర్ నిర్ధారించినట్టుగా, వారసత్వ లక్షణాలు యించుమించు 1.3 నిష్పత్తిలో కొనసాగివుంటాయి. ఇక్కడ మనం మరో విషయం గుర్తించుకోవాలి. మెండెల్ గణిత శాస్త్రప్రవీణుడు. ఈ నిష్పత్తి ఆయనకూ తెలిసేవుంటుంది.

ప్రయోగ ఫలితాలతో ప్రేరణ పొందిన తర్వాత, యితర మొక్కల వారసత్వ లక్షణాల అధ్యయనం కొనసాగించాడు మెండల్. అయితే, వాటిలోనూ యివే ఫలితాలు కనిపించాయి. అంటే యిక వారసత్వ లక్షణాలను గురించి కొన్ని ఖచ్చితమైన నిర్ధారణలు చేయవచ్చు. కలైడోస్కోప్‌లో రాళ్ళు అమరికలు మార్చుకున్నట్టుగా కలుస్తాయి లక్షణాలు. ఇదో పద్ధతి. ఒకే కుటుంబంలో నీలికళ్ళ రంగు పిల్లలూ, గోధుమరంగు కళ్ళతో పుట్టటానికి యిదే కారణం. "ఇది కలయిక మాత్రమే. ఒకదానిలో ఒకటి కలసిపోవటం కాయం" అని 1857లోనే రాశాడు మెండెల్.

1866 నుండి నాలుగేళ్ళపాటు తన పిరశోధనాఫలితాలను, వివరణాలను మ్యూనిక్‌లోవున్న కార్ల్ విల్హెల్మ్ నాగెలీకి పంపాడు. ఎందుకో, వీటినాయన పరిశీలించలేదు. కాని, వారసత్వం గురించి తన స్వంత పరిశోధనల గురించి ప్రచురించాడు. ఎక్కడా మెండెల్ పేరైనా ప్రస్తావించలేదు. రెండు పిల్లలు కలిసినప్పుడు వాటి పోలికలున్న పిల్లే పుట్టకపోవచ్చు. కాని తరువాతి తరం పిల్లులకు తప్పక వాటి లక్షణాలు వస్తాయి. మెండెల్ సిద్ధాంతాన్ని నిరూపించటానికి యితకన్న మంచి దృష్టాంతమేం కావాలి.

డార్విన్ కూడా ఈ విషయాలపట్ల ఆసక్తిచూపి, మరింత పరిశీలించమని తన మిత్రులకు సూచించాడు. కాని మెండెల్ జీవితకాలంలో ఆయన కృషికి ఏ రకమైన గుర్తింపూ రాలేదు.

చివరికి 1900 సంవత్సరంలో ముగ్గురు వృక్షశాస్త్రజ్ఞులు హ్యూగో డివ్రైస్, కార్ల్ కారెన్స్, ఎరిక్ వాన్ షెర్మాక్‌లు మెండెల్ ఎప్పుడో తెలుసుకున్న విషయాలను పునరావిష్కరించారు. అలా మరణానంతరం, మెండెల్ గురించి ప్రపంచానికి తెలిసింది. డార్విన్ పరిణామ సిద్ధాంతంమీద పైచేయి సాధించారు వారసత్వ శాస్త్రజ్ఞులు. 1903లో, స్వతంత్ర్య పరిశోధనలు చేసిన అమెరికన్ జెనెటిసిస్ట్ వాల్టర్ సట్టన్, క్రోమోసోమ్‌ల ప్రవర్తన, మెండెల్ చెప్పినట్టే వుందన్నాడు. 1918లో రొనాల్డ్ ఫిషర్ అనబడే బ్రిటిష్ శాస్త్రజ్ఞుడు, మెండెలిజం, డార్వినిజంల మధ్య వైరుధ్యం లేదనీ డార్వియిన్ పరిణామవాదానికే కొనసాగింపు మెండెల్ వారసత్వ సిద్ధాంతమని నిరూపించాడు. అయినా మ్యుటేషన్ (జన్యువులో వచ్చే మార్పులు) ప్రక్రియక సరైన వివరణ యింకా లభించలేదు.

ఇప్పుడు మనం డార్విన్, మెండెల్‌ల సరసన వుండదగిన మరో మహానుభావుని గురించి తెలుసుకోవాలి. ఆయనే హెర్మాన్‌జో ముల్లర్. కలహ ప్రియుడు. లేదా కొందరి అభిప్రాయంలో రియల్ ఫైటర్. న్యూయార్క్‌లో పుట్టిన ముల్లర్, మెటల్ కాస్టింగ్ నేర్చుకున్నాడు. కాని జెనెటిక్స్ మీది ఆసక్తితో కొలంబియా యూనివర్శిటీలో చేరాడు. అక్కడ తన ప్రొఫెసర్ మోర్గాన్‌తో పొసగక, 1980లలో యూనివర్శిటీ ఆఫ్ టెక్సాస్‌కు వచ్చాడు. యూదు గనుక ముల్లర్ పట్ల కొందరు వివక్ష చూపటం నిజమే. బహుశా జీవితాంతం అతడు అందరితోనూ పోట్లాడుతూ వుండటానికి యిందే కారణం కావచ్చు. చివరికి, ఓ ఆత్మహత్యా ప్రయత్నం కూడా చేసి, అమెరికాలో వుండలేక 1932లో యూరోప్ వెళ్ళిపోయాడు.

కృత్రిమంగా జన్యువులలో మార్పులు తీసుకు రావచ్చునన్న పరిశోధనలకుగాను ముల్లర్‌కు నోబెల్ బహుమతి వచ్చింది. ఈ కృత్రిమ జన్యుమార్పిడి ప్రక్రియే ఆధునిక జెనెటిక్స్‌కు పునాది. ముల్లర్ పరిశోధనలు ఆధారంగా 1940లో జార్జి బీడిల్, ఎడ్వర్ట్ టాటమ్ అనబడే యిద్దరు శాస్త్రజ్ఞులు కృత్రిమ జన్యుసంయోగంతో సత్ఫలితాలు సాధించారు.” అయితే ఈలోగా సామ్యవాద సిద్ధాంతాలను నమ్మిన ముల్లర్ కొన్ని వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్నారు. పుట్టబోయే పిల్లలందరూ మార్క్స్, లెనిక్‌లను పోలివుండాలంటే, Selective breading వల్ల మాత్రమే అవి సాధ్యమవుతుందని ఆ దిశగా ప్రయత్నాలు కొనసాగించాడు (తరువాతి రోజుల్లో తను మార్క్స్ లెనిన్‌లనలేదు. లింకన్, డెకార్ట్ (తత్వవేత్త)లన్నాను అని మాటమార్చాడు). అలా తన వ్యాఖ్యల గురించి దుమారం చెలరేగటంతో అమెరికా వదిలి, యూరోప్‌కు పలాయనం చిత్తగించక తప్పలేదు. ఆ తర్వాత ఆయన బెర్లిన్‌లో, ఆర్యుల సంతతి పిల్లలకోసం హిట్లర్ చేసిన ప్రయోగాలు చూసి దిగ్భ్రాంతి చెందాడు. ఈ చరిత్ర యింతటితో ముగిద్దాంగాని ముల్లర్ ఆవిష్కరించిన Selective breading పద్ధతుల్ని Engemics అంటారు. అత్యంత దుర్మార్గమైన శాస్త్రమిది. మానవజాతికే మచ్చ.

హిట్లర్‌ను నిరసించిన ముల్లర్ లెనిన్‌గ్రాడ్ చేరుకున్నాడు. అయితే స్టాలిన్ ఈయన ప్రతిపాదనలకు ఆమోదం తెలపకపోవటంలో స్పెయిన్ వెళ్ళి విముక్తి పోరాటంలో పాల్గొన్నాడు. అక్కడినుండి ఎడింబరో చేరుకున్నాడు. కాని ఎక్కడా సైన్సు పరిశోధనలు మాత్రం కొనసాగించలేకపోయారు. దీనిక్కారణం, అందరితో కలహించే ఆయన స్వభావమే. చివరికి అమెరికా తిరిగివచ్చి ఇండియానా యూనివర్శిటీలో చేరిన సంవత్సరం తర్వాత, ‘కృత్రిమ జన్యుసృష్టి’ నోబెల్ అందుకున్నారు.

జన్యువులలోని ప్రొటీన్‌ల తయారీ గురించి తెలియవలసింది యింకా వుంది. అసలు, జన్యువే ప్రొటీన్ అనుకుంటే దేనితో తయారైంది? క్రోమోసోమ్‌లలో కొన్ని సంకేతాలు కనిపించాయి అదే న్యూక్లియర్ ఆసిడ్ లేదా DNA 1869లోనే జర్మన్ శాస్త్రజ్ఞుడు ఫ్రీడ్రిష్ మైషర్ దీనిగురించి ప్రస్తావించినా, ఎవరూ దాన్ని నమ్మలేదు.

ఇండియానా యూనివర్శిటీకి ముల్లర్ చేరిన కొద్దికాలానికే అక్కడికి మరో సైన్సు పట్టభద్రుడు పందొమ్మిదేళ్ళ జేమ్స్ వాట్సన్ కూడా వచ్చాడు. అయితే, ముల్లర్‌కు బదులు మరో యిటాలియన్ ప్రొఫెసర్ సాల్వడార్ లూరీ, పరిశోధనల్లో ఆయనకు దారిచూపాడు. జన్యువులలో వున్నది ప్రొటీన్ కాదు, DNA అని వాట్సన్ నమ్మకం. కాని అతన్నెవరూ సీరియస్‌గా తీసుకోలేదు. చివరికి అక్టోబర్ 1951లో కేంబ్రిడ్జిలోని కావెండిష్ లేబరీటరీలో మరో

బ్రిలియంట్ సైంటిస్ట్ ఫ్రాన్సిస్ క్రిక్‌తో కలిసి పరిశోధన కొనసాగించాడు. అప్పటికే DNA గురించి చాలా కొత్త విషయాలు తెలుసుకున్నాడు.

ఆ తర్వాతి పరిణామాలే మనకు సుపరిచితమైన జన్యుశాస్త్ర చరిత్ర.

వాట్సన్‌లాగ చాల మేధావి కాదు క్రిక్. ముప్పైఏళ్ళు వచ్చాయిగాని యింకా పి.హెచ్‌డి సాధించలేకపోయాడు. ఫిజిక్సు నేపథ్యంలో బయాలజీలోకి ప్రవేశించాడుగాని పెద్దగా సాధించిందేమీ లేదు. ప్రస్తుతం కావెండిష్‌లో చేరి క్రిస్టలోగ్రఫీ నేర్చుకుంటున్నాడు. చుట్టూ వున్నవాళ్ళంతా నిరంతరం ప్రొటీన్ల గురించే చర్చించటం చూస్తే చిరాకుగావుంది. నిస్సందేహంగా జన్యురహస్యం తెలుసుకోవాల్సిందే కాని DNA లో పరిష్కారం దొరుకుతుందేమోనని ఆలోచించాడు. అగ్నికి ఆజ్యం పోసినట్టుగా వాట్సన్ పరిచయం ఈ పరిశోధనను వేగవంతం చేసింది. రెండు చెకుముకి రాళ్ల రాపిడి అది.

అతి త్వరలో, అంటే కొద్దినెలల్లోనే, మానవజాతి చరిత్రలోనే అత్యంత కీలకమైన ఆవిష్కరణ జరిగింది. అదే DNA నిర్మాణం గురించిన వివరణ. అది ఆర్కిమెడీస్ నీళ్ళతొట్టెలోంచి దూకి ''యురేకా!'' అనటంకన్నా ముఖ్యమైంది. 28 ఫిబ్రవరి 1953 నాడు ఈగిల్ (Eagle) పబ్‌లో ఫ్రాన్సిస్ క్రిక్ తన ఆనందాన్ని మిత్రులతో పంచుకునానడు. "జీవప్రక్రియ రహస్యం తెలుసుకున్నాం – "We have Discovered the Secret of Life" అని ప్రకటించారు. కాని వాట్సన్‌కు భయంగా వుంది. తమ పరిశోధనల్లో పొరబాటు జరిగిందేమో!

పొరబాటు జరగలేదు. మెలివేసుకుపోయిన నిచ్చెన (Double Helix) మీద నిక్షిప్తమైంది DNA కోడ్ (దీన్ని విధి లిఖితమందామా?). ఈ రహస్య భాష, కొన్ని రసాయనిక ప్రక్రియల ద్వారా తనను తాను పునర్లిఖించుకొంటుంది. మొత్తంమీద DNA కూ, ప్రొటీన్లకూ సంబంధముంది. వాట్సన్–క్రిక్‌ల విప్లవాత్మక ఆవిష్కరణ తర్వాత, మాలెక్యూలర్ బయాలజీ భాష డిజిటల్‌గా మారిపోయింది. జన్యువులది కంప్యూటర్ భాషలాగే వుంటుంది'8 అన్నాడు రిచర్డ్ డాకిన్స్.

అయితే, వాట్సన్–క్రిక్‌ల పరిశోధనా ఫలితం తొలిసారి ప్రచురితమైనప్పుడు ఏ సూచనలనూ సృష్టించలేదు. ఆ సంవత్సరం ఇంగ్లండులో కొత్త రాణి సింహాసనం అధిష్టించింది. ఒక బ్రిటిష్ పర్వతారోహక బృందం ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించింది. ఇవన్నీ ఆనాడు ప్రముఖ వార్తలే – యిది తప్ప.

బహిర్గతమైన DNA నిర్మాణ రహస్యం మరికొన్ని సంవత్సరాలపాటు ఎవరి దృష్టినీ ఆకర్షించలేదు. కోడ& – రహస్యలిపి ఇంకా యిస్టరీగానే మిగిలింది. అంటే వాట్సన్ – క్రిక్ దాన్ని ఛేదించినప్పటకే, పలువురు అర్థం చేసుకోలేకపోయారు. ఇదివరకే చెప్పుకున్నట్టుగా యిది నాలుగక్షరాల భాష. A.C.G.T. తరువాత యిదే ఇరవై అక్షరాల అమినోయాసిక్స్ (ప్రొటీన్స్)గా మారుతుంది. కాని ఎలా మారుతుంది? ఆ ప్రక్రియ గురించి స్పష్టతలేదు.

త్వరలోనే ఈ సందేహకులన్నీ తీర్చాడు క్రిక్. ఈ మార్పిడి ప్రక్రియకు మూలకారణం RNA అన్నాడు. అయితే అతడికి తనమీద తనకు విశ్వాసం లేదనిపించింది. తన ఆవిష్కరణలను/వివరాలను ఎవరూ సీరియస్‌గా తీసుకోవద్దన్నాడు.

1961లో RNAను కృత్రిమంగా సృష్టించారు నైరెన్‌బర్గ్, మోహాన్ మాతీలు. ఈ రిబోసోమ్‌లన్నీ ప్రొటీన్‌లను తయారుచేశాయి. అలా కోడ్‌లోని తొలి పదం 444 (ఫెనిలాలానైన్) గురించి తెలిసింది.

1961 నాటికి జెనెటిక్ కోడ్‌ను సంపూర్ణంగా చదవగలిగారు శాస్త్రజ్ఞులు. జీవప్రక్రియ యిక రహస్యం ఎంతమాత్రం కాదు. అంటే, ఆధునిక జెనెటిక్ యుగం ప్రారంభమైంది. శాస్త్రపురోగతిని చూసి ఎవరైనా విస్తుపోక తప్పదు. 1960లనాటి విప్లవాత్మక ఆవిష్కరణలు 1990 నాటికి అతిసాధారణ విషయాలుగా మారిపోయాయి.

1995 నాటికి వైద్యశాస్త్రంలో జెనెటిక్స్ విరివిగా వాడుకలోకి వచ్చింది. అంటే రోగాలకు జన్యుకారణాలను కనుగొన్నారు. శరీరంలోని రసాయనిక ప్రక్రియల సంయోగానికి మూలకారణం క్రోమోసోమ్–3 అని కూడా తెలిసివచ్చింది. మి

Matt Ridley రచన ఆధారంగా,

తెలుగు : ము.పా.సా

హైదరాబాదు.

ఫోన్ : 9177618708

# గోవాలో తెలుగువారు

– *కొసరాజు వెంకటేశ్వరరావు*

*(కొసరాజు వెంకటేశ్వరరావు గోవా ప్రభుత్వ పురావస్తుశాఖలో 1975–76 సంవత్సరాలలో అన్వేషణ అధికారిగాను, 1978–79లో ఓల్డ్ గోవాలోని కేంద్ర పురావస్తు వస్తుసంగ్రహాలయంలో సహాయ సంచాలకులుగా, తిరిగి 1992–96 సంవత్సరాలలో ఉపసంచాలకులుగా కర్తవ్యం నిర్వహించారు. వీరు గోవా ఆంధ్ర సంఘం అధ్యక్షులుగా 1995–96లో ఒక పర్యాయం పనిచేశారు.)*

ప్రకృతి రమణీయతకు పేరుప్రఖ్యాతులు కాంచిన గోవా రాష్ట్రం భారతదేశంలో వున్న ఒక చిన్న రాష్ట్రం. దీనికి ఉత్తరాన మహారాష్ట్ర, తూర్పు, దక్షిణం కర్ణాటక, పశ్చిమాన అరేబియా మహాసముద్రం హద్దులుగా ఉన్నాయి. ఈ రాష్ట్రానికి 101 కిలోమీటర్ల కోస్తాతీరం వున్నది. ఇద్దరు పార్లమెంటు సభ్యులు వుంటారు. ఈ రాష్ట్ర వైశాల్యం 3702 చ.కి.మీ. దీనిని విదేశీయాత్రికులు "Pearl of the East", అని "Tourist Paradise" అని పిలుస్తారు. గోవా, దామన్, దీవ్ (డయ్యూ) అనేవి 1961కు పూర్వం పోర్చుగీసు కాలనీలుగా ఉండేవి. పోర్చుగీసులు 15వ శతాబ్దం చివరి సంవత్సరాలలో (1498) మసాలా దినుసులు (Spices), శిల్కువస్త్రాలు వారి దేశానికి దిగుమతి చేసుకోవాలనే ఉద్దేశ్యంతో భారతదేశానికి వచ్చిన మొట్టమొదటి యూరప్ దేశస్థులు. వీరు మొదట వాణిజ్యం చేయాలని భారతదేశానికి వచ్చి, ఆనాటి భారతదేశపు రాజకీయ స్థితిగతులు గమనించి, ఈ దేశంలో పరిపాలన చేయాలని నిర్ణయించుకున్నారు. అఫోన్సోడి అల్బుఖర్ఖ్ అనే పోర్చుగీసు దేశస్థుడు తగిన సైన్యంతో 1510 సంవత్సరంలో గోవాను పరిపాలిస్తున్న బీజాపూర్‌లో ఆదిల్ షాహి రాజైన ఇస్మాయిల్ ఆదిల్‌షాను ఓడించి, గోవాను జయించి, పోర్చుగీసు రాజ్యస్థాపన చేశాడు. ఆ తరువాత గుజరాతులో భాగమైన దయ్యూ, దామన్‌లను కూడా జయించి, 1510 సంవత్సరం నుండి 1961 సంవత్సరం వరకు అనేకమంది వైస్రాయ్‌లు (రాజవంశానికి సంబంధించినవారు), గవర్నర్లు షుమారు 450 సంవత్సరాలు ఈ ప్రాంతాలను పరిపాలించినట్లుగా చరిత్ర తెలియచేస్తున్నది. గోవాను పోర్చుగీసు ప్రభుత్వం హస్తాల నుండి విమోచన చేయటానికి ఎంతోమంది స్వాతంత్ర్య సమరయోధులు, వాలంటీర్లు (భారతీయులు) ప్రాణత్యాగం చేశారు. చివరకు డిసెంబరు 19వ తేదీ 1961 సంవత్సరంలో భారతసైన్యం గోవాను పోర్చుగీసు పరిపాలన నుండి 'విముక్తి కలిగించింది'. ఆ తేదీనుండి గోవా, దామన్, దీవ్ (డయ్యూ)లు భారతదేశపు కేంద్రపాలిత ప్రాంతాలైనాయి. గోవా 1987, మే 30న భారతదేశపు 25వ రాష్ట్రంగా ఆవిర్భవించింది. కాగా దామన్, దయ్యూ ప్రస్తుత కేంద్రపాలిత ప్రాంతాలుగానే వ్యవహరింప బడుతున్నాయి. గోవా ప్రభుత్వం ప్రజలు గోవా విమోచన దినాన్ని ప్రతి యేటా *డిసెంబరు 19 న* చాలా ఘనంగా జరుపుతారు. ఆ రోజంతా గోవా అంతటా పండగ వాతావరణమే కనిపిస్తుంది. పనాజీ (పోర్చుగీసు – పంజిమ్) గోవా రాష్ట్రానికి రాజధాని. గోవా రెండు జిల్లాలు మాత్రమే వున్న చిన్న రాష్ట్రం. ఈ జిల్లాలు మడ్‌గాంవ్ (సౌత్ గోవా) మరియు పనాజి (నార్త్ గోవా). మడగాంవ్ జిల్లాలో మార్ముగోవా, పోండా, సాల్‌సెట్, సాంఘెం క్వెపెం, కానాకోనా తాలూకా కేంద్రాలు కాగా పనాజీ జిల్లాలో తిస్‌వాడి, బార్దేష్, సతారి బిచోలిం, పేర్నెం తాలూకాలుగా ఉన్నాయి. ఈ రాష్ట్రంలో మొత్తం 416



గ్రామాలు వుండగా రాష్ట్ర జనాభా *1.817* మిలియన్లు. వీరిలో అధికభాగం హిందువులే. మిగతావారిలో క్రిష్టియన్లు, ముస్లింలు, సిఖ్ఖులు ఉన్నారు. గోవా రాష్ట్రానికి రాజధాని పనాజీ (లేక పంజిమ్) అయినా శాసనసభ మండోవి నది అవతలివైపున వున్న పర్వోరింలో వుండగా, బాంబే (ముంబై) హైకోర్టు బెంచి పనాజీలో వున్నది. పశ్చిమ కనుమల అంచున వున్న గోవా రాష్ట్రంలో ముఖ్యమైన నదులు జువారి, మాండోవి, తెరాకోల్, చాపోరా, బేతుల్ మొదలైనవి. గోవా విశ్వవిద్యాలయం పనాజీ ప్రక్కనేవున్న తాలీగాంలో వున్నది. మెడికల్ కాలేజి బంజోలింలోను, ఇంజనీరింగు కాలేజి, పర్మాగుడిలో వున్నది. ముఖ్యమైన చర్చీలు (16వ శతాబ్దంనాటివి) వెల్హాగోవా (ఓల్డ్ గోవా)లోను హిందూ దేవాలయాలు (శాంతాదుర్గా) మంగేషి నాగేషి, మహాదేవ్ దేవాలయం) ఎక్కువ పోండా తాలూకాలోను, సఫామసీదు పోండావద్ద ఉన్నది. ఓల్డ్ గోవాలో వున్న చర్చిలలో Basilica of Born Jesus, Se'cathedrae, St Francis of Assissi our Lady of the Immaculate ముఖ్యమైనవి. ఈ చర్చీల వాస్తుకళ పోర్చుగీసు వాస్తు కళనే ప్రతిబింబిస్తుంది. Basilica of Born Jesusలో చైనా దేశంలో 1552లో మరణించిన గోవా క్రిష్టియన్‌ల ముఖ్య మతగురువు (Patron Saint) Saint Francis Xavier శవపేటిక భద్రపరచబడింది. ఇది యాత్రికులకు ప్రత్యేక ఆకర్షణగా వున్నది. ఈ శవపేటికను 10 సంవత్సరాలకొకసారి బామ్ జీసస్ బసిలికా నుండి ఊరేగింపుగా Se Cathedralకు తీసుకువెళ్ళి ప్రజల దర్శనార్థం నెలరోజులు బల్లపైన వుంచుతారు. 10 సంవత్సరాలకొకసారి (1994లో ఈ వ్యాసకర్త తన శ్రీమతితోపాటు ఆ శవపేటికను భుజాలపైన మోసే అదృష్టం దక్కింది). నవంబరు, డిసెంబరులో Exposition చేసే ఈ ఉత్సవానికి గోవానుండే కాక భారతదేశంలోను, విదేశాలలోను వున్న రోమను క్యాథలిక్కులు వచ్చి జేవియర్ శవాన్ని భక్తితో దర్శించుకుంటారు. ఈ Exposition కార్యక్రమాన్ని గోవా ప్రభుత్వం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తుంది.



**గోవా చరిత్ర :**

పురావస్తుశాఖవారు గోవాలో జరిపిన అన్వేషణలో ప్రాచీన మానవుడు సుమారు రెండువేల సంవత్సరాల క్రితమే జువారీ, మంఓవి నదీ తీర ప్రాంతాలలో నివసించినట్లుగా తెలిసింది. ఆదిమానవుడు తన వేటకోసం తయారుచేసుకున్న రాతిపనిముట్లు (పాత రాతియుగం, కొత్త రాతియుగం, సూక్ష్మశిలాయుగానికి సంబంధించినవి) అనేకం వివిధ ప్రదేశాలలో లభించాయి. గోవాలో బృహత్ శిలాసమాధులు (Megaliths) చాలాచోట్ల కనుగొనబడినాయి. గోవా చరిత్ర మగధను పాలించిన మౌర్యచక్రవర్తులతో మొదలైంది. అశోకుని శిలాశాసనాలలో ఈ ప్రాంతం, వారి సామ్రాజ్యంలో వున్నట్లుగా తెలుస్తున్నది. ఆ తరువాత ఈ ప్రాంతాన్ని కొంకణ శిలాహారులు, గోవా కదంబులు, బాదామి చాళుక్యులు బీజాపూరును రాజధానిగా చేసుకుని పరిపాలించిన ఆదిల్‌షాహి రాజులు, విజయనగర చక్రవర్తులు పరిపాలించారు. రాయలకాలంలో రాయ్‌బందర్ రేవు ద్వారా అరేబియా దేశాలనుండి అశ్వాలను దిగుమతి చేసుకున్నట్లుగా తెలుస్తున్నది. ఆ తరువాత ఈ ప్రాంతాన్ని పోర్చుగీసువారు (1510–1961 వరకు) పరిపాలించినట్లు వారు నిర్మించిన చర్చిలలోను కోటలలోను వున్న శిలాశాసనాల ద్వారా మరియు అనేక గ్రంథాల ద్వారా తెలుస్తున్నది.

గోవా యాత్రికులకు స్వర్గధామం అని అంటే ఇక్కడ ఎన్నో అందమైన బీచ్‌లు వున్నాయి. బాగా కాలం ఘూట్, అంజునా, పలోలిం, కందోలిం, మీరామార్ బీచ్‌లు ముఖ్యమైనవి. ఈ విశాలమైన బీచ్‌లు దేశ, విదేశ యాత్రికులను (హిప్పీలను కూడ) ఆకర్షిస్తాయి. గోవాలో సమశీతోష్ణ వాతావరణం చాలా బాగావుంది. వేసవికాలంలో $35^\circ$ డిగ్రీల వేడి, చలికాలంలో $18^\circ$ వేడి వుంటుంది. ఇక్కడ వర్షాలు జూన్ నెలనుండి సెప్టెంబరు నెలవరకు బాగా కురుస్తాయి. గోవాకు పనాజి రాజధాని అయినా వాస్కో నగరమే (వాస్కోడిగామా

పేరుతో వెలసిన నగరం) పెద్దనగరం. మార్మగోవా ఓడరేవు ద్వారా విదేశాలకు ఇనుపరజను (Iron ore) ఎగుమతి అవుతుంది. పనాజి ముంబై మధ్య అక్టోబరు నెలనుండి ఏప్రియల్ నెలవరకు ప్రయాణీకుల ఓడను (Ship) నిర్వహిస్తారు. 1990–1996 సంవత్సరాలలో నిర్మించిన కొంకణ్ రైల్వే లైను ద్వారా గోవా, ముంబై, మంగళూరు, కోచీ మొదలైన కోస్తా ప్రాంతాలకు ప్రయాణం సుఖమయమైంది. వాస్కో-నిజాముద్దీన్ (ఢిల్లీ) మధ్య ప్రతిరోజు గోవా – నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్ రైలు నడుస్తున్నది. హౌరా, విజయవాడ, బెంగుళూరు, హైదరాబాద్, చెన్నై, ముంబయ్, పూనా నగరాల నుండి వాస్కో నగరానికి సరాసరి రైలు సౌకర్యం వున్నది. గోవాప్రజలు కొంకిణి (లిపి లేని భాష), మరాఠీ, ఇంగ్లీషు భాషలు మాట్లాడుతారు. ఇక్కడి ప్రజలు శాంతిప్రియులు. వీరు సంగీతమంటే ముఖ్యంగా పాశ్చాత్య సంగీతమంటే చాలా ఇష్టపడతారు. పండుగల సమయంలో వీరు గీతాలతోపాటు నృత్యం కూడా చేస్తారు. *ఫిబ్రవరి – మార్చి నెలలలో గోవాలో నిర్వహించే కార్నివాల్ వీక్షించటానికి* దేశవిదేశాల నుండి వేల యాత్రికులు గోవా సందర్శిస్తారు. ఈ సంరంభంలో పాల్గొనే కళాకారులు విచిత్రమైన వేషధారణతో, సంగీత వాయిద్యాలతో చూసేవారికి మంచి వినోదాన్ని అందిస్తారు. విజేతలకు మంచి బహుమతులు పంచుతారు. ఈ వినోదాన్ని తిలకించటానికి ఆ మార్గంలో రోడ్లేకాక భవనాలు కూడా సందర్శకులతో కిక్కిరిసిపోతాయి. ఆ రోజు పనాజీలో పండుగ వాతావరణంలాగా అలంకరిస్తారు. గోవాలో మాండో అనే జానపద, సంగీత, నృత్య కార్యక్రమం తమ పొలాలలో పండిన పంట ఇంటికి చేరిన సమయంలో నిర్వహిస్తారు. ఈ ఉత్సవంలో అందరూ ఉత్సాహంగా పాల్గొని సందర్శకులకు ఎంతో వినోదాన్ని పంచిపెడతారు. క్రిస్టియన్లు క్రిస్టమస్‌ను, న్యూ ఇయర్ డేను ఘనంగా జరుపుకుంటారు. ఆ వారంరోజులు గోవాలోని అన్ని ప్రాంతాలను విద్యుత్ దీపాలతో అలంకరించి పండుగ వాతావరణాన్ని కలుగచేస్తారు.



హిందువులు గణేష్ చవితి పండుగను ఘనంగా జరుపుతారు. ప్రతివాడలో గణేష్ మండపాలను ఏర్పాటు చేసి, పెద్దపెద్ద వినాయకుని విగ్రహాలను ప్రతిష్ఠించి ఆ నవరాత్రులు పూజలు నిర్వహిస్తూ అనేక వినోదకార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. చివరి రోజున "గణపతి బప్పా మోరియా పుఢ్లేవర్షా బేగిన్ యా" అని పాటలు పాడుతూ నృత్యం చేస్తూ, గుల్ చల్లుకుంటూ ఊరేగింపుగా దగ్గరలో వున్న చెరువులోకాని నదిలోకాని వినాయకుని నిమజ్జనం చేస్తారు. ముస్లింలు బక్రీద్, రంజాన్ పండుగలు నిష్ఠగా నిర్వహిస్తారు.

గోవాలో ముఖ్యంగా ఉత్తర గోవా జిల్లాలో అనేక దీవులు (దివాడి, చోర్లెం వంటివి) వున్నాయి. ఆ దీవులకు కూడా పనాజీని కలుపుతూ అనేక బస్సులను ఏర్పాటు చేశారు. ఈ బస్సులు భారీ లోడుతోవున్న లారీలు (చేపలు, కొబ్బరికాయలు ఇనుప రజనుతో వున్నవి), కార్లు, స్కూటర్లు, మోటారు సైకిళ్ళు, కాలినడకన వెళ్ళేవారు, ప్రభుత్వంవారు ఏర్పాటు చేసిన ఫంట్‌ల ద్వారా నదులను, కాలువలను దాటి, తమతమ గ్రామాలకు వెళ్ళిపోతారు. గోవాలో ముఖ్యమైన పంట వరి. చెరకు కొద్ది ప్రాంతాలలోనే పండిస్తారు. దక్షిణ గోవా జిల్లాలో ప్రభుత్వం నిర్మించిన సలౌలిం (Salaulim) నీటి ప్రాజెక్టు ఆయకట్టు క్రింద వరి (పొట్టి వంగడాలు) పండిస్తున్నారు. మెట్టచేలల్లో జీడిమామిడి (Cashew nut), కొబ్బరి, మామిడి తోటలను పండిస్తారు. జీడిమామిడితోను, కొబ్బరి కాయలతోను 'ఫెన్నీ' అనే డ్రింక్ తయారుచేస్తారు. తమ ఇంటికి వచ్చిన బంధువులకు, స్నేహితులకు ఫెన్నీతో ఆతిథ్యం ఇస్తారు. మత్తులక్షణాలు కలిగివున్న ఈ పానీయం గోవాలో మాత్రమే లభ్యమవుతుంది. గోవాలో ఎక్కువమంది ఫెన్నీ, బ్రాందీ, జిన్, వైనులాంటి మత్తుపానీయాలను తమ కుటుంబ సభ్యులతోపాటు ఆనందంగా పంచుకుంటారు. ప్రతి గ్రామంలోను మత్తుపానీయాలు విక్రమించే బార్లు రెస్టారెంట్లు తప్పనిసరిగా వుంటాయి. గోవావారు కొందరు పోర్చుగల్ దేశంలో ఉద్యోగ, వ్యాపారరీత్యా పోయి అక్కడే స్థిరనివాసం ఏర్పరచుకుని అప్పుడప్పుడూ

మాతృదేశానికి వచ్చి తమ బంధువులను కలిసి, తిరిగి వెళ్ళిపోతూ వుంటారు.

గోవాలో స్థానిక పాలకులతోను, పోర్చుగీసు పరిపాలకులతోను అనేక కోటలు నిర్మించబడినాయి. తమ రాజ్య రక్షణకోసం స్థానిక రాజులు మట్టితోను, రాతితోను నిర్మించిన కోటలు చాందూర్, కుర్ది గోపకపట్టణ (గోవా వెల్హా), ఓల్డుగోవా (వెల్హాగోవా) మార్థాన్‌ఘడ్, బనస్తరిం, తిరాకూల్, కోర్జం, మార్ముగోవా, నరోవా, బిచోలిం, సాంకేలిం, నానుజ్ కాబోడిరామా అనే ప్రదేశాలలోను, పోర్చుగీసు పరిపాలకులు కట్టించిన కోటలు అగ్వాదా, రాచోల్ రీస్ మాగోస్, క్యాస్పర్ డయాస్, అలోర్నా, చాపోరా తివిం, కోల్వాలే మరియు ఆల్డోనా అనేచోట్ల వున్నాయి. స్థానిక రాజులైన కదంబులు, శిలాహారులు నిర్మించిన కోటలను సావంతవాడి భోన్స్లేలు, సుందారాజులు, మరాఠా రాజులు దుర్భేద్యంగా విస్తరించారు. పోర్చుగీసువారు నిర్మించిన కోటలు పోర్చుగీసువారి వాస్తు శైలిలో నిర్మింపబడినాయి. ఫిరంగుల వాడకం పోర్చుగీసువారే భారతదేశంలో మొట్టమొదట ప్రవేశపెట్టారు. వారు తమ రాజ్య రక్షణకోసం గోవా సముద్రతీరంలో అనేక కోటలు నిర్మించారు.

**గోవా - ఆంధ్రరాష్ట్ర సంబంధాలు :**

గోవాతో ఆంధ్రదేశానికి స్వాతంత్ర్యానికి పూర్వంనుండే సంబంధాలుండేవని తెలుస్తున్నది. బ్రిటీష్‌వారి హయాంలోనే మచిలీపట్నం - మార్మగోవా అనే మీటరు గేజి రైలుమార్గం వుండేది. గోవాను పోర్చుగీసువారి శృంఖాల నుండి విమోచన చేయించటానికి ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు తమ ప్రాణాలను బలిదానం చేశారు. ఆంధ్ర దేశం నుండి కూడా చాలామంది వాలంటీర్లు పోర్చుగీసు సైన్యంతో పోరాడినట్లుగా కృష్ణాజిల్లాకు చెందిన చావరాల జగన్ మోహనరావు, సూరి సీతారామ శోభనాచలపతిగార్లు గోవా పోలీసులచే దొడామార్గ్ (దూద్‌సాగర్ జలపాతంవద్ద) అనే ప్రదేశంలో కాల్చివేయబడ్డారు. గోవా రాష్ట్రాన్ని పోర్చుగీసు పాలననుండి విముక్తి చేయించటానికి అనేక రాష్ట్రాలనుండి ఎంతోమంది సత్రాగ్రహులు తమ ప్రాణాలను బలిదానం చేశారు. పైన పేర్కొన్న తెలుగు సత్యాగ్రహులు, కన్నడ రాష్ట్ర సత్యాగ్రహులతో కలసి పోర్చుగీసువారి వ్యతిరేక నినాదాలు ఇచ్చుకుంటూ గోవా సరిహద్దులో ప్రవేశించగానే పోర్చుగీసు పోలీసులు వారిని తమ తుపాకులతో ఆటవికంగా కాల్చివేశారు. వారు వీరమరణం పొంది, అమరులైనారు. విజయనగర సామంతులకు గోవా పోర్చుగీసువారికి సత్సంబంధాలు వుండేవి. విజయనగర సైన్యంలో వున్న తెలుగు సేనానులు గోవా సైన్యానికి భారతదేశంలో అమలులో వున్న యుద్ధనీతిని, నైపుణ్యాన్ని నేర్పినట్లుగా విదేశీరాయబారుల వ్రాతలవలన తెలుస్తున్నది. కొంకణ రైల్వే లైను నిర్మాణంలో కూడా తెలుగువారి పాత్ర ఎంతోవున్నది. కొర్లిం - మడగావ్ మధ్య కొంకణ రైల్వే లైనును జువారీ నదిపైన రైల్వే వంతెనను ఖమ్మంజిల్లాకు చెందిన మధుకాన్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీవారే నిర్మించారు. అనేకమంది తెలుగు కంట్రాక్టర్లు గోవాలో అనేక నిర్మాణాలలో పాలుపంచుకున్నారు. గోవాలో అనేక ప్రభుత్వశాఖలలో అధికారులుగా, ఇంజనీర్లుగా, పురాతత్వవేత్తలుగా పనిచేసిన తెలుగువారు గోవా ప్రభుత్వ ఉద్యోగులకు సుపరిపాలనా విధానాన్ని నేర్పించారు. తెలుగు రైతులు వారికి వరి, చెఱకు పండించటం నేర్పించారు. తెలుగు కార్మికులను కష్టజీవులుగా, గోవన్లు గౌరవిస్తారు.

**ఆంధ్ర సంఘం :**

గోవాలో సుమారు 50 సంవత్సరాలుగా నివసిస్తున్న తెలుగువారు, తమ మాతృభాషావ్యాప్తికి, సంస్కృతి, సంప్రదాయాలకు తెలుగువారి అభ్యుదయానికి ఎంతో కృషిచేస్తున్నారు. గోవా పోర్చుగీసు పాలన నుండి విముక్తి పొందిన (1961) తరువాత పోర్చుగీసు ఉద్యోగస్తులు తమ దేశానికి వెళ్ళిపోయారు. గోవాలో ప్రభుత్వ యంత్రాంగాన్ని నడిపించటానికి తగినంతమంది ఉద్యోగులు లేకపోవటంతో, కేంద్రపాలిత ప్రాంతమైన గోవా తమ ప్రక్క రాష్ట్రాలనుండీ నిరుద్యోగులను,



ఉద్యోగులను ఆహ్వానించింది. గోవాకు పొరుగునేవున్న మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన అనేకమంది గోవా ప్రభుత్వ, ప్రైవేట్ సర్వీసుల్లో చేరారు. చిన్నచిన్న ఉద్యోగాలు స్థానిక నియామక కమిటీల ద్వారానే నిర్వహించగా పెద్ద ఉద్యోగాలు యూనియన్ పబ్లిక్ సర్వీసు కమీషను (U.P.S.C., Delhi) ద్వారా నియామకాలు చేయబడినాయి. అట్టివారిలో తెలుగువారు కూడా అనేక శాఖలలో నియమింపబడ్డారు. గోవాలో నివసిస్తున్న తెలుగువారు తమ మంచిచెడులను చర్చించుకోవటానికి ఒక వేదిక కావలసిన అవసరాన్ని గుర్తించారు. గోవాలో వున్న తెలుగువారి అభ్యున్నతికోసం, తెలుగు భాషను, సాంప్రదాయాలను బ్రతికించుకుంటూ ముందు తరాలవారికి తెలుగు భాష గొప్పతనాన్ని తెలియచేయాలనే ఉద్దేశ్యంతో ఔత్సాహికులైన కొందరు తెలుగు ఉద్యోగులు ముఖ్యంగా శిష్లా జగన్నాథరావు (AIR), Dr. రాజారామ్, Dr. P.S. కృష్ణమూర్తి, Dr. భుజంగరావు, రమణ (గోవా మెడికల్ కాలేజి), A. వెంకటరత్నం (Deputy Collector), S. రామారావు (కేంద్ర పురావస్తుశాఖ) మొదలైనవారు 1967లో పనాజీ నగరంలో గోవా ఆంధ్ర సంఘాన్ని స్థాపించి, దానిని రిజిస్టరు (Reg. No. 504) చేయించి తమ కార్యకలాపాలను ఎంతో ఉత్సాహంగా ప్రారంభించారు. ఈ సంఘం 1992లో 25 వసంతాలు పూర్తిచేసుకుని రజతోత్సవాన్ని ఘనంగా జరుపుకుని సావనీరును విడుదల చేసింది. ఆంధ్రసంఘం తెలుగు సంస్కృతి, కళల వికాసానికి నడుంకట్టి తెలుగుభాష, సంస్కృతి పరిమళాలను భావితరాల తెలుగువారికి అందిస్తున్నది. ఈ సంఘం అనేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ తెలుగువారి మన్ననలు పొందుతున్నది. ఈ సంఘం నిర్వహించే కార్యక్రమాలకు గోవాలో మారుమూల వున్న ప్రాంతాలనుండి తెలుగువారు తమతమ కుటుంబాలతోసహా హాజరై, ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ సంతోషపడిపోతారు. ఇంతటి ఆత్మీయత, తెలుగు భాషపై వున్న మమకారం, అభిమానం తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో కూడా దొరకదంటే అతిశయోక్తి కాదనుకుంటా. ఆంధ్ర సంఘంవారు 1976–79 సంవత్సరాలలో నెలలో ప్రతి మొదటి ఆదివారం పనాజీలోని నేషనల్ థియేటరులో తెలుగు సినిమా ప్రదర్శించేవారు. ఈ సినిమాలు చూడటానికి గోవాలో వున్న తెలుగువారంతా ఎంతో ఉత్సాహంగా వచ్చి ఆనందించేవారు. ఈ మ్యాట్నీషో వున్ననాడు ఆహుతులంతా తెలుగువారితోనేకాక కన్నడ, గోవా స్థానికులతో కిక్కిరిసిపోయేది. గోవాలో అనేక తెలుగు సినిమా షూటింగులు జరుగుతుంటాయి. జగన్నాథరావుగారు పనాజీలో వున్న ఆలిండియా రేడియోలో అనేక కార్యక్రమాలు నిర్వహించేవారు. గోవాలో అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడుతూ వుండేవి. తిరుపతి దేవస్థానం వారి అన్నమాచార్య కళాపీఠంవారి కళాకారులద్వారా అన్నమాచార్యుని గీతాలాపనలు సాంస్కృతిక కార్యక్రమాలు పనాజి, వాస్కోపోండా, మడ్‌గాంవ్ పట్టణాలలోని నిర్వహింపబడినాయి. అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు డా॥ మేడసాని మోహన్‌గారు అష్టావధానం నిర్వహించి గోవాలో తెలుగువారికి అష్టావధాన, శతావధాన ప్రక్రియను తెలియజేశారు.

ఆంధ్ర సంఘంవారు అనేకమంది తెలుగు కవులను (డా॥ సి. నారాయణరెడ్డిగారు), సినీనటులను (స్వర్గీయ డా॥ అక్కినేని నాగేశ్వరరావుగారు), సాహితీవేత్తలను (డా॥ మేడసాని మోహన్‌గారు), కళాకారులను సన్మానించారు. తెలుగువారి ముఖ్య పండుగలైన సంక్రాంతి, ఉగాది, దసరా శుభదినాల సందర్భంగా అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆ సందర్భంలో స్త్రీలకు ముగ్గుల పోటీలు, వంటల పోటీలు నిర్వహించేవారు. కార్తీకమాస వనభోజనాలు వేరువేరు ప్రదేశాలలో (Old Goa, Tambdi Surla, Cunda) ఏర్పాటు చేసేవారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన బస్సులలో ఈ వనభోజనాలకు తెలుగువారందరూ ఎంతో ఉత్సాహంగా హాజరయ్యేవారు. స్త్రీలు వంటా వార్పు చేసి, అతిథులకు రుచికరమైన తెలుగు భోజనం ఏర్పాటు చేసేవారు. ఈ వనభోజనాలలో ఆత్మీయ అతిథులకు సత్కారం, స్త్రీలకు, పిల్లలకు ఆటలపోటీలు, పాటలపోటీలు, తంబోలా నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించేవారు. రాయ్‌బందర్ ప్రక్కనేవున్న క్యాంపులలో (చింబల్) వున్న తెలుగు కార్మికుల పిల్లల కోసం తెలుగు పాఠశాలను నిర్వహించేవారు. గోవా గనులలో తెలుగు ఇంజనీర్లేకాక అనేకమంది కార్మికులు కూడా పనిచేస్తూ వుండేవారు. చిన్నచిన్న వృత్తులైన రజకులు, క్షురకార్మికులు, మిలటరీలో పనిచేసే సిపాయిలు కూడ

తెలుగువారు ఉండేవారు. వీరందరూ ఆంధ్ర సంఘ సభ్యులుగా వుండి తెలుగువారి అభ్యున్నతికోసం తమవంతు సహకారాన్ని అందించేవారు.

గోవాలో వున్న తెలుగువారు తమ రాష్ట్రానికి దూరంగా వుంటున్నా తమ మాతృ భాష, సంస్కృతి, సంప్రదాయాలను బ్రతికించుకుంటూ, స్థానికుల సంస్కృతి, సంప్రదాయాలను, ఆచారాలను గౌరవిస్తూ, స్థానిక భాష (కొంకణి)ను నేర్చుకుని, స్థానికులను గౌరవిస్తూ వారితో మమేకం అవుతూ తమ మాతృభాష ఔన్నత్యాన్ని పరిరక్షించుకుంటూ తమ ఇతోధిక సేవలను గోవా రాష్ట్రానికి అందిస్తూ సంఘంలో మంచి పేరు సంపాదించుకుంటున్నారు.

గోవా మంచి పర్యాటక కేంద్రం, పర్యాటకం ద్వారా ఆ రాష్ట్రానికి మంచి ఆదాయం వస్తున్నది. గోవా ప్రభుత్వం పర్యాటక రంగాన్ని అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నది. కేంద్ర ప్రభుత్వ, గోవా ప్రభుత్వ సర్వీసుల్లో ఉన్నత పదవుల్లో ఎంతోమంది తెలుగు ఉద్యోగులు ఉన్నారు. కేంద్ర ప్రభుత్వ శాఖలైన ఆదాయపు పన్ను శాఖ, టెలికమ్యూనికేషన్సు, రైల్వే, భారత పురావస్తుశాఖ, రక్షణశాఖ, జాతీయ సముద్ర విజ్ఞాన శాఖ (N.I.O.) కస్టమ్స్‌శాఖ, గోవా ఆలిండియా రేడియో, దూరదర్శన్, కేంద్ర నేర పరిశోధక శాఖ (C.B.I.), చిన్న మొత్తాల పొదుపు సంస్థ (N.S.S.), కేంద్ర పోలీసు బలగాలు (C.R.P.F) I.B.M. మొదలైన సంస్థలలో మరియు రాష్ట్రప్రభుత్వ శాఖలైన న్యాయశాఖ, ఇరిగేషన్, ప్రజాపనుల శాఖ (PWD), విద్యుత్‌శక్తి శాఖ, రెవెన్యూ కార్మికశాఖ, ఆరోగ్యశాఖ, పశుసంవర్ధకపాల శాఖ, వ్యవసాయ శాఖ, విశ్వవిద్యాలయం, మెడికల్, ఇంజనీరింగ్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, డిగ్రీ కళాశాల, ఉన్నత పాఠశాలలో అనేకమంది తెలుగువారు ఉద్యోగం చేస్తున్నారు. వీరేకాక అనేక ప్రభుత్వ సంస్థలు (Pest control of India, I.F.B.), ప్రైవేటు సంస్థలేకాక వ్యాపార సంస్థలు (Diamond Factory) కాంట్రాక్టర్లుగా, రియల్ ఎస్టేట్ Buildersగా విధులు నిర్వహిస్తూ తెలుగు జాతి ఔన్నత్యాన్ని గోవాలో వ్యాపింప చేస్తున్నారు. గోవా వైద్య కళాశాల శాఖాధిపతులుగా డా॥ రాజారాం, డా॥ కృష్ణమూర్తి, డా॥ భుజంగరావు, డా॥ అబ్రహాం గార్లు, జిల్లా న్యాయమూర్తిగా ఘంటా వెంకటరత్నం, చీఫ్ ఇన్ఫర్మేషన్ కమీషనర్‌గా A.V. రత్నం, N.I.O. Director గా వరదాచారి, సైంటిస్టులుగా డా॥ పానకాలరావు, డా॥ రమణ, డా॥ శంకర్‌రావు, డా॥ సోమయాజులు, డా॥ గోపాలరావు, డా॥ మధుసూధన రావు, డా॥ గుప్త, డా॥ మూర్తి, డా॥ సుబ్బరాజు, డా. కృష్ణ, డా॥ సుబ్రహ్మణ్యంగార్లు, ఆదాయపు పన్ను శాఖ సహాయ కమీషనర్‌గా రామకోటయ్య, C.B.I. సూపరింటెండెంటుగా దిలీప్‌కుమార్ I.P.S., College of Pharmacy లో డా॥ సత్యనాథ్, డా॥ సత్యనారాయణగార్లు పశుసంవర్ధక శాఖ సంచాలకులుగా డా॥ K.V.K. శాస్త్రి, ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజనీరుగా M. నరసరాజుగారు, ఇంజనీర్లుగా N.R. రావు, P. కొండలరావు (SE), శేషయ్య, G.S. బాబు, J.S. రెడ్డి గార్లు, విద్యుత్ శక్తి శాఖలో అప్పాజీ హనుమంతరావు, చలపతిరావు, చంద్రమౌళి గార్లు, గోవా పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌గా హనుమంతరావు, MES లో కృష్ణంరాజు, Col. రావు, రాఘవరాజు, శరణ్ రెడ్డి, తంతి తపాలా శాఖలో శంకర్‌రావు, హరికృష్ణ N.S.S.C. లో రంగనాథ్‌రావు, కేంద్ర పురావస్తుశాఖలో రాజారావు, హనుమంతరావు, వెంకటేశ్వరరావు (వ్యాసకర్త), డా॥ గోపాలరావు గార్లు, Engg College Principal గా డా॥ గుప్త గార్లు మొదలైనవారు ఉద్యోగాలు నిర్వహించి, తెలుగువారికి మంచి పేరుప్రఖ్యాతులు సంపాదించి పెట్టారు. మి



దూద్ సాగర్ జలపాతం

కొసరాజు వెంకటేశ్వరరావు
హైదరాబాద్.
ఫోన్ : 9490636659

# గిరిజన సాహిత్యం

-ఎమ్. వెంకటస్వామి

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 67 సంవత్సరాలు గడచినప్పటికీ ఈశాన్య భారతదేశం యిప్పటికీ ఈ దేశంనుండీ దూరంగానూ ప్రత్యేకంగావున్న ఒక భూభాగపు ముక్కలా, భౌగోళికంగానూ, భావనాత్మకంగానూ పరకీయంగా వున్నట్టు బాధపడుతున్నది. ఈ భారత భూభాగాన్ని దక్షిణపూర్వ ఆసియా సాంస్కృతిక పడసాల అని అంటారు. మొత్తం 2,60,000 చ.కి.మీ. విస్తీర్ణమున్న యీ వలయంలో ఎనిమిది రాష్ట్రాలు వుండి వాటిని సప్తసహోదరిలు మరియు ఒక చిట్టతమ్ముడ (సిక్కిం)ని పిలవడం పరిపాటి. ఈ వలయంలో దగ్గరదగ్గర 220 గిరిజన మరియు ఉప-గిరిజన జాతులు వుంటూ అందరూ తమవే అయిన గిరిజన భాషలు పొందివున్నవి. మనదేశపు యీశాన్య ప్రదేశం భౌగోళికంగానూ, సాంస్కృతికంగానూ మరియు చారిత్రకంగానూ చాలా వైవిధ్యమున్నటువంటిది. ఇక్కడ నివసిస్తున్న ఇండోమంగోలాయ్డ్ జాతులు నూరారు సంవత్సరాలనుండి సంకరమైపోయి వున్నవి. నైసర్గికంగా రమణీయమైన యీ ప్రదేశం హిమాలయ పర్వతశ్రేణులతోనూ, దట్టమైన హరిద్వర్ణమైన అడవులతోను రమణీయంగానూ, నయనానందకరంగానూ వుంటూ మధ్యభాగంలో ఒక పురుష నది (బ్రహ్మపుత్ర) ఈ ఈశాన్య భారత భూభాగాన్ని రెండుగా చీల్చి ప్రవహిస్తుంటుంది.

ఈ ఈశాన్య భూభాగంలో మొదటినుంచీ కాకసులు మరియు మంగోలాయ్డ్ అన్న రెండు ముఖ్య జాతులు వుండేవి. కాకసుల జాతికి చెందిన ఇండెడ్‌లో రెండురకాలు - హిందువులు మరియు ముసల్మానులు. వీరికి ముందు ఆస్ట్రోలాయ్డ్ జాతివారు యిచటికి వచ్చి నివసించేవారు. బహుశః మంగోలాయ్డ్ జాతివారి వలస ఎక్కువైనందువల్ల ఆస్ట్రోలాయ్డ్ జాతి చిహ్నాలువున్న జాతివారిని మంగోలాయ్డ్ జాతివారు తమలో పూర్తిగా విలీనం చేసుకొన్నారనిపిస్తుంది.

ఆర్యుల వేదకాలంలో వీరిని నిష్ఠాదులని, సబారరని పిలిచేవారు. క్రీ.శ. 1228 సమయంలో బర్మా వైపునుండి *'ఆఓమ్స్'* జాతివారు *ఇర్వాడి చింద్విన్* కనుమల మార్గంగా ఈశాన్య భారత ప్రదేశానికి వలసవచ్చి యిక్కడున్న జాతుల ప్రజలపై దాడిచేయడం ద్వారా ఇక్కడి చరిత్ర నికరంగా తెరచుకొంటుంది. ఇది జరుగడానికి ముందే చైనా చరిత్రకారులు ఇక్కడి జనులను గురించి దాఖలాలు సృష్టించిన విషయం అక్కడక్కడా మనకు మసకమసకగా చరిత్ర పుటలలో గోచరమవుతుంది. హిందూపురాణాలు మరియు మహాభారతంలో యీ జాతులను గురించి ఉల్లేఖించబడివున్న విషయం మనం గమనించవచ్చు. నాగాలాండ్‌లోవున్న యిప్పటి దిమాపురం (Dimapur) పూర్వం మహాభారతంలోని భీముడు వరించిన హిడింబి నివాస స్థానం, హిడింబాపురమని అంటారు. అలాగే అర్జునుడు వరించిన మరొక స్త్రీ పుట్టినిల్లు మణిపురమన్న ఆనవాలు లభిస్తాయి.

**ఈశాన్య భారత భాషల మూలం :**

ఇండో మంగోలాయ్డ్ గుంపుకు చేరిన బోడో గుంపువారి భాషలను మాట్లాడేవారు బ్రహ్మపుత్ర కనుమలనుండి, తూర్పు, పశ్చిమ బెంగాలు వరకూ విస్తరించారని అంటారు. ఇప్పుడు బోడో, కఛారి, ఫారో, హాజోంగ్, త్రిపురలని, వివిధ రకాలైన పేర్లున్న వీరు, చిన్నచిన్న గుంపులుగా యిపుడు వీరు ఈశాన్య భారత ప్రదేశంలో నివసిస్తున్నారు.

ఈశాన్య భారతపు ఇండో మంగోలాయ్డ్ జాతులవారు సైనో టిబెటన్ గుంపుకు చెందిన భాషలను మాట్లాడుతారు. ఈ భాషలను ముఖ్యమైన రెండు గుంపులుగా విభజించవచ్చు. అవి, టిబెటోబర్మన్ మరియు సియామీస్ చైనీస్. సియామీస్ చైనీస్ గుంపులో సియామీస్ మరియు ప్రాదేశిక లేక ప్రాంతీయ భాషలైన థేవి లేక థాయ్ గుంపుకు చెందినవి. ఈశాన్య ప్రదేశంలో మాట్లాడే ఆఓం, కామ్తి,

కామ్యాంగ్, ఆయిటన్, ఫేకియల్, తురంగ్ మొదలుగాగల భాషలు థాయ్ భాషకు ఉపయుక్త భాషలుగా ఉంటున్నాయి. ఇండో మంగోలాయ్డ్ గుంపుకు చెందిన భాషలు (కాశీ మరియు ప్నర్ భాషలను తప్పించి) టిబెటో, బర్మన్ గుంపుకు చేరినవి. ఈ భాషలు ఉత్తర అస్సాంలో మాట్లాడే భాష లేవంటే - అరుణాచల ప్రదేశంలో వున్న గిరిజన ప్రదేశం మరియు అస్సాంలోని కొన్ని ప్రదేశాలలో అకా, ఆది, మిస్సింగ్, నిశె, మిస్సీ మొదలైనవి వీరు మాట్లాడే భాషలు. టిబెటో బర్మన్ గుంపులో అస్సామీ - బర్మన్ భాషలు సృష్టింపబడ్డాయి. ఇవి ఉత్తరం మరియు తూర్పు బెంగాల్, అస్సాం మరియు బర్మా ప్రదేశాలలోని భాషలేవనగా-

1. బోడో, మెక్, రాభా, షారో, కఛారి, త్రిషి, మిగిలిన ఉపభాషలు

2. నాగా గిరిజన జాతులు మాట్లాడే ఆఓ, అంగామి, సెమా, తంకూల్, సంగ్టమ్, కోన్యాక్, లోథా, మహో మరియు కుంబై మొదలైనవి.

3. కుకి, చిన్న, గిరిజన జాతులు మాట్లాడే మణిపురి, త్రిపుర మరియు మిజో భాషలు.

మేఘాలయాలో మాట్లాడే కాశీ మరియు దాని ఉప భాషలు మాత్రమే ఈశాన్య భారత ప్రదేశంలో మాటలాడే భాషలకంటె భిన్నంగా వుంటాయి. వారు మన్‌కీ మీర్ గుంపుకు చెందిన భాషను మాట్లాడుతారు.

పైన చెప్పిన భాషలు ఆఫ్రో ఏషియాటిక్ గుంపుకు చెందిన భాషలు. వీటి ప్రత్యేకతేమిటంటే ఈ భాష మాటలాడే జనుల చుట్టూ టిబెటో జర్మన్ భాషలు చుట్టుముట్టున్నవి. ఇచ్చట ఏ భాషకూ లిపి అన్నది లేదు. 17-18 వ శతాబ్దంలో యిచటికి వచ్చిన యూరోపియన్ మిషనరీలు, భాషా శాస్త్రజ్ఞులు కొన్ని ముఖ్యమైన గిరిజనుల భాషలకు ఇంగ్లీషు, రోమన్ లిపిలను వాడుకొన్నారు. ప్రస్తుతం ప్రచారంలోని చాలా పురాతనమైన భాషలు అంతరించే పరిస్థితిలో వుంటే ఈశాన్య ప్రదేశంలోని అందరి గిరిజనుల భాషలు చాలా వేగంగా యీ భూతలంనుండి మాయమవుతున్నవి. ఇక్కడి ఎన్నో భాషలు యింకా శైశవావస్థలో వుండి యితర బలిష్టమైన భాషలు వీటిని మ్రింగివేస్తున్నవి. కాని, ఈ ఈశాన్య భాగంలోని ప్రతి యొక్క భాషకూ తనదేయైన ప్రత్యేక చరిత్ర, సాంస్కృతిక నేపథ్యం, ఆచార వ్యవహారాలు, కళ, సాహిత్యం, పాటలు, సుఖదుఃఖాలు వున్నవి. అంతేగాక అక్కడి విజ్ఞానం, తంత్రజ్ఞానం యీ భాషలలో అడగివున్నవి. ఇచటి అస్సామీ భాష చాలా బాగా అభివృద్ధి చెందిన భాష. అలాగే మణిపురి సైతం కూడ. అస్సామీ భాషకు బెంగాలి మరియు దేవనాగరి లిపిని వాడుకొన్నారు. మణిపురి భాషకు మూడు శతాబ్దాల క్రితంగా బెంగాలి లిపిని వాడుతున్నారు. అంతకు మునుపు యీ భాషకు మీథియ్ అనే లిపి వుండేది. మిగిలిన కొన్ని గిరిజనుల ముఖ్య భాషలైన నాగామీన్ (అస్సామీ నుండి వేరుపడిన భాష) కాశి, బోడో మొదలైన భాషలకూ రోమన్ - ఇంగ్లీషు లిపిని వాడుకొన్నారు. కాని, ఆ భాషలలో చెప్పుకోదగిన సాహిత్యం సృష్టింపబడలేదు.

**యుద్ధ సాహిత్యం :**

1988లో లక్నో పట్టణంలో కేంద్ర భూగర్భశాఖలో పనిచేస్తున్న నన్ను ఈశాన్య వలయానికి బదిలీచేయమని కోరిన వెంటనే నాగాలాండ్‌కు బదిలీ చేశారు. ఈ భాగంలోని గిరిజనుల వైవిధ్యమయమైన జీవితాలను గురించి కుతూహలం కలిగివున్న నేను, అచటికి చేరిన వెంటనే ఆ చుట్టుప్రక్కలంతా సంచారం చేస్తూ చేతికి అందిన సాహిత్యాన్నంతటినీ చదువసాగాను. కాని, అప్పుడు నాకు ఈశాన్య ప్రదేశానికి చెందిన, సరిపడ్డ ఎలాంటి కథ, కావ్యం, నవలగాని లభించలేదు. అంటే, ఆ సమయానికి అక్కడ ఆధునిక సాహిత్య ప్రక్రియ యింకా కళ్ళు తెరవలేదనిపించినది. నాకపుడు లభించినదంతా గిరిజనులకు సంబంధించిన జానపద, ఐతిహ్యపు కథలు, వారి ఆహార వివరణలు, వారు అవలంబిస్తున్న పద్ధతులకు సంబంధించిన ఆంగ్ల గ్రంథాలు మాత్రమే. వాటినన్నిటినీ సంగ్రహించి భద్రపరచినవారు ముఖ్యంగా యిచటికి యుద్ధం చేయడానికి వచ్చిన బ్రిటిష్ మరియు యూరోపియన్ అధికారులు మరియు ధర్మప్రచారణార్థం మిషనరీ పనులకై వచ్చినవారు. దీనికి తోడుగా, కలకత్తా మరియు యితర విశ్వవిద్యాలయాలలో పరిశోధన చేస్తున్నటువంటి చేతివ్రేళ్ళతో లెక్కపెట్టగల విద్యార్థులు మరియు అధ్యాపకులు. యిక్కడికి గిరిజనుల కథలను అనేకమంది సంపాదించి వుంచినందువల్ల చాలావరకు కథలు కొన్ని కృతులలో మరల మరలా పునరావృతమైనవి.

ఈశాన్య భారతంలో స్వాతంత్ర్యానికి పూర్వం జరిగిన యుద్ధాలకు సంబంధించిన కొన్ని గ్రంథాలు లభించాయి.

ముఖ్యంగా నాగా జాతివారు మరియు బ్రిటిష్‌వారి మధ్య స్వాతంత్ర్యానికి ముందు జరిగిన యుద్ధాలను గురించి లిఖింపబడినవి. మొదట మరియు రెండవ మహాసంగ్రామాలు యీ ప్రదేశంలో తీవ్రంగా జరిగినవి. సుభాష్‌చంద్రబోస్ గారు యిక్కడ సంచరించి యుద్ధనాయకత్వం వహించినట్టు దాఖలించబడినది. వేలకొద్ది భారతీయులు, బ్రిటీష్‌వారు మరియు వారికి సహాయం చేయడానికి వచ్చిన యితర దేశాల యోధులకు సంబంధించిన రుద్రభూమి కొహిమాలో వున్నది. 1962లో జరిగిన భారత-చైనా యుద్ధంలో మరణించిన వేలకొద్ది భారతీయ యోధుల స్మశానాలు అరుణాచల ప్రదేశపు సరిహద్దు ప్రదేశమంతా విస్తరించబడినది.

స్వాతంత్ర్యానికి ముందు నాగాప్రజలు కొహిమా చుట్టుముట్టూ వున్న బ్రిటిష్‌వారు నడుపుతున్న బ్యాంకులలోనికి ప్రవేశించి నూరారుమంది బ్రిటిష్ వారి తలలను కత్తిరించివేసి పారిపోయారు. కర్నల్ జాన్ స్టోన్ యీ విషయం గురించి ఒక సుదీర్ఘమైన యుద్ధ కథనం వ్రాశారు. బ్రిటీష్ వారు చివరకు నాగాల విరుద్ధంగా యుద్ధంలో గెలవాలంటే మణిపురం రాజ్యపు హిందూరాజు తన మొత్తం సైన్యాన్ని బ్రిటిష్ సైన్యం వెంట పంపాల్సి వచ్చినది. ఈ యుద్ధంలో చనిపోయినవారందరూ మణిపురవాసులు మరియు దేశంలోని యితర భాగాలనుండి వచ్చిన యోధులు. మనదేశపు ప్రజలే యోధులుగా ఒకరి ఎదురుగా ఒకరు నిలబడి పోరాడి ప్రాణాలు విడిచిన యుద్ధం కథ చదివిన నేను చలించిపోయా. మొత్తం ఈ ఈశాన్య ప్రదేశంలో నాగాలు 'ఫెరోషియస్ వారియర్స్' అన్న ఖ్యాతి గడించినవారు. మన దేశపు మిలిటరీలో నాగాల ప్రత్యేక రెజిమెంట్‌కూడ వున్నది. మన దేశపు ఒక భాగాన్ని అతిక్రమణ చేసిన పాకిస్తాన్ సైన్యాన్ని మట్టిపాలు చేసిన ఘనత యీ నాగాలకే చెందిన నాగా రెజిమెంట్.

భారతదేశం బ్రిటీషు వారినుంచి స్వాతంత్ర్యం పొందడానికి ముందే నాగాలు ఇంగ్లండు దేశం కలిసి బ్రిటిష్ వారి ముందు మరియు మహాత్మాగాంధీని కలిసి తమకు ప్రత్యేకమైన నాగాదేశం కావాలన్న ప్రస్తావన వారి ముందుంచారు. భారత ప్రభుత్వం వారి కోరికను త్రోసిపుచ్చి 1947లో నాగాలాండ్ రాజ్యం కూడ భారతదేశంలో ఒక అవిభాజ్య అంగమని ఘోషించగా నాగా క్రాంతి కార్లు భారత ప్రభుత్వానికి విరుద్ధంగా గెరిల్లా యుద్ధం ఘోషించి పరారయ్యారు. ఆనాడు వారు ప్రారంభించిన యీ గెరిల్లా యుద్ధపు మంటలు ఈశాన్య భారత ప్రదేశం పూర్తిగా ఆవరించి ఈనాటికీ భారతదేశానికి పెద్ద తలనొప్పిగా పరిణమించినవి. ఒక అంచనా ప్రకారం 1947 నుండి యిప్పటివరకు సుమారుగా 10,000 మందికి పైగా స్థానికులు, మిలిటరీ, పోలీస్ అధికారులు మరియు గెరిల్లాలు ప్రాణాలు పోగొట్టుకున్నారు.

దళితులు లేదా దళితుల సాహిత్యమన్న వ్యాఖ్యానం యీ ఈశాన్య భాగంలో లేదు. దీనికి కారణం యిచ్చటి జాతులు మూలంగా మంగోలాయిడ్ గిరిజన జాతులకు చేరడంవల్ల, ఇక హిందూ ధర్మపు ఛాయలు యీ పర్వతాల వరకు వ్యాపించలేదు. అందువల్ల జాతి, అస్పృశ్యత అన్న సమస్య ఇక్కడి ప్రజలనెప్పుడూ బాధించలేదు. ఆ కారణంవల్లనే యిక్కడి నదులు కనుమలలో వున్న నివాస స్థలాలు స్వచ్ఛంగా గాలిపీలుస్తున్నవి. కాని, అస్సాంలో వుంటున్న హిందూ ప్రజలు మాత్రం జాతి, అస్పృశ్యతల నుండి తప్పించుకోవడం సాధ్యపడలేదు. బ్రహ్మపుత్ర కనుమ (గువహాతి మరియు చుట్టుముట్టు ప్రదేశం), మణిపురం (ఇంఫాల్ లోక్టక్ సరోవరం చుట్టూ వున్న ప్రదేశం) కనుమలను అక్కడి బంగాలీలు ఆవరించుకొన్నప్పటికీ ఈ విషయం అంతగా యిక్కడి ప్రజలపై ఎలాంటి ప్రభావాన్నీ చూపలేదు. అయితే బెంగాలీ భాషను యీ రెండు ప్రదేశాలలోను, అస్సామీ మరియు మణిపురి భాషల లిపిగా వాడుకొంటున్నారు.

**మణిపురి భాష :**

పురాణపరమైన మణిపురి భాషను మొదటినుండి మిథిలిలో లేదా మీథియ్ అని పిలుస్తారు. మణిపురం రాజ మహారాజులు 17వ శతాబ్దం ప్రారంభంలో గోపాలదాస్ అన్నవాడి ద్వారా మొదట వైష్ణవ మతాన్ని స్వీకరించారు. ఈతని హయాంలో మీథియ్ దేవతలైన పంథూలుబి, సానామహి మరియు హిందూ దేవతలకు దేవాలయాలను కట్టించారు. అప్పటినుండి మణిపురం జనుల సంబంధం బర్మాదేశం నుండి విడిపోయి భారతదేశంతో గట్టిపడినది. అనంతరం వచ్చిన శాంతిదాస్ అన్నవారి ప్రేరణతో మయిడింఘ పామహియిబా అన్న రాజు (1709-1748)

ఆదేశం ప్రకారం ఆతడి సముఖంలో 1729వ సంవత్సరం 123 పవిత్ర మీథియ్ భాషయొక్క గ్రంథాలను మంటలలోవేసి బూడిద చేశారు. ఈ దురంతాన్ని 'పూయ్ మీథిబా' అని యిప్పటికీ పిలుస్తారు. ఈ ఘటనతో మణిపురి లేదా మీథియ్ భాషకు ఒక గొప్ప అన్యాయం జరిగినది. అనంతర కాలంలో మీథియ్ భాషలో పోగొట్టుకున్న రామాయణ, మహాభారతాలను బంగాళి మరియు హిందీ భాషలనుండి అనేక కృతులు మణిపురి భాషలోనికి తీసుకువచ్చారు. మణిపురి మూలసాహిత్యం గద్యం, పద్యం రెండింటిలోనూ రచనలు జరిగి 'మీటన్' అన్న చాలా పురాతనమైన సాహిత్య రచన యొక్క ఒక పద్ధతిని అంటారు. కాని, యిపుడు మణిపురి పూర్వ సాహిత్యం లభించినది మియిడింగు తంగవై (1467–1508) రాజుగారి తరువాతి కాలానికి సంబంధించినవి మాత్రమే. ఆ రాజుగారి ఆస్థానంలో కొనసాగిన ఆస్థాన పండితుడు మియిడింగు బోద్ధచంద్ర (1941–1955) అనేకమైన సాహిత్య గ్రంథాలను ఎలాగో కాపాడుకొంటూ వచ్చాడు. వీటిలో ముఖ్యమైన గ్రంథాలు – సుపిత్ కప్ప, జాగ్ర బెంజో, సనాలామోక్ (6/7వ శతాబ్దం) ఆహోంగ్లౌన్ (11వ శతాబ్దం) బోజులా మోర్ (12వ శతాబ్దం) హిజన హిరో, నింగ్దారోన్ (17వ శతాబ్దం) మరియు జనపద కావ్యం, కథలు మాత్రమే. ఈ గ్రంథాలన్నీ 'పూయ్‌మీథిబా' దురంతం నుండి తప్పించుకొన్నవి.

1891 ఏప్రిల్ 27న మణిపురి రాజులు బ్రిటిష్‌వారి చేతిలో ఓడిపోయినరోజే కంగ్లా (లోక్టక్ కనుమ) పట్టణాన్ని తమవశం చేసుకొన్నారు. బ్రిటిష్‌వారు మియిడింటునిగ అన్న రాజుగారి కుమారుడు భోయ్బియిము (1891–1941)ను యువరాజుగా నిర్ణయించారు. అప్పటినుండి మణిపురిలో క్రొత్తరీతిలో సాహిత్య రచన జరగడం ప్రారంభమైనది. దానికి తోడుగా 1872లో ఆంగ్ల పాఠశాలలు ప్రారంభమైనవి. మయిత్రి బక్ లేక యిప్పటి లోక్పల్ కనుమలో బంగాళి భాష సామాన్య ప్రజల భాష అయినందువల్ల మీథియ్ భాషకు బంగాళి లిపిని అన్వయించుకొన్నారు. ఈ కారణంతో వెనుకటి మీథియ్ భాషను ఎవరూ యిపుడు వాడడంలేదు.

1867లో షిల్లాంగ్‌లో జన్మించిన హెయ్జిజమ్ చైయిన్య అన్నతను మీథియ్ భాష యొక్క జనపద కావ్యం, పురాణ గ్రంథాలైన తక్కల్, నంబా మరియు బాహిన్గంబాలను బంగాళి భాషలోనికి అనువదించాడు. తరువాతి కాలంలో వాటిని 'క్రోనికల్' (1900–02) ప్రెస్ వారు ప్రకటించారు. 1993లో మణిపుర సభా ప్రారంభించబడి, తరువాతి కాలంలో దానిని నిఖిల్ మణిపురి మహాసభా అని పిలువసాగారు. మహారాజ చూరాచంద్ దానికి అధ్యక్షులయ్యారు. 1930లో ఆస్థాన పండితుడైన ఆటోంబప శర్మ అన్నతను సంస్కృతం నుండి అనేకమైన కృతులను మీథియ్ భాషలోనికి అనువాదం చేశారు.

లైనిని మగ్వన్ సోపోరియా పోలో (1888–1947) అనునతను మణిపురం పూర్వపు చరిత్ర, సంస్కృతిని తిరిగి తీసుకొని రావడానికి ప్రయత్నించి మీథియ్ భాషలో అనేకమైన కావ్యాలు, కథలను రచించారు. 1922 లో మొట్టమొదటిసారిగా మణిపురి భాషలో ఒక పత్రిక ప్రారంభమైనది. 1905లో 'సమంగ్‌లీలా' అన్న నాటక పాఠశాల కూడ ప్రారంభమైనది. ఆధునిక మణిపురి సాహిత్యంలో బమై రక్బమ్ చోబా, డా॥ లామాబమ్ కమల్ మరియు హజిమ్ అంగంఖల్ సింఘ్ చాలా ముఖ్యమైనవారు. హజిమ్ 3,900 పాదాలు (లైన్స్) వున్న మహా కావ్యాన్ని రాజఖంబ థోయిబీ గురించి రచించారు.

**మణిపురి ఆధునిక సాహిత్యం :**

మణికేతన్ రచించిన కావ్యం క్రొత్తదైనప్పటికీ మణిపురి ఐతిహ్యపు నేపథ్యంలో రచింపబడిన కావ్యమిది. సురచంద్ మోహిరంగ్, దోయిబి రాజుగారిపై ఒక కావ్యం వ్రాశారు. ఆర్.కె. షిటల్జిత్, ప్రకృతి మరియు మానవత్వపు కవిగా కావ్యం రచించారు. ఇబోల్ ప్రేమలో వంచితుడవడాన్ని గురించి కావ్యం రచించారు. గౌర్కిశిర్ మరియు ఆర్.కె. ఇల్బంగ బయ్ ఒక రొమాంటిక్ కావ్యం వ్రాశారు. మరికొంతమంది కవులు అప్పటి సామాజిక ఇబ్బందులు మరియు రాజకీయ కుట్రల గురించి వ్రాసి వెలుగు చూపారు. మరికొందరు రచయితలు యిప్పటి సమాజంలో కనపడుతున్న భయంకరమైన మార్పుల గురించి ఖేదం వ్యక్తం చేస్తూ రచనలు చేశారు. సమరేంద్ర అన్న రచయిత స్థళీయమైన సంస్కృతిని గురించి అత్యంత సమగ్రంగా చిత్రించి కావ్యానికి ఒక తీవ్రతను కల్పించారు. దానికి తోడుగా భాషను అత్యంత ప్రభావితమైన పద్ధతిలో ఉపయోగించారు. నీలకాంతగారి కవితలు చాలా భావుకతతో కూడుకొని వుండి భాష యొక్క కౌశలాన్ని

మెరిపిస్తాయి. ఇంకా చెప్పవలసిన కవులు, కవయిత్రులకంటె పద్మకుమార్, బరేన్ ఇ బొంమ్జు, ఇబోహాల్, ఇబోపిశాక్, మధుబిర్, జ్యోతిరేంద్ర మరియు ఇబెమ్జిశాక్.

**నాటకం :**

మణిపురి పరంగా చరిత్రలో పోరాడిన పోరాటగాళ్ళు రాజులను గురించి అనేకమైన నాటకాలు రచింపబడినవి. ఇక్కడి అనేకమైన చిన్నచిన్న పాళేగార్లకు తోడుగా నాయకులు, నాయకురాండ్రు దర్శనమిస్తారు. లేక ఆయా కాల ఘట్టాలలో వున్న గ్రామ దేవతలు దీనిలో చేరి వారందరి గురించి అనేక రకాలైన కావ్యాలు వుండటంతో వాటి ఆధారంతో నాటకాలను రచించడమైనది. రాజకీయం మరియు సామాజిక సమస్యల ఆధారంగా ఆధునిక నాటకాలు రచించారు. అలాంటి నాటక కారులలో ముఖ్యమైనవారంటే జె.సి. తొంగ్ర్బ, నేత్రజిత్, ఎమ్.కె. బినోదిని దేవి, రామచంద్ర కన్నైయిలాల్, ఎ. సుమోరేంద్ర, తొమ్బ మరియు సనాబోబా, హెయస్నమ్ కన్నయలాల్ 1969లో 'మణిపురి కళాక్షేత్ర' స్థాపించి, ఆధునిక నాటకాలతో మణిపురి కళాసంస్కృతులను అందులో నింపి, నాటకాలను వ్రాసి ఒక క్రొత్త ఆయామాన్ని సృష్టించారు. అప్పటి రాజకీయం మరియు సామాజిక వైచిత్రాలను గురించి ఒకచోట చేర్చి పల్లెలలోనూ, పట్టణాలలోనూ నాటకాలను ప్రదర్శించారు. జాతీయ నాటకశాలలో (National School of Drama, Delhi) తరిఫీదు పొందిన మరొక ప్రతిభావంతుడైన నాటకకారుడు రతన్ థియమ్, ఇతను ప్రసిద్ధ నాటక కారుడైన ఇబ్రహీమ్ అల్‌కాజీ శిష్యుడు. ఇతను 1976లో 'కోరస్ రిపర్సరీ' అన్న సంస్థను ఇంఫాల్‌లో స్థాపించారు. దాని తరువాత 'మణిపురి డ్రమాటిక్ యూనియన్', 'రూప్‌మహల్', 'ఆర్యన్ థియేటర్', 'సొసైటీ థియేటర్' అన్న సంస్థలు ముఖ్యమైనవి. ఇతర భాషల నుండి మణిపురి భాషలలోని వచ్చిన నాటికల పట్టీకూడా చాల పెద్దదే. భాస, కాళిదాసు, రవీంద్రనాథ్ ఠాగూర్, షేక్స్‌పియర్, ఇబ్సన్ మొదలైన వారు రచించిన నాటకాలు భాషాంతరం చెంది ప్రదర్శించబడినవి.

**నవలలు :**

20వ శతాబ్దంలో మొట్టమొదటిసారి డా. కమల్, చౌహోబా మరియు అనంగాంగ్హాల్ మణిపురి భాషలో నవలలను వ్రాయడానికి ప్రయత్నించారు. డా॥ కమల్ ప్రకృతి గురించి అనే పద్యంలో అత్యంత మనోజ్ఞంగానూ, రమణీయంగానూ వర్ణనలు చేస్తూ కథలను వ్రాశారు. వారు తమ మొదటి నవల 'మధబి'లో మనుష్యుని నమ్మకాలను సాక్షాత్కరింపచేసి వ్రాశారు. చౌహోబా తమ చారిత్రక నవల 'లబంగలతా'లో బగేంబార రాజు (1597–1652) కాలపు మణిపురి చరిత్రను నేపథ్యంగా కథను దాఖిలించారు. అనంగాంగ్హాల్ తమ 'జహేరా' అన్న నవలలో ఒక మణిపురి హిందూ యువకుడు మరియు ఒక ముస్లిమ్ యువతి మధ్య కలిగిన ప్రేమను గురించి వ్రాస్తూ యీ రెండు సమాజాల మధ్య వున్న సామాజిక, ధార్మిక సంబంధాలను సూక్ష్మంగా వివరించారు. ఆర్.కె. శతల్జిత్ తమ నవలల్లో మనుష్యుని ఆత్మసాక్షి మరియు ధర్మంతోవున్న సంబంధాలను విశ్లేషిస్తూ రచనలు చేశారు. హెచ్. గుణో, దోయబిదేవి, ఆర్.కె. ఇలంగ్బమ్, రామ్‌సింఘ్ బోహాల్, డా॥ భాగ్య, నోదియాచంద్, ఇబొమ్జ, చిత్రేశ్వర, ఎమ్.కె. బినోదిని దేవి, పచ్చమీవియ మొదలైనవారు నవలలు వ్రాశారు.

**చిన్న కథలు (Short Stories) :**

ఆర్.కె. శీతలజిత్ మరియు ఆర్.కె. ఇలంగ్బమ్ మణిపురి సంస్కృతి నేపథ్యంలో సాధారణ మానవుని సుఖదుఃఖాలతో కూడిన ప్రేమకథలను రచించారు. నిల్బర్‌శర్మ గారి కథలు పేదవారు మరియు సమాజంలోని అట్టడుగువారి జనుల జీవితాలు కథలుగా రూపుగొన్నవి. హెచ్. గోనుగారి కథలు మణిపురి సమాజంలోని రీతిరివాజుల నేపథ్యంలో వ్రాసిన కథలు. అలాగే సాంగ్తోంబమ్, కుంజామోహన్ గారి కథలు స్థలీయ (లోకల్) సువాసనలు వెదజల్లే కథలు. ఇక బీరేన్, ఎమ్.కె. బినోదినిదేవి, ఇ. దినాబీరమణి చిన్న కథలు వ్రాసేవారిలో ముఖ్యమైనవారు. ప్రపంచ సాహిత్యంలో పేరెన్నికగన్న లియోటాల్స్టాయ్, రబీంద్రనాథ్ ఠాగూర్, మున్షిప్రేమ్‌చంద్ యింకా అనేక గొప్ప రచయితల కథలను మణిపురి భాషలోనికి అనువాదం చేశారు. మణిపురి సాహిత్యం గురించి ప్రఖరమైన విమర్శ సాహిత్యం కూడ వెలువడినది.

ఆరంభమ్ దొరేంద్రజిత్ సింఘ్ (1907–1944), మోయిరంగ్, భాగ్యచంద్ర మరియు పరాజయ్ అన్న మూడు చారిత్రక నాటకాలను, 'కన్యా బదు' మరియు 'సుభద్ర హరణ్' అన్న రెండు ఐతిహ్యపు కవితలను వ్రాశారు. మొత్తంగా మణిపురి సాహిత్యం కొన్ని ఎత్తు పల్లాలను

చవిచూచినా, ఇంఫాల్ (లోక్టర్ సరోవరం) చుట్టుముట్టు కనుమలలో మాత్రం తన వ్యక్తిత్వాన్ని యిప్పటికీ కాపాడుకొన్నవి. ఈ లోయలలో నివసిస్తున్న వారి పాత్ర విడిస్తే మిగిలిన చుట్టుముట్టు పర్వతాలలో వున్న గిరిజనులు యిప్పటికీ నాగా మరికొన్ని ప్రాంతీయ భాషలనే మాట్లాడుతుంటారు. వారందరూ టంకుల్ మరియు కుకినాగా మొదలైన గిరిజన సముదాయాలకు చెందినవారైనందున మణిపురి ప్రజలు మరియు వీరి మధ్య యిప్పటికీ ఘర్షణలు జరుగుతూనేవుంటున్నవి.

పి. అలెమ్ జమీర్ అన్న ఆఓ అనే నాగాజాతి ఉపాధ్యాయుడు యిలా అంటాడు : 'ఆఓ భాషలో ఇంతవరకు ఆరుగ్రంథాలను రచనచేసి నేనే ప్రకటించా. కాని ఎవరూ కొని చదవడం లేదు'. వారు యిలా చెప్పినప్పుడు ఆ గ్రంథాలను తెరిచి పేజీలు త్రిప్పిచూశా. కాని అందులో ఒట్టి ఇంగ్లీషు అక్షరాలు మాత్రమే వుండి నాకేమీ అర్థంకాలేదు. అది నాగా ఉపగిరిజన 'ఆఓ' భాషలో రచించిన పుస్తకం. లిపిమాత్రం ఇంగ్లీషు రోమన్ అక్షరాలు.

**అస్సామీ భాష :**

17-18 వ శతాబ్దంలో రామాయణం మరియు మహాభారతానికి సంబంధించిన సాహిత్యం, తరువాతి కాలంలో భక్తిసాహిత్యం అస్సామీ భాషలో ఉద్భవించినది. దీనికి తోడుగా వైష్ణవపంథా యిక్కడి ప్రదేశమంతా ప్రచారమై, దానికి సంబంధించిన సాహిత్యం కూడ పుట్టుకొన్నది. అనంతరం 'బీహోనృత్యం' కొరకే రచింపబడ్డ పాటలు వచ్చాయి. 20వ శతాబ్దంలో మొదటగా అస్సామీ భాషలో విపులంగా సాహిత్యం పుట్టుకొన్నది. 1960 సమయానికి ఆధునికత ప్రారంభమై ముఖ్యంగా కావ్యంలో యూరోపు ప్రభావం, ఆ సాహిత్యపు అనుకరణ కనపడసాగినది. కాని, బంగాళీ లిపిలో వున్న అస్సామీ భాషలో భారతదేశంలోని యితర భాషలలో వున్న సాహిత్యం ఎలాంటిది వచ్చినదో అది అస్సామీ భాషలో 100 సంవత్సరాలైనా రాలేకపోయినది. అందువల్లనేమో కలకత్తా బెంగాళీలు ఒక మాటను యిప్పటికీ అంటుంటారు. అదేమంటే 'భారతదేశం ఈరోజు ఏది ఆలోచిస్తుందో దానిని బంగాళీలు 100 సంవత్సరాలు ముందుగానే ఆలోచిస్తా'రని. మొదట యిక్కడ పాలన చేస్తున్న బ్రిటీష్‌వారు 1836లో బంగాళీ భాషను అస్సామీ రాజ్యభాష అని ఘోషించారు. అనంతరం 1873లో అస్సామీ భాషను రాష్ట్రభాషయని ఘోషణ చేశారు. ఆ తరువాతనే అస్సామీ భాష వ్రాయడానికి సాధ్యపడినది. 1888లో కొందరు అస్సామీ యువకులు కలకత్తాలో 'అస్సామీ భాసార్ ఉన్నతి సాధన సభ'ను స్థాపించారు. దీనికి తోడుగా 'జోనకి' అన్న పత్రికను కూడ వారు ప్రారంభించారు. అప్పటి యూరోపియన్ మరియు బంగాళీ భాషలలో వస్తున్న ఆధునిక సాహిత్యాన్ని ఆరగించుకొన్న యీ యువకులు, ఆ సాహిత్యాన్నంతటినీ అస్సామీ సాహిత్యంలో రచింపసాగారు. లక్ష్మీకాంత బేజబరువ- చంద్రకుమార్ అగర్‌వాల మరియు హేమచంద్ర గోస్వామి అన్న యీ ముగ్గురు యువకులు అస్సామీ భాషకు ఒక క్రొత్త దృక్పథాన్ని యిచ్చారు. ఆ సమయానికి దేశంలోని ప్రజలలో స్వాతంత్ర్యపు నిప్పురవ్వలు రగిలి ఒకరినుండి మరొకరికి అంటుతుండేవి. అస్సామీ భాషకు మొదట జ్ఞానపీఠ ప్రశస్తి తెచ్చియిచ్చిన (1979) బీరేంద్రకుమార్ భట్టాచార్య తమ 'మృత్యుంజయ' కృతిలో ఈశాన్య ప్రదేశపు నూరారుమంది యువకులు స్వాతంత్ర్య పోరాటంలో వారి జీవితాలను సక్రమంగా అర్పించిన విషయాన్ని సమగ్రంగా చిత్రించారు. 2వ జ్ఞానపీఠ ప్రశస్తి తెచ్చియిచ్చిన ఇందిరా గోస్వామి, రాజకీయం మరియు సామాజిక భయభీతులను గురించి కథలు వ్రాశారు. వారు వ్రాసిన నవలలు, కథలు అస్సామీ సాహిత్యాన్ని ఒక ఉన్నత ఘట్టానికి తీసుకుపోయినది. వారు శ్రీమతి ఇందిరాగాంధీ హత్య జరిగినమీదట సిఖ్ఖులపైన జరిగిన దాడి, మానవ హోమం గురించి అస్సామీ భాషలో వ్రాసిన నవల ఆంగ్ల భాషలోనికి 'The Moth Eaten Howdah of Juskar' అని అనువాదం చేయబడి ప్రకటితమైనది.

ఈశాన్య భారత సాహిత్యం యిప్పుడు పలువిధాలుగా దేశంలోని యితర భాగాల ప్రజలతోనేగాక విదేశాలలోనూ కుతూహలాన్ని కలిగిస్తున్నది. అస్సామీ ఉప-గిరిజనుల బోడో భాషను మాట్లాడే జాతులవారు తమ భాషను సాధ్యమైనంత ముందుకు తీసుకుపోగలిగారు. వీరు మౌఖికమైన జానపద కావ్య కథలు, ఐతిహ్యపు కథలు, పాటలు, సామెతలు, లాలిపాటలు మొదలైన సాహిత్య ప్రక్రియలను కాపాడుకొంటూ వచ్చారు. సైయద్ అబ్దుల్ మాలిక్ అస్సామీ భాష పరిధిని విస్తరింపజేసి చాలామంది రచయితలు ఉద్భవించడానికి కారణమయ్యారు.

బోగన్ దాస్, సౌరభ్ చాలిహ్, హెమన్ బోర్గోయిన్, మహిమాబోరా పేరుగాంచిన రచయితలు. మూలంగా భౌతిక శాస్త్రజ్ఞుడైన రచయిత, నాటకకారుడు మరియు అస్సాంకు చెందిన దర్శకుడు భజేంద్రనాద్ సైకియా యీ ప్రదేశంలో అత్యంత ప్రతిభావంతుడైనవారని అంటారు. అలాగే అస్సాంకు చెందిన ప్రతిభావంతుడైన రచయిత మరియు గాయకుడు భూపేన్ హజారికా పేరు యిక్కడ చెప్పితీరాలి. అతడు పాడిన 'హే గంగా బెహతీ క్యూ' పాట మరువడానికి ఎవరివల్లా సాధ్యంకాదు!

**ఆధునిక ఇంగ్లీషు సాహిత్యం :**

ఇందలి కావ్యం మిలిటరీ మరియు క్రాంతికారుల మధ్య నలిగిపోయినదన్న మాట వున్నది. కాని, పత్రికలు మాత్రం చాలా కుతూహలకరమైన మాటలను వ్యక్తం చేస్తాయి. విశ్వవిద్యాలయాలు, రచయితలు మరియు కొన్ని సంఘ సంస్థలు ప్రతి రాష్ట్రంలోనూ అప్పుడప్పుడూ ఒకటిగాక మరొక కార్యాలయంగాని, సభగాని ఏర్పాటుచేసి ఈశాన్య వలయంలోని జనపద కావ్యం, కథ, ఐతిహ్యం, మౌఖిక కథాకావ్యాలు, ఆధునిక కథాకావ్యం, సామ్రాజ్యవాదం, దాని తరువాతి సాహిత్యం, నాటకం, కళ, ఆచార్య వ్యవహారాలు, సంప్రదాయ పద్ధతులను గురించి చాలా ఎక్కువగానే నిర్వహిస్తున్నారు. ఈ ప్రదేశం రెండు మహాప్రపంచ యుద్ధాలకు సాక్షియైన కారణంవల్ల, యుద్ధాలను గురించి కూడ చర్చలు జరుగుతుంటాయి. యుద్ధాలను గురించే కావలసినంత సాహిత్య రచన జరిగింది.

ఇంగ్లీషు నవలలు మాత్రం రాజకీయ కుట్రలతో కూడిన బాధలకు తోడుగా యిక్కడి చరిత్ర, ఇతిహాసం ఆధారాలపై కూడ రచనలు జరిగినవి. నాగాలాండ్‌లోని అనుంగ్లాలోంగ్జారి తన 'Silent Death' అన్న నవలలో స్త్రీలపై జరిగే అత్యాచారాలను గురించి వ్రాయగా, అదే రాష్ట్రంలో వున్న ఆ యంగ్లాలోంగ్కుమారి తన 'Angel Girl' కృతిలో అమాయకులైన యువతులపై జరిగే అత్యాచారాలను ఖండించి, యువతులను రెండవ తరగతి ప్రజలుగా చూడడాన్ని చిత్రించారు. మరొక నాగా రచయిత్రి ఈస్టరైన్ 'మారి' అన్న నవలలో అస్సాంకు చెందిన సిదార్థ శర్మ గారి 'దిగ్రాన్ హోపర్ రన్' అన్న కథలో, ఈశాన్య వలయంలలో జరిగిన మహాప్రపంచ యుద్ధాల రణరంగమైన యిక్కడి చరిత్రను రచించారు. మేఘాలయ ప్రదేశానికి చెందిన కిస్టమ్ సింఘ్ నాంకిగ్రిప్ సంపాదించిన 'కాశి' ఐతిహ్యపు కథలు చాలా ప్రత్యేకమైనవి. అదేవిధంగా తెమ్సులా ఆఓ యుద్ధానికి సంబంధించిన కథలు చాలా ప్రత్యేకత వున్నటువంటివి. వీటికి తోడుగా ప్రస్తుతం ఇచటి సామాజికమైన మార్పులను గురించి ఇప్పుడు కథలు వస్తున్నాయి.

1988-1992 మరియు 2007-2012 మధ్యకాలంలో యిక్కడ నివసించి లభించిన అనుభవం ప్రత్యేకమైనటువంటిది. ఆ సమయంలో జీవితం చాలా కష్టతరంగా వుండేది. ఎప్పుడు, ఎక్కడ, ఏ సమయంలో బాంబు ప్రేలుతుందోనన్న విషయం ఎవరికీ తెలిసేదికాదు. ఎన్నోమార్లు రోజులకొద్దీ బోడో, కోక్రజార్ నాయకులు పిలుస్తున్న బంద్‌లతో, పల్లెలవద్ద రైళ్ళు నిశ్శబ్దంగా నిలిచిపోయేవి. జనజీవనం అస్తవ్యస్తం అయ్యేది. అప్పుడు టి.వి., మొబైల్‌ఫోన్, ఇంటర్‌నెట్ లాంటి ఏ ఆధునిక సౌకర్యాలు వుండేవికాదు. అలాంటి సమయాలలో కుటుంబసమేతంగా యిక్కడి అడవులలో తిరుగుతూ బ్రతికి బయటపడి వెనుదిరిగి వచ్చినదే ఒక పెద్ద సాహసమనవచ్చు.

**ముగింపు :**

మొత్తంగా ఈశాన్య భారత ప్రదేశపు అనుభవాలు అక్కడ నివసిస్తున్న వారికి చాలా ప్రియమైనవి. వీటికి తోడుగా భానుని మొదటి అరుణ కిరణాలు ప్రసరించే అరుణాచల పర్వతశ్రేణులు అత్యంత సుందరంగా మనసుకు ఆహ్లాదాన్నీ, ఆనందాన్ని కలిగిస్తాయి. 1962 చైనా, టిబెట్ భారత యుద్ధభూమి, టిబెట్‌లో పుట్టి భారతదేశపు ఈశాన్యంగా ప్రవహించే పురుషనది బ్రహ్మపుత్ర, 'తవాంగ్' ప్రదేశం మాదని పదేపదే చెప్పే చైనా, దుర్గనదృశమైన హిమాలయాలు, ప్రపంచంలోనే అత్యధిక వర్షం కురిసే చిరపుంజి, అత్యంత సుందరమైన గ్యాంగ్‌టాక్, షిల్లాంగ్, కోహిమా, అగర్తల మరియు యితర పట్టణాలు, మిజోరాం నీలిరంగు పర్వతాలు, దట్టమైన వెదురు అడవులు – యిలా ఒకటా రెండా? ప్రపంచమంతా చుట్టివచ్చే మన భారతీయులు కొద్దిరోజులైనా మనదే అయిన ఈ ఈశాన్య భారత భూగాన్ని దాని అందాలను చూచి తీరాలి! ❖

కన్నడ మూలం : డా॥ ఎమ్. వెంకటస్వామి

తెలుగు : వేలూరి కృష్ణమూర్తి

మైసూరు - సెల్ : 09448977877


ఖలీల్

# ఖలీల్‌తో కలయిక

– కాళోజి

**1953,** డిసెంబరులో 'నా గొడవ' రెండవ ముద్రణ సాగుతున్నది. మొదటి ముద్రణ, తర్వాతి గేయాలు కలిపి అచ్చుప్రతిని సిద్ధం చేస్తున్నాము. ఆ రోజుల్లో శ్రీ ఏల్చూరి సుబ్రహ్మణ్యంగారు హైదరాబాదులో వున్నారు. వారి యింట 'నా గొడవ' ఎడిటింగ్ సాగింది. ఆఖరు పుటల్లో 'చెలిమి' గేయం చదివి, సుబ్రహ్మణ్యంగారన్నారు – "మీరు ఖలీల్ జిబ్రాన్ రచనలు బాగా చదివినట్లున్నారు" అని, "అతనెవరు?" అన్నాను నేను. "అదేమిటి, ఖలీల్ జిబ్రాన్‌నే ఎరుగరా?" ఎంతో ఆశ్చర్యంగా అడిగారు ఏసుగారు. "ఎరుగనన్నాను" నేను. అప్పుడు వారు తమవద్దవున్న "ది ప్రాఫెట్" అనే పుస్తకాన్ని వెతికితెచ్చి నాకు యిచ్చినారు. ఆ పుస్తకం యీనాటికీ నావద్ద ఉన్నది. "చెలిమి" గేయానికి బహుమతిగా, ఒక స్నేహితుడు యిచ్చిన కానుకగా, మానవతకు ప్రామాణిక గ్రంథంగా, బ్రతుకు బాటగా, జీవనగీతంగా నాకడ వుండి పోయిందా పుస్తకం.

ఖలీల్ జిబ్రాన్‌తో ఎందరికో పరిచయం చేయించినాను. కొందరికి పుస్తకాలు కొని యిచ్చినాను. ఎందరిచేతనో కొనిపింపచేసినాను. ఖలీల్ గొడవను, నా గొడవగా చేసుకున్నాను. ఎక్కడ కూర్చున్నా ఖలీల్ జిబ్రాన్ ముచ్చటే. ఏ సభలో మాట్లాడినా ఖలీల్ సంగతే. ఎవరికి వుత్తరం వ్రాసినా ఖలీల్ గురించే.

1953 ఆఖరు రోజుల్లో తెలంగాణా రచయితల వార్షికోత్సవం జరిగింది. ఖలీల్ జిబ్రాన్‌తో పరిచయం గలిగిన వారం రోజులలో ఆ సభలు జరిగాయి. "మంజీర" అను సంచిక వెలువరించినారు. దానిలో "కర్మయోగము" అను పేరుతో "ది ప్రాఫెట్"లోని ఒక అధ్యాయం వెలసింది. నాటినుండి నేటిదాక, ఖలీల్ జిబ్రాన్ పుస్తకాలు దొరికినన్ని చదివినాను, అను వదించినాను, మిత్రులకు వినిపించినాను.

"ది ప్రాఫెట్" పుస్తకం సొంతం తెనుగైంది, వ్రాత ప్రతి పోయింది. మళ్ళీ వ్రాసినాను. అప్పుడప్పుడు చేసిన అనువాదాలకు లెక్కలేదు. పోగొట్టుకొనడానికి హద్దులేదు. "ది ప్రాఫెట్" అనువాదం, బ్రతుకుబాట, ఖలీల్ పాట, మిత్రుడు "శశాంక" "జీవనగీత"గా నామకరణం చేసినాడు. వ్రాతప్రతి విని, తాను చదువుకుని "జీవనగీత" విషయ పరిచయ వ్యాసం వ్రాసినాడు. ఎందరో మిత్రులు "జీవనగీత" ప్రతులకై ఉత్తరాలు వ్రాసినారు. ఈనాటికీ, అది అచ్చు పురుడుకు నోచుకుంది.

ఖలీల్ జ్రిబాన్ జననం, 1883లో. దేశం లెబనాన్. అతని మాతృభాష అరబ్బీ. తలిదండ్రుల మతానుసారంగా ఆతడు క్రైస్తవుడు. నిజానికతడు, మానవుడు. 1903లో, అరబ్బీలో "ది స్పిరిట్స్ రిబెలియస్" ప్రకటింపగా, ఆయన విప్లవ భావాలకు ఆయనను దేశంనుండి బహిష్కరించారు. ప్రతులన్నీ స్వాధీనం చేసుకుని చౌకులో కాల్చివేసింది ప్రభుత్వం. ఆ వార్త ఖలీల్ జిబ్రాన్‌కు పారిస్‌లో అందింది. "భలేపని జరిగింది. రెండవ ముద్రణకు మంచి అవకాశం" అన్నాడట ఆ మహానుభావుడు!

ఆయన అమెరికావెళ్ళి, తరువాత ఫ్రాన్సువెళ్ళి, అక్కడ సంగీతమూ, చిత్రకళా నేర్చుకున్నాడు. అక్కడనుండి 1912లో అమెరికా వెళ్ళి, స్థిరనివాసం ఏర్పరచుకున్నాడు. తన జీవితంలోని ఆఖరి యిరవైఏండ్లు ఖలీల్ జిబ్రాన్

అమెరికాలోనే గడిపినాడు. ఎక్కువకాలం వున్నది న్యూయార్క్‌లో. అతని బస ఆనాటి చిత్రకారుల, రచయితల సమావేశ స్థలము. అతని గది చిత్రప్రదర్శనశాల. ఎప్పుడూ ఏదో ఒక చిత్రప్రదర్శనం, లేక నవీన రచన పఠనం, శ్రవణం, ఏదో చర్చ, ప్రేమ, జీవనం శ్రమ – అతని మూలసూత్రాలు.

మొదట్లో తన గ్రంథాలను, అరబ్బీలో వ్రాసి, ఆ తరువాత ఇంగ్లీషులో అనువదించేవాడు. ఆ తరువాత, ఇంగ్లీషులోనే వ్రాశాడు. జిబ్రాన్ సాహిత్యంలోని అన్ని శాఖలలోనూ కృషిచేశాడు. అతని పుస్తకాల పేర్లు చూస్తేనే తెలుస్తుంది. ఆ మనిషిలోని గొప్పతనం, నవ్యత, నాణ్యత – స్పిరిట్స్ రిబెలియస్, మాడ్ మాన్, సాన్డ్ అండ్ ఫోమ్,

ది వాన్‌డరర్, గార్డెన్ ఆఫ్ ది ప్రాఫెట్, జీసస్ ది సన్ ఆఫ్ మాన్, ఎర్త్‌గాడ్స్, టియర్స్ అండ్ లాఫ్టర్, సెల్ఫ్ పోర్ట్రెట్, ది వాయిస్ ఆఫ్ ది మాస్టర్, ది బ్రోకెన్ వింగ్స్, నింఫ్స్ ఆఫ్ ది వాలీ, థాట్స్ అండ్ మెడిటేషన్, ది సీక్రెట్స్ ఆఫ్ ది హార్ట్, ఫోర్ రన్నర్... యింకా ఎన్నో వ్యాసాలు, వచన గేయాలు, సాహిత్య గోష్ఠుల్లో చేసిన ప్రసంగాలు, మిత్రులకు వ్రాసిన ఉత్తరాలు, సాహిత్య పత్రికల సంపాదకీయాలు బోలెడు.

ఖలీల్ జిబ్రాన్ కవి, తాత్వికుడు, చిత్రకారుడు. నలభై ఎనిమిదేళ్ళు బ్రతికాడు. 1931లో చనిపోయినాడు జిబ్రాన్. ఎల్లకాలం వుండే రచనలు సాగించినాడు. "రిటర్న్ ఆఫ్ ది ప్రాఫెట్" అనేది ఆయన రాద్దామనుకున్న గ్రంథం. మొదలుపెట్టాడట కూడా. కవిగా, చిత్రకారుడుగా అతనికి ప్రపంచఖ్యాతి లభించింది. అతడు బ్రతికివున్న నాటికే, ప్రపంచంలో పాతిక భాషల్లో అతని రచనలు స్థానం సంపాదించుకున్నాయి. నే నెరిగినంతవరకు, భారతీయ భాషలలో – హిందీ, తమిళం, మళయాళం, మరాఠీ, గుజరాతీ, బెంగాలీ, ఉరుదూ భాషలలో అతని రచనల అనువాదాలున్నాయి. యూరప్‌లోని అన్ని భాషలను, ఖలీల్ జిబ్రాన్ రచనలు పలకరించినాయి. జపాన్ వారు కూడా, జిబ్రాన్ వాణితో తమ భాషను శోభిల్ల చేసుకున్నారు.

ఆయన మరణం తరువాత చాల సంవత్సరాలకు, 1948లో, లెబనాన్ స్వతంత్ర రిపబ్లిక్ అయ్యాక, ఆయన సమాధి త్రవ్వి, లెబనాన్‌లో సమాధి నిర్మించి, ఆయనను ఆరాధిస్తున్నారు.

ఖలీల్ జిబ్రాన్ చాలా చిన్న వయస్సులోనే Prophet అనే మహాకావ్యాన్ని మొదటిసారిగా అరబ్బీ భాషలో వ్రాసినాడు. తల్లికి వినిపించినాడు. 'It is all right, but yet green' ('బాగానే వున్నదిగాని యింకా పసిగా వుంది) అన్నదట ఆ కన్నతల్లి. ఖలీల్ తన కావ్యాన్ని మళ్ళా దిద్దుకున్నాడు. కొన్నాళ్ళకు మళ్ళీ తల్లికి వినిపించాడు. మళ్ళీ అదేమాట. ఈ విధంగా ఏడుసార్లు పదేండ్లబాటు వ్రాయడం, వినిపించడం, మళ్ళీ దిద్దుకోవడం జరిగింది. ఏడవసారి విని తృప్తిపడ్డది తల్లి. ఖలీల్‌కు ఎంతో ఆనందం కలిగింది. అప్పుడు అది అచ్చుకు నోచుకుంది. మళ్ళీ కొన్నేళ్ళు గడిచినాయి. అరబ్బీలోని తన అమోఘ రచనను ఇంగ్లీషులోకి తానే చేయసాగినాడు. ఏరుకున్న గ్రంథం మళ్ళీ Prophet. ఐదుసార్లు ఏండ్లతరబడి ప్రయత్నించి ప్రస్తుతం మనకు లభించే ఇంగ్లీషు Prophet అచ్చు ప్రతి సిద్ధం చేసినాడు. 1923లో ఇంగ్లీషులో మొదటిసారి అచ్చయింది. ఈనాటికి ఇంగ్లీషులో వందలసార్లు అచ్చయి వుంటుంది. అమెరికాలో, ఇంగ్లండులో ఎన్నో ప్రచురణ సంస్థలు ఎన్నెన్నో తీరులుగా దానిని ప్రచురించాయి. మహాభారతానికి పంచవేదము అను పేరు వచ్చినట్లు Prophet అనే పుస్తకానికి 'The Little Black Book', 'Bible Black Book' అను పేర్లు వచ్చాయి. అంటే బైబిల్ ఏ భాషలో ప్రచురించినా దాని కవరు నల్లగా వుండడం ఆచారం. Prophet పుస్తకానికి కూడ నల్లకవరే వుంటుంది. అమెరికాలో కొన్ని దేవాలయాల్లో (చర్చి) Prophet గ్రంథపఠనం Pulpit నుండి జరుగుతుంది.

'బార్బరా యంగ్' అనే అమెరికన్ రచయిత్రి This Man from Lebanon పేరుతో జిబ్రాన్ జీవిత చరిత్ర వ్రాసింది. ఆ పుస్తకం చదివితే మనకు తెలుస్తుంది, జిబ్రాన్ ఎంత గొప్పవాడనే విషయం. 1924 నుండి 1931 వరకు చాలా సన్నిహితంగా ఖలీల్ జిబ్రాన్ పరిచయ భాగ్యం లభించిన 'బార్బరా యంగ్' జిబ్రాన్ చరిత్ర వ్రాసి సాహిత్యరంగంలో ఘనకార్యాన్ని సాధించింది.

వైవాహిక బంధనమన యేమిటి? అని అల్‌మిత్రయె ప్రశ్నింపగ విని



**అల్‌ముస్తఫ ఇట్లనె :**

వైవాహిక బంధనము సనాతనము
పుట్టినపుడె జంటలుగా పుట్టినారు మీరందరు
జంటజంటగానె కలసి వుంటారు మీరెప్పుడు
మీ జీవితాలను చావు-చేతులు చెండాడినను
మీరు జంట వీడకనే వుంటారు వాస్తవముగ
పరాత్పరుని స్మృతియందును
మీరు కలసియే వుందురు
విడిపోవని జంట మధ్య
ఎడము మాత్రముండవలెను
స్వర్గసమీరాలచ్చట
నాట్యమాడుచుండవలెను
జంటనడుమ తావుంచుట మీ బాధ్యత
*ఒకరినొకరు ప్రేమింపుడు-*



కాని :

ఈ షణ్మాత్రము ఆ ప్రేమ మీకు బంధనమ్ము కాగూడదు ఏక్షణమున.
అంతకన్నను మీరు మీమీ యెడదలను తీరాలు జేయుడు
ప్రేమకడలిని వాని మధ్యనజేరి అల్లల్లాడ నీయుడు
ఒకరి పాత్రను ఒకరు నింపుడు
కాని యెప్పుడు ఏక చషకమునుండి పానము చేయబోకుడు
ఒకరి కబళము ఒకరి కీయుడు
కాని యెప్పుడు ఒకే కబళము పంచుకొని సేవింప బోకుడు.
సంతసంబుగ ఎల్లవేళల కలసియాడుడు కలసిపాడుడు
కాని యెప్పుడు వేరువేరుగ నిలచి ఉండుడు.
ఎవరి వ్యక్తిత్వంబు వారు నిలుపుకొనుడు
వీణతీగలు రాగమందున ఏకమయ్యును
దేనికయ్యది వేరువేరుగ నిలచి వుండును
*స్వీయకంపనముతోడ పలుకును.*



ఒకరికొకరు హృదయములను వాయనంబుగ ఇచ్చుకొనుడు
కాని యెప్పుడు ఒకరియెడదను ఒకరి గుప్పిట పెట్టబోకుడు.
ఏలయన?
సనాతనమగు విశ్వజీవనమునకధీనములైనయట్టివి మీయెడందలు.
జంట వీడక నిలచియుండుడు
కాని యెప్పుడు యేకమయ్యెడి సాహసంబును జేయబోకుడు.
ఆలయపుస్థంభాలు సతతము వేరువేరుగ నిలిచివుండును
మంటపమ్మును తలనుదాలిచి ఒకటినొక్కటి కలసివుండును.
తీగనీడలోన మ్రాను, మ్రానునీడలోన తీగ
*ఎదుగదెపుడు బ్రదుకదెపుడు.*

ఎస్.వి.ఎల్. నరసింహరావు (మాజీ ఎమ్మెల్యే)
(హైదరాబాదు) వారి సౌజన్యంతో
ఫోన్ : 9703841989

అధ్యక్షోపన్యాసము

# ప్రథమాంధ్ర నాటక కళాపరిషత్తు

– చట్టి చినపూర్ణయ్య పంతులు

**దశరూపానుకారేణ, యస్యమాద్యంతి భావుకాః,**
**నమస్సర్వవిదే తస్మై, విష్ణవే భరతాయచ ॥**

*(ధనంజయుడు)*

మహోదయులారా! నమస్కారములు.

ధర్మాధర్మ వివేకజ్ఞులును, లోకసేవాధురంధురులును, చతుర్దశవిద్యానవద్యులును, చతుష్షష్టి కళాభిజ్ఞులును, కారుణ్యామృత రస స్వరూపులును, మహానుభావులును, పండితవరేణ్యులును నగు నిందరనొకసారి యిచ్చట చూడగల్గుటచే, భగవద్విశ్వరూప సందర్శనమువోలె, నేను విగతపాపుడనై, ధన్యజీవనుడ నైతినని భావించుకొను చున్నాను. ఇటకు విచ్చేసిన విద్వన్మణుల చరణసేవ, ఆజన్మమెునర్చినను, తద్జ్ఞానరాశియందొక యణు మాత్రమును సంపాదించుకొనజాలని మందబుద్ధిని నేనని యెఱుంగుదును. అట్టి నాకు తమ వెనుక, నెంతేనిదూరమున నొకమూలనైన, స్థానమున్నదో లేదోయని సందేహింప వలసియుండ, నన్నీ యగ్రాసనమునకే నియోగించునపుడు నేను సంతసింపవలయునో, సంతపింపవలయునో, యెఱుంగకున్నాను.

అయినను, విబుధులయాజ్ఞ భగవదాజ్ఞయే యగుట 'శిరసా ప్రథమగృహీతాం, ఆజ్ఞామిచ్ఛామి పరిపదః కర్తుం' అను కాళిదాస సూక్తిని మనమునందిడుకొని, 'పలికెడిది భాగవతమట, పలికించెడివాడు రామభద్రుండట, నేపలికిన భవహరమగునట, పలికెద...' అను ధైర్యముతో అంగీకరించితిని. శాస్త్రవిరోధముగను, లోకసమ్మతముగను, చర్చసాగించి 'ధర్మము సంస్థాపించి', నాట్యకళను, తన్మూలమున దేశమును సముద్ధరించి, నన్ను కరుణింప మిమ్ము మరల మరల సమస్కరించుచున్నాను. ఇంక ప్రకృతము ననుసరింతము.

**నాట్య కళాప్రశస్తి**

'ధర్మ్యం యశస్య మాయుష్యం హితం, బుద్ధివివర్ధనం లోకోపదేశజననం, నాట్యమేతద్భవిష్యతి' అని భరతాచార్యులవారు నాటక ప్రయోజనమును ప్రవచించి యున్నారు. నాట్యకళాగౌరవమును, నటుల యౌన్నత్యమును, ఇందు సంపూర్ణముగ నిమిడి యున్నది. ధర్మమునందే లోకము ప్రతిష్ఠితము. 'ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే', అని భగవంతుడును తత్సందర్భముననే 'పుట్టువెఱుంగని వాడయ్యునుపుడిమిం బుట్టుచున్నాడు'. 'శరీరమాద్యం ఖలుధర్మ సాధనం', అనుటచే ధర్మాచరణకు ఆయువు ప్రధానమైయున్నది. అట్టి దీర్ఘాయువుంబొంది, పురుషుడు హితకాంక్షియై, తన బుద్ధిని వృద్ధిబొందించుకొని, లోకమునకుపదేష్టయగు చున్నాడు. తాను ధర్మమెఱింగి, లోకమున ధర్మము ప్రతిష్ఠించుటయే పురుషార్థములలో ప్రధానము. అట్టి మహాకార్యమును నిర్వహించుటలో నాట్యకళ సహస్ర విధముల సహాయభూతమగుచుండుట చేతనే అయ్యది కళలలోనెల్ల యుత్తమోత్తమమై, క్షతి నెఱుంగక దివ్యముగ ప్రకాశించుచున్నది. కావుననే,

**నతచ్ఛ్రుతం, నతచ్ఛిల్పం,**
**నసావిద్యా, నసాకళా,**
**నాసౌయోగో, నతత్కర్మ,**
***యన్నాట్యేస్మిన్నదృశ్యతే***

అని భరతాచార్యులును, దానికి వ్యాఖ్యాన రూపముగా

The theatre where many arts are combined to produce a magical effect has for its interpreter the most finished action, which is at once eloquence and an animated picture; while architecture contributes her splendid decorations, and painting her perspective illusions and the aid of music is called in to attune the mind, or to heighten by its

strains the emotions which already agitate it, the theatre, in short where the whole of the social and artistic enlightenment which a nation possesses, the fruit of many centuries of continued exertion, or brought into play within the representation of a few short hours, has an extra-ordinary charm for every age, sex and rank, and has ever been the favorite amusement of every cultivated people. Here, princes, statesmen, and generals behold the great events of the past times similar to those in which they themselves are called upon to act, laid open in their inmost springs and motives; here, too, the philosopher finds subject, for profoundest reflection on the nature of constitution of man; with curious eye, the artist follows the groups which pass rapidly before him and from them impressions on his fancy the germ of many a future picture; the susceptible youth opens his heart to every elevating feeling; age becomes young again in recollection; even childhood sits with anxious expectation before the gaudy curtain, which is soon to be drawn up with its rustling sound, and to display to it so many unknown wonders; all alike are diverted, all exhilarated, and all feel themselves for sorrows of life.

అని 'లెజల్' అను పండితుడు వివరించుచున్నాడు. దీనియందింతటి మహాత్మ్యముండుటచేతనే కాళిదాసు 'మహాకవి'యును.

'దేవానామిదమామనంతి మునయః కాంతు తుంచాక్షుషం, రుద్రేణేయ ముమాకృతౌవ్యతిక రేష్వా గే విభక్తంద్విధా । త్రైగుణ్యోద్భవ మత్రలోకచరిత నానారసంధృశ్యతే, నాట్యం భిన్నరుచే ర్జనస్య బహుదాప్యేకం సమారాధనమ్ ॥

అనుచో నాట్యము యజ్ఞసమ్మతమైనదనియు జగత్పితరులగు పార్వతీపరమేశ్వరులచేగూడ నంగీకరింప బడినదనియు, విశేసించి, భిన్నరుచికరమగు సమస్త లోకమును ఆరాధించుటయం దద్వితీయమనియు విస్తరించియున్నాడు. దీనియందింతటి మాహాత్మ్యముండుట చేతనే, శూద్రక, శ్రీహర్ష, రాజశేఖరాది మహారాజా వరేణ్యులును, భాస, కాళిదాస, భవభూతి ప్రముఖ విద్వత్కవివర్యులును, ఈ నాట్యకళ నిష్టదేవతగా భావించి, సేవించి, కృతకృత్యులైరి. వేయేల, మన భారతీయులకెల్లరకు ప్రధాన దేవతలగు శివకేశవులిరువురును మహానటులు. మన దేశమున నాట్యకళకును, తన్యాలమున నటులకును, నొకానొకనాడు గల్గిన 'మహాగౌరవ సంపత్తి' యిట్టిది.

**నేటి నాట్యకళా పరిస్థితులు**

అట్టి సర్వోత్కృష్టమగుకళ యిప్పు డేస్థితిలో నున్నది? ఎల్లరు నెఱింగిన యీ విషయమును మరల నేల వివరింపవలయునో యెఱుంగను. ఐనను, సందర్భ వశమున, ప్రస్తావింపక విడుచుటకును వీలులేదు. నాటక ప్రయోగాభినయములమాట యటుండె, తద్దర్శనమున కేవలలాఘువముగ పరిగణింపబడుచున్నది. నాటక సందర్శనమున ఉత్సాహము కల్గినంతమాత్రమున, స్త్రీ సౌశీల్యము, శంకింపబడుచున్నది. బాలురు చెడుటకును నాటకరంగ మొకసాధనమని తలపబడుచున్నది. పవిత్ర మగు నాటకరంగమునకు అధఃపతన మెప్పటినుండి? అది సరిగ చెప్ప వీలు లేకున్నను, కొన్ని వేల యేండ్లనుండియు, నిట్టి నైచ్యము కల్గినదని చెప్పక తప్పదు. వాల్మీకి మహర్షియు రామాయణమున రాముడు సీతతో, 'కాంతా! నీవిచటనేయుండుము. నేను పదునాల్గు వత్సరములను గడిపివచ్చువాడ'నను సందర్భమున, సీత యా వాక్యము తన్ను మిక్కిలి బాధింప, తన యసమ్మతిని నిష్ఠురముగ సూచింప

**'స్వయంతు భార్యాం, కౌమారీం,**
**చిరమధ్యుషితాం సతీం,**
**శైలూష ఇవమాంరామ**
***పరేభ్యోదాతు మిచ్ఛసి ॥***

శైలూషుడు తన భార్యనువలెనే, పతివ్రతనగు నన్ను పరుల కీయదలంచుచున్నావు' అని పల్కినది. ఆనాటికే 'శైలూషులపై' లోకులకు లాఘవము కల్గినధేమో! తరువాత, ధర్మశాస్త్రములయందు నటు లపాంక్తేయులుగ పరిగణింపబడిరి. మరికొందరి మతమున అస్పృశ్యులు నైరి. ఇట్లుగా భరత శాస్త్రమున, బ్రాహ్మణులే, 'నటులు' కాదగునని నియమమునుబట్టి యేర్పడిన తెగను, అమరుడు

'శూద్రవర్గులో' చేర్చియున్నాడు. ఇంతియకాక కొందరు రాజులు బ్రాహ్మణోత్తముల కగ్రహారము లొసంగుచు నిందు నటులు ప్రవేశింపరాదని కట్టడి జేసియున్నారు. ఇట్లుగా, లోకమునంతటిని సముద్ధరింపగల దివ్యకళ స్మరణ మాత్రమున, జుగుప్సాకరమైనదిగ మారినది. ఆ నైచ్యమును భరింప జాలక, కృశించి తుదకు నామావ శేషమైనది.

**తదుద్ధరణ ప్రయత్నము**

సరియే, లోకమునందలి జీవకోటివలె నాటక కళయు పుట్టిపెరిగి యంతమొంద, దానికై విచారింపనేలయను నంశము మనస్సునకు స్ఫురింపవచ్చును. ఇంతకాలమును, దాని యక్కర యంతగా లేకుండుటయు, నది విస్మరింపబడుటకొక కారణమైయుండెను. నేడన్నచో నాటకకళ ధర్మదృష్టినట్లుండ నార్థిక దృష్టిని మిక్కిలి ప్రధానమై ప్రకాశించుచున్నది. అమెరికా దేశమున, అభినయము మూడవవృత్తిగను ఇంగ్లండున నేడవ వృత్తిగను నున్నది. మనము బాగుగ పరిశీలింపకున్నాము గాని, ప్రతి సంవత్సరమును నెన్నోలక్షలు సినిమా మూలమున మనము విదేశముల పాలొనరించుచున్నాము. అన్య దేశములలో, నాట్యకళనుగూర్చి యిట్టి పోటీయే తటస్థింప, నొక దేశమువారింకొక దేశము నుండి యభినయమును తెలుసుకొనక, తమకళను తావే 'యధార్థముగ' పెంపొందించుకొనుచున్నారు. మనకు నిపుడట్టి యవస్థయే తటస్థించినది. నానాటికి ప్రజలు సినీమామూలముగ, నాట్యకళాభిరుచికి వశంగతులగుచున్నారు. ఎంతగ నిర్బంధించినను, తద్రుచి వారిని విడువ జాలదనుట ముమ్మాటికి నిశ్చయము. ఇట్టియెడ మనము స్వజాతీయాభినయమును పెంపొందించుకొనకున్న మనచేతనున్న యీ రవంత ధనమును, ఈ మూలమునగూడ యన్యదేశములపాలుగాక తప్పదు. కావున, అన్యదేశములతోపాటు, మన దేశమును వృద్ధిపొందవలయునన్న, నాట్యకళను మనసార నుపాసింపవలసియే యున్నది. నాట్యకళాపోషణమున కవి, నటుడు, ప్రయోక్త, విమర్శకుడు నీ నల్వురును పాలుగొనుచున్నను, అందు ప్రధానాధికారము నటునకేగలదు. ప్రయోక్తయు విమర్శకుడును నటుని తరువాతి వారే. ఇంక కవి గుణగౌరవముల నటునికి పైవాడనిపించుకొనినను, అధికారమున తరువాతివాడే యగుచున్నాడు. కవి నిర్మితకావ్యరత్నము నటుని దయాధర్మభిక్షకు లోనైయున్నది. దాని పోషింపజేయు వాడు నటుడే; శోషింపజేయువాడు నటుడే. కనుకనే, 'కర్ణునౌదలనె భారతసంహిత నిలుచు చాడ్పునన్' అనునట్లు నాట్యకళ బ్రదుకంతయు నటునిపై నాధారపడియున్నది. కావున, నాట్యకళ వర్ధిల్లవలయునన్న, నటుడు తాను తొలుదొల్తవృద్ధికే రావలయు.

**నటలక్షణము**

(ఎ) నటుడు జగద్గురువు. నాటక ముపదేశ ప్రధాన మగునపుడు, నటు డాచార్యపదవి నధిష్ఠించుచున్నాడు. ఆ క్షణకాలమునను భిన్నమత భిన్నరుచి కరమైన సామాన్యలోకమెల్ల, వానికి శిష్యప్రాయమేయగుచున్నది. 'ఆచార్యః పూర్వరూపమ్ అంతేవాస్యుత్తర రూపం' అనునట్లు, నటుడు సామాజికుల తనంతటి వారిని చేయుచున్నాడు. సామాజికుల దృష్టిపథమున నిల్చినది నటుడా, నటులచే ననుకరింపబడు మహాపురుషుడా? నటుడెట్టివాడయిన నేమి. కథాపురుషుడేకదా ప్రధానుడని తలపరాదు. తొలుదొల్త నాటక సందర్శనమునకై, ప్రోత్సహించువాడు నటుడు. నటుల సమాకర్షణముననే, మనము సభ్యభూయిత్యముగొని, తరువాత నాతని నటనాకౌశలమున తన్మయులమై, సముద్ధరింపబడుచున్నాము. కావుననే, మతాచార్యుల యందు విలసిల్లు గుణములెల్ల, నటునియందును రాణింపవలయును. అనగా నిష్కళంకమగు సౌశీల్యము, నటునికి ప్రధాన లక్షణము.

(బి) ఇంక రెండవది, విద్యావిచక్షణత – నటుడు బోధకుడని యిదివరకే మనవిచేసికొని యుంటిని. కవి హృదయమును బాగుగ గ్రహించి, దానిని రవంతయు వ్యత్యాసములేక, దానిని సామాజికుల యెదుట ప్రదర్శించు బాధ్యత 'నటుని' యందు గలదు. 'నతచ్ఛ్రుతం సతచ్ఛిల్పం, నసావిద్యా, నసాకళా' యనుటవలన నాటకమునందు సర్వాంగ సంపూర్ణములుగ విద్యలెల్ల నిమిడియున్నవి. అట్టి నాటకమును విద్వాంసుడుగాక తదితరుడు గ్రహింపను జాలడు, బోధింపను జాలడు.

(సి) ఇంక మూడవలక్షణము చిరంతనాభ్యాసము. శ్రీరామానుజులవారు శ్రీమద్రామాయణమును అరువదిమంది గురువులయొద్ద యరువదిసారులు చదివిరట. అందొకసారికంటె నింకొకసారి యేవేవో విశేషాంశములు గ్రహించుచు వచ్చిరట. ఇట్టిసంగతి,

మనయనుభవములోగూడ నున్నదే. ఏదేని సుగ్రంథమును పలుసారులు చదువుచో, ప్రతి పఠనమునందును నూతనాంశములను మనమును గ్రహించుచుండలేదా? కావుననేగదా, పలుసారులు చదువ ప్రయత్నించుటయు వ్రాయుకైవడి తెలిసినను, వరువడి వడివ్రాయు చుండుటయు, తీరు కుదురుటకేగదా. అభ్యాసమువలని ప్రయోజనము నెఱుంగని వారెవ్వరునుండరు. కావున నావిషయమును విస్తరింపనవసరములేదు. నాట్యశాస్త్రమున భరతాచార్యులు విస్తరించినట్లు

**'శాస్త్రవిచ్ఛీలసంపన్నో,**
**రూపవాన్ ప్రియదర్శనః।**
**విక్రాంతో వృత్తిమాంశ్చైవ,**
**వయోవేషకులాన్వితః।**
**సురభి ర్మధుర స్త్యాగీ, సహిష్ణు రవికత్థనః।**
**ఆశంకిత ప్రియాభాషీ, చతురశ్శుభగ శ్శుచిః**
**కామోపచారకుశలః, కృతజ్ఞోదేశ కాలవిత్ః**
**నదీనవాక్యః స్మిత వాక్,**
**వాగ్మీ, వశ్యః, ప్రియంవదః**
***అలుబ్ధస్సౌమ్యభావీచ శ్రద్ధధానోధృధస్స్మృతః***

నటుడే తద్గుణగణంబులచే నలంకృతుడై యుండ వలయును.

### నటులదోషములు

(ఎ) ఇప్పటి నటులలో కొందరు అభ్యాసము నే మాత్రమును గౌరవింపకున్నారు. పాత్యభాగము వచ్చిన జాలు. ఆవువెంబడి లేగవలె, అభినయము, తనంతట తానే వచ్చునని వారి యభిప్రాయము. ఎవడైననటుడు, కొన్ని మాసములపాటు యొకపాత్రము నభ్యసించుచున్నాడని యనుకొనినపుడు వీరు వానిని పరిహసించుటయుగలదు. ఇట్టి వీరిని, అభ్యాస విధులలో నభినయింపు మనునపుడు, 'నేనిపుడు జేయజాలను. నాటక ప్రదర్శనమున రంగస్థలముపై తనంతట తానే వచ్చున'ని పలుమారు బల్కుచుందురు. తుదకు వీరే నాటకమును ధ్వంసము చేయువారు. సుప్రసిద్ధులగునటులు పలువురు పలు దేశముల నుండి వచ్చి, యే యభ్యాసమును లేక యెక్కెడ ప్రదర్శించుటయు, నందూహింపజాలని పరాజయము నొందుటయు మనమెల్లెడ చూచుచునే యున్నాము. నటుడు ప్రత్యేకముగను మరల తోడినటులతోను ఎంతెంతో యభ్యసింపవలయును. నేడు పాశ్చాత్య నాటక రంగమున నటుడొక ప్రధాన పాత్రమును ఆరు మాసముల నుండి యొకవత్సరము వరకు ప్రత్యేకముగ నభ్యసించి తరువాత తోడినటులతో నేబది అరువది సారు లాద్యంతమును సరిచూచుకొనునట. కావుననే వారి ప్రదర్శనము లెన్నిసారులు చూచిన నింకను చూడవలయునని తజ్ఞులందరు. అభ్యాసమే నటులకుజీవకరము.

(బి) ఇంక రెండవది నీచరంజనము. నాటకము యజ్ఞసమ్మతమనియు, నాట్యకళ యుపాస్య దేవతయనియు, నాట్యమందిరము దేవాలయమనియు భారతీయుడు నాటకమునకు పవిత్రత ప్రతిపదమునను చేకూర్చుచున్నాడు. భారతీయ నాట్యరంగమునకు జీవనాధారమైనది పవిత్రత. ఉపదేశము కొరకుగాక ఉబుసు పోకకును, విలాసమునకును నాట్యమందిరమును బ్రవేశించు కొందరు పామరులను రంజింపనెంచి నటుడు అకార్యకరణమునకు సిద్ధపడుచున్నాడు. కవి గౌరవమును పాటింపక కావ్యార్థమును సమాదరింపక ఆత్మప్రతిష్ఠయైన చూచుకొనక తానొనర్చుచున్న పాపమును తానెఱింగియు రవంతయు కలంగక కళాదేవతాప్రతిమను తాను స్వహస్తములతో బ్రద్దలు సేయుచున్నాడు. ఏమీ ఘోరమనిన యిది నా రాజపోషకుల కిష్టమని నవ్వుచు ప్రత్యుత్తర మిచ్చుచున్నాడు. నాటకమున చతుర్థసోదరుల రంజింప శ్రీకృష్ణుడు పోయి సత్యభామప్రక్కను పండుకొనుచున్నాడు. చిత్రాంగి సారంగధరుని కౌగిటిలోబట్టి నలిపివేయుచున్నది. ఇంక సినీమా సంప్రదాయము ననుసరించి భోజన, సలిలక్రీడాదుల మాటయేమి, చుంబనాదులును బహిరంగముగ ప్రదర్శింపబడుచున్నది. ఇది యెంతయు నశాస్త్రీయమును ననర్థదాయకమును.

**'న కార్యమ్ శయనంరంగే, నాట్యధర్మం విజానతా**
**కేనచిద్ వచనార్థేన ఛేదమత్ర, ప్రయోజయేత్**
**యదాస్వపేదర్థవశాత్, ఏకాకీ సహితోపివా**
**చుంబనాలింగనాదీని, రంగమధ్యే, నకారయేత్**
**దంతం నఖక్షతంభేద్యం, నీవీస్రంసనమేవచ**
**స్తనాధర విమర్ధంచ రంగమధ్యే నకారయేత్.**
**భోజనం సలిలక్రీడాం, తథాలజ్జాకరంతుయత్**
**ఏవంవిధం భ వేత్ యద్వత్,**
***తత్తద్రంగేన కారయేత్.***

అని రంగస్థలంబున నిషేధింపబడవలసిన వానిని నిరూపించి దానికి కారణముగ

**'పితృ పుత్రుస్నుషాశ్వశ్రూ దృశ్యం**

**యస్మాత్తు నాటకం**

***తస్మాదేతాని సర్వాణి, వర్జనీయాని, యత్నతః'***

అని చెప్పియున్నారు. కావున నెట్టియెడలనైన, ఔచిత్యము మేర మీరక యభినయించుట నటునకు విధి.

(సి) కాని ధనకాంక్ష నటుని యౌచిత్యమును గంగపాలొనరించుచున్నది. చినిగిన చీరతో పతివ్రత నాలుగు గోడలనడుమ నవయువలసియుండును. ఏడువారముల నగలతో పడుపుకత్తె నడువీధిని తాండవించుచుండును. ధర్మ మార్గానుసారియైన యెడల, పురుషుడు ధనమునకు కొంతదవ్వుగనుండవలసి వచ్చుచున్నది. ఏ వేసమో వేసికొని, యేకూతలోకూసి, నలువురను నాలుగుసారులు నవ్వించినవాడే నాయకుడు. అది నాట్య కళ కథఃపతన కారణమగుచున్నను, నటునకిది తాత్కాలికముగ, పటుత్వమునకు వచ్చుచున్నది. ఎంతధనము లభింపనున్నను దేవుని యెదుట దీపము నార్పరాదని ప్రాజ్ఞులు ఘోషించుచున్నారు. నటుడు ధనాగమనము ప్రధానముగ జూచుకొను నంతకాలము నాతడు నీచజన రంజనమునకు పూనుకొనక తప్పదు. పవిత్రతను పాడొనరించి, యకార్యమును నిర్లజ్జగనొనర్పక తప్పదు. ఏకోరికయు లేక, దినమున కేగంటయో భగవంతు నారాధించు ప్రాజ్ఞుడు, భక్తు డనబడుచున్నాడుకాని, యుదయమునుండి యుదయమువరకు గూర్చున్నను, ధనాశాలంపటుడగు పూజారి, భక్తుడనిపించుకొనజాలడు గదా. ధనాగమము ఆనుషంగికమౌగాక. అదియే ప్రధానమని తలంచి తత్సంపాదనమునకు, నాట్యవృత్తినొక యాధారముగ జేసికొనున టుని, నిందింప వలయుగాని యభినందింపరాదు. నిజమగు నటునియొక్క నిశ్చితా భిప్రాయము

If I prove the pleasure of Pen.

So he judicious be, he shall be alone,

A theatre unto me.

అను దానియందు వ్యక్తమగుచున్నది.

ఈ ధనాకాంక్షవలననే, నియమ రాహిత్యము సంఘటిల్లుచున్నది. దేశకాల పాత్రముల యోజింపక, ధనముజూపి పిలచినంతనే విసవిస పరుగిడు నటునిచే నాటక ప్రయోగములు నిర్జీవములై పిశాచ రూపముల బొందుచున్నవి.

**'నతథాశు' దహత్యగ్నిః',**

**ప్రభంజన సమీరితః,**

**యథాహ్యప ప్రయోగస్తు,**

***ప్రము క్తోదహతిక్షణాత్,***

అపప్రయోగము దహించునట్లు, అనలముతో గూడుకొనిన దెద్దియు దహింపజాలదట. 'అనియమాత్, గ్రామ్యంహి; యత్వపభ్రంశః' అనుసూత్రము కేవలము భాషాసందర్భముననేగాక, యెల్లెడలమన్నింపదగియున్నది. కావున నటులు నీచరంజనమును, ధనసంపాదనమును, తాత్కాలిక ప్రసిద్ధియు, చూచుకొనక, కళయే యుపాస్యదేవతగా భావించి, యారాధించి, సాక్షాత్కరించుకొని, కృతార్థులై, లోకమును కృతార్థ మొనర్పవలసియుండును.

**అభినయము**

**'భవేదభినయో, వస్థానుకార,**

**స్స చతుర్విధః'**

***ఆంగికోవాచికశ్చైవ, మహార్యస్సాత్త్విక స్తథా ॥***

(ఎ) అవస్థానుకరణ మభినయమనియు, అదియు ఆంగిక, వాచిక, ఆహార్య, సాత్త్వికములనుపేర చతుర్విధములనియు, తెలియవచ్చుచున్నది. అందు ఆహార్యము (అనగా రూపారోపము) ప్రధానమైనది. కావుననే, 'రూపారోపాత్తు రూపకమ్' అని నాటకమునకు రూపక సంజ్ఞ. రూపధారణము, అభినయమునకు ప్రధానాంగము. ఎట్టి నటనా కౌశల్యమున్నను, నటునకు రూపసౌష్ఠవ మలవడకున్న, సభ్యరంజనము పొసగనేరదు. నటుడు అభినయింపబోవునపుడు, తనకు సరిపడు పాత్రమునుగాని, లేదా వర్ణాదులచే తాను సరిపెట్టుకొనగల్గు పాత్రము కాని, తీసికొనవలయును. నటుని, విజయము ఒకానొక పాత్రమునందు కంటె, పాత్రము నెన్నుకొనుటలో హెచ్చుగా నాధారపడి యున్నది.

ఈ సందర్భమున పాశ్చాత్యనాటక విమర్శకాగ్రణియు, నటశిఖామణియునగు Wilton Lackage అను నాతని యభిప్రాయమిది.

"In my experience of the stage I have never

known a man who made up well to be a bad actor, or a good actor to make up badly. Thoroughness, in this as in every art or profession, is the thing that tells? The actor who looks the part has a lady played his prologue. He has obtained the suffrages of his auditors and they are willing to grant him action, manners, even words, which seem to belong to the type."

ఈ వేషధారణము, పౌరాణిక నాటకములలో నేమి, చారిత్రక నాటకములలోనేమి, మిక్కిలి పరిశ్రమతో సంపాదింపదగినది. దేవతాపాత్రములెట్లు నిరూపింప వలయు? రమారమి ప్రతినాటకమునను ప్రత్యక్షమగు నారదుని పాత్రమునకు వేషరచన యెట్టిది?

శకుంతలా జననచిత్రమున రవివర్మ చిత్రించినట్లే, విశ్వామిత్రుని పాత్రమును సరిదిద్దుకొనవలయునా? ఇట్టి సందేహములను పురాణవాఙ్మయమేగదా తీర్పవలయు!

'It is the duty of every actor when cast for a part requiring costume to become thoroughly acquainted with the customs, dress, manners and prevailing styles of the age.'

అను young మహాశయుని అభిప్రాయము నిట ననుసంధింపదగినది. దైవప్రాతికూల్యమున నాటకకళ సన్నగిలుటచే, నాటకాభినయమున ఆహార్యమునకుగల ప్రాముఖ్యము మనమెఱుంగ కున్నాము. అది నేడు పాశ్చాత్యదేశములలో నొక ప్రత్యేకకళగా వృద్ధి పొందింపబడినది. ఒక నటీమణి వేషధారణమునకు బోవుచు, సేవకుని చేతికి సొమ్మిచ్చి, పానీయమును గొనితెమ్మనె నట. వేషధారణము పూర్తిచేసికొని, యింతలో సేవకుడు తిరిగిరాగా వానిచేతినుండి పానీయము నందుకొనబోవ వాడు, "ఇది తమ కొఱకుగాదు, ఇంకొకరు తెప్పించుకొనినది", అని యెంత చెప్పినను విడువక, తుదకు యిద్దరు ముగ్గురి సాక్ష్యముపైని అర్ధాంగీకారముగా వదిలిపెట్టెనట. ఇట్లు భారతదేశమున, ముఖ్యముగ మన యాంధ్రదేశమున వేషరచన, యనాయాసముగ సాగుచున్నవి. నలుగుపిండివలె మొగమున కింత పొడి పూసికొని తలపై నొకవిగ్గును పెట్టుకొని, కట్టుబట్టలు వదలకున్నను పైబట్టను మార్చుకొనినంత, తరచుగా వేషరచన పూర్తియగుచున్నది. కాని కళాప్రధానులు, కనులను నాసికను, ముఖ్యముగ పెదవులను, కరచరణములను, కంఠమును ఎంతగనో దిద్దుకొని పాత్రమున కుచిత మగునట్లు, పాత్రశీలమున కొప్పిదమగునట్లు పాత్రరసమునకు పోషకమగునట్లు, చక్కగనమర్చుకొందురు. ఇపుడు వేషరచనమునందు, దేశీయపద్ధతి విస్మరింపబడుటచే, పాశ్చాత్యుల తీరునే యనుసరింపవలసియున్నది. దానికి వలయు పరికరములువేరు. వాని నుపయోగించు పద్ధతియు విచిత్రమైనది. ఈ విషయమును సంపూర్ణముగ వివరించుచు నా మిత్రుడు విశ్వనాథకవి వ్రాసిన 'ఆహార్యాభినయము' అను ఉద్గ్రంథము శీఘ్రకాలములో ప్రకటింపబడునేని, కళోపాసకులకు మిక్కిలి సహాయకారియగునని తలంచుచున్నాను. నేత్రాదులను సరిదిద్దుకొను ప్రయోజనము పాశ్చాత్య నటశిఖామణియగు young అను నాతడిట్లు ప్రవచించియున్నాడు:

The Eyes are the arbiters of expression. Temperament & character are thus indicated, and the communicative nature of the 'tell tale roles' causes over secret thoughts to come forth unhidden for the world to gape at.

Although the nose is the least expressive of the features it is nevertheless the most prominent, and lends itself most readily to make up. In many characters it predominates over all other features, and is the first to be considered.

The Mouth is an indicator of character. The thoughts and workings of the mind are often clearly and correctly seen upon the lips - Their natural formation is not only fashioned after the disposition of the individual but their expression changes with every emotion. The Mouth undergoes a complete transformation with every feeling, and in strong emotions in often distorted. Love and hatred are manifested by the mouth, while pride and humility leave an indelible impress upon it.

ఈ విషయమున 'Louis nann' అను నొక సుప్రసిద్ధ

నటశిఖామణి యిట్లు ప్రవచించియున్నాడు :

The first essential of a good make-up is a thorough comprehension of the part you are to impersonate. The actor must appreciate the 'internal's' of a part before he can develop the "internals" to correspond. In other words, psychology comes before the grease - paint, and the study of physiognomy before that of the looking glass. Needless to say, the actor must be a man of imagination; otherwise he will never be an artist at making up or acting. From the base lines of his part he must gather the vague out-lines of the character he is going to impersonate, and fill in the details by a combination of logic and fancy, until he can fairly see the person in his mind.

**వాచికాభినయము**

వేషము తరువాత నటుడు పరిగణింపవలసినది భాష. జంతుకోటిలో మనుష్యుల కగ్రస్థాన మొసంగినది భాషయే. అందునను, 'తలపరువు నోరు తెలుపు' నను మాటనుబట్టి పురుషుల తారతమ్యము నిరూపించునదియు భాషయే యయియున్నది. 'దేశ భాషలందు తెలుగు లెస్స'యని బహుభాషావేత్తయగు కృష్ణదేవరాయల చేతను, 'Telugu is the Etalian of the East.' అని పాశ్చాత్యులచేతను, ప్రస్తుతిగన్న మన యాంధ్ర భాష మరియు సున్నితమై, స్వరూపమాత్రమున తరగతుల నేర్పరచునదై యున్నది. మరియు, ఒక్క తెలుగు బాషకే సలక్షణమును సంపూర్ణమునగు నుచ్చారణ కలదని తజ్ఞులందురు. వేదము, యధావిధిగ నుచ్చరింపగలవాడు ఆంధ్రుడే. కావున దైవదత్తమగు మన మృదుమధుర భాషకు, వైరూప్యము కలుగకుండునట్లు కాపాడుకొను బాధ్యత, మనయందుగలదు. కాని కాలకర్మవశతను,

**'నటవిటగాయకగణికా జ్యౌతిషముఖగహ్వరాణి యదినస్యుః'**

***వైయాకరణ కిరాతాదప శబ్దమృగాః క్వయాంతి సంత్రస్తాః"***

(నటులు విటులు గాయకులు గణికలు జ్యోతిష్కులు అనువారి ముఖములనెడి గుహలే లేనిచో అపశబ్దములను మృగములు వైయాకరణుడను కిరాతుని వలన భయపడి యెందు బోవుచున్నవి? ఇట్లపశబ్దములు) పల్కుటయందు నటులకిందరిలో నగ్రతాంబూలమీయబడినది. ఈ యపప్రథ నేటిదిగాక చాల పురాతనమైనదనియు నా యభిప్రాయము. భరతముని తన నాట్యశాస్త్రమున

**'పునరుక్తం హస్యమాసోవిభ క్తిభేదో విసం ధయో-పార్థాః**

***త్రై లింగజాశ్చ దోషాః ప్రత్యక్షపరోక్ష సమ్మోహాః'***

అని వచించి యున్నాడు. చెప్పినమాటయే మరలమరల చెప్పుచుండుట, సమస్త పదములను శిథిలమొనర్చి చెప్పుచుండుట, విశేషణ విశేష్యములలో విభక్తిభేదములు కల్పించుట, సంధినియమములపాటింప కుండుట, శబ్దముల కపార్థము గల్పించి యభినయించు చుండుట యనునవి తెనుగు నటులలోని దోసములని చెప్పియున్నాడు. ఈ దోషములు నేడును ఉత్తమ నటులనుకొను ననేకులలో గూడ మనము చూచుచున్నాము. ఇట్టి దోషమునుండి విడుమర గాంచుట ప్రధానవిధియై యున్నది. మఱియొక విశేషము. వాచి కాభినయ సందర్భమున సంగీతమునకు నాటకమున స్థానము గలదాయను ప్రశ్న యొకటి యీనాడు బయలుపడినది. కలదని కొందరును, లేనేలేదని కొందరును, కలదుగాని ప్రాముఖ్యము లేదని కొందరును, ఇట్లు పలువిధములుగా వాదించుచున్నారు. ఈ వాదము ఈ పండిత సభలో నాట్యకళామర్మజ్ఞులగు తమబోంట్లచే నిర్ణయింప బడవలసినది. కాని ప్రస్తుతస్థితి ననుసరించి నేను రెండుమాటలే ప్రస్తావింపబోవుచున్నాను. సంగీతమునం దేమాత్రమును ప్రవేశము లేనివారు కొందరు, రంగస్థలమున నిర్భయముగ పాడనుంకించుచున్నారు. అట్టిది, నిరోధింపబడవలయునని నాయభిప్రాయము. చక్కని సంగీతజ్ఞానముగలవారు కొందరు వచన భాగమునకు వచ్చుసరికి వైరస్యమును బొందుచు

'Those to whom the stage does not belong such, whose vocation only is - to song'

అను అపప్రథకు పాల్పడుచున్నారు. కావున రసమున దృష్టినిలిపి గద్యపద్య భేదమును పాటింపక పాత్ర్యభాగమును విస్తరింతురుగాక యని నాసందేశము. మఱియు, భాష స్వరప్రధానమైనది. 'స్వరభేదాదర్థభేదః' అనుటవలన, అర్థము యథోచితముగ వెల్లడించునది స్వరము. నటుని స్వరమునందేగాక, నిట్టూర్పునందును, తుద కూపిరి బిగబట్టుట యందును గూడ, నర్థమున్నది. దానిని బాగుగ

పాటింపకున్న నటుడు కృతకృత్యుడు కాజాలడు.

**ఆంగికాభినయము**

ఇటీవల, సినీమా మహాత్మ్యము, దేశమున వ్యాప్తమైన తరువాత, నటుల యాంగికాభినయము, వేరు దారిని బట్టినది. ఈనాడు సినీమాతారకల, ననుకరింపని నటశిఖామణెక్కడనోగాని లేనే లేరని చెప్పవచ్చును. సినీమాయందు, ప్రత్యర్థమును ఆంగికాభినయముచేతనే వెల్లడింపబడవలసి యుండుట, అవయవ సంచలనము, మహోద్ధతముగను, మహోత్కటముగను నుండును. ఇంక నాటకమున నన్ననో, కావ్యార్థము, చాలవరకు వాచికాభినయముననే మనసున కెక్కును. ఇంక, ఆంగిక సంచలనము స్వాభావికముగనే కావలసినది. అందునను పాటింపదగిన విషయవేమన, పాత్రభేదమునుబట్టి యభినయమును యుద్ధతముగనో, లలితముగనో, యేర్పరించుకొనవలయును. మన నటులలో ననేకులకు, ఆత్మగతమును వెల్లడించునపుడుగూడ, అంగికాభినయ మొనరర్చుట యలవాటై యున్నది. అది స్వభావ విరుద్ధమేమోయని నా యభిప్రాయము. మరియు ఆంగికాభినయము కరచరణ సంచలనముకంటె ముఖరాగము నందు విశేషించి దృక్ప్రసారమునందును ఆధారపడియుండును.

**'శాఖాంగోపాంగసంయుక్తః, కృతోప్యభినయశ్శుభః,**
**ముఖరాగ విహీనస్తు, నైవ శోభాన్వితో భవేత్.**
**శారీరాభినయో–ల్పోపి, ముఖరాగ సమన్వితః,**
**ద్విగుణాంలభతే శోభాం, రాత్రావివ నిశాకరః**
**నయనాభినయో–పిస్యా న్నా నాభావ రసస్ఫుటః**
***ముఖరాగాన్వితో యస్మాత్, నాట్యమత్ర ప్రతిష్ఠితమ్.***

ఆంగికాభినయ మెంతయొనర్చినను ముఖరాగ విహీనుడు శోభిల్ల జాలడనియు శారీరాభినయము స్వల్పమైనను ముఖ రాగసమన్వితుడు రెండంతలుగ శోభిల్లుననియు, ఆంగికాభినయమున ప్రదర్శింపదగిన భావమును, రసమును నయనాభినయముననే ప్రదర్శింప వచ్చుననియు ముఖ రాగమునందే నాటకము ప్రతిష్ఠిత మనియు, భరతుని అభిప్రాయము. కావున, నటుడు ముఖరాగమును నయనాభినయమును విశేషముగ వృద్ధినొందింపవలెను. ఆంగికాభినయమునకును ముఖ్యముగ నయనాభినయమునకును, శాస్త్రదృష్టినితో నపరిమితమగు నభ్యాసము వలయును. గతి, హస్తము, గ్రీవము, శిరస్సు, దృష్టి, కన్బొమ, యిన్నియు నొక్కమారుగ సంచలించును. అవి యథార్థ్యముగ సంచరింప వలయునన్న సర్వాంగములును, నటునివశమం దుండవలెను. కావుననే నాట్యమును యోగమనుట. ఈ విషయము అభ్యాసమే లేనిచో క్రొత్త పూజారివలె నొకటి ప్రయత్నించిన యింకొకటి మానుకొనవలసి వచ్చును. కావున నటుడు ప్రత్యేకముగ నొకపాత్రమును ధరించుటకు ముందు సంపాదించు కొనవలసిన గుణవిశేషము లనేకములున్నవి. వీనిని తగిన గురువునొద్ద యోగ్యమగు మార్గమున, సమగ్రమగు శిక్షణలో వశపర్చుకొనవలెను.

**సాత్వికాభినయము**

తఱచుగ గ్రంథమందే అణగి యుండవలసినది సుదీర్ఘములగు శాలలలో ప్రదర్శింపరాదు.

**'మండపే, విప్రకృష్టేతు, పాఠ్యముచ్చరితస్వరం,**
**లనిస్సరణధర్మత్వాత్, విస్వరత్వం భృశంవ్రజేతే ॥**
**యస్యలాస్యగతోభావో, నానాదృష్టిసమన్వితః,**
***సర్వేభ్యోవిప్రకృష్టత్వాత్, వ్రజేదవ్యక్తతాంపరామ్ ॥***

అని నాట్యమండపము, మిక్కిలి దీర్ఘముగా నుండరాదనియు, అట్లయిన, పాఠ్యమునకు విస్వరత్వమును, దృష్టి ప్రసరణ, వ్యక్తత్వము గలుగుననియు భరతాచార్యులు శాసించి

*'ద్వాంత్రింశతించ విస్తారం మర్త్యానామ్ యోభ వేదిహ'*

అని నాట్యమండపమును 32 మూరలే యను గ్రహించుచున్నాడు. అట్టియెడ, కంపము, రోమాంచము, స్వేదము మున్నగునవి చూడనగును గాని, అంతకు 4 అంతలకు మించియున్న యీనాటి నాట్యశాలలలో, నీ పేరైనతలంపరాదు. నటుడు తాధరించు పాత్రకైయున్న సామగ్రితోనేగాక, యితరాంగములతోగూడ, ఆనుకూల్యము ననుసంధించుకొనవలయు. దేశకాల పాత్రములనుకూలములు గానిచో నెంతటివాడైన, పరాజితుడు కాకతప్పదు. తాదగిన వాడయ్యు, తగిన సీమయందు, తగినపరివారముతో, తగిన పరికరములతో, తగిన సభ్య జనము నెదుట, ప్రదర్శించిననే గాక, తాను ప్రతిష్ఠ సంపాదింప నేరడు. ఇంక మరియొక్క విషయము. ఎవడేని నటుడు సుప్రసిద్ధుడగునేని తాము స్వతంత్రించి యేమాత్రమును యోజింపక కనులుమూసికొని, వానివెంబడి నేపోయి తామును కీర్తిగడింపనెంతురు.

He rather choose in new attempts to fail than in the old indifferently prevail.

అనునట్లు ఒరుల ననుకరించి మేలనిపించుకొనుట కంటె స్వతంత్రముగ ప్రయత్నించి, 'అయ్యో' యనిపించుకొనినను మేలే యనియొక యనుభవజ్ఞుని యభిప్రాయము.

'యత్నేకృతే, యది నసిద్ధ్యతి, కోఽత్రదోషః' సముద్రమును, తరచి తరచి గదా దేవత లమృతమును బడయగల్గిరి. స్వతంత్రబుద్ధి నాల్గుసార్లు పరాజయము నొందినను, అయిదవమారైన విజయము గాంచగల్గునేమో! నాట్యమున నిది యొకలోపము. ఇందేవిషయమునను, ఇదమిద్ధమని నిర్ణయించి చెప్పుట కెట్టివారికిని కష్టము. అందు నావంటివాని కసాధ్యమేయనుదగును. పాశ్చాత్య దేశములలో నాట్యకళ, ధనాధికులచేనెల్ల బోషింపబడుచు విద్యాధికులచే నెల్ల సేవింపబడుచు, ప్రత్యక్ష దేవతవోలె నారాధింపబడుచున్నను, తగినవరము నొసంగకున్నది. అట్టియెడ పఠింతమన్న పదియుద్గ్రంథములు లేక, నటింతమన్న నొక నాణ్యమగు నాట్యరంగము లేక, తెలిసికొందమన్న తెలుపదగునొక పత్రికలేక, అంధకారమున నల్లాడుచున్న మనము, ఈ సందర్భమున నువ్వెత్తుగ, నే మహాకార్యము నొనర్పగల్గుదుము! ఇంతకు, నొకరి మనస్సులోని యభిప్రాయముల నింకొకరికి తెలుపుకొనుటకును వీలులేని యవస్థలో చిక్కుకొనియుండ, కళాభిమానమున వ్యయప్రయాసముల కోర్చి, ఆంధ్రనాటక కళాపరిషత్తును నెలకొల్పి మనలనెల్లర నియ్యెడ సమావేశపరిచిన శ్రీయుత వనారస గోవిందరావు గారెంతయు ప్రశంసనీయులు. ఈయుద్యమము అంధకారమున దీపదర్శనమువలె నున్నది. దీని సహాయమున, మనము సత్యమును నిత్యమునునగు, నాటక స్వరూపమును గుర్తెరింగి, సలక్షణమగు నభినయము నలవరుచుకొని ఆదర్శప్రాయమగు నాట్యమందిరముల నిర్మించుకొని, నిష్పాక్షికముగ, గుణాగుణముల నెలకొల్పు పత్రికను స్థాపించుకొని మనము కృతకృత్యులమై కళనుద్ధరించి దేశమును పెంపొందింపవలసియున్నది.

ఇంతకే విలంబనమైనది. ఇంక పండితప్రకాండులగు తమరెల్లరు తమతమ యనుభవములను నభిప్రాయములను ఉపదేశరూపముగ నుపన్యసించి జ్ఞానోదయమును ఘటింపవలయునని నమస్కార పూర్వకముగ మిమ్మర్థించుచు నా ప్రస్తావన నింతటితో చాలించుచున్నాను.

(ఆంధ్ర నాటక కళాపరిషత్తు రజతోత్సవ సంచిక,
ఫిబ్రవరి - 1960)
పతివాడ సూర్యనారాయణ సౌజన్యంతో

## వర్ణన రత్నాకరం

*చం. వెనుకకు మొగ్గ వ్రాలి కడు విన్నను వొప్పఁగఁ దొట్టి నీళ్లలో*
*మునిఁగి తదంతరస్థమగు ముంగర ముక్కునఁ గ్రుచ్చుకొంచు లే*
*చెను రసనాప్రవాళమున శీఘ్రము గ్రుచ్చెను నల్లపూస పే*
*రనుపమలీల నిప్పడు చుపాయము లిట్టివి యెట్టు నేర్పెనో*

(క్రీడాభిరామము

ఓరుగల్లులో ఒక పడుచుపిల్ల చేస్తున్న అద్భుత విన్యాసాలను చూసి మంచనశర్మ ఆశ్చర్యచకితుడవుతున్న సందర్భం

ఆ పడుచుపిల్ల – నిండా నీళ్ళున్న తొట్టెలోకి ముక్కెరను విసిరేసింది. ఆ తొట్టె చెంత ప్రేక్షకులవైపు తిరిగి బోసి ముక్కుతో నిలబడింది. చేతులు పొట్టకి పెట్టుకుని అలవోకగా వెనక్కి వంగింది. తొట్టె అంచుకి తన వెన్ను తాకకుండా వంగింది. తొట్టెనీళ్ళలోకి చాలా నేర్పు ఒప్పేట్టు తలా మెడా ముంచింది. అంతే నేర్పుగా అలవోకగా లేచి నిలుచుంది. ఇప్పుడు ఆమె ముక్కుకి ముంగర మెరసిపోతోంది. చప్పట్లే చప్పట్లు.

చేటలో నల్లపూసలు పోసుకుంది. ఒక చేత్తో పట్టుకుంది. దారం ఎక్కించిన సూదిని మరో చేత్తో పుచ్చుకుంది. చిగురాకులాగా ఎర్రగా ఉన్న తన నాలుకతో అతివేగంగా ఆ నల్లపూసలను దారానికి దండ గుచ్చింది. సాటిలేని రీతిలో ఒయ్యారంగా నల్లపూసల పేరు తయారు చేసింది. మళ్ళీ చప్పట్లే చప్పట్లు.

ఈ పడుచుపిల్ల ఇలాంటి విద్యలూ ఉపాయాలూ ఎన్ని నేర్చిందో ఎలా నేర్చిందో కదా అని మంచనశర్మ ఆశ్చర్యపోయాడు.

- బేతవోలు రామబ్రహ్మం

# జాతీయ వాదాన్ని పెంపొందించిన
# కోణార్క దేవాలయ శిల్పి

– ఈమని శివనాగిరెడ్డి

**క్రీ.శ.** 13వ శతాబ్దంలో గాంగరాజైన మొదటి నరసింహదేవుడు, అత్యంత దృఢసంకల్పంతో కోణార్క దగ్గర సూర్యాలయాన్ని నిర్మించాడు. ఇది చరిత్ర. ఘనమైన చరిత్ర. స్వాతంత్ర్యానికి ముందూ, తరువాత జరిగిన అనేక పరిశోధనలు కోణార్క దేవాలయ నిర్మాణ విశేషాలను అందించి ఆశ్చర్యపడేట్లు చేశాయి. ఇరవయ్యో శతాబ్దపు మొదటి రోజుల్లో దేవాలయ నిర్మాణ విషయం, ఒక సంప్రదాయంగా మారి, జాతీయ వాదులు ఒరిస్సా వారిలో సమైక్యతాభావాన్ని, దేశభక్తి జాతీయ భావాలను పెంపొందించటానికి వినియోగించుకున్నారు. 16 సంవత్సరాలపాటు, 1200 మంది శిల్పులతో ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసిన విషయంతోపాటు, ప్రధానశిల్పి, ఆలయ శిఖరంపైన కలశాన్ని సరిగా బిగించలేకపోగా, ఆ శిల్పి కొడుకు చాకచక్యంగా ఆ కలశాన్ని బిగించాడన్న ఒక కథ బాగా ప్రచారం పొందింది. ఆ శిల్పి కొడుకు పేరు ధర్మపాదుడనీ, ఆ కథనం పేరు ధర్మపాద సంప్రదాయమనీ ప్రజల నోళ్లలో నానింది. జగన్నాథ రథయాత్ర సందర్భంగా, జగన్నాధ, సుభద్ర, బలభద్రుల రథాలను ఊడ్చి శుభ్రం చేసే పవిత్ర సాంప్రదాయాన్ని కంచి – కావేరీ సంప్రదాయం అనే పేరుమీద కేవలం పూరీలోనేకాక, మొత్తం ఒడిషా అంతా ప్రచారంలో వున్నట్లే, ఈ ధర్మపాద సంప్రదాయం కూడా, మధ్యయుగంలో ప్రారంభమై 20వ శతాబ్దం తొలినాళ్లలో మరోసారి తెరపైకొచ్చింది. ఈ సంప్రదాయం రెండు విధాలుగా ప్రచారం పొందింది. మొదటి విధానాన్ని ఎల్లెస్సెస్ ఓ మల్లె అనే బ్రిటీషు అధికారి 1908లో మొదటిసారిగ బీహార్ అండ్ ఒరిస్సా డిస్ట్రిక్టు గెజిటీర్‌లో ప్రచురించటంతో మరచిపోయిన ఒక సంప్రదాయం మళ్లీ ప్రజల్లోకి వచ్చింది. దీనిప్రకారం, కోణార్క దేవాలయాన్ని 1200 మంది శిల్పులు, 16 ఏళ్లపాటు పనిచేసి, పూర్తిచేశారు. అయితే ఒక శిల్పి, తనకు అప్పుడే పుట్టిన కుమారుణ్ణి, భార్యను తన వూళ్లోనే వదలిపెట్టి, తానొక్కడే నిర్మాణంలో పాలుపంచుకోవటానికి వెళ్లాడు. వెళ్లేటప్పుడు ఇంటిదగ్గర ఒక గంగరేగు చెట్టును నాటి వెళతాడు. కొడుకు పెరిగి పెద్దవాడైన తరువాత తండ్రిని వెదుక్కొంటూ కోణార్కకు వెళతాడు. అప్పుడు తల్లి పెరట్లో పెరిగిన గంగిరేగు పండు నొకదాన్ని అతనికిచ్చి, దాన్ని చూపించి, తండ్రిని గుర్తించే ఉపాయం చెబుతుంది. చాన్నాళ్ల ప్రయాణం తరువాత కోణార్కకు చేరుకొన్న శిల్పి కొడుకు, ఆ పండును అందరికీ చూపిస్తూ పోగా, ఒకే ఒక వ్యక్తి ఆ పండు తన పెరట్లో తాను పెట్టిందేనని, కొడుకును గుర్తించాడు. ఆ రోజు శిల్పి దేవాలయంపైన కలశాన్ని బిగించే పనిని పూర్తి చేయలేక అర్ధాంతరంగా వదలిపెట్టి శిబిరానికి వెళ్లిపోయాడు. గమనించిన శిల్పి కొడుకు, రాత్రంతా గుడిపై పనిచేసి, తన స్థానంలో సరిగా అమరని కలశాన్ని, తన నైపుణ్యంతో బిగించి వెళ్లాడు. తెల్లవారింది. శిల్పులంతా ఒక్కొక్కరుగా దేవాలయం దగ్గరకొచ్చారు. నిన్నటిరోజున పొందికగా అమరని కలశం చక్కగా అమరి ఉండటాన్ని ఆ పనిని శిల్పి కొడుకు చేశాడన్న సంగతిని తెలుసుకొని వారంతా శిల్పిని సమీపించి 'అయ్యా, శిల్పిగారూ, మీకు మీ అబ్బాయి కావాలా?' లేక మేము కావాలా? మీ అబ్బాయి కలశాన్ని ఇంత త్వరగా బిగించాడంటే, ఆలయ నిర్మాణాన్ని అతి త్వరలోనే పూర్తిచేస్తాడు. ఈ విషయం రాజుగారికి తెలిస్తే, ఇన్నాళ్లు కాలయాపన చేశామని మమ్మల్ని దండిస్తాడు. అందుకని, మీ అబ్బాయి కావాలో, మేము కావాలో తేల్చుకోండి' అని చెప్పి, వారగా వెళతారు. అప్పుడు శిల్పి విచార వదనంతో, తనకు, తన కొడుకుకంటే, 16 ఏళ్లపాటు తనతో నిర్మాణంలో పాలుపంచుకొన్న 1200 మంది శిల్పులే

ముఖ్యమ’ని ప్రకటించాడు. ఆ సమయంలో, శిల్పి కొడుకు దేవాలయం శిఖరంపైన, కలశాన్ని మరోసారి బిగిస్తూ పనిలో నిమగ్నమై ఉన్నాడు. తండ్రి గబగబా, శిఖరంపైకి ఎక్కాడు. ఇంతమంది శిల్పులు రాజుల దగ్గర మాట పడకుండా ఉండాలంటే తన కొడుకు ఇక్కడుండకూడదనుకొని, ఉన్న ఫళంగా, కొడుకును పైనుంచి, కిందికి పడదోస్తాడు. కొడుక, ఒక పక్క మండప ద్వారం పై పడి చనిపోతాడు. ఎందుకో, అతడు పడిన, ఆ మండపం అసంపూర్తిగా మిగిలిపోయింది. ఇదీ ఆ సంప్రదాయం ప్రకారం జరిగిన కథ.

1867లో కపిలేశ్వర విద్యాభూషణుడు, ఒరియా భాషలో రాసిన ‘ధాగమాల’ అనే గ్రంథంలో వివరించిన ఇదే కథను, నటబర సామంతరాయ్ అనే మరో ఒరియా రచయిత ఒచనిక సంప్రదాయంలో ప్రచురించటంతో, ఈ కథ మళ్లీ ప్రచారంలోకొచ్చింది. గోప బంధుదాస్ లాంటి జాతీయ వాద ఒరియా రచయితలను ఆకట్టుకొంది. ఇదే కథను, గోప బంధు, తాను స్వాతంత్రోద్యంలో పాల్గొని, హజరీబాగ్ జైలు నుంచి 1924, జూన్ 26 వ తేదీన విడుదలైన తరువాత ‘సమాజ్’ అనే పత్రికలో ప్రచురించాడు. బాగా ప్రచారం పొందిన పద్యం రూపంలోనున్న ఈ కోణార్క గాథ, 1920వ దశకంలో ప్రముఖ పత్రికలైన ఉత్కల సాహిత్య, బరుణి, ఆషాల్లో అనేక వ్యాసాలతోపాటు, 1924 నుంచి 1928 వరకు ‘ధర్మపాద’ పేరుతో అనేక ముద్రణలు పొందింది. గోపబంధు, తన పద్యంలో కోణార్క దేవాలయ సంఘటనను వివరిస్తూ, శిల్పి, అతని కొడుకును, శిఖరం పైనుంచి పడదోయలేదనీ’, శిల్పి కొడుకే, శిల్పులందరి ప్రయోజనం కోసం, ఆలయం పైనుంచి చంద్ర భాగ నదిలోకి దూకి చనిపోయాడని రాశాడు. ఆత్మ త్యాగం చేసుకొన్న ఆ శిల్పి కొడుకు పేరు ‘ధర్మపాదుడ’ని మొదటిసారిగ పేర్కొన్నాడు. దేవాలయాన్ని ‘ధర్మదేవత’గా పేరుగాంచిన సూర్యభగవానుని పేరుమీద, శిల్పి కొడుక్కి ధర్మపాదుడని పేరుపెట్టాడు. 1963 ప్రాంతంలో అశ్వినీకుమార్ ఘోష్ ఇదే సంప్రదాయంపై ‘అది నాకు తెలుసు’ అన్న పేరుమీద రాసిన నాటకంలో, తండ్రి (శిల్పి) పేరు బిసూ మహారాణాగా అని పేర్కొన్నాడు. ఇలా తండ్రి చేసిన పొరపాటును, కొడుకు సరిచేసినట్లు హొయసలులు నిర్మించిన బేలూరు దేవాలయం (అమరశిల్పి జక్కన, అతని కొడుకు) ఇంకా, మొదటి నరసింహ దేవుడు సింహాచలం దగ్గర నిర్మించిన నరసింహస్వామి (సింహాద్రి అప్పన్న) దేవాలయంల వద్ద కూడా ప్రచారంలో వున్నాయి.

మళ్లీ కథలోకెళితే, కోణార్క దేవాలయ ప్రధాన శిల్పి (స్థపతి)గా ఎంపికైన బిసూ మహారాణా, రాజు ఆదేశంపై నిర్మాణ స్థలానికి బయలుదేరతాడు. ఆ సమయంలో బిసూ మహారాణా భార్య గర్భవతి. రాణా దేవాలయ నిర్మాణంలో మునిగిపోయి ఉండగా, కొడుకు పుడతాడు. 16 ఏళ్లపాటు, 1200 మంది శిల్పులు నిరాటంకంగా పనిచేసి, ఆలయ నిర్మాణాన్ని దాదాపు పూర్తిచేశారు. ఇక కలశం బిగించటం ఒక్కటే మిగిలింది. బిసూ మహారాణా ఆలయంపైకెళ్లి, కలశాన్ని బిగించటానికి చేసిన ప్రయత్నం ఫలించలేదు. తన తండ్రిని వెదుక్కుంటూ, కోణార్కకు వచ్చిన బిసూ మహారాణా కొడుకు, తాను తెచ్చిన గంగ రేగు పండు ఆధారంగా, తండ్రిని గుర్తించాడు. ముహూర్తం సమీపిస్తుండటంతో, ఆలయ నిర్మాణాన్ని అన్నివిధాలా, అనుకున్న సమయానికే పూర్తి చేయాలని, నరసింహదేవుడు శిల్పుల్ని ఆజ్ఞాపించాడు. ఒకవేళ పూర్తి కాకపోతే ప్రాణాలకే ముప్పు కలుగుతుందనుకొన్న శిల్పులు, కలశాన్ని బిగించటానికి పూనుకొన్నారు. బిసూ మహారాణా వారికి సూచనలిస్తున్నాడు. అందరూ ఉత్కంఠతో పనిలో నిమగ్నమై, కలశాన్ని బిగిస్తున్నారు. ఎందుకో ఆ కలశం సరిగా ఇమడటంలేదు. గమనించిన శిల్పి కొడుకు, పూనుకొని, కలశాన్ని సరిగా బిగించాడు. ఉత్కంఠకు తెరపడింది. బిసు మహారాణాతోపాటు 1200 మంది శిల్పులు ఊపిరి పీల్చుకొన్నారు. శిల్పి కొడుకు, తన తండ్రినీ, తల్లినీ కలిపాడు. దీంతో కథ ముగుస్తుంది. జాతీయవాద కవి పండిత గోపబంధం దాస్ తన ‘ధర్మపాద’ పద్యంలోని వర్ణన మరోవిధంగా ఉంది. బాగా తెలివైన, చురుకైన, ప్రతిభావంతుడైన శిల్పి కొడుకు, ఎలాగైనా కలశాన్ని బిగించి, ఒక్క రాత్రిలోనే ఆలయ నిర్మాణాన్ని అన్ని విధాలా పూర్తి చేయటానికి పూనుకొని, కలశాన్ని బిగించాడు. విస్మయానికి గురైన శిల్పుల ముఖంలో కళ తప్పింది. 1200 మంది చేయలేని పనిని చిన్న కుర్ర శిల్పి పూర్తిచేసిన సంగతి రాజుకు తెలిస్తే, అతన్ని మెచ్చుకోకపోవటమేకాక, తమకు శిరచ్ఛేదన

తప్పదనుకొన్నారు. వెంటనే ప్రధాని శిల్పి దగ్గరకెళ్ళి 1200 మంది శిల్పుల జీవితాలు ముఖ్యమా? లేక మీ కొడుకు మీకు ముఖ్యమా' అని అడిగారు. తండ్రి సందిగ్ధ పరిస్థితిని గమనించిన శిల్పి కుమారుడు, అతనికీ, అతని తోటి శిల్పులకు మాట రానీయకూడదనుకొని, శిఖరం పైనుంచి చంద్ర భాగా నదిలో దూకి చనిపోయాడని గోప బంధు దాస్ రాశాడు. ఒకరికంటే ఎంతోమంది ప్రయోజనం ముఖ్యమని భావించి, కుర్ర శిల్పి త్యాగం చేశాడనీ, స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న ఈ సందర్భంలో ఒరియా ప్రజలంతా, ఈ కథలోని సారాంశాన్ని ఆదర్శంగా తీసుకొని, జాతీయ భావాన్ని అలవరచుకొని ఐకమత్యంతో ఉద్యమంలోకి దూకాలని, తాను హజారీ బాంగ్ జైల్లో ఉండగా, రాసుకున్న 'ధర్మపాద' పద్యంలో నూరిపోశాడు.

'రాజభోగచరిత్ర' అనే రాత ప్రతిగ్రంథంలోని కథ కొంత భిన్నంగా ఉంది. దాని ప్రకారం, కోణార్క దగ్గర సూర్యభగవానునికి దేవాలయం నిర్మించాలనుకొన్న గాంగ రాజైన మొదటి నరసింహ దేవుడు క్రీ.శ. 1243లో, ఆ పనిని పర్యవేక్షించే బాధ్యతను తన మంత్రి సిబై సంతారాకు అప్పగించాడు. ముందుగా రాళ్ళు, నీళ్లతో పునాదులు నింపారు. నీటి ప్రవాహానికి రాళ్ళు కొట్టుకుపోయాయి. ఒకరోజు ఒకామెవచ్చి, సిబైకి ఒక దేవత గుళ్లో నుంచి తెచ్చిన ప్రసాదానివ్వబోగా, అతడు చేత్తో అందుకోవటాన, అతని వేళ్లు కాలిపోయాయి. ఆమె అతన్ని గుర్తుపట్టకుండా ఇలా అంది: 'నీవు కూడా సిబై సంతారా మాదిరిగా తయారైనావు. ఆయన దేవాలయం కట్టేపుడు, పునాదుల్లో రాళ్లను చుట్టూ కాకుండా మధ్యలో వేశాడు'. ఈ మాటలు విన్న మంత్రి, ఆమె చెప్పినట్లే విని, పద్మకేసరాన్ని, ముఖశాలను నిర్మించాడని చెప్పబడింది. కృపాసింధు మిశ్రా ప్రకారం, రాజు, దేవాలయ నిర్మాణ పర్యవేక్షకునిగా తన మంత్రి సిబై సంతారాను నియమించాడు. రామచండి అనే దేవత కృపవల్ల సిబై ఆలయ పునాదులను నింపాడు. అటుతరువాత 1200 మంది శిల్పులు, 12 సంవత్సరాలపాటు కష్టపడి ఆలయాన్ని నిర్మించారు. రాజుమాత్రం, ఎట్టి పరిస్థితుల్లోనూ, దేవాలయం నిర్మాణం నిర్ణీత సమయానికే పూర్తి కావాలని ఆదేశాలు జారీచేశాడు. అయితే, చాలా ఏళ్లుగా ఇల్లు వదిలి, కోణార్క దగ్గరే ఉండటంవల్ల కుర్ర శిల్పులకు ఇంటికి పోవాలనిపించింది. అందువల్ల పనిని ఆపేసి, వారంతా వారి వారి ఊళ్లోకెళ్లిపోయారు. పెద్దవాళ్లు మాత్రం, ఇదొక సవాలుగా స్వీకరించి పనిని పూర్తి చేయటానికి పూనుకొన్నారు. ఆ సందర్భంగా పెద్ద శిల్పులు, కుర్ర శిల్పులతో '1200 మంది శిల్పుల ఉమ్మడి శ్రమ ముఖ్యమా? లేక మీ చిన్నపిల్లలు ముఖ్యమా?' అని అడిగారు.

పూరీలోని జగన్నాథాలయంగానీ, లింగరాజాలయం గానీ, ఏ ఒక్క రాజు పాలనా కాలంలో పూర్తి కాలేదనీ, ఒక రాజు ప్రారంభించగా, మరో రాజు పూర్తి చేశాడనీ, మరి అలాంటప్పుడు, కోణార్క దేవాలయాన్ని, నిర్ణీత సమయంలో పూర్తి చేయాల్సిన అవసరమేమొచ్చిందని, పెద్ద శిల్పుల్ని ప్రశ్నించిన కుర్రశిల్పులు, దేవాలయ నిర్మాణ పనిని విడిచిపెట్టి, ఉన్నఫళంగా, ఊళ్లోకెళ్లిపోయారు. అందువల్ల ఈ దేవాలయ నిర్మాణం పూర్తి కాలేదని కొందరి నమ్మకం. కానీ, రెండో నరసింహవర్మ కెందు పట్న రాగి రేకు శాసనాల్లో మొదటి నరసింహ దేవుడు, కోణార్క దేవాలయాన్ని నిర్మించి, అందులో మహాభాస్కరుణ్ణి ప్రతిష్ఠించాడని చెప్పబడింది. దీనివల్ల, దేవాలయ నిర్మాణం పూర్తి కాలేదన్న వాదనకు, తెరపడింది. బ్రిటిషు ఈస్టిండియా కంపెనీ కాలంలో ఒరిస్సా కొచ్చిన కొంతమంది బెంగాలీ అధికారులు, ఒరియా వారిని ఘనమైన వారసత్వం లేనివాళ్లని చిన్న చూపు చూశారు. అంతేకాదు, 'ఉత్కళ దీపిక' అనే ఒరిస్సా వార్తాపత్రిక సంపాదకుడైన గిరీశంకర్ రాయ్, కూడా ఒరియావాళ్లు సోమరిపోతులు, తెలివి తక్కువ వాళ్లు అన్న బ్రిటీషు కమీషనరు రావెన్‌షా మాటలతో వంతపాడాడు. ఈ నేపథ్యంలో, ఒరియా వారికి సరైన గుర్తింపు దక్కాలన్న తలంపుతో, గత వైభవ ప్రాభవాలను, అద్భుత కట్టడ, కళా కౌశలాలు ఈ తరం (1920–30 ప్రాంతం) వారిని ఉత్తేజపరచి, ఒక్కటిగా చేసి, జాతీయ భావాన్ని పెంపొందించుకొని, ఒరియావారు, దేశంలో మరే ప్రాంతం వారికీ తీసిపోరనీ, వారికీ ఘనమైన వారసత్వముందని తెలుసుకొని, తెలియజెప్పటానికి ధర్మపాద సంప్రదాయాన్ని ప్రచారం చేయటానికి పూనుకొన్నారు కొందరు జాతీయ వాద ఒరియా రచయితలు. ఒరిస్సాలో వాస్తు, శిల్పకళా విన్యాసానికీ, వికాసానికీ అద్దంపడుతున్న, క్రీ.శ. 7–13

శతాబ్దాల మధ్య కాలంలో నిర్మించిన ముక్తేశ్వర దేవాలయం, లింగరాజు ఆలయం, రాజా రాణి ఆలయం జగన్నాథాలయం, ఇంకా, కోణార్క సూర్యదేవాలయాలను అందుకు ఉదాహరణలుగా పేర్కొన్నారు. ఈ ఆలయ వాస్తు, ప్రత్యేక గుర్తింపు పొందిన కళింగ దేవాలయ వాస్తుకు ప్రతీకగా నిలిచింది. ఒక శతాబ్దం నుంచి మరో శతాబ్దానికి వాస్తు కళ వికాసం కొత్త పుంతలు తొక్కిందే తప్ప, ఎప్పుడూ వెనక్కి మళ్లిన దాఖలాలు లేవు. అయితే, కోణార్క దేవాలయ నిర్మాణం తరువాత, శిల్పు నైపుణ్యం సన్నగిల్లి, మునుపటి పటిమను ప్రదర్శించని మాట నిజమని, అటు తరువాత కట్టడ కౌశలం అడుగంటి కోణార్కలాంటి బృహత్తర ప్రణాళికలు, ఆచరణలోకి రాలేదని పరిశోధకుల అభిప్రాయం. ఈ సందర్భంగా, మరి కొంతమంది వెలిబుచ్చిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి. దాదాపు 16 సంవత్సరాలపాటు కోణార్క దేవాలయ నిర్మాణంలో పాలుపంచుకొన్న శిల్పులు, కుటుంబ జీవనానికి, దాంపత్య సుఖాలకు దూరమైనందున, తమ తరువాతి తరం శిల్పులకు శిక్షణనిచ్చి, ప్రతిభావంతులుగా తీర్చిదిద్దలేకపోయారని వారి వాదం. అంతేకాదు, శిల్పులకు కోణార్క లాంటి ప్రతిష్టాత్మక పథకాలను చేపట్టిన రాజులు లేకపోవటం కూడా ఒక కారణం. ఇలా, కోణార్క దేవాలయ నిర్మాణం తరువాత 600 సంవత్సరాలపాటు నిరాదరణకు గురైన శిల్పులు, తమ నైపుణ్యాన్ని ప్రదర్శించే అవకాశం లేక, నగిషీలు దిద్దిన చేతులు, మొద్దుబారి, శిల్పకళ సద్దుమణగటానికి కారకులైనందున నైరాశ్యాన్ని పోగొట్టి, ఆత్మస్థైర్యాన్ని పెంపొందించి యువకులను, స్త్రీలను పునరుత్తేజితుల్ని చేయటానికి ధర్మపాద ఇతివృత్తాన్ని మిక్కిలిగా ప్రచారం చేయటానికి పూనుకొన్నారు. ఈ క్రమంలోనే, మధుసూదన్ దాస్, ఉత్కళ యంగ్ మెన్ అసోసియేషన్‌ను స్థాపించాడు. అందుకోసం, ప్రధాన శిల్పి చేయలేని పనిని విజయవంతంగా పూర్తి చేసిన శిల్పి కుమారుడు చేసిన ప్రాణత్యాగాన్ని ఒక గొప్ప ఆదర్శంగా తీసుకోమని గోప బంధుదాస్ ధర్మపాద సంప్రదాయాన్ని ప్రచారంగావించి, ఒరియావారికి ఒక గుర్తింపును, ఉనికినీ తీసుకొచ్చాడు. ఇదే స్ఫూర్తితో ఒక కొత్త ఒరిస్సాను, ఒక కొత్త ఒరియా జాతినీ కలలుగని, నిజం చేశాడు. అదే వరవడిలో, ఆయన 1907లో సెంట్రల్ ఉత్కళ యంగ్ మెన్స్ అసోసియేషన్‌ను స్థాపించి, వరదల బారిన పడిన జాజ్‌పూర్ ప్రజలకు సహాయ సహకారాలనందించాడు. సత్యవాది స్కూలును స్థాపించి ప్రగతిశీల ఒరిస్సాకోసం, ప్రజలను విద్యావంతుల్ని గావించాడు. కానీ, ఒక సంఘటిత ఒరిస్సాను నిర్మించటంలో సఫలం కాలేకపోయాడు. అందుకనే, చరిత్రలో జరిగిన ఒక సంఘటనను ఒక ఆయుధంగా వాడుకొని, కోణార్క దేవాలయ ప్రధాన శిల్పి, ఆయన కొడుకుల ఇతివృత్తంలోని కొడుకు త్యాగాన్ని ఆదర్శంగా తీసుకొని సరికొత్త ఒరిస్సా నిర్మాణానికి, ప్రజలంతా పునరంకితులై, దేశభక్తిని పెంపొందించుకొని, ఒక్కుమ్మడిగా జాతీయోద్యమంలో పాల్గొనాలని, అందుకు అనువుగా ధర్మపాద సంప్రదాయాన్ని మలచుకొన్నాడు.

అశ్వినీకుమార్ ఘోష్ కూడా, గోప బంధు దాస్‌ను అనుసరిస్తూ, కోణార్కపై 1927లో ఒక నాటకాన్ని రాసి, కటక్‌లో ప్రదర్శించాడు. బెంగాలి అయిన బలయ్ బెనర్జీ, ప్రధాన శిల్పి బిసు మహారాణా పాత్ర పోషించి, రక్తి కట్టించాడు. చాన్నాళ్లు ప్రదర్శింపబడిన ఈ నాటకం ఒరియా ప్రజలపై ప్రగాఢ ముద్రవేసి, నవ జాతీయ వాదాన్ని నూరిపోసింది. అంతేకాదు, తండ్రి లేని 12 ఏళ్ల కాలంలో, శిల్పి కొడుక్కి, అతని తల్లి, శిల్పకళలో మెళకువలు నేర్పి, తండ్రిని మించిన తనయునిగా తీర్చి దిద్దిందనీ, ఒరియా మహిళలు కూడా ప్రశంసనీయులేనని, 1932లో బౌండరీ కమీషన్, అధ్యక్షునికి, సభ్యులకు, ఒరియా మహిళలు ఒక విజ్ఞప్తిని చేసి, యువకులతోపాటు, ధర్మపాద సంప్రదాయం, తమను కూడా జాతీయోద్యమంలోకి దిగటానికి ప్రభావితం చేసిందని చెప్పారు. క్రీ.శ. 13వ శతాబ్దంలో జరిగిన ఒక సంఘటన, స్తబ్దుగా ఉన్న ఒరియా జాతిని ఉత్తేజపరచి, జాతీయోద్యమంవైపు మళ్లించింది.



డా॥ ఈమని శివనాగిరెడ్డి (స్థపతి)
మొఘల్ గార్డెన్స్,
విజయవాడ - 10
ఫోన్ : 9848598446

# నార్ల – ఒక జ్ఞాపకం

**– వి. ప్రమోద్ కుమార్**



నార్ల

శ్రీ నార్ల వెంకటేశ్వరరావుగారు నవమేధావి. విలక్షణమైన, విశిష్టమైన వ్యక్తిత్వంగల రచయిత. ఇది ఎవరూ కాదనలేని సత్యం. తెలుగు పత్రికారచనకు సరికొత్త ఒరవడిని, పరవడిని దిద్దిన మేధావి.

ఆయనకు ఏ విశేషణాలైనా ఆభరణాలుగా నిలవవు. ఆ ఆభరణాలకే ఆయన అలంకారమౌతారు.

నార్లవారి గృహం 'లుంబినీ'కి ఓ మిత్రునితో వెళ్ళాను. వారికి రాతి శిల్పాంటే మక్కువ ఎక్కువ.

పరిచయనాంతరం కొన్ని మాటలయినాక "ఏం చేస్తూ ఉంటారు" అన్నారు.

"నేను ఫిలిం జర్నలిస్టుని. మీవంటి శిఖరాగ్రం ముందు విలేఖరిని అని చెప్పటం కాస్త ఇబ్బందిగా ఉంద"న్నాను.

"అలాంటివి ఏమీ పెట్టుకోకండి" అన్నారు నవ్వుతూ.

కించిత్ ధైర్యం పుంజుకొని "నాకు ఏడెనిమిది ఏళ్ళ వయసులో దెందులూరులో మొటపర్తి రామమోహనరావు గారింట్లో మీ అమూల్యమైన నాటికల సంపుటి 'కొత్త గడ్డ'ను తొలిసారిగా చూశాను, చదవలేదు. చదివగలిగే వయసూ కాదు కాదా! చూచాను. ఆ 'లినొకట్' బొమ్మల్ని తరచూ తిరిగేసేవాణ్ణి. అంటే అన్యాపదేశంగా నాకు బాల్యంనుండే మీ పరిచయ భాగ్యం కలిగింది."

"అలాగా చాలా సంతోషం! లీలగా గుర్తొస్తోంది. రెండు 'కొత్తగడ్డ' పుస్తకాలు పంపినట్లు గుర్తుంది.

"మీరు అనుమతిస్తే మరోమాట" సిగరెట్ వెలిగిస్తూ చెప్పమని తలూపారు.

"1952–53 సంవత్సరాల మధ్య ఏలూరు అశోక్‌నగర్‌లో మీకు సన్నిహితుడు, ఆంధ్రప్రభ ఏజెంట్ శ్రీ బొబ్బా రామమోహన్‌రావుగారింటికి మీరొచ్చారు. అప్పట్లో బొబ్బావారే మా కుటుంబ స్నేహాన్ని పురస్కరించుకొని మిమ్మల్ని ప్రక్కనే ఉన్న మా ఇంటికి తీసుకువచ్చారు.

హాల్లో ఆసీనులైన మీకు 'బత్తాయి రసం' మా అమ్మగారు అందించగా మీకిచ్చే భాగ్యం కలిగింది. అప్పట్లో నేను సి.ఆర్.ఆర్. కాలేజీలో చదువుతున్నాను."

"అవునవును అన్నీ బాగా జ్ఞాపకం ఉంచుకొన్నారే!"

"అంతే కాదండి! కొత్తగడ్డలోని 'ద్రోహం' నాటిక మా గురువుగారు శ్రీ జానికీజానీ మా కాలేజీలో ప్రదర్శింప చేశారు. ఆఖర్లో వచ్చే 'మూర్తి' వేషం నేను వేశాను" అన్నాను.

ఆయన చిరునవ్వుతో.... "అవునా! నా లిటరేచర్‌తో బాగా పరిచయం ఉందన్నమాట."

"అంతేకాదండి" అంటూ మళ్ళీ కొనసాగించాను.

"గతకాలంలో మీరు కాంగ్రెస్‌కు సమర్థిస్తూ ఆంధ్రప్రభ మొదటిపుటలో 'కాప్రేముల రాజ్యం వస్తే' అన్న మకుటంతో వచ్చిన కార్టున్ల కోసం ఎంతో ఆసక్తితో రోజూ ఎదురుచూసేవాళ్ళం. మీ సమర్థన కాంగ్రెస్ అధికారంలో రావటానికి ఎంతో కొంత దోహదపడింది" అన్నాను. అవునవును. "అప్పుడది ఓ యజ్ఞంలా నిర్వహించాం. లోపలికి వెళదాం" అంటూ హాల్లోకి దారితీశారు.

వరండాలోనూ, మొదటి గదిలోనూ ఆర్టు, క్లాసికల్ ఆధునిక డ్రామాలు, రెండవ ప్రపంచ యుద్ధానికి సంబంధించిన గ్రంథాలు, పాశ్చాత్య దేశాల ప్రాచీన, ఆధునిక డ్రామాలే కాక నెపోలియన్, డిగోల్, గారిబాల్డి మొదలైనవారి రచనలున్నాయి. రెండవ గదిలో భారతదేశానికి సంబంధించిన విషయ పరిశీలనా గ్రంథాలు, మొగల్, బ్రిటిష్ ఇండియా రచనలు. మెట్లక్రింద అమెరికా ప్రజాస్వామ్య పుస్తకాలను ఉంచారు. మొదటి గది పేరు 'మేవాడ్'. తరువాతి గదికి 'కృష్ణ'. అందులో నార్లవారి రచనలన్నీ ఒక్కొక్క ప్రతిచొప్పున బైండ్‌చేసి ఉంచారు. ఆ తరువాత 'శివుడి గది'. దానిలో 'గీత'పై విశేష సేకరణ, బౌద్ధ, సిక్కు, ముస్లిం దర్శనాలు, తత్వాలు ఉంటాయి. ప్రక్క గది పేరు 'బుద్ధుడు'. వారు దక్షిణాసియాలో పర్యటించి, సేకరించిన వివిధ బుద్ధ ప్రతిమలను ఎంతో అందంగా అమర్చి, దానికి 'బుద్ధుడి గది' అని నామకరణం చేశారు.

ఇవన్నీ చూస్తూ ఒక ట్రాన్స్‌లో ఉన్నాను. వారు వివరిస్తూనే ఉన్నారు.

నాకు అది సరస్వతి మాత కొలువుతీరిన క్షేత్రం అనిపించింది. వారు ఇన్నేళ్ళుగా గ్రంథాలు సేకరించుటయేకాక వాటిని క్రమబద్ధంగా అమర్చడం వారికి గల ప్రత్యేక అభిరుచిని, ఆసక్తిని మనఃపూర్వకంగా ప్రస్తుతించి కృతజ్ఞతలతో సెలవు తీసుకొంటుండగా వారు సంతకం చేసిన 'వేమన' పుస్తకం తమ గుర్తుగా నాకు ఇచ్చారు. ఇది నాకెంతో మధురమైనటువంటి అనుభూతిని కలిగించింది.

నేనెక్కడ ఉన్నా వారి జన్మదినం డిసెంబర్ ఫస్ట్‌న జన్మదిన శుభాకాంక్షలు తెలిపేవాణ్ణి. వెంటనే కృతజ్ఞతలతో ఓ కార్డు వచ్చేది. మరపురాని, మరువలేని మహోన్నతులు నార్లవారన్నది జగమెరిగిన సత్యమే.

మి



వి. ప్రమోద్ కుమార్

# చదవండి...

- ఎన్నార్కె




✦ **మనసులో వెన్నెల :** చైతన్య పింగళి సామాజిక దృక్పథంతో రాసిన మనసును తాకే 8 కథలు. ప్రతి కథకు ఇలస్ట్రేషన్స్ ఉన్నాయి. మంచి గెటప్ - పాకెట్ సైజ్.

*పేజీలు : 95, వెల : ₹ 60/-, ప్రతులకు - ఫోన్ : 08886983399*

120 వ జయంతి ఉత్సవ కమిటి మహాకవి గుర్రం జాషువా పై దిగువ పేర్కొన్న నాలుగు పుస్తకాలు ప్రచురించారు. ప్రజాశక్తి ప్రచురణలు - ఫోన్ : 0866 - 2577533.



✦ **1. మహాకవి జాషువా సాహిత్యం :** ప్రగతి శీలత, కళాత్మకత. రచన డాక్టర్ అద్దేపల్లి రామమోహనరావు. ఇందులో ప్రజాకవి  జాషువా యొక్క పద్యం, వర్గ దృష్టి, ఖండకావ్య చైతన్యం- వర్తమాన విశ్లేషణ, వచనకవిత, ప్రగతి శీలత లాంటి వ్యాస పరంపరలు జాషువా లోదృష్టిని మనకందిస్తున్నాయి.

*పేజీలు : 64, వెల : ₹ 40/-*



✦ **2. జాషువా సాహిత్యం - దృక్పథం - పరిణామం - :** రచన డాక్టర్ ఎండ్లూరి సుధాకర్. ఇందులో జాషువా జీవితం, రచనలు, దృక్పథం, సాహిత్య పరిణామం, కవితా లక్షణాలు - ఇతర కవులపై ప్రభావం, సాహిత్యంలో జాషువా స్థానం లాంటి విషయాలపై విశ్లేషణలున్నాయి.

*పేజీలు : 100, వెల : ₹ 168/-*

✦ **3. దళిత సాహిత్య వాదం - జాషువ :** రచన డా॥ కత్తి పద్మారావు ఇందులో 16 వ్యాసాలున్నాయి.

*పేజీలు : 176, వెల : ₹ 100/-*

✦ **4. జాషువా - స్వప్నం - సందేశం :** రచన డా॥ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి. జాషువాను సమతావాది. చైతన్యానికి ప్రతీకగా పేర్కొన్నారు రచయిత.

*పేజీలు : 95, వెల : ₹ 60/-*




✦ **చారు వసంతం :** నాడోజ హంపనగా కన్నడ హృదయాల్లో భద్రపీఠాన్ని అధిష్టించిన హంపసంద్ర పద్మనాభయ్య కుమారుడు నాగరాజయ్యగా ప్రసిద్ధులైన వారి కన్నడ కవితకు గుత్తి చంద్రశేఖర రెడ్డి గారి తెలుగు అనువాదం. తెలుగు, కన్నడ రెండు భాషా సంస్కృతులతో గాఢ పరిచయంగలిగి, అభిరక్తి కలిగిన రచయిత కావటంతో అనువాదం అసిధారా వ్రతంగా సాగింది. తెలుగు, కన్నడ భాషాభిమానుల కిదొక వెల లేని కానుక. పుస్తకం వెనక రచయిత తన బొమ్మకు బదులుగా హంపన ఫోటోను ప్రచురించి వారిపై తమకున్న గౌరవాన్ని ప్రకటించుకున్నారు.

*పేజీలు : 325, వెల : ₹ 200/-, ప్రతులకు - ఎమెస్కొ వారి ప్రచురణ.*




✦ **చాసోస్ఫూర్తి :** 1995-2013 వ్యక్తిగా, కథకునిగా, చాసోను విభిన్న కోణాలలో విశ్లేషించిన 17 మంది రచయితల ప్రసంగాల - సంకలనం. చాసో అభిమానుల వద్ద తప్పక ఉండవలసిన పుస్తకం. దీని సంపాదకులు డా. రామసూరి.

*పేజీలు : 208, వెల : ₹ 150/-, ప్రతులకు - ఫోన్ : 9440143488 / 9963377672*

✦ **వైనతేయ కథలు :** రచయిత బి.శశి. వారి అబ్బాయిలు, అమ్మాయిలు, మనిషిగా ఎలా బతకాలో చెప్పకుండా, వెళ్ళిపోయిన తమ తండ్రి కథలను సేకరించి పుస్తక రూపంలో మన ముందుంచారు. ఇవి చక్కని కథలు వ్రాసిన విస్తృత కథకుని కథలుగా పేర్కొన్నారు శీలావీర్రాజు. బాపూ ముఖచిత్రం ముచ్చటగా ఉంది. *పేజీలు : 174, వెల : ₹ 100/-, ప్రతులకు – ఫోన్ : 9490106390*




✦ **తెలుగు : ఎప్పుడు... ఎక్కడ ఎలా ... :** రచయిత కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళై. ద్రావిడులు ఎవరు? ఎక్కడి వారు? అని ప్రశ్నిస్తూ వాల్మీకి చేత వానరులుగా వర్ణించ బడిన కిష్కింద వాసులే ద్రావిడులని – ఇది ముమ్మాటికి నిజమని విశ్లేషిస్తారు రచయిత.
*పేజీలు : 43, వెల : ₹ 25/-, ప్రతులకు – ఫోన్ : 9502304027*



✦ **చెట్టును దాటుకుంటూ :** రచయిత జూకంటి జగన్నాథం. వారానికొక్కటిగా కవితా సంపుటిలొస్తున్నాయి. కానీ ఆర్తితో నిండినవి వేళ్ళ మీద మాత్రమే లిఖించ దగ్గవి. జూకంటి వారి కవితలో ఆర్తి ఉంది, దేశభక్తి ఉంది, మానవతా వాదం ఉంది, తల్లి పాలలాంటి శ్రేష్ఠమైన తెలుగు యాస ఉంది. కొండపల్లి శేషగిరిరావు గారు వేసిన ముఖచిత్రం ముచ్చటగా ఉంది. కవితలు 50.
*పేజీలు : 150, వెల : ₹ 100/-, ప్రతులకు – ఫోన్ : 9440169896*



✦ **మా ఊరు చెప్పింది :** చిన్ని, చిన్ని, కథలు – రచయిత ప్రశాంత్ విఘ్నేష్. తన స్వంత ఊరయిన తిరుపతిని కేంద్రంగా తీసుకుని కథలల్లారు. ఇందులోని మనుషులు, సంఘటనలో మనకు పరిచయం ఉన్నట్లుగా, సహజంగా అనిపిస్తాయి. పుస్కి కథ కంటతడిపెట్టిస్తుంది. ముఖచిత్రం శోభాయమానంగా ఉండటమే కాదు, తానూ ఒక కథ చెబుతాడుగా అన్నట్లు ఉంది. ముందుమాటగా వచ్చిన వెనుక మాట సూపర్బ్. మధ్య మధ్యలో చిత్రాలు అందంగా అమరాయి. పుస్తక ప్రచురణ సాంకేతికంగా ఉన్నత స్థాయిలో ఉంది.
*పేజీలు : 180, వెల : ₹ 180/-, అన్ని పుస్తక విక్రయ కేంద్రాలలో లభ్యం.*



✦ **నవ్యాలోకనం :** పరిచయం అవసరం లేని రచయిత చందు సుబ్బారావు రాసిన సాహిత్య వ్యాసాలు. తెలుగు సాహిత్యాభిలాషులు, విద్యార్థుల వద్ద తప్పక ఉండవలసిన గైడ్ అని చెప్పదగ్గ పుస్తకం.
*పేజీలు : 164, వెల : ₹ 150/-, ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలలో లభ్యం.*




✦ **కథ - 2014 :** వటుడింతై, అంతంతై అన్నట్లుగా తెలుగు సాహిత్యంలో మైలురాళ్ళు అన్న దగ్గ కథల సంపుటి ఈ సంవత్సరంలో రజితోత్సవం జరుపుకుంటుంది. సంపాదకులు వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్‌లకు అభినందనలు. వీరి సాహితీ కృషి, ఇలానే మరికొంత కాలం సాగాలని ఆశిస్తున్నాం. ఇందులో కొన్ని లోటుపాట్లు లేకపోలేదు. ఒకటి లెస్బియన్ కథ – ఇది ఈ సంకలనాన్ని మలినపరచినట్లు – దీనిలో విశ్వజనీనత ఎంతవరకు? మరొకటి అమెరికాలో వుంటూ వాళ్ల సంస్కృతిని నిరసించే – తల్లిదండ్రులు – అమ్మాయిల (అమ్మాయిలు స్వేచ్ఛ కోసం వెంపర్లాట) కథ – మరొకటి : కూతుర్ని చదివించే మిషతో అందరికీ 'వాకిలి' తెరచిన స్త్రీవాది కథ – నాల్గోది : ఇది అమెరికా – అబార్షన్ కథ. మరొకటి : పల్లెటూరి కథ అయినా మొగుణ్ణి వదిలి, తన కిష్టమైన వాడితో 'లాడ్జి'లో గడిపిన 'మాధవి' కథ. పతంజలి 'రోహిణి' కల్పితమైనా కలుషితం కాదు. ఇప్పటికీ సందర్భోచితమే. మిగతావి యాసలో గోసలో అర్థం కావు – ఇప్పుడు ఎవరికీ అంత తీరిక, ఎరుక లేదు కదా!
*పేజీలు : 190, వెల : ₹ 65/- , అన్ని పుస్తక విక్రయ కేంద్రాలలో లభ్యం.*




✦ **తాంగ్డి :** బంజారా సాహిత్య సమాలోచనం. ఈ సంపుటిలో 16 వ్యాసాలున్నాయి. రెండు వ్యాసాలు ఇంగ్లీషులో ఉన్నాయి. ఈ వ్యాస సంపుటి బంజారాల సాహిత్య సంస్కృతుల విశేషాలకు, ఆచార సంప్రదాయాలకు అద్దం పడుతుంది. రచయిత్రి డా॥ సూర్యాధనంజయ్ కృషి ప్రశంసించ దగ్గది.
*పేజీలు : 95, వెల : ₹ 60/-, ప్రతులకు – ఫోన్ : 040–27015930*

## మిసిమి విజ్ఞాన దాయకం, వినోద ప్రసాదం!

**మిసిమి** పత్రిక ప్రతినెలా మీ ముంగిట చేరేందుకు మీరు చేయాల్సిన చిన్న పని, ఈ క్రింది వివరాలు మీ సంవత్సర చందా ₹300/- తో పాటు పంపండి. బయటి **చెక్కులకు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కు** అదనంగా ₹50/- కలపండి.

1. **పేరు :** ..................................................
2. **చిరునామా :**
   - ఇం.నెం. ..................................................
   - వీధి ..................................................
   - ఊరు ..................................................
   - పిన్ ..................................................
   - సెల్ ..................................................
3. **సంతకం :** ..................................................

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | STATE BANK OF INDIA |
| Account | : | MISIMI |
| A/c. No. | : | 10261569316 |
| Branch | : | Saifabad, Hyderabad, INDIA |
| IFS Code | : | **SBIN0007315** |



రెండు సంవత్సరాల చందా దారులకు (₹ 600+50/-) ***పరియల్ (షెల్లీ)* గ్రంథం బహుమతి.**





మూడు సంవత్సరాల చందా దారులకు (₹900+50/-) ***బైరన్ (జీవిత కథ)* గ్రంథం బహుమతి.**



నాలుగు సంవత్సరాల చందా దారులకు (₹1200+50/-) ***నా కథ* చార్లీ చాప్లిన్ గ్రంథం బహుమతి.**



అయిదు సంవత్సరాల చందా దారులకు (₹ 1500+50/-) ***మిసిమి* 2013/2014 సంచికల బౌండ్ పుస్తకం బహుమతి.**

---

**మిసిమి** మాసపత్రిక

**మీరు బహుమతిగా మిసిమి పంపండి.**

**మీ** ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల – ఇవన్నీ మీకు అపురూపమైనవే కదా.
మీకు ప్రియమైన వారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యం కదా. వీరందరికీ మీరు **మిసిమి** ని బహుమానంగా నెల నెలా పంపవచ్చు. మీరూ ఒక బహుమతిని పొందవచ్చు. ప్రక్కన వున్న పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంపిక చేసుకోండి. దాన్ని మీకు బహుమతిగా పంపిస్తాం. మీ ఊరి గ్రంథాలయానికి, లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం చందా **మిసిమి** పేర ₹ 300 పంపండి. వారి పూర్తి చిరునామా ఈ క్రింద గడులలో ఇవ్వండి.
మీరు ఇచ్చిన చిరునామాకు నెల నెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం. ప్రతినెలా మీరు వారిని పలకరించినట్లే – మంచి సారస్వతంతో...

ఈ క్రింది బహుమతి పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంచుకోండి

1.పారాయణ వర్గ, 2. నేనొక ప్రవాహాన్ని (అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి), 3. బుద్ధ – ధమ్మ – సంఘ (జె.లక్ష్మిరెడ్డి), 4. బుద్ధుని సూత్రసముచ్చయం 5. మానవీయ బుద్ధ, 6. యతిగీతం – వివేకానందుడు, (గజ్జెల మల్లారెడ్డి) 7. అంతర్వీక్షణం, 8. దూర తీరాలలో, 9. అగాధం, 10. ఓ ఖైదీ వీరగాథ, 11. నాలో నేను, (వి. అశ్వినీకుమార్) 12. మిసిమి వ్యాసాలు (డా॥ ఇన్నయ్య),

బహుమానంగా పంపవలసిన వారి చిరునామా :

...................................................
...................................................
...................................................

**మిసిమి**
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536



ఊటీలో ఉదయరేఖలు

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2015-17
Date of Posting: On 29th & 30th of every month.
Date of Publication: 25.11.2015



మగ్దలీనా